బుధవారం
23•08•2017
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 77
• పేజీలు : 18 + 24 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

బుధవారం
23•08•2017
హైదరాబాద్
• వెల.5 రూ.

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం బుద్వేల్‌లో రాజ బహద్దూర్ వేంకట రామారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్మించే రెడ్డి హాస్టల్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, మహేందర్‌రెడ్డి, ఎంపీలు జితేందర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, సుధీర్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, టీఎస్ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, టీఎస్ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, రెడ్డి హాస్టల్ సొసైటీ అధ్యక్షుడు ఏ రఘుపతిరెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

రాజ బహద్దూర్ పేరిట
ప్రఖ్యాత విద్యాసంస్థ

రెడ్డి హాస్టల్‌కు మరో ఐదెకరాలిస్తం ■ అవసరమైతే మరో పది కోట్లు ■ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల ప్రాంగణంగా దీనిని తీర్చిదిద్దాలి

రెడ్డి మహిళా హాస్టల్‌కు 1500 గజాల స్థలం ■ బుధవారం సాయంత్రానికల్లా జీవోల జారీ

రెడ్డి హాస్టల్ నూతన భవన నిర్మాణ శంకుస్థాపన సందర్భంగా సీఎం కేసీఆర్

సమైక్య రాష్ట్రంలో మరుగునపడిన తెలంగాణ మహనీయుల పేర్లు ■ వాటిని పునరుద్ధరించుకోవాలి

పోలీస్ అకాడమీకి బహద్దూర్ పేరు పెట్టాం ■ అంబేద్కర్‌కంటే గొప్ప నేత భాగ్యరెడ్డివర్మ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాజ బహద్దూర్ వేంకటరామారెడ్డి స్థాపించిన విద్యాసంస్థలను ఆయన శిఖరాయమాన వ్యక్తిత్వానికి దీటుగా విస్తరించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అన్నారు. ఆయన పేరు చిరస్థాయిగా నిలిచేలా ప్రఖ్యాత విద్యాసంస్థల ప్రాంగణంగా ప్రస్తుతం నిర్మిస్తున్న భవనాన్ని తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఇందుకోసం మరో ఐదెకరాల స్థలాన్ని రెడ్డి హాస్టల్‌కు కేటాయిస్తున్నట్టు సభావేదికపైనే ప్రకటించారు. ప్రస్తుతం పది కోట్లు కేటాయించామని, అవసరమనుకుంటే మరో పది కోట్లు కూడా ఇచ్చేందుకు సిద్ధమని స్పష్టంచేశారు. అవికూడా సరిపోవనుకుంటే బయట నుంచి మరో పది కోట్లు తీసుకువద్దామని అన్నారు. కానీ, దేశంలోనే ప్రఖ్యాతి కలిగిన, ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల ప్రాంగణంగా దీన్ని తయారు చేయాలని నిర్వాహకులను సీఎం కోరారు. దేశంలోని వివిధ కంపెనీలు ఇక్కడకు వచ్చి క్యాంపస్ ఇంటర్వ్యూల్లో మన పిల్లలను సెలెక్ట్ చేసుకోవాలని అభిలషించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలంలోని బుద్వేల్ గ్రామంలో ప్రభుత్వం కేటాయించిన 10 ఎకరాల భూమిలో రెడ్డి హాస్టల్ నూతన భవన నిర్మాణానికి భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ప్రసంగించారు. అందరికీ విద్యావకాశాలు కల్పించాలని రాజ బహద్దూర్ వేంకటరామారెడ్డి హాస్టల్‌ను ప్రారంభించారని, ఇదే స్ఫూర్తితో దీనిని మంచి విద్యాసంస్థల సముదాయంగా అభివృద్ధి చేయాలన్నది తన కోరికని సీఎం తెలిపారు. మహిళా హాస్టల్‌కు ఐపీఎంలో 1500 గజాల స్థలాన్ని ఇస్తామని ప్రకటించారు. ఈ రెండింటిపై బుధవారం సాయంత్రంకల్లా జీవోలు ఇస్తామని తెలిపారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ వైతాళికుల పేర్లు మరుగున పడ్డాయని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తంచేశారు. వాటన్నింటినీ మనం పునరుద్ధరించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగం ఆయన మాటల్లోనే..

పోలీస్ అకాడమీకి రాజ బహద్దూర్ పేరు పెట్టా

మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టినందుకు ఈ రోజు చాలా సంతోషంగా ఉంది. ఉద్యమ సందర్భంలో చాలా బాధనిపించేది. ఎంతో గొప్ప పనులుచేసిన తెలంగాణ మహనీయుల ప్రస్తావన సమైక్య రాష్ట్రంలో

› మిగతా 4వ పేజీలో

ఏకబిగిన ట్రిపుల్ తలాక్‌పై సుప్రీం వేటు

రాజ్యాంగ విరుద్ధం





ఇది దివ్య ఖురాను సూత్రాలకూ వ్యతిరేకం

ధర్మాసనం మెజారిటీ తీర్పు ■ ముమ్మాటికీ చెల్లదన్న ముగ్గురు న్యాయమూర్తులు

మైనారిటీలో ప్రధాన న్యాయమూర్తి ■ చారిత్రాత్మకమైన తీర్పు అంటూ ప్రధాని మోదీ ప్రశంస

స్వతంత్ర భారతావనిలోనే ఇది అతిగొప్ప సంఘ సంస్కరణ

మహిళా సంఘాల హర్షాతిరేకాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 22:

వివాదాస్పదమైన ట్రిపుల్ తలాక్‌ల ముస్లిం విడాకుల పద్ధతికి సుప్రీంకోర్టు తెరదించింది. ముస్లిం భర్త ఏకబిగిన మూడుసార్లు తలాక్‌లు చెప్పి భార్యకు ఏకపక్షంగా విడాకులిచ్చే ఆచారం చెల్లనేరదని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తేల్చిచెప్పింది. ఆ ఆచారం రాజ్యాంగ విరుద్ధమని, చట్టవిరుద్ధమని మంగళవారం ఐదుగురు సభ్యుల ధర్మాసనం 3:2 నిష్పత్తితో చారిత్రాత్మకమైన తీర్పును ప్రకటించింది. ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాను మౌలిక సూత్రాలకు కూడా మూడు తలాక్‌ల పద్ధతి విరుద్ధమని ధర్మాసనం అభిప్రాయపడింది. '3:2 నిష్పత్తితో మెజారిటీ తీర్పు ప్రకారం తలాకే బిద్దత్ లేదా మూడు తలాక్‌ల ఆచారాన్ని పక్కన పెట్టడమైంది' అని ఒక వాక్యంతో తలాక్‌ను బద్దలు కొట్టింది. 395 పేజీల సుదీర్ఘతీర్పును ధర్మాసనం వెలువరించింది. కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించింది. ఆ తీర్పు చారిత్రాత్మకమైనదని, ముస్లిం మహిళలకు అది సమానత్వం ప్రసాదిస్తున్నదని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు.

3:2 నిష్పత్తిలో చీలిపోయిన ధర్మాసనం

ధర్మాసనంలోని ఐదుగురు న్యాయమూర్తుల్లో ముగ్గురు ఓవైపు, మిగిలిన ఇద్దరు మరోవైపు నిలిచారు. స్వయంగా ప్రధాన న్యాయమూర్తి మైనారిటీ పక్షంలో ఉండిపోయారు. తలాక్ అనేది ముస్లిం మతనిబంధనలకు మౌలికమైనదా.. కాదా? అనే విషయమై ధర్మాసనం రెండుగా చీలిపోయింది. ధర్మాసనానికి నేతృత్వం వహించిన ప్రధాన న్యాయమూర్తి జేఎస్ ఖేహర్, ధర్మాసనంలో సభ్యుడైన న్యాయమూర్తి ఎస్ అబ్దుల్ నజీర్ మెజారిటీకి భిన్నమైన విధానాన్ని అనుసరించారు. ఆరునెలలపాటు మూడు తలాక్‌ల ఆచారాన్ని తాత్కాలికంగా నిలిపివేసి ఈ విషయమై పార్లమెంటులో చట్టం చేయాలని ప్రభుత్వానికి సూచన చేయాలని భావించారు. కానీ ధర్మాసనంలోని మిగతా ముగ్గురు న్యాయమూర్తులు కురియన్ జోసెఫ్, ఆర్ఎఫ్ నారిమన్, యూయూ లలిత్ మూడు తలాక్‌ల ఆచారం రాజ్యాంగ విరుద్ధమైనదని, మొత్తంగా పక్కన పెట్టాల్సిందేనని స్పష్టం చేశారు. మూడు తలాక్‌లే కాదు ఖురాను

› మిగతా 7వ పేజీలో

మైనారిటీ తీర్పు



మూడు తలాక్‌ల ఆచారం పాపభూయిష్టం కావొచ్చు. కానీ వైయక్తిక న్యాయం విషయంలో కోర్టు జోక్యం చేసుకోలేదు.. ప్రభుత్వానికి ఈ విషయమై పార్లమెంటులో చట్టం చేసేందుకు ఆరునెలల గడువు ఇవ్వాలి. అంతదాకా తలాక్ ఆచారాన్ని నిలిపివేయాలి.

– ప్రధాన న్యాయమూర్తి జేఎస్ ఖేహర్, న్యాయమూర్తి అబ్దుల్ నజీర్

మెజారిటీ తీర్పు



ముస్లిం భర్త క్షణికావేశంలో, ఇష్టారాజ్యంగా తలాక్ చెప్పి భార్యకు విడాకులిచ్చే ఈ ఆచారం వివాహబంధాన్ని కాపాడేందుకు ప్రయత్నించాలన్న దివ్య ఖురాను ఉద్దేశాలకు వ్యతిరేకం. దివ్య ఖురానులో చెడ్డదని చెప్పిన సంగతి షరియాలో మాత్రం మంచిది ఎలా అవుతుంది?

– న్యాయమూర్తులు కురియన్ జోసెఫ్, రోహింటన్ ఫాలీ నారిమన్, ఉదయ్ ఉమేశ్ లలిత్

• హైదరాబాద్ ఫుట్‌బాల్ దిగ్గజం



సయ్యద్ హకీమ్‌కు 'ధ్యాన్‌చంద్' పురస్కారం

దేవేంద్ర జజారియా, సర్దార్ సింగ్‌లకు ఖేల్‌రత్న

తెలుగు క్రీడాకారులు జ్యోతి సురేఖ, సాకేత్ సహా 17మందికి అర్జున

క్రీడా అవార్డులను ప్రకటించిన కేంద్రప్రభుత్వం

..వివరాలు ఖేల్‌లో



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఏరియా హాస్పిటల్‌లో మంగళవారం డయాలిసిస్, ఇంటెన్సివ్ కేర్ యూనిట్, బ్లడ్ బ్యాంకులను ప్రారంభించిన అనంతరం పద్మనాయక కల్యాణ మంటపంలో జరిగిన సభలో ప్రసంగిస్తూ కేసీఆర్ కిట్ గురించి వివరిస్తున్న మంత్రి కే తారకరామారావు. చిత్రంలో మంత్రి లక్ష్మారెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

ఆరోగ్య తెలంగాణే లక్ష్యం

- వైద్యరంగంపై గత పాలకుల నిర్లక్ష్యం ■ చికిత్స చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్
- 40 డయాలిసిస్ కేంద్రాలు దేశానికే ఆదర్శం ■ పట్టణాభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్
- కేసీఆర్ కిట్లతో సర్కారు దవాఖానల్లో పెరిగిన ప్రసవాలు : మంత్రి లక్ష్మారెడ్డి
- సిరిసిల్లకు జనఔషధి కేంద్రం, నర్సింగ్ కళాశాలలో పీజీ కోర్సులకు హామీ

4

కాళేశ్వరానికి సై

ప్రజాభిప్రాయ సేకరణకు విశేష స్పందన

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తేనే తమ బతుకులు మారుతాయని, చెరువులు నిండి బీడువారిన భూముల్లో పంటలు పండుతాయని కరీంనగర్, నిజామాబాద్, మేడ్చల్, యాదాద్రి జిల్లాల రైతులు ముక్తకంఠంతో నినదించారు. మంగళవారం ఆయా జిల్లాల్లో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణకు రైతులు, వృత్తిదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పర్యావరణ అనుమతులివ్వాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. భూసేకరణకు సమ్మతి తెలిపారు.

17



కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై కరీంనగర్ జిల్లా రేకుర్తిలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో పర్యావరణ అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు వినతిపత్రం ఇస్తున్న ముస్లింలు, రైతులు




రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం బుద్వేల్‌లో రాజ బహద్దూర్ వేంకట రామారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్మించే రెడ్డి హాస్టల్ కాంప్లెక్స్‌కు మంగళవారం శంకుస్థాపన అనంతరం బహిరంగసభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మండలి చైర్మన్ స్వామిగౌడ్, డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, మహేందర్‌రెడ్డి, కే తారకరామారావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, హరీశ్‌రావు, ఈటల రాజేందర్, జగదీశ్‌రెడ్డి, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, రెడ్డి హాస్టల్ సొసైటీ అధ్యక్షుడు ఏ రఘుపతిరెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

రాజ బహద్దూర్ పేరిట ప్రఖ్యాత విద్యాసంస్థ



సభలో సీఎం కేసీఆర్, హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి చిరునవ్వులు



రాజ బహద్దూర్ వేంకట రామారెడ్డి చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీఎం కేసీఆర్

రెడ్డి హాస్టల్‌కు 10కోట్లు మంజూరు

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ బుద్వేల్‌లో రెడ్డి హాస్టల్ నూతన భవన సముదాయాన్ని నిర్మించేందుకు రూ.10 కోట్లను మంజూరుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రాజ బహద్దూర్ వేంకటరామారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ (ఆర్‌బీవీఆర్‌ఆర్)కి ఈ నిధులను కేటాయించారు. హాస్టల్ భవన సముదాయ నిర్మాణానికి అవసరమైన అంచనాలను రూపొందించి, వివరాలను సమర్పించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్‌రావును ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీపీ ఆచార్య ఆదేశించారు.



రెడ్డి హాస్టల్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సీఎం కేసీఆర్ తదితరులు

మూడోపేజీ తరువాయి...

గ్యంతో చనిపోయారు. అప్పటి ప్రభుత్వం ఆ కాలనీకి ధర్మారెడ్డి పేరు పెట్టింది. బోర్డు కూడా పాతారు. తదనంతర కాలంలో ఆ పేరులేకుండా చేసి, బోర్డు తీసివేసి కేపీహెచ్‌బీ అని పెట్టారు. 2001లో ఉద్యమ ప్రారంభంలో నేను గొడవ చేశాను. ఎవడ్రా ధర్మారెడ్డి పేరు తీసి వేసిందని చెప్పి.. బోర్డు పాతి వచ్చా. ఎవడన్నా బోర్డు తీస్తే తాటతీసేస్త అని చెప్పిన.

స్కూలుకు 700 గజాల స్థలం దొరకలేదు

ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి చిన్నాయన రామచంద్రారెడ్డి నాకు సన్నిహితులు. ఒక సందర్భంలో వేంకటరంగారెడ్డి కార్యక్రమానికి ఆహ్వానించడానికి వచ్చారు. రాజ బహద్దూర్ స్ఫూర్తితో కొండా వేంకటరంగారెడ్డి విద్యాలయాలు ప్రారంభించారు. నాంపల్లిలో ఒక పాఠశాల.. అదేమీ కమర్షియల్ పాఠశాల కాదు.. చారిటీ స్కూల్. దీనికి 700 గజాల జాగా కోరుతూ ఆయన ఎక్కని కొండ లేదు.. మొక్కని బండలేదు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకూ దరఖాస్తు పెట్టారు. కానీ ఎవ్వరూ జాగా ఇవ్వలేదు. అట్లనే ఉందని చెప్తే.. రేపు పొద్దున్నే ప్రపోజల్ ఇవ్వని చెప్పి, వెంటనే క్లియర్ చేసి, జాగ ఇచ్చాం.

కనిపించేది కాదు. అలాంటి శిఖరాయమానమైన వ్యక్తిత్వం కలిగిన వారిలో వేంకటరామారెడ్డి ఒకరు. ఆయన ప్రస్తావన ఎక్కడా వినిపించేది కాదు. కనిపించేది కాదు. వారి చరిత్ర నిలిచి ఉండాలని సురవరం ప్రతాపరెడ్డి రాసి అందించారు. ఇలాంటి మహనీయుల ప్రస్తావనలు లేకుండా పోయాయని బాధపడేవాళ్లం. అందుకే తెలంగాణ వచ్చిన కొద్ది రోజులకే.. అప్పా పేరుతో ఉన్న పోలీస్ అకాడమీకి రాజ బహద్దూర్ వేంకటరామారెడ్డి పోలీస్ అకాడమీ అని పేరుపెట్టా. అగ్రికల్చర్ యూనివర్సిటీకి ప్రొఫెసర్ జయశంకర్‌పేరు పెడుతూ రెండు కలిపి జీవో ఇచ్చా. తెలంగాణ పోలీస్ అకాడమీని మనమంతా రాజ బహద్దూర్ వేంకటరామారెడ్డి పోలీస్ అకాడమీ అని పిలువాలి.

కేపీహెచ్‌బీ కాలనీ సృష్టికర్త ధర్మారెడ్డి..

ధర్మారెడ్డి అనే మంచి నాయకుడుండేవారు. వరంగల్ జిల్లాలో క్రియాశీల కార్యకర్త. ఆనాడు ఒక సీఎం హయాంలో హౌసింగ్‌బోర్డు చైర్మన్‌గా పనిచేశారు. తరువాత వచ్చిన సీఎం ఆయన పనికి మెచ్చి, గృహనిర్మాణశాఖను ఇచ్చారు. ఆసియాలోనే అతిపెద్ద కాలనీ నిర్మించాలని భావించిన ధర్మారెడ్డి.. మూడునాలుగు దేశాలు పోయి వచ్చి, ప్రస్తుతం కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ అని పిలుస్తున్న కాలనీని కట్టించారు. గృహనిర్మాణ శాఖ మంత్రిగా పనిచేస్తూనే అనారో

అంబేద్కర్‌ను మించిన దళిత నాయకుడు భాగ్యరెడ్డివర్మ

భాగ్యరెడ్డివర్మ తెలంగాణలో ప్రముఖ దళిత నేత. అంబేద్కర్‌కంటే తొలితరం. అంబేద్కర్‌ను మించిన దళితనాయకుడు. నిజాం రాజుతోని కొట్లాడి, దళితులకు బల్దియా (నేటి జీహెచ్‌ఎంసీ)లో రిజర్వేషన్లు కల్పించిన మహానాయకుడు. ఆయన పేరుకూడా ఎక్కడా కనిపించదు. చరిత్రలో భాగ్యరెడ్డివర్మ కనిపించరు.. రాజ బహద్దూర్ వేంకటరామారెడ్డి కనిపించరు.. కొండా వేంకట రంగారెడ్డి కనిపించరు. తెలంగాణలో ఎవ్వరు కనిపియ్యరు. రావి నారాయణరెడ్డి పేరు ఉండది. మనకు సంబంధంలేని అనేక పేర్లు ఉన్నయి. అంటే ఫీలైతరు. మళ్ల నన్ను తిడుతరు. అదో పంచాయతీ. మన పేర్లయితే మాయమై ఉండే. అన్నింటినీ కచ్చితంగా పునరుద్ధరించుకోవాలె.

తెలంగాణలో వికసించిన కుసుమం రాజ బహద్దూర్

తెలంగాణలో ఒకటిన్నర శతాబ్దకాలం క్రితం వికసించిన కుసుమం.. అద్భుతమైన మనిషి.. చారిత్రాత్మక పురుషుడు మన వేంకటరామారెడ్డి. ఆయన చాలా సంపన్నులు. వనపర్తి సంస్థానం రాజారామేశ్వర్‌రావు వీరి తాతగారు. చదువుకొని కష్టపడి పైకి వచ్చారు. వారి తల్లి చిన్నతనంలోనే చనిపోయినా దీక్షతోని, పట్టుదలతోని పైకి వచ్చి సబ్

ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాన్ని స్వీకరించారు. అంచెలంచెలుగా ఎదుగుతూ కొత్వాల్ అయ్యారు. కొత్వాల్ అంటే నేటి డీజీపీ పోస్టుతో సమానం. ఆ పదవిలో 14 ఏండ్లు కొనసాగారు. ఆయనకు నిజాం రాజులు రాజ బహద్దూర్ బిరుదు ఇచ్చి సత్కరించారు. ఆ తర్వాత కొన్నాళ్లకు బ్రిటిష్‌ప్రభుత్వం 'ఆర్డర్ ఆఫ్ బ్రిటిష్ ఎంపైర్' అనే బిరుదు ఇచ్చింది.

అవకాశాలు లేని వాళ్ల కోసం ఆలోచించారు

వేంకటరామారెడ్డి ప్రజల కోసం, పేదవాళ్ల కోసం, అవకాశాలు లేని వాళ్ల కోసం ఆలోచించారు. వీళ్లకు విద్యరావాలి, దురలవాట్లు రావద్దు, మంచి దేహదారుఢ్యం ఉండాలి, అన్ని రకాలుగా సమాజం పురోగమించాలని చెప్పి.. దృఢ సంకల్పం తీసుకున్నారు. నేను రాజుగారి దగ్గర ఉద్యోగంలో ఉన్నా.. ఏమన్న చేస్తే రాజుగారు ఏమనుకుంటారోనని బెదురలేదు. ఆ రోజు ఉర్దూ మీడియం ఉన్నప్పటికీ తెలుగు మీడియం స్కూళ్లను ఏర్పాటుచేశారు. దళితులకోసం ప్రత్యేక పాఠశాల నిర్వహించారు. అలియాబాద్ సభలో నర్సన్న నాకు చెప్పిన తరువాత రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందర్‌రావును పిలిచి 'అబిడ్స్‌లో రెడ్డి హాస్టల్ ఇరుకుగా ఉన్నది. దానికి రంగారెడ్డి జిల్లాలో స్థలం ఇవ్వాలి. రఘుపతిరెడ్డి అడిగిన చోట స్థలం ఇవ్వాలి' అని చెప్పిన. వేంకటరామారెడ్డి అంటే నాకు చాలా అభిమానం సర్ అని ఆయన అన్నడు. ఆర్‌వీఆర్ మహిళా స్కూల్లోనే మా సోదరి చదువుకున్నదని, ఆ స్కూలు లేకుంటే చదుకునేదే కాదని చెప్పారు. వేంకటరామారెడ్డికి డబ్బు ఉంది. పిల్లలు ఉన్నారు. హోదా ఉన్నది. కానీ అవకాశాలు లేని వారికోసం స్కూల్స్ ప్రారంభించారు.

నేను చేసే పని.. చంద్రుడికో నూలుపోగు

సాహితీవేత్త అయిన సురవరం ప్రతాపరెడ్డి ఒక సహాయం కోసం కొత్వాల్ అయిన వేంకటరామారెడ్డిని ఆశ్రయించారు. వయసులో చాలా చిన్న అయినప్పటికీ ప్రతాపరెడ్డితో మీ పని నేను చేసిపెడతాను.. కానీ మీరు ఒక్క ఏడాదిపాటు రెడ్డి హాస్టల్‌కు వార్డెన్‌గా పనిచేయాలని కోరారు. చంద్రుడికో నూలుపోగు లాగా నేను చేసేది చిన్న పని మాత్రమే. తెలంగాణ ప్రభుత్వ కర్తవ్యం. రాబోయే తెలంగాణ సమాజం స్ఫూర్తిగా తీసుకోవాలి. తెలంగాణ వారసత్వ సంపదను వైభవంగా స్మరించుకోవాలి. పొద్దున లేచి ఆయన పేరు తలుచుకుంటే బర్కతి ఉంటది.. ఇంత బువ్వ దొరుకుతది. రాజ బహద్దూర్ హాస్టల్‌లో ఉండి చదివిన వాళ్లలో దేశానికి ప్రధాని అయినవారున్నారు. దేశవిదేశాలలో ఈ కార్యక్రమాన్ని చూసేవాళ్లు చాలామంది ఉన్నారు. నాకు చాలామంది ఫోన్ చేశారు. 10 ఎకరాల స్థలం, రూ.10 కోట్లు ఇచ్చారు. ఇంకా కావాలంటే రూ.10 కోట్లు, రూ.20 కోట్లు పోగేసి ఇస్తామన్నరు.

నర్సన్న చెపితే ఆర్డరే... కోరిక కాదు

నర్సన్న చెపితే ఆర్డరే.. కోరిక కాదు. ఆయన మా హోం మినిస్టర్. పదెకరాల స్థలానికి సౌత్ వెస్ట్ కార్నర్ ఇంకో ఐదెకరాల స్థలం ఉంది. దాన్ని సొసైటీకి కేటాయిస్తూ రేపే జీవో ఇస్తాం. బాలికల పాఠశాల.. తరువాత కళాశాల అయింది. హాస్టల్‌లో 400 మంది ఉన్నారు. వసతి సరిపోవడం లేదు. దాని పక్కనే ఉన్న ఐపీఎంలో ఖాళీగా ఉన్న 1500 గజాల స్థలం కూడా ఇస్తాం. ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి రేపు సాయంత్రంకల్లా జీవో ఇవ్వాలి. 1500 గజాలు వెళ్లక పోతే వెళ్ల దీసి ఇవ్వాలి. ఇది తెలంగాణ జనరేషన్ కోసం.

కొండపైన వేంకటరామారెడ్డి ఎడ్యుకేషనల్ టవర్

మీరు అడిగినవన్నీ ఇచ్చినా.. నా కోరిక మీరు తీర్చాలి. ఇక్కడ 15 ఎకరాలు ఉంది. రూ.10 కోట్లు ఉన్నయి. అవసరమైతే మరో రూ.10 కోట్లు ఇస్తా. ఇంకా రూ.10 కోట్లు బయటకెళ్లి తీసుకుందాం. వేంకటరామారెడ్డి ఎంత శిఖరాయమాన వ్యక్తిత్వమో అంతే గొప్పగా ఈ కొండ మీద.. హైదరాబాద్‌లో చిరస్థాయిగా ఆయన పేరు నిలిచేలా రాజ బహద్దూర్ వేంకటరామారెడ్డి ఎడ్యుకేషనల్ టవర్ నిర్మించాలి. మంచి కోర్సులు ఉండే విద్యాసంస్థల నిర్మాణం జరుగాలి. హైలీ స్పెషలైజ్డ్, రెప్యుటేషన్ ఉన్న సంస్థగా ఎదుగాలి. ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ బిజినెస్ అంతటి రెప్యుటేషన్ ఉండాలి. దేశంలోని కంపెనీలు ఇక్కడికి వచ్చి మన పిల్లల్ని క్యాంపస్ ఇంటర్వ్యూల్లో సెలెక్ట్ చేసుకోవాలి. ఇది నాకోరిక. ఇది ఒక్క కులానికి కాదు. అందరికీ అవకాశం కల్పిద్దాం. ఈ రోజు తృప్తినిచ్చే సంఘటన. అంతమంది గత తెలంగాణ వైతాళికులను స్మరించుకునే అవకాశం సీఎంగా నాకు రావడం అదృష్టం అని సీఎం కేసీఆర్ అన్నారు.

ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, మండలి చైర్మన్ స్వామిగౌడ్, శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గడ్డం వివేక్, మంత్రులు కే తారక రామారావు, తన్నీరు హరీశ్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, జీ జగదీశ్‌రెడ్డి, ఈటెల రాజేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, జూపల్లి కృష్ణారావు, టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పక్ష నేత జితేందర్‌రెడ్డి, ఎంపీలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీబీ పాటిల్, బాల్క సుమన్, సీహెచ్ మల్లారెడ్డి, రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు సలీం, శంభీపూర్‌రాజు, పట్నం నరేందర్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, తీగల కృష్ణారెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, రవీందర్‌రెడ్డి, మదన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కాలే యాదయ్య, జీవన్‌రెడ్డి, చిన్నారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఢిల్లీలో రాష్ట్రప్రభుత్వ ప్రతినిధి వేణుగోపాలచారి, మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, కలెక్టర్ రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శాంతాబయోటెక్ వరప్రసాదరెడ్డిది గొప్ప సంకల్పం..

శాంతా బయోటెక్ వరప్రసాద్‌రెడ్డిది చాలా గొప్ప సంకల్పం. రాజ బహద్దూర్ వేంకటరామారెడ్డి స్ఫూర్తితో మాట్లాడుతారు. ఆయన గురించి చెప్పాలి. (సభికుల్లో కూర్చొని ఉన్న వరప్రసాదరెడ్డి, జీవీకె గ్రూప్ అధినేత జీవీ కృష్ణారెడ్డి, రెడ్డీ ల్యాబ్స్ సతీశ్‌రెడ్డిలను ఈ సందర్భంగా సీఎం స్వయంగా వేదికపైకి ఆహ్వానించారు). వరప్రసాదరెడ్డి ఐఐసీలో పనిచేసేవారు. ఆయనపై అధికారి ఒక తప్పుడు పని చేయమంటే కుదురదని చెప్పి.. ఉద్యోగానికి రాజీనామా చేసి వచ్చేశారు. తర్వాత.. తన తల్లి పేరుతో శాంతాబయోటెక్ స్థాపించారు. ఆఫ్రికాలో కలరా వస్తే.. గొప్ప గొప్ప దేశాలు చేయలేని పనిని చేసి, కలరా వ్యాధికి తక్కువ ధరకు వ్యాక్సిన్ సరఫరా చేసిన ఘనడు వరప్రసాదరెడ్డి. ఇన్సులిన్ మందు రూ.800 అవుతున్నది. దానిని కేవలం రూ.70 లకు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

నచ్చిన చోట.. మెచ్చిన భూమి ఇస్తామన్నారు

రఘుపతిరెడ్డి, సొసైటీ అధ్యక్షులు

రెడ్డి హాస్టల్ ఎందరికో ఆశ్రయాన్నిచ్చింది. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు, మాజీ గవర్నర్ సత్యనారాయణరెడ్డి, పారిశ్రామికవేత్త జూపల్లి రామేశ్వర్‌రావు ఇదే హాస్టల్లో చదువుకున్నరు. పోయినేడాది రెడ్డి జనసంఘం సమావేశానికి వచ్చిన సీఎం కేసీఆర్‌ను కలిసి రెడ్డి హాస్టల్‌కు భూమి కేటాయించాలని వినతిపత్రం సమర్పించినం. స్వయంగా ఆయనే మమ్మల్ని క్యాంప్ ఆఫీసుకు పిలిపించి.. మూడు గంటలపాటు కూర్చోబెట్టి మాట్లాడారు. నగరంలో అతి తక్కువ ఫీజుతో హాస్టల్ నడుపుతున్నమని.. రెడ్డి హాస్టల్స్, కాలేజీలు, విద్యాసంస్థలందించే సేవల గురించి సవివరంగా ఆయనకు చెప్పినం. అంతా విని కేసీఆర్ ఒకటే అన్నరు. మీకు 'నచ్చిన చోట.. మెచ్చిన భూమిని' ఇస్తమన్నరు. మాట ఇచ్చారు.. ఇప్పుడు నిలబెట్టుకున్నారు. మూడే మూడ్రోజుల్లో 10 ఎకరాల స్థలాన్ని, రూ.10 కోట్ల నిధులను మంజూరుచేయడం ఆయన కార్యదక్షతకు నిదర్శనం. నా జీవితంలో ఇలాంటి ముఖ్యమంత్రిని చూడలేదు. నేనిప్పుడు.. కేసీఆర్‌కు పెద్ద అభిమానిని.

కేసీఆర్ వెయ్యేండ్లు గుర్తుంటరు: మంత్రి నాయిని నర్సింహారెడ్డి

వేంకటరామారెడ్డి.. రెడ్డి హాస్టళ్లను ఏర్పాటుచేసి వందేండ్లు గుర్తుంటే.. ముఖ్యమంత్రి కేసీఆర్ వెయ్యేండ్లు చిరస్థాయిగా నిలిచిపోతరు. ఇది కేవలం హాస్టల్ వరకే పరిమితం కాకూడదు. పేదలకు సేవచేస్తూ దశలవారీగా అభివృద్ధి అవుతూ, విశ్వవిద్యాలయం స్థాయికి చేరాలి.

నేను రెడ్డి హాస్టల్లో చదువుకున్నవాడినే: మంత్రి మహేందర్‌రెడ్డి

నేను సైతం ఏడాదిపాటు రెడ్డి హాస్టల్లో చదువుకున్న. ఇక్కడ చదువుకున్నవాళ్లు జడ్జిలుగా, మంత్రులుగా, ప్రధానులుగా ఎదిగారు. ఇలాంటి హాస్టల్ కోసం రంగారెడ్డి జిల్లాలో అత్యంత ఖరీదైన స్థలాన్ని ఇవ్వడం కేసీఆర్ దాతృత్వానికి నిదర్శనం.

ఆధునిక తెలంగాణ నిర్మాత కేసీఆర్: ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కేసీఆర్ యావత్తు తెలంగాణ రథసారధిలా పనిచేస్తున్నారు. ఆయనకు అన్ని అంశాలపై స్పష్టమైన అవగాహన ఉంది. 'కేసీఆర్.. ఆధునిక తెలంగాణ నిర్మాత. నిజాంకాలంలో రెడ్లపైనే ఎక్కువ బాధ్యత ఉండేది. ప్రస్తుత తెలంగాణలో సైతం రెడ్లపైనే అధిక బాధ్యత.. భరోసా ఉంది.

ముహూర్తం

సూర్యోదయం: 6.04 గంటలకు

సూర్యాస్తమయం: 6.33 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం, విదియ రాత్రి 9.05 వరకు. తదుపరి తదియ. నక్షత్రం: పుబ్బ మధ్యాహ్నం 2.05 వరకు తదుపరి ఉత్తర. రాశి: సింహ రాత్రి 8.01 వరకు తదుపరి కన్య. అమృతఘడియలు: ఉదయం 7.52 నుంచి ఉదయం 9.28 వరకు. రాహుకాలం: మధ్యాహ్నం 12.18 నుంచి మధ్యాహ్నం 1.52 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.54 నుంచి మధ్యాహ్నం 12.43 వరకు వర్జ్యం: మధ్యాహ్నం 2.29 నుంచి సాయంత్రం 4.05 వరకు.

లోకం పోకడ



ధర్నాలకు ఇక్కడేమైనా ఇబ్బందులు ఏర్పడితే వాషింగ్టన్‌లో ధర్నా చేద్దాం.. రాజీ పడొద్దు!

ఆరోగ్య తెలంగాణే లక్ష్యం

వైద్యరంగంపై గత పాలకుల నిర్లక్ష్యం

చికిత్స చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

40 డయాలిసిస్ కేంద్రాలు దేశానికే ఆదర్శం

పట్టణాభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ వెల్లడి

కేసీఆర్ కిట్లతో సర్కారు దవాఖానల్లో పెరిగిన ప్రసవాలు: మంత్రి లక్ష్మారెడ్డి

సిరిసిల్లకు జనఔషధి కేంద్రం, నర్సింగ్ కళాశాలలో పీజీ కోర్సులకు హామీ




సిరిసిల్ల పట్టణంలో మంగళవారం జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి కే తారక రామారావు. సభకు హాజరైన ఏఎన్‌ఎంలు, జిల్లా ప్రజలు

వైద్యరంగంలో విప్లవం

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ: వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తూ రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణగా మార్చడమే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం కృషిచేస్తున్నదని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి, ఐటీశాఖల మంత్రి కల్వకుంట్ల తారక రామారావు చెప్పారు. బంగారు తెలంగాణ నిర్మాణానికి కీలకమైన వైద్యరంగాన్ని బలోపేతంచేస్తూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం కేసీఆర్ సంకల్పమని అన్నారు. సీఎం కేసీఆర్ ఆశయం మేరకు కంకణం కట్టుకుని ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాలన్నీ తిరిగొచ్చి దవాఖానల ఆధునీకరణకు అడుగులు వేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ దవాఖానల్లో 40 డయాలిసిస్ కేంద్రాల ఏర్పాటుతో రికార్డు సృష్టించి రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఏరియా హాస్పిటల్‌లో మంగళవారం డయాలిసిస్, ఇంటెన్సివ్ కేర్ యూనిబ ట్, బ్లడ్ బ్యాంకులను ప్రారంభించడంతోపాటు మాతాశిశు సంరక్షణ కేంద్రం, నర్సింగ్ కళాశాలలకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డితో కలిసి కేటీఆర్ శంకుస్థాపనచేశారు. అనంతరం స్థానిక పద్మనాయక కళ్యాణ మంటపంలో జరిగిన సభలో మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన వైద్యరంగానికి సీఎం కేసీఆర్ చికిత్స చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. మూత్రపిండాల వ్యాధులతో బాధపడుతున్న పేదలకు ప్రభుత్వ దవాఖానల్లో వైద్యం అందించడానికి డయాలిసిస్ కేంద్రాలు, ఐసీయూ ఏర్పాటుచేయాలన్న సోయి ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వాలకు లేకపోయిందని విమర్శించారు. ప్రభుత్వ దవాఖానలపై ప్రజలకు నమ్మకం పెంచేలా అత్యాధునిక వసతులు కల్పిస్తున్నామన్నారు. పుట్టిన బిడ్డ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో కేసీఆర్ కిట్ల పేరిట 13 వస్తువులు ఇవ్వడంతో సర్కారు దవాఖానల్లో ప్రసవాల సంఖ్య 50 శాతం పెరిగిందని వివరించారు. ఒక్క రాజన్న సిరిసిల్ల జిల్లాలోనే 800 కేసీఆర్ కిట్లను పంపిణీ చేసినట్టు చెప్పారు. పేద ప్రజలకు మందుల ధరలు అందుబాటులో ఉండేలా సిరిసిల్ల జిల్లా కేంద్రానికి జనఔషధి కేంద్రం ఏర్పాటుతోపాటు, డయాగ్నస్టిక్ సెంటర్, నర్సింగ్ కళాశాలలో పీజీ కోర్సులను ప్రవేశపెట్టాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డిని మంత్రి కేటీఆర్ కోరారు.



మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఏరియా దవాఖానలో ఐసీయూను ప్రారంభించి పరిశీలిస్తున్న మంత్రులు కేటీఆర్, లక్ష్మారెడ్డి

ఆరోగ్యవంతమైన సమాజానికి కృషి: లక్ష్మారెడ్డి

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడానికి కేసీఆర్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని వైద్యారోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. మంత్రి కేటీఆర్ కోరిక మేరకు జిల్లాకు జనఔషధి కేంద్రం, పీజీ డిప్లొమో కళాశాలను మంజూరుచేస్తున్నట్టు ప్రకటించారు. ప్రభుత్వ దవాఖానలో డయాగ్నస్టిక్ కేంద్రాన్ని ఏర్పాటుచేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 90 లక్షల మందికి మీజిల్స్, రుబెల్లా వ్యాక్సిన్ వేయనున్నామన్నారు. 15 ఏండ్లలోపు పిల్లలందరికీ వ్యాక్సిన్ తప్పకుండా వేయించాలని కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో దవాఖానల ఆధునీకరణ వేగంగా జరుగుతున్నదని మంత్రి తెలిపారు. ప్రైవేటు దవాఖానల్లో అనవసరంగా అపరేషన్లు చేస్తున్నారని, దీనివల్ల భవిష్యత్‌లో ఇబ్బందులుంటాయని లక్ష్మారెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వ దవాఖానల్లో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మిషన్ భగీరథ పథకంలో శుద్ధజలాలను అందించే ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, కలెక్టర్ కృష్ణభాస్కర్, సెస్ చైర్మన్ దోర్నాల లక్ష్మారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సామల పావని, సిరిసిల్ల ఏఎంసీ చైర్మన్ జిందం చక్రపాణి, గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆర్గనైజర్ గుగులోతు రేణ పాల్గొన్నారు.

పరస్పర విద్యుత్ సహకారం



మంగళవారం తిరువనంతపురంలో నిర్వహించిన ఎస్‌ఆర్‌పీసీ సమావేశంలో కమిటీ చైర్మన్, తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీ డీ ప్రభాకర్‌రావు తదితరులు

- దక్షిణాది రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం
- అవసరమున్న రాష్ట్రానికి తక్షణం విద్యుత్
- మిగులు రాష్ట్రం నుంచి గంట వ్యవధిలో సరఫరా
- సదరన్ లోడ్ డిస్పాచింగ్ సెంటర్ ద్వారా అమలు
- కొత్త విధానానికి రూపకల్పన!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తమ విద్యుత్ అవసరాలను తీర్చుకునేలా కొత్త విధానం రూపొందించుకోవడంపై దక్షిణాది రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. దక్షిణాదిలోని ఏ రాష్ట్రానికి విద్యుత్ అవసరం ఉన్నా.. వెంటనే పక్క రాష్ట్రాలనుంచి పొందేలా కొత్త విధానానికి రూపకల్పనచేశారు. ఈ విధానం అమల్లోకివస్తే పవర్ ఎక్స్చేంజ్ జోక్యంలేకుండా.. ఎలాంటి జాప్యానికి అవకాశమివ్వకుండా ఇరుగు, పొరుగు రాష్ట్రాలు విద్యుత్‌ను ఇచ్చిపుచ్చుకునే వెసులుబాటు కలుగుతుంది. త్వరలోనే ఈ మేరకు విద్యుత్ సంస్థలు ఒప్పందం కుదుర్చుకోనున్నాయి. దక్షిణ భారతదేశ రాష్ట్రాల విద్యుత్ కమిటీ (ఎస్‌ఆర్‌పీసీ) చైర్మన్, తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీ డీ ప్రభాకర్‌రావు అధ్యక్షతన కేరళ రాజధాని తిరువనంతపురంలో కమిటీ సమావేశం సోమ, మంగళవారాల్లో జరిగింది. గత నెలలో హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో దక్షిణాది రాష్ట్రాల మధ్య సరళమైన విద్యుత్ విధానాలపై ప్రాథమికంగా చర్చించారు. ఈ సమావేశంలోనే ఎస్‌ఆర్‌పీసీ సభ్య కార్యదర్శి ఎస్‌ఆర్ భట్ నేతృత్వంలో కమిటీని నియమించారు. కొత్త విధానానికి ఈ కమిటీ ముసాయిదాను తయారుచేసి తిరువనంతపురం సమావేశంలో ప్రవేశపెట్టింది. దీనిపై రెండ్రోజులపాటు చర్చించారు. ప్రభాకర్‌రావుతోపాటు సభ్య కార్యదర్శి ఎస్‌ఆర్ భట్, కేరళ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ బోర్డు సీఎండీ డాక్టర్ కే ఎలంగోవన్, కర్ణాటక ట్రాన్స్‌కో ఎండీ జావెద్ అక్తర్, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ విజయానంద్, తమిళనాడు ట్రాన్స్‌కో ఎండీ ఎస్ షణ్ముగం, టీఎస్‌ఎస్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు, ట్రాన్స్‌కో డైరెక్టర్లు నర్సింగ్‌రావు, జగత్‌రెడ్డి, సచ్చిదానందం తదితరులు చర్చల్లో పాల్గొన్నారు.

గంట వ్యవధిలో మిగులు రాష్ట్రం నుంచి సరఫరా

దక్షిణ భారతదేశ పరిధిలో పొరుగు రాష్ట్రంలో ఎక్కడ విద్యుత్ అవసరం ఉన్నా విద్యుత్ కలిగిన రాష్ట్రం నుంచి పొందవచ్చని ముసాయిదాలో స్పష్టంగా పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, సరఫరా విషయాల్లో పరస్పరం సహకరించుకోవాలని ఈ భేటీలో తీర్మానించారు. ప్రస్తుతం విద్యుత్ కొనుగోళ్లన్నీ పవర్ ఎక్స్చేంజ్ ద్వారా చేపడుతున్నారు. ఈ విధానం వల్ల క్రయ విక్రయాల్లో జాప్యం చోటుచేసుకుంటున్నది. ప్రస్తుత విధానం వల్ల ఒకరోజు ముందుగానే సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఫలితంగా అది వాస్తవ పరిస్థితికి తగ్గట్టుగా ఉండటం లేదు. ఈ పరిస్థితిని నివారించడానికి దక్షిణాది రాష్ట్రాలు ఎప్పుడు కావాలంటే అప్పుడు కేవలం గంట వ్యవధిలోనే పక్క రాష్ట్రం నుంచి విద్యుత్‌ను పొందవచ్చు. క్రయ విక్రయాలకు సంబంధించి ప్రతిసారీ ఒప్పందం కుదుర్చుకోవాల్సిన అవసరం ఉండదు. ఈ విధానం వల్ల ఏ రోజు డిమాండ్‌ను ఆ రోజే అంచనా వేసి, విద్యుత్‌ను తీసుకోవడమో.. లేదా ఇవ్వడమో చేయవచ్చు. దీని వల్ల అటు మిగులు విద్యుత్ రాష్ట్రాలకు, ఇటు లోటు విద్యుత్ రాష్ట్రాలకు మేలు కలుగుతుంది. ఎవరికి విద్యుత్ కావాలన్నా.. ఎవరు విద్యుత్ ఇవ్వాలనుకున్నా.. ఈ సమాచారాన్ని సదరన్ లోడ్ డిస్పాచింగ్ సెంటర్‌కు అందించాలి. దక్షిణాది రాష్ట్రాల మధ్య విద్యుత్‌ను అందిపుచ్చుకోవడం సదరన్ లోడ్ డిస్పాచింగ్ సెంటర్ ద్వారానే ఉంటుంది. ఈ ముసాయిదాను సభ్య రాష్ట్రాలు రెండు రోజులపాటు సమగ్రంగా చర్చించాయి. త్వరలోనే ఈ విధానం అమలు కోసం విధి విధానాలు రూపొందించుకోవాలని, ఒప్పందం చేసుకోవాలని నిర్ణయించాయి.

'గాంధారి' శాసనంలో
నిజాం పన్నుల వివరాలు


ఆదిలాబాద్‌లో లభ్యమయిన గాంధారి ప్రాంత రాగి శాసనం

హైదరాబాద్ నమస్తే తెలంగాణ, సిటీబ్యూరో: గాంధారి ప్రాంతానికి చెందిన ఓ రాగి శాసనం వెలుగులోకి వచ్చింది. ఆ ప్రాంత ప్రస్తావన, 200 ఏండ్లనాటి గోండు గిరిజనుల వ్యవసాయం, నాటి పరిపాలన, సర్ దేశ్‌ముఖ్‌లనే వెలమ సామంతుల పాలన, పన్నుల వివరాలు శాసనంలో ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని గోండు గిరిజనుడి వద్ద డాక్టర్ సిడాం ఓ రాగి శాసనాన్ని గుర్తించారని, ఆ శాసనంలో ఆనాటి విశేషాలెన్నో గుర్తించామని ప్రముఖ చరిత్ర పరిశోధకుడు ద్యావనపల్లి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. రెండువందల ఏండ్ల కిందట నేటి ఆదిలాబాద్ జిల్లాలోని అటవీ ప్రాంతాన్ని అసఫ్‌జాహీ పాలకులు వెలమదొరలకు అధికారం కట్టబెడుతూ సర్‌దేశ్‌ముఖ్‌లుగా నియమించారని, వారివద్ద స్థానిక గోండు గిరిజనులు కొందరు మోకాసాదారులుగా ఉంటూ పన్ను వసూలుచేసే అధికారాలు కలిగి ఉన్నట్టు ఆ శాసనంలో పేర్కొన్నారని చెప్పారు. 1824లో గాంధారి తాలుకా మోకాసా బాపతు హక్కులు పొందిన గోండు గిరిజనులు ఆ సనదు (శాసనం) పోగొట్టుకోవడంతో మళ్లీ 1871లో మరో రాగి సనదును ఇస్తున్నట్టు అందులో ప్రస్తావించారని పేర్కొన్నారు. ఆదివాసీల నుంచి పెండ్లికి రూపాయి పావులా, వ్యవసాయదారుడి నుంచి అర్ధ హుండ (62 పైసలు), దసరా బాపతు పెద్ద ఊరికి ఒక రూపాయి, చిన్న ఊరికి 50 పైసలు, ఒక అరక ఉండి ఐదు బీగాలు దున్నితే (ఒక బీగా అంటే 20 గుంటలు) 50 పైసలు, కట్టెలతో నిర్మించిన పెద్ద ఇంటికి అడ్డెడు ధాన్యం, చిన్నదానికి మానెడు ధాన్యాన్ని పన్నుల రూపంలో వసూలుచేసే అధికారం గోండు మోకాసాలకు ఉన్నట్టు ఈ శాసనాల్లో ప్రస్తావించారని సత్యనారాయణ వివరించారు.

గురుకుల పీడీ పరీక్ష రద్దు

7న తిరిగి నిర్వహిస్తామన్న టీఎస్‌పీఎస్సీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గురుకులాల ఫిజికల్ డైరెక్టర్ పోస్టుల భర్తీకి జూలై 18వ తేదీన నిర్వహించిన పరీక్షను రద్దుచేస్తున్నట్లు టీఎస్‌పీఎస్సీ మంగళవారం తెలిపింది. వచ్చేనెల ఏడో తేదీన తిరిగి పరీక్షను నిర్వహిస్తామని వివరించింది. అభ్యర్థులు ఈ మార్పును గమనించాలని సూచించింది. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరింది.

టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో మూడు క్యాటగిరీల హాల్‌టికెట్లు

ఈ నెల 27, 28 తేదీల్లో జరిగే వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, ఏఈఈ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ హాల్‌టికెట్లు www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఏ వాణీప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

మహిళా శిశు సంక్షేమశాఖకు
రూ.152.64 కోట్లు మంజూరు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 2017-18 ఆర్థిక సంవత్సరంలో మహిళా శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ పథకాల అమలుకు రాష్ట్రప్రభుత్వం రూ.152.64 కోట్లు మంజూరుచేసింది. మహిళా రక్షణ, భద్రత కల్పన కోసం రూ.1.78 కోట్లు, ఐసీడీఎస్ కేంద్రాల నిర్వహణకు రూ.91.66 కోట్లు, భేటీ బచావో, భేటీ పడావో పథకానికి రూ.59.20 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు మహిళా శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ కార్యదర్శి ఎం జగదీశ్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

రూ.23.25 కోట్ల నిధులు విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం క్రూషియల్ బ్యాలెన్సింగ్ ఫండ్(సీబీఎఫ్) నిధుల కింద ప్రతిజిల్లాకు రూ. 75లక్షల చొప్పున రూ.23.25 కోట్లను విడుదల చేసింది. మంగళవారం ప్రణాళికాశాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. 2017-18 ఆర్థిక సంవత్సరం రెండో వాయిదా కింద ఈ నిధులను మంజూరుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బీపీ ఆచార్య ఉత్వర్వులు జారీచేశారు.

పైరసీని అరికడుతాం!

ఇండియన్ కాపీరైట్స్ సంస్థ చైర్మన్, డైరెక్టర్‌తో మంత్రి తలసాని


సచివాలయంలో మంత్రి తలసానికి పుష్పగుచ్ఛం అందిస్తున్న చైర్మన్ రత్నాకర్, డైరెక్టర్ అరవింద్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పైరసీని అరికట్టడంలో అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టి, చిత్రరంగాన్ని పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని సినిమాటోగ్రఫీ, పశుసంవర్ధకశాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఫర్ ఇండియన్ కాపీరైట్స్ సంస్థ చైర్మన్ రత్నాకర్, డైరెక్టర్ అరవింద్ మంగళవారం సచివాలయంలో మంత్రిని కలిసి పలు అంశాలపై చర్చించారు. చిత్ర పరిశ్రమ అభివృద్ధికి, సినీకళాకారుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ప్రాధాన్యం ఇచ్చారని తలసాని చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో విజిలెన్స్ అడ్మిన్ ఆఫీసర్ శివ, పీఆర్‌వో చంద్రశేఖర్‌శర్మ, బీఆర్ నాయుడు, ప్రతాప్ తదితరులు ఉన్నారు.


30రోజుల్లో ఇండ్ల అనుమతులు ఇవ్వాల్సిందే

డీటీసీపీ ప్రాంతీయ సంచాలకుడు విద్యాధర్ ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆన్‌లైన్‌లో 30 రోజుల్లోపు ఇండ్ల అనుమతులను ఎట్టిపరిస్థితుల్లోనూ మంజూరు చేయాల్సిందేనని డైరెక్టర్, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) ప్రాంతీయ సంచాలకుడు విద్యాధర్ ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డీటీసీపీ కార్యాలయంలో 42 పట్టణాల టౌన్‌ప్లానర్లు, సిబ్బంది, సాంకేతిక నిపుణులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అపరిష్కృతంగా ఉన్న అనుమతుల దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని విద్యాధర్ ఆదేశించారు. భవనాలకు ఆన్‌లైన్‌లో అనుమతులు ఇచ్చే ప్రక్రియలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాస్టర్‌ప్లాన్ల ప్రక్రియ వేగవంతానికి జిల్లాస్థాయి టౌన్‌ప్లానింగ్ అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించామని చెప్పారు. పలు పట్టణాల మాస్టర్‌ప్లాన్ల రూపకల్పనలో కన్సల్టెంట్లు, టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో సమన్వయం చేస్తారని ఆయన తెలిపారు. నగరాల్లో రహదారులు, జంక్షన్ల అభివృద్ధి, మోడల్ మార్కెట్ల డిజైన్లు, పార్కులు, ఆటస్థలాలు, శ్మశానవాటికలు, ఆఫీసు కార్యాలయాలు వంటివాటిని డిజైన్ చేయడానికి తోడ్పాటు అందిస్తారని విద్యాధర్ పేర్కొన్నారు.

డ్రగ్స్ ముఠాల ఆటకట్టిద్దాం

మాదకద్రవ్యాల తయారీపై మరింత నిఘా
ఉన్నతస్థాయి సమీక్షలో అధికారుల నిర్ణయం
ఎక్సైజ్‌సహా తొమ్మిదిశాఖల అధికారుల హాజరు



మంగళవారం ఎక్సైజ్ కార్యాలయంలో డ్రగ్స్ నివారణపై ఉన్నతస్థాయి సమావేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో డ్రగ్స్ ముఠాల ఆట కట్టించేందుకు ఉన్నతాధికారులు సిద్ధమయ్యారు. మాదకద్రవ్యాల తయారీ, రవాణా, సరఫరా, వినియోగం ఇలా అన్ని రూపాల్లో డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతస్థాయి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. డ్రగ్స్ రవాణా, నియంత్రణలో కీలకశాఖల మధ్య పరస్పర సమాచార, సహకారంతో పకడ్బందీగా డ్రగ్స్ ముఠాలను అడ్డుకోవచ్చనే ప్రతిపాదన సమావేశంలో వచ్చింది. నాంపల్లిలోని ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఎక్సైజ్‌సహా తొమ్మిదిశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో నుంచి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆర్పీ సింగ్, జోనల్ డైరెక్టర్ సునీల్‌కుమార్, డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ నుంచి అడిషనల్ డీజీ ఎంకే సింగ్, అడిషనల్ డైరెక్టర్ ప్రసాద్, పోలీస్‌శాఖ నుంచి సీఐడీ అడిషనల్ డీజీ గోవింద్‌సింగ్, రాచకొండ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ డీవీ శ్రీనివాస్‌రావు, సైబరాబాద్ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ బీ శ్రీనివారెడ్డి, ఎక్సైజ్‌శాఖ నుంచి కమిషనర్ డాక్టర్ ఆర్‌వీ చంద్రవదన్, డైరెక్టర్ అకున్ సబర్వాల్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి డిప్యూటీ డైరెక్టర్ బీ వెంకటేశ్వర్లు, రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సీఐఎస్‌ఎఫ్ నుంచి కమాండెంట్ సుధీర్‌కుమార్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) నుంచి క్రైమ్ అధికారి షేక్ కరీముల్లా, బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ నుంచి అసిస్టెంట్ డైరెక్టర్ ఏకే మహంతి పాల్గొన్నారు. ఉదయం 11 గంటల నుంచి మూడుగంటలపాటు కొనసాగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఇటీవల నగరంలో డ్రగ్స్ రాకెట్ బయటపడటం, డ్రగ్స్ సరఫరా చేసే ముఠాలు వరుసగా పట్టుబడటం వంటి అంశాలపై చర్చ జరిగింది. ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ తరలిస్తున్న తీరు, డ్రగ్స్ రవాణా చేస్తున్న పద్ధతులపై అధికారులు సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రధానంగా ఆఫ్రికాకు చెందిన ముఠాలు డ్రగ్స్ రవాణాలో కీలకంగా వ్యవహరిస్తున్నందున వీరిపై మరింత నిఘా పెట్టాలని నిర్ణయించారు. ఇతరదేశాల నుంచి దేశంలోని ప్రధాన నగరాలకు డ్రగ్స్ ఏయే మార్గాల్లో తీసుకొస్తున్నారన్న అంశంపై నిరంతరం నిఘా పెట్టాలని భావిస్తున్నారు. అన్ని శాఖల మధ్య సమన్వయం పెరిగేలా ఇకపై నిరంతర సమీక్షలు నిర్వహించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.


'థైరాయిడ్' సమస్యను అలక్ష్యం చేయవద్దు... తీవ్ర వ్యాధులకు దారితీసే ప్రమాదం

యశోద హాస్పిటల్స్‌లో 'థైరాయిడ్' వ్యాధులకు అత్యాధునిక చికిత్సలు

డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎండోక్రైనాలజీ
యశోద హాస్పిటల్స్ - హైదరాబాద్
సికింద్రాబాద్ - సోమాజిగూడ-మలక్‌పేట్
ఫోన్: 81210 22333

శరీరానికి అవసరమైన మొత్తంలో థైరాయిడ్ హార్మోన్ అందుబాటులో లేని స్థితిని హైపోథైరాయిడిజం అంటున్నారు థైరాయిడ్ హార్మోన్ ప్రధాన బాధ్యత జీవ క్రియలను నియంత్రించటం. అది తగినంతగా అందుబాటులో లేకపోవటం సహజంగానే మొత్తం శరీరం పనితీరును తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. మనదేశంలో దాదాపు పదిహేను కోట్ల మందిలో హైపోథైరాయిడిజం ఉన్నట్లు అంచనా. వీరిలో అత్యధికులకు తమకు ఈ వ్యాధి ఉన్న విషయం కూడా తెలియదు. సముద్రతీర ప్రాంతాల(విశాఖ, చెన్నై, మంగుళూరు వంటివి)లో నివసిస్తున్న వారికంటే సాగరాలకు దూరంగా మైదాన, కొండ ప్రాంతాల(హైదరాబాద్, వరంగల్, బెంగళూరు లాంటి)లో నివసిస్తున్న వారిలో ఈ వ్యాధి ఎక్కువగా ఉన్నట్లు ఓ అధ్యయనంలో వెల్లడించింది. సాధారణంగా ప్రచారంలో ఉన్న దానికంటే ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ సంఖ్యలో ప్రజలు దీనితో బాధపడున్నారు.

థైరాయిడ్ గ్రంధి మన మెడలో ముందువైపు, దిగువభాగాన ఉంటుంది. దీనికి ఎటువంటి నాళాలు ఉండవు(వినాళ గ్రంధి). అందువల్ల ఇది ఉత్పత్తి చేసిన హార్మోన్ నేరుగా రక్తప్రవాహంలో విడుదలయి గుండె నుంచి మెదడు దాకా, జీర్ణవ్యవస్థ నుంచి చర్మం వరకూ శరీర భాగాలన్నింటినీ ప్రభావితం చేస్తుంటుంది. శరీరభాగాలు తమకు అందిన ఆహారంలోని శక్తిని ఉపయోగించుకొనే విధానాన్ని ఈ హార్మోన్ నియంత్రిస్తుంది. ఈ ప్రక్రియనే మెటాబాలిజం(జీవక్రియ)అంటున్నారు. జీవక్రియనే మన శరీరపు ఉష్ణోగ్రతను, గుండె కొట్టుకోవటాన్ని, ఆహారం ద్వారా శరీరానికి అందిన కాలరీలను ఏవిధంగా ఖర్చుచేస్తున్నదీ నిర్ణయిస్తుంది. థైరాయిడ్ గ్రంధి సరైనంత హార్మోనును ఉత్పత్తి చేయలేకపోవటం వల్ల హైపోథైరాయిడ్ ఏర్పడుతుంది. దీనిలో జీవక్రియల వేగం తగ్గుతుంది. అంటే, పోషకాహారం తీసుకున్నా మన శరీరం తగినంత శక్తిని పొందలేదు. వ్యక్తి చాలా బలహీనపడతారు.



హైపోథైరాయిడిజం వ్యాధి లక్షణాలు

స్త్రీ,పురుషులు అన్ని వయస్సుల వారిలో ఇది కనిపిస్తుంది. అయితే పురుషులకంటే స్త్రీలు ఈ వ్యాధి బారిన పడే అవకాశాలు అధికం. కొన్ని సాధారణ లక్షణాల ఆధారంగా దీనిని గుర్తించవచ్చు. అవి: థైరాయిడ్ గ్రంధి వాపు, తీరని అలసట, గుండె వేగం తగ్గిపోవటం, అనుహ్యంగా శరీరం బరువు పెరగటం, మానసిక కృంగుబాటు, చర్మం ఎండిపోయినట్లు కావటం, తలవెంట్రుకలు ఎక్కువగా రాలిపోవటం, మలబద్ధకం వంటివి కనిపిస్తాయి. అయితే పిల్లల్లో హైపోథైరాయిడ్ ఏర్పడినపుడు లక్షణాలు ఇందుకు కొంత భిన్నంగా ఉంటాయి. కాళ్లు-చేతులు చల్లబడతాయి. చాలా ఎక్కువగా నిద్రపోతుంటారు. పెరుగుదల కనిపించదు. పొట్టపొంగిపోతుంది. ముఖం ఉబ్బి ఉంటుంది. మలబద్ధకం. ఈ లక్షణాలు కనిపించినపుడు డాక్టరును కలిస్తే కొన్ని పరీక్షలు చేయించటం ద్వారా వ్యాధిని నిర్ధారిస్తారు. ఇందుకోసం డాక్టర్లు టి.ఎస్.హెచ్.(థైరాయిడ్ స్టిమ్యులేటింగ్ హార్మోన్), టి4(థైరోగ్జిన్) పరీక్షలు సిఫార్సుచేస్తారు. ఈ పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ అయితే థైరాయిడ్ గ్రంధి వాపు ఏమైనా ఉందా చూసేందుకు అల్ట్రా సౌండ్ లేదా థైరాయిడ్ స్కాన్ కూడా చేయించవచ్చు.

థైరాయిడ్ గ్రంధి పనితీరు ఎందుకు దెబ్బతింటుంది?

చాలా సందర్భాలలో హష్మితోస్ థైరాయిడిస్ వల్ల థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తి తగ్గి హైపోథైరాయిడిజం ఏర్పడుతున్నది. 'థైరాయిడిస్' ఓ ఆటోఇమ్మ్యూన్ (వ్యక్తి శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ పొరపాటున ఆ శరీరంలోని అంతర్గత అవయవాలపైన దాడిచేసే) వ్యాధి. దీనికారణంగా శరీరం ఆంటీబాడీలను ఉత్పతిచేస్తూ థైరాయిడ్ గ్రంధిపైన దాడికి దిగి ఆ గ్రంధిని నాశనం చేయటానికి పూనుకుంటుంది. కొన్ని కేసులలో వైరసుల వల్ల కూడా థైరాయిడిస్ వ్యాధి సోకుతుంది. ఇవి కాకుండా మరికొన్ని కారణాల వల్ల కూడా థైరాయిడ్ తన హార్మోన్ ఉత్పాదక శక్తిని కోల్పోయి హైపోథైరాయిడిజం ఏర్పడుతున్నట్లు గుర్తించారు.

థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తికి అయొడిన్ అవసరం అవుతుంది. మన శరీరం తనంత తాను అయోడిన్‌ను తయారుచేకోలేదు కనుక ఉప్పు, పాలు, కోడిగుడ్లు, చేపల వంటి ఆహార పదార్థాల ద్వారా అందించాల్సి ఉంటుంది. ఆహారంలో అయొడిన్ లోపిస్తే థైరాయిడ్ గ్రంధి హార్మోన్‌ను ఉత్పత్తి చేయలేదు. హైపోథైరాయిడ్ ఏర్పడుతుంది. గుండె సంబంధిత సమస్యలు, మనోవ్యాధులు, కాన్సర్ చికిత్సలలో ఉపయోగించే కొన్ని మందులు థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తి తగ్గిపోవటానికి కారణం అవుతుంటాయి. లింఫోమా వంటి కొన్నిరకాల కాన్సర్ల చికిత్సకు మెడ భాగానికి రేడియేషన్ ఇస్తారు. దీంతో థైరాయిడ్ గ్రంధిలోని కణాలు దెబ్బతిని థైరాయిడ్ హార్మోన్ తయారీ తగ్గిపోతుతుంది. కొన్ని ఆరోగ్య కారణాల దృష్ట్యా థైరాయిడ్ గ్రంధిని తొలగించినపుడు సహజంగానే హార్మోన్ ఉత్పిత్తి ఉండదు. అయితే ఆ గ్రంధిలోని కొంత భాగాన్ని మాత్రమే తొలగించినపుడు తక్కిన గ్రంధి భాగం శరీరానికి అవసరమైన మొత్తంలో హార్మోనును తయారుచేస్తుంది. ఎందువల్లనో కొందరు స్త్రీలు గర్భం దాల్చిన సమయంలో థైరాయిడ్ గ్రంధి వాచుతుంది (పోస్ట్ పార్టమ్ థైరాయిడిస్). దీనిలో మొదట అధిక మొత్తంలో థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తి అవుతుంది. ఆపైన ఒక్కసారిగా అది తగ్గిపోయి హైపోథైరాయిడిజం ఏర్పడుతుంది. చాలా మంది మహిళలు తరువాత మళ్లీ సాధారణ పరిస్థితికి చేరుకుంటారు. కొంతమంది పిల్లలు థైరాయిడ్ గ్రంధి లోపంతో జన్మిస్తారు. గర్భస్థ శిశువుగా ఎదిగే సమయంలో వారిలో ఈ గ్రంధి సరిగా అభివృద్ధిచెందక పసిపాపలుగానే హైపోథైరాయిడిజం ఏర్పడుతుంది.

చికిత్స

చాలా మందిలో హైపోథైరాయిడిజం చికిత్స సూటిగా, సులభంగా ఉంటుంది. వారికి డాక్టర్లు థైరాయిడ్ హార్మోన్ మాత్రలను సిఫార్సు చేస్తారు. ప్రతీరోజు, చాలా వరకు ఉదయాన్నే ఈ మాత్ర వేసుకోమనటం ద్వారా పరిస్థితిని అదుపులోకి తెస్తారు. మన శరీరంలో థైరాయిడ్ తయారు చేసే టి4కు సరిగ్గా పత్యామ్నాయం కాగల టి4ను కృతిమంగా ఉత్పత్తిచేసి ఈ మందులను తయారు చేస్తారు. క్రమం తప్పకుండా రక్తపరీక్షలు చేయటం ద్వారా రక్తంలో థైరాయిడ్ హార్మోన్ తగినంత ఉన్నది నిర్ధారించుకుంటూంటారు. దీని ఆధారంగా టి4 మాత్రల డోసును కూడా నిర్ణయించి సరిచేయటానికి డాక్టర్లకు వీలుకలుగుతుంది.

హైపోథైరాయిడిజంను గుర్తించి చికిత్సచేయని పక్షంలో అది గుండె, కీళ్లు, వ్యంధ్యత్వం, ఊబకాయం వంటి తీవ్రమైన ఇతర వ్యాధులకు దారితీస్తుందని యశోద హాస్పిటల్స్ లోని ఎండోక్రైనాలజీ విభాగానికి చెందిన వైద్యనిపుణులు తెలిపారు. గర్భవతుల్లో హైపోథైరాయిడిజం గర్భస్థశిశువు అభివృద్ధిని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. గర్భంలో మొదటి మూడు నెలల శిశువు థైరాయిడ్ హార్మోనును తల్లి నుంచే పొందుతుంది. తల్లి హైపోథైరాయిడిజంతో బాధపడుతుంటే గర్భంలో మెదడు అభివృద్ధిని, ఆపైన బిడ్డ మానసిక అభివృద్ధిని సరిదిద్దలేని విధంగా దెబ్బతీస్తుంది. రక్తంలో థైరాయిడ్ హార్మోన్ శాతం పూర్తిగా తగ్గిపోయినపుడు వ్యక్తి స్పృహతప్పి ప్రాణాలు కోల్పోతారు. థైరాయిడ్ హార్మోన్, అది లోపించటం వల్ల కలిగిన ఫలితాలని దృష్టిలో ఉంచుకుని సమగ్ర పరీక్షలు జరిపి ఖచ్చితమైన నిర్ధారణ అనంతరం హైపోథైరాయిడిజం చికిత్స ప్రారంభించాల్సి ఉంటుంది. ఇందుకుగాను థైరాయిడ్ పనితీరును సమగ్రంగా పరిశీలించి ఖచ్చితంగా అంచనా వేయగల అత్యాధునిక వ్యాధి నిర్ధారణ పరీక్షలు, అనుభవజ్ఞులైన వైద్యనిపుణులు అవసరం. తమ వద్ద అత్యాధునిక రోగనిర్ధారణ వైద్య పరీక్షలు నిర్వహించే పరికరాలు, నిపుణులతో ప్రత్యేక ఎండోక్రైనాజీ విభాగం పనిచేస్తోందని యశోద హాస్పిటల్స్‌కు చెందిన వైద్యనిపుణులు చెప్పారు. దీన్లో హార్మోన్ రిప్లేస్ థెరపీ, గ్రోత్ హార్మోన్ టెస్ట్‌తో థైరాయిడ్ సహా వినాళ గ్రంధుల చికిత్సకు ఎండోక్రైనాలజీ విభాగంలో సౌకర్యాలు అభివృద్ధి చేశారు.



పారిశ్రామికవేత్తలు దేశాభివృద్ధి చోదక శక్తులుగా మారాలి. ఆర్థిక వృద్ధికి, ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యమివాలి. స్వాతంత్ర్య పోరాటాన్ని మహాత్మాగాంధీ ప్రజాపోరాటంగా ఎలా మార్చారో, అదే స్ఫూర్తితో పారిశ్రామికవేత్తలు ముందుకు పోవాలి. అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రజాఉద్యమంగా తీర్చిదిద్దాలి.


నరేంద్ర మోదీ, ప్రధాని

ట్రిపుల్ తలాక్ రద్దుతోనే మహిళల స్వేచ్ఛ రాదు. మహిళలు విద్యావంతులు కావాల్సిన అవసరం ఉన్నది. స్వేచ్ఛాపూరిత వాతావరణం ఉండాలి. 1400 ఏండ్ల నాటి ఖురాన్ చట్టాలు రద్దు కావాలి. అలాగే సమానత్వంతో కూడిన కొత్త చట్టాలు రావాలి.

తస్లిమా నస్రీన్, బంగ్లాదేశ్ రచయిత్రి



చరిత్రలో నేడు




1900

బోస్టన్‌లో 'నేషనల్ నీగ్రో బిజినెస్ లీగ్' ప్రారంభం.

1906



అమెరికా సాయాన్ని కోరిన క్యూబా మొదటి అధ్యక్షుడు టోమ్స్ ఎస్ట్రాడా పామా.



1933

పూనా జైలు నుంచి విడుదలైన వెంటనే మరో నిరాహార దీక్షా ఉద్యమాన్ని ప్రారంభించిన గాంధీ.

కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ హిందీలో రాసిన లేఖకు లోక్‌సభ సభ్యుడు తథాగత సత్పతి ఒడియా భాషలో బదులివ్వడం, హిందీని రుద్దాలనే ప్రయత్నాల పట్ల వ్యక్తమవుతున్న నిరసనకు అద్దం పడుతున్నది. 1950, 60 దశకాల్లో భాషా విధానంపై తీవ్ర చర్చ సాగుతున్నప్పుడు కూడా హిందీని జాతీయ భాష చేయాలనే విఫలయత్నం జరిగింది. అందుకే రాజ్యాంగ వేత్తలు అధికార భాష ఉండాలే తప్ప జాతీయ భాష ఉండాలని నిర్ణయించలేదు. భిన్నత్వంలో ఏకత్వం అంటే భిన్న ఆహార అలవాట్లను, వేష భాషలను, మతాలను సహించడమే కాదు, సంబురంగా జరుపుకోవడం.

హిందుస్థాన్ టైమ్స్

ఇంటర్నెట్ నీతిబాహ్యమైనది కూడా కావచ్చు. దీనికి కొన్ని ప్రమాణాలు విధించాలనుకోవడంలో తప్పులేదు. భావ స్వేచ్ఛను కోరుకునే వాళ్లం కూడా కొన్ని పరిమితులు ఉండాలని అంగీకరిస్తాం. కానీ ఈ పరిమితులు ఎవరు విధించాలె, ఎవరు అమలు చేయాలనేది ప్రశ్న. ప్రభుత్వాలు, కంపెనీలు ఈ ప్రక్రియలో భాగస్వాములు. ప్రభుత్వాలు పరిమితులు కోరినప్పుడు కంపెనీలు అమలుచేస్తాయి. విద్వేషాలను ప్రేరేపించే భావాలపై సెన్సార్‌షిప్ సరే. కానీ కొన్ని ఎంత ఉద్రేకపూరితంగా ఉన్నప్పటికీ అనుమతించవలసిందే. నిబంధనలను ప్రజాస్వామ్యబద్ధంగా రూపొందించడంతోపాటు స్వతంత్ర న్యాయవ్యవస్థ ద్వారా అమలుచేయాలె.

ది గార్డియన్

మానవీయ తీర్పు

'తక్షణ తలాఖ్' (తలాఖ్– ఎ– బిద్దత్) విధానాన్ని రాజ్యాంగ విరుద్ధమైనదిగా పేర్కొంటూ సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం వెలువరించిన తీర్పు చరిత్రాత్మకమైనది. ఈ రకమైన తలాఖ్ రాజ్యాంగంలోని మత స్వాతంత్ర్యాన్ని కాపాడే 25 అధికరణం ప్రకారం కూడా చెల్లుబాటు కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తితో పాటు మొత్తం ఐదుగురు సభ్యుల ధర్మాసనంలోని ముగ్గురు సభ్యులు తమ మెజారిటీ తీర్పును వెలువరించారు. అత్యంత అరుదైన రీతిలో ప్రధాన న్యాయమూర్తి మెజారిటీ తీర్పుతో ఏకీభవించకపోవడం విశేషం. మెజారిటీ అభిప్రాయాన్ని ప్రతిబింబించిన న్యాయమూర్తి నారిమన్ ఇచ్చిన తీర్పు గమనార్హమైనది. ముస్లిం మహిళలు న్యాయం అర్థించినప్పుడు న్యాయస్థానం చేతులు ముడుచుకొని కూర్చోలేదని జస్టిస్ నారిమన్ స్పష్టం చేశారు. మూడు రకాల తలాఖ్ విధానాలు 1937 నాటి 'షరియత్ చట్టం' రెండవ సెక్షన్ ప్రకారం అమలులో ఉన్నాయి. అందువల్ల ఈ తలాఖ్ చట్టపరంగా అమలులో ఉన్నదే తప్ప మతపరంగా కాదని నారిమన్ తమ తీర్పులో స్పష్టం చేశారు. 13 అధికరణం ప్రకారం– రాజ్యాంగం ఆమోదించడానికి ముందు ఆ తరువాత గల చట్టాలన్నీ ప్రాథమిక హక్కులకు భంగం కలిగించనివై ఉండాలె. అందువల్ల ప్రాథమిక హక్కులకు భంగకరంగా ఉన్న తలాఖ్ చెల్లుబాటు కాదని న్యాయమూర్తి నారిమన్ తమ తీర్పులో వివరించారు.

ముస్లిం మహిళల హక్కులకు, ఆత్మగౌరవానికి భంగకరంగా ఉన్న తలాఖ్ విధానం చాలా కాలంగా వివాదాస్పదంగా మారింది. పలువురు ముస్లిం మహిళలు ఈ విధానాన్ని సవాలు చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వివిధ హక్కుల సంఘాలు కూడా తలాఖ్ విధానాన్ని సవాలు చేశాయి. అయితే ముస్లిం పర్సనల్ లా బోర్డు మాత్రం ఇది ముస్లిం మత ఆంతరంగిక అంశమని అభిప్రాయపడుతున్నది. మతపరమైన సున్నితమైన అంశమైనప్పటికీ, మహిళల హక్కులకు సంబంధించినది కావడం వల్ల ఈ విధానం ప్రాధాన్యం సంతరించుకున్నది. ఖురాన్‌లో, షరియత్‌లో తలాఖ్ విధానం లేదు. మహమ్మద్ ప్రవక్త కూడా విడాకులకు మానవీయమైన, ప్రజాస్వామిక విధానాన్ని సూచించారు. అయితే కొన్ని వందల ఏండ్లుగా అమలులో ఉన్నదనే కారణంగా తలాఖ్‌ను ముస్లిం మత విధానాలలో భాగంగా గుర్తించాలనే వాదన ముందుకువచ్చింది. తలాఖ్‌లో మూడు రకాల విధానాలు ఉన్నాయి. ఇందులో 'బిద్దత్' విధానం ప్రకారం అప్పటికప్పుడే మూడుసార్లు తలాఖ్ చెప్పి విడాకులు పొందడం. ఈ విధానం ఆవేశంలో, తాగిన మైకంలో తలాఖ్ చెప్పినా చెల్లుబాటు కావడం మొదలైంది. ఫోన్, ఈ– మెయి ల్, వాట్సాప్ మొదలైన పద్ధతుల్లో కూడా మూడుసార్లు తలాఖ్ చెప్పి భార్యను వదిలి పెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. మిగతా రెండు తలాఖ్ పద్ధతులకు భిన్నంగా తలాఖ్ బిద్దత్ ద్వారా విడాకులు పొందితే మళ్ళా అదే వ్యక్తితో కాపురానికి వీలులేదు. ఆ మహిళ మరో వ్యక్తిని వివాహమాడి, కాపురం చేసి విడాకులు తీసుకుంటే కానీ పాత భర్తను వివాహం చేసుకోవడం సాధ్యం కాదు. ఈ తలాఖ్ బిద్దత్ మహిళలకు క్షోభనిస్తున్నది. వారి ఆత్మగౌరవానికి భంగకరంగా మారింది. అందువల్ల మహిళల హక్కుల పరిరక్షణకు న్యాయపోరాటం ఉధృతమైంది. సుప్రీంకోర్టు ముందుకు బహుభార్యత్వం వంటి ఇతర అంశాలు వచ్చినప్పటికీ, ఈ మూడవ రకం తలాఖ్‌పైనే దృష్టి సారించింది.

తలాఖ్‌ను రాజ్యాంగ విరుద్ధమైనదిగా ప్రకటిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల రాజకీయ వర్గాలు హర్షం వ్యక్తంచేశాయి. ఈ తీర్పును సమానత్వం, మానవ హక్కుల కోణంలో చూడాలే తప్ప మతపరమైన దృక్కోణంలో వ్యాఖ్యానించడం సబబు కాదు. ముస్లింలలోని ఆధునికత సంతరించుకున్నవారు ఈ తలాఖ్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఏ మతంలోనైనా అభివృద్ధి చెందిన వారు పాతకాలపు అమానవీయ చట్టాలను వ్యతిరేకించడం సహజం. ప్రతిమతంలోనూ స్వీకరించదగిన అంశాలతోపాటు తిరస్కరించదగినవీ ఉంటాయి. కాలం మారే కొద్దీ కొన్ని సం ప్రదాయాలను వదిలివేయక తప్పదు. ఇది అన్ని మతాలకూ వర్తిస్తుంది.

తలాఖ్‌ను రాజ్యాంగ విరుద్ధమైనదిగా ప్రకటిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల రాజకీయ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ తీర్పును సమానత్వం, మానవ హక్కుల కోణంలో చూడాలే తప్ప మతపరమైన దృక్కోణంలో వ్యాఖ్యానించడం సబబు కాదు. ముస్లింలలోని ఆధునికత సంతరించుకున్నవారు ఈ తలాఖ్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఏ మతంలోనైనా అభివృద్ధి చెందినవారు పాతకాలపు అమానవీయ చట్టాలను వ్యతిరేకించడం సహజం. ప్రతిమతంలోనూ స్వీకరించదగిన అంశాలతోపాటు తిరస్కరించదగినవీ ఉంటాయి. కాలం మారే కొద్దీ కొన్ని సంప్రదాయాలను వదిలివేయక తప్పదు. ఇది అన్ని మతాలకూ వర్తిస్తుంది. ఉదారవాద ప్రజాస్వామ్య సంస్కృతిలో భాగంగా మతపరమైన అంశాలలో జోక్యం చేసుకోకూడదని స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ళలో దేశ నాయకులు భావించారు. తమ ఆంతరంగిక అంశాలలోకి రాజ్యం చొరబడుతుందని, తద్వారా తమ విశ్వాసాలకు భంగం కలుగుతుందని భిన్న మతాలవారిలో భయాందోళనలు కూడా వ్యక్తమయ్యాయి. కానీ స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచింది. ఆధునిక సంస్కృతి సమాజంలో విస్తరించింది. ఇప్పుడు లౌకిక విషయాలలో మతం పాత్ర ఉండకూడదనే భావన సమాజంలో బలపడ్డది. అందువల్ల ఆయా మతాలలోని లౌకిక, అభ్యుదయవాద శక్తులకు ప్రభుత్వం మద్దతు ఇవ్వాలె. రాజ్యాంగం హామీ ఇచ్చిన సమానత్వానికి, ప్రాథమిక హక్కులకు భంగం కలిగే సూత్రాలు, ఆచారాలు ఏ మతంలో ఉన్నా చెల్లవనే స్పష్టమైన వైఖరి పార్లమెంటు, న్యాయస్థానం తీసుకోవాలె. తలాఖ్ రాజ్యాంగ విరుద్ధమైందంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు లౌకిక వ్యవస్థ బలోపేతానికి బాటవేయాలె.

జనగళం

అవగాహన కల్పించాలె

భారత దేశం సాంకేతిక రంగంలో ముందుకు దూసుకెళ్తున్నది. రాకెట్ ప్రయోగాల్లో కూడా ఎన్నో ఘన విజయాలను సొంతం చేసుకుంటున్నది. ఈ నేపథ్యంలో దేశంలో కొన్నిచోట్ల మూఢనమ్మకాలకు ప్రాధాన్యం ఇచ్చి డబ్బును, ఆభరణాలను సైతం కోల్పోతుంటే ఆశ్చర్యం వేస్తున్నది. ఇలాంటివారిలో ఎక్కువమంది విద్యావంతులే ఉండటం గమనార్హం. ఏకంగా కొన్ని గ్రామాల్లో అయితే గుప్తనిధుల తవ్వకాల పేరిట నర, జంతు బలులివ్వ డం చూస్తుంటే భయమేస్తున్నది. మూఢ నమ్మకాల పట్ల ప్రభుత్వాలు ప్రజలను చైతన్యపరుచాలి.

- శివుని శశిధర్, సైదాపురం, యాదాద్రి భువనగిరి

ప్రతిపక్షాలకు కనువిప్పు

రాష్ట్ర ఆవిర్భావం నుంచి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు శ్రేయస్సు కోసం ఎన్నో పథకాలను రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగానే మిషన్ కాకతీయ, రుణమాఫీ లాంటివి రైతులకు ఎంతో మేలు చేశాయి. దీన్ని గుర్తించిన కేంద్రప్రభుత్వం కేసీఆర్ అగ్రికల్చర్ లీడర్‌షిప్ అవార్డు ఎంపిక చేయడం హర్షణీయం. ఇకనైనా ప్రతిపక్షాలకు కనువిప్పు కలుగాలె.

- చిలువేరు కరుణాకర్, పడమటి గూడెం, తొర్రూర్

ఖాళీలను భర్తీ చేయాలె

రాష్ట్రంలోని కొన్ని మండల కేంద్రాల్లోని పశువైద్యశాలల్లో వైద్యాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వైద్యాధికారులు లేక కాంపౌండర్లే పశువులకు వైద్యం నిర్వహించాల్సిన పరిస్థితి ఉన్నది. కాబట్టి ప్రభుత్వం ఈ విషయమై దృష్టిసారించి వైద్యాధికారుల పోస్టులను భర్తీ చేయాలి.

- చుంచు అరుణ్‌కుమార్, వెల్గనూర్, లక్షెట్టిపేట, మంచిర్యాల జిల్లా

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

విశ్లేషణ



బాబీ ఘోష్

రాజకీయ నిర్ణయాలతోనే పరిష్కారం

భారత్, చైనాల మధ్య డోక్లామ్ ప్రాంతంలో సైన్యాల మోహరింపుతో నెలకొన్న ఉద్రిక్తతలు రోజుకో విధంగా కొత్త పుంతలు తొక్కుతున్నాయి. చైనా అధికార పత్రిక చేస్తున్న భారత్ వ్యతిరేక ప్రచారానికి తోడు ఈ మధ్య చైనా సరికొత్త ప్రచారానికి తెరలేపింది. ఆధునిక కంప్యూటర్ టెక్నాలజీతో వీడియోలు సృష్టించి భారత్ వ్యతిరేక ప్రచారానికి పూనుకుంటున్నది.

డోక్లామ్ సంక్షోభం నేపథ్యంలో చైనా అధికార మీడియా రెండు వీడియోలను జిన్‌హువా విడుదల చేసింది. ఒక వీడియోలో భారత్, చైనా సైనికులు పరస్పరం ముష్టి ఘాతాలు, పిడిగుద్దులు గుద్దుకోవటం, రాళ్లతో దాడులు చేసుకోవటం చూపించారు. మరో వీడియోలో సరిహద్దు పొరుగు దేశాలతో చైనా పాలకులు సరిగ్గా వ్యవహరించకపోవటం ఫలితంగానే డోక్లామ్ లాంటి సమస్యలు తలెత్తుతున్నాయని చెబుతున్నది. అయితే.. పొరుగు దేశంతో సరిహద్దు వివాదం నెలకొన్న పరిస్థితుల్లో ఇలాంటి సైబర్ ప్రచారంతో దాడికి పూనుకోవటం గర్హనీయం.

వీడియోలు చూసినట్లయితే.. భారత సరిహద్దు లడఖ్ సమీపంలోని ప్యాంగాంగ్ సరస్సు సమీపంలో భారత్–చైనా సైనికులు పరస్పరం ముష్టిఘాతాలతో తలపడుతుంటారు. రాళ్లను విసురుకుంటుంటారు. వాస్తవానికి అలాంటి ఘటనలు జరిగాయి అన్నది సాధారణ పౌరులకు తెలియదు. వాటిని చూసిన వారికి ఎవరికీ అది వాస్తవికమైనదిగా తోచి భావోద్రేకాలేమీ కలుగవు. కాకుంటే ఇరువైపులున్న సైనికులు మారణాయుధాలు, తుపాకులు ఉపయోగించిన దాఖలాలు కనిపించవు. అణ్వాయుధాలు కలిగిన ఇరు దేశాలూ ఇలాంటి ప్రచారం కారణంగా ఎటు వైపు ప్రయాణిస్తున్నాయోనన్నది మాత్రం ఆలోచించదగిందే. ఈ వీడియో చూసిన వారికెవరికైనా దానిలోని వాస్తవికత పట్ల అనుమానం తప్పక వస్తుంది. మరోవైపు జిన్‌హువా ప్రసారంలో భాగంగా ఓ మహిళా యాంకర్.. డోక్లామ్ ప్రాంతంలో భారత్ సైన్యాన్ని మోహరించటంతో భారతదేశం ఏడు తప్పులకు పాల్పడిందని చెప్పుకొచ్చింది. భారత్ అవాంఛనీయమైన జాతీయవాదాన్ని రెచ్చగొడుతున్నదని ఆరోపించారు. భూటాన్‌కు రక్షణ పేర భారత్ తన ఆధిపత్య, జాతీయవాదాన్ని ప్రదర్శిస్తున్నదని చెప్పుకొచ్చింది.

ఈ వీడియో ఉద్దేశం స్పష్టమే. భారత్ తన పొరుగు దేశాలతో అనసర వివాదాలను సృష్టిస్తున్నదని చెప్పటమే లక్ష్యం. అయితే వీడియో తీరు ఎంత విడ్డూరంగా ఉన్నదో చూస్తే తెలుస్తున్నది. వీడియోలో చైనా వారికే భారత సైనికుల బట్టలు, సిక్కుల మాదిరిగా తల పాగా, గడ్డం పెట్టి భారత సైనికులుగా చూపించారు. భారతీయులుగా చూపాలనుకుంటే చైనాకు అనుకూలంగా ఉన్న పాకిస్థాన్‌కు చెందిన వారితోనూ చూపించవచ్చు. కానీ అలా జరుగలేదు. అలాగే ఆ వీడియోలో మాట్లాడిన యాంకర్ అమెరికా ఇంగ్లీష్ యాసలో మాట్లాడటం మరింత హాస్యాస్పదం.

ఈ నేపథ్యంలోనే చైనా విధానాన్ని ఒకసారి పరిశీలించాలి. అక్కడి పరిస్థితుల్లో రాజకీయ వ్యంగ్యంతో రాతలు, వీడియోలు చాలా అరుదు. అలా ఎవరైనా చైనా నాయకత్వాన్ని వ్యంగ్యంగా విమర్శిస్తూ ఏదైనా ప్రసారం జరిగితే ఆ యాంకర్ భవిష్యత్తు అగమ్యగోచరమే. వ్యంగ్యంగా మాట్లాడే స్వేచ్ఛ చైనాలో ఉండనే ఉండదని చెప్పుకోవచ్చు. చైనా నాయకత్వంపైనే అలాంటి వ్యంగ్యాస్త్రాలు, జోకులు వేస్తారా? అలాంటిది పొరుగు దేశంపై అలాంటి వ్యంగ్యాస్త్రాలు వేయటం సమంజసం అనిపించుకోదు. దీన్నిబట్టి చైనా అధికారిక మీడియా ఎలాంటి ప్రచారం చేస్తున్నదో అర్థం చేసుకోవచ్చు.



మరోవైపు చైనా మీడియా ప్రకారం.. డోక్లామ్ ప్రతిష్టంభనపై ఇండియాతో చైనా నేరుగా మాట్లాడాలి. చైనా నేతలు రాజకీయ నిర్ణయాలు తీసుకోవాలి. అయితే చైనా మీడియా అనుసరిస్తున్న విధానమే సమంజసంగా లేదు. కానీ రెండో వీడియో కొంతమేరకు సమర్థనీయంగానే ఉన్నది. రెండో వీడియోలో భారత్ జాతీయవాదం గురించేమీ లేదు. కొంత మెతక వైఖరితో ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో ఇరుదేశాలూ ఉండాలన్న హితబోధ ఉన్నది. దీనిప్రకారం.. చైనా, భారత్ దేశాలూ వేల ఏళ్ల పురాతన సంస్కృతి గల దేశాలు. పూర్వకాలం నుంచీ రెండు దేశాలు ఎన్నడూ శత్రు దేశాలుగా వైరంతో లేవు. కాబట్టి భారత్ డోక్లామ్ ప్రాంతంలో చైనా భూభాగాల్లో మోహరించిన సైన్యాలను వెనక్కి తీసుకోవాలని హితవు పలికింది. అనవసర విషయాలకు పోయి యుద్ధాన్ని కొనితెచ్చుకోవద్దని సూచించింది. ఢిల్లీ యుద్ధానికి దిగే తప్పుడు నిర్ణయం తీసుకోదని ఆశాభావం వ్యక్తంచేసింది.

ఇలాంటి పరిస్థితుల్లో చైనా చేస్తున్న ప్రచార ప్రభావం దీర్ఘకాలికంగా ఏదో రూపంలో సాధారణ పౌరులపై తప్పక ఉంటుంది. చైనా అనేక రంగాల్లో సాధించిన ప్రగతి లాగానే సాఫ్ట్‌వేర్ రంగంలో కూడా గొప్ప ముందంజ వేసింది. ఆసియాలోనే అతిపెద్ద ఆర్థిక శక్తిగానే గాక, ఆధునిక కంప్యూటర్ రంగంలో కూడా చాలా ఎత్తుకు ఎదిగింది. ఇది కేవలం ఏకోన్ముఖ అధికారవాదంతో సాగించిన ప్రగతి మాత్రమే కాదు. సోవియట్ రష్యా కూడా పశ్చిమదేశాలతో స్నేహ సంబంధాలు నెరపుతున్న సమయంలో చైనా ఒంటరివాదంతో దూసుకుపోతున్నది. ఈ క్రమంలో చైనా మాత్రం భారతదేశంతో కూడా స్నేహాన్ని కోరుకుంటున్న పరిస్థితి లేదు. భారత దేశంలోనూ ఆధునిక కంప్యూటర్ రంగం ఎంతో అభివృద్ధి చెందటానికి అవకాశం ఉండింది. కానీ ఇందిరాగాంధీ హయాంలో అమెరికాను మిత్ర దేశంగా చూడకుండా, దాన్నొక అంటరాని దేశంగా చూడటంతో మనం వెనుకబడిపోయాం.

వీడియోలతో తెలుస్తున్నదేమంటే.. చైనా ధోరణిలోనే సమస్య ఉన్నది. పొరుగు దేశాలతో అనుసరించే విధానం సమాన స్థాయిదిగా ఉండటం లేదు. భారత్ గురించి మాట్లాడాల్సి వచ్చినప్పుడల్లా చైనా అహంకారపూర్వకంగా వ్యవహరిస్తున్నది, మాట్లాడుతున్నది. వీక్షకులను నవ్వించటం పేర మరో దేశాన్ని లక్ష్యం చేసుకోవాల్సిన అవసరం లేదు. హేళన చేయాల్సింది అసలే కాదు. ఈ పరిస్థితుల్లో ప్రపంచమంతా భారత్–చైనాల మధ్య ఏం జరుగుతున్నదన్న దానిపట్ల ఆసక్తిగా ఉన్నది. అంతకన్నా ఆందోళనకరంగా ఉన్నది. సరిహద్దు సమస్యలు సైనికుల మోహరింపులతో పరిష్కారం కావన్నది గుర్తించాలి. సైనికుల ప్రాణాలతో సమస్యలు తీరే మార్గాలు ఉండరాదు. సరిహద్దు సమస్యలు తలెత్తినప్పుడు రాజకీయ పరిష్కారం దిశగా పాలకులు ఆలోచించి, అడుగులు వేయాలి.

> చైనా ధోరణిలోనే సమస్య ఉన్న ది. పొరుగు దేశాలతో అనుసరించే విధానం సమాన స్థాయిదిగా ఉండటం లేదు. భారత్ గురించి మాట్లాడాల్సి వచ్చినప్పుడల్లా చైనా అహంకారపూర్వకంగా వ్యవహరిస్తున్నది, మాట్లాడుతున్నది. వీక్షకులను నవ్వించటం పేర మరో దేశాన్ని లక్ష్యం చేసుకోవాల్సిన అవసరం లేదు. హేళన చేయాల్సింది అసలే కాదు. ఈ పరిస్థితుల్లో ప్రపంచమంతా భారత్-చైనాల మధ్య ఏం జరుగుతున్నదన్న దానిపట్ల ఆసక్తిగా ఉన్నది. అంతకన్నా ఆందోళనకరంగా ఉన్నది. సరిహద్దు సమస్యలు సైనికుల మోహరింపులతో పరిష్కారం కావన్నది గుర్తించాలి

(వ్యాసకర్త:హిందుస్థాన్ టైమ్స్ చీఫ్ ఎడిటర్)

(హిందుస్థాన్ టైమ్స్ సౌజన్యంతో..)


అవిరళ కృషీవలుడు పీవీఆర్కే

నివాళి



వనం జ్వాలా నరసింహారావు

విశ్రాంత ఐఏఎస్ అధికారి, దివంగత ప్రధాని పీవీ నర్సింహారావు మీడియా సలహాదారు పీవీఆర్కే ప్రసాద్, 2017, ఆగస్ట్ 21న మరణించారన్న వార్త అనేక మందిని శోక సముద్రంలో ముంచేసింది. సోషల్ మీడియాలో, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో ఆయన అభిమానులు చాలామంది ఆయన మృతికి సంతాపం తెలిపారు. ఈయన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ మాజీ డైరెక్టర్ జనరల్, తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ కార్యానిర్వహణ అధికారి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషనర్, మాజీ పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ లాంటి పలు అధికార బాధ్యతలు నిర్వర్తించారు. పాలనా వ్యవస్థను సమర్థవంతంగా నిర్వర్తించగల నైపుణ్యం, ఆధ్యాత్మిక చింతన, మానవతకు నిలువెత్తు నిదర్శనంగా చెప్పుకోదగిన పీవీఆర్కే, సంస్థలను, వ్యవస్థలను అభివృద్ధి పథాన నడిపించారు. ఎక్కడ, ఏ హోదాలో పనిచేసినా తనదైన శైలిలో తనదైన పని తీరును ప్రతిబింబింపజేయటంలో ఆయన అనుసరించిన విధానం ఒక ప్రత్యేకత సంతరించుకున్నది. పీవీఆర్కేతో నాది ఐదు దశాబ్దాల అనుబంధం. నా సొంత జిల్లా ఖమ్మం కలెక్టర్‌గా ఆయన పనిచేసే కాలంలో మా పరిచయం మొదలైంది. ఆ పరిచయం అనుబంధంగా మారి, మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్‌గా ఆయన ఉన్నప్పుడు నేనక్కడ అదనపు డైరెక్టర్‌గా ఆయనతో కలిసి పనిచేసే వరకూ కొనసాగడం జరిగింది.



1998లో పీవీఆర్కే మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో డైరెక్టర్ జనరల్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజే, అప్పటికే సంస్థ చేపట్టిన ఒక ప్రధాన అంశాన్ని ఆయనకు వివరించడానికి ఆయన ఛాంబర్‌లోకి వెళ్లడం జరిగింది. ఆ సంస్థ చైర్మన్‌గా ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు ఆదేశాలకు అనుగుణం గా, ఆప్టికల్ మార్క్ రీడర్ (ఓ.ఎం.ఆర్) పద్ధతిలో ఐదు లక్షల పైగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల శిక్షణావసరాల విశ్లేషణ మానవ వనరుల అభివృద్ధి సంస్థ చేపట్టింది. దానిని కిందిస్థాయి ఉద్యోగులైన జూనియర్ అసిస్టెంట్ల నుంచి, శాఖల ఉన్నతాధికారుల వరకు నిర్వర్తించాల్సి ఉన్నది. అయితే అప్పట్లో లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నందున సీఎం ఆ పనిలో బిజీగా ఉండటంతో సంస్థ చేపట్టిన పనిలో కాస్త జాప్యం కావటం జరిగింది. ఏ క్షణంలోనైనా సీఎం ఈ విషయం గురించి అడిగే ఆస్కారం ఉన్నందున ఆ అంశాన్ని చూస్తున్న నేను ఆ వివరాలు చెప్తానన్నాను. నేను వివరించే లోపే ప్రసాద్‌గారు నాతో, తాను ఆ సంస్థలో విశ్రాంత సమయం కోసం చేరానని, తన ఆధ్యాత్మిక పనులకు వెసులబాటు కల్పించాలని కోరి మరీ ఆ పోస్టింగ్ వేయించుకున్నాననీ, ఈ విషయాలన్నీ అదనపు డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్న ఊర్మిలా సుబ్బారావు చూసుకుంటారని అన్నారు. ఆయన ఆ మాటలు అంటుండగానే ముఖ్యమంత్రి స్వయానా పీవీఆర్కేకి ఫోన్‌చేసి ఓఎంఆర్ పురోగతి వివరాలు తీసుకురమ్మని కోరటం జరిగింది. తక్షణమే నా నుంచి కావలసిన సమాచారం రాబట్టి నన్ను తీసుకొని సీఎం కార్యాలయానికి వెళ్ళారు. అక్కడ ఆయన ఓఎంఆర్ వివరాలను ఎంతో కాలంగా తెల్సినవాడిలా సోదాహరణంగా సీఎంకు వివరించడం కళ్లారా చూసిన నాకు ఆయనకున్న విషయ పరిజ్ఞానం పట్ల ఆశ్చర్యం కలిగింది.

ఇక అప్పటి నుంచి సంస్థకు సంబంధించిన ఏ అంశంలోనూ వెనుకంజ వేయకుండా ఆయన పనితీరుకు నిదర్శనంగా నిలిచే విధంగా, ప్రపంచంలో అత్యుత్తమ శిక్షణను అందించే ప్రతిష్ఠాత్మక సంస్థగా ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీని ఆయన తీర్చిదిద్దారు. పీవీఆర్కే తన సర్వీసులో ఎక్కువకాలం అందించిన సేవల ఫలితంగా ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ సంస్థ అమోఘమైన రూపకల్పనకు దారితీసింది. 1998 నాటికి ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌గా వ్యవహరించబడిన ఆ సంస్థ కేవలం సంప్రదాయబద్ధంగా నిబంధనలకు లోబడి, తరగతి గదులకు లోబడి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడానికి మాత్రమే పరిమితమయ్యేది. ఆయన డైరెక్టర్ జనరల్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన అచిరకాలంలోనే కొత్తకొ పద్ధతులకు శ్రీకారం చుట్టారు.

ప్రసాద్‌గారి హయాంలోనే, మర్రి చెన్నారెడ్డి మరణానంతరం, సంస్థ పేరు మార్చి, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థగా నామకరణం చేశారు. రాష్ట్రంలోని భూత, భవిష్యత్, వర్తమాన మానవ వనరుల అభివృద్ధికి ముందుచుపుతో వ్యవహరించి గమనాన్ని, గమ్యాన్ని మార్చి రాయగలిగిన సత్తా సామర్థ్యం ఉన్నవారికే సాధ్యపడిందనాలి. ప్రభుత్వ ఉద్యోగులందరికీ శిక్షణ అన్న నినాదంతో రాష్ట్ర శిక్షణా చొరవ (ఎస్టీఐ) అనే విధాన ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ఘనత ఆయనదే. ఉద్యోగుల పని తీరులో సామర్థ్యాన్ని పెంపొందించి వారిని నిష్ణాతులుగా తీర్చిదిద్దడానికి, ఎస్టీఐ ద్వారా, రాష్ట్రంలోని ఐదు లక్షల ప్రభుత్వ ఉద్యోగులందరికీ ప్రతిఉద్యోగికీ కనీసం సంవత్సరంలో రెండు వారాలపాటు శిక్షణ ఇచ్చే ఏర్పాటు చేశారాయన. అప్పట్లో యావత్ దేశంలో అమలు చేయాలన్న జాతీయ శిక్షణా విధానాన్ని మొట్టమొదటగా అమలు చేసిందిక్కడే.

సంస్థకు కావలసిన మౌలిక వసతులను అబ్బురపరిచే రీతిలో సమకూర్చిన ఘనత, చరిత్ర వారి సొంతం. వారి దూరదృష్టికి నిదర్శనమే నేడు మానవ వనరుల సంస్థ భావన సముదాయం కాని, శిక్షణా పటిష్టత కాని, సిబ్బంది సామర్థ్యం కాని, మరేదైనా కాని. అప్పట్లో అటువంటి తొట్టతొలుత పరిపాలనా పరమైన మార్పులను తీసుకువచ్చే వ్యవస్థను తీర్చదిద్దే క్రమాన్ని అత్యంత సునాయసంగా, చాకచక్యంగా సమర్థవంతంగా చేయటం బహుశా వారికే సొంతం అని చెప్పవచ్చు. వ్యక్తులను ఎంపిక చేయటం, కర్తవ్యాలను నిర్దేశించటం, వ్యవస్థకు గాడిలో పెట్టడం వంటివి అనుకున్న రీతిలో చేసి చూపారు. పద్ధతి ప్రకారం శిక్షణా అవసరాలను గుర్తించి వినూత్న పద్ధతులను ఎంపిక చేసి డీవీడీల ద్వారా, కంప్యూటర్ల ద్వారా, శాటిలైట్ నెట్‌వర్క్ ద్వారా, దృశ్య శ్రవణ మాధ్యమాల ద్వారా శిక్షణను అందించే పద్ధతులకు శ్రీకారం చుట్టారు.

హెచ్‌ఆర్డీ కాంపస్‌లోనే సెంటర్ ఫర్ గుడ్ (సీజీజీ) నెలకొనడం పీవీఆర్కే చొరవతోనే. పాలనలో అత్యుత్తమ ప్రమాణాలను ఎక్కడ రూపొందించినా, వాటిని గుర్తించి, మనకు అనుకూలంగా అవి అనుసరించదగిన పద్ధతులను అభివృద్ధి చేయటంలో సీజీజీ తనదైన పాత్ర పోషించడం జరుగుతున్నది. ఎక్కడికక్కడ ఆయా జిల్లాలకే పరిమితమయ్యే రీతిలో జిల్లాస్థాయి శిక్షణా తరగతులు నిర్వహించడం ఆయన హయాంలోనే మొదలైంది. ఆయా జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో వారిని నేరుగా జిల్లా శిక్షణా కమిషనర్లుగా వ్యవహరించే బాధ్యతలు అప్పజెప్పడం కూడా జరిగింది. జాతీయ శిక్షణా విధానం నిర్దేశాలకు లోబడి, ఉద్యోగుల జీతభత్యాలకు వినియోగించే బడ్జెట్ కేటాయింపు మొత్తంలో, 1.5 శాతం మేరకు శిక్షణా కార్యక్రమాల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించే పద్ధతి తీసుకురావటం పీవీఆర్కే కృషికి తార్కాణం.

పీవీఆర్కే నేతత్వంలో వారి ఆలోచనలు ఆచరణలో పెట్టి నాయకత్వం నిష్ణాతులను తీర్చిదిద్దటంలో సమర్థనీయంగా తన కర్తవ్యాలను నిర్వర్తించిందని, దానికి రూపకర్త, మార్గగామి పీవీఆర్కే మాత్రమే. శాఖల వారీగా గవర్నింగ్ ఫర్ రిజల్ట్స్ (జీఎఫ్ఆర్ కార్యక్రమాన్ని నిర్వహించటం ఇందుకుగాను మార్పుకారక నాయకులను గుర్తించడం, వారి ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం, దానికి కోర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ వంటి కార్యక్రమాలను అనుసంధానం చేయడం జరిగింది.

బాలకార్మిక నిర్మూలన కార్యక్రమాన్ని అంతర్జాతీయ బాలల సంస్థ, వివిగిరి జాతీయ కార్మిక సంస్థ నేతృత్వంలో నిర్వహించటంలో వినూత్న పద్ధతిలో రూపకల్పన చేసి 4100 నిష్ణాతులను రాష్ట్రవ్యాప్తంగా తీర్చిదిద్ది సామర్థ్యాలను పెంపు చేయటంలో పీవీఆర్కే దోహదపడ్డారు.

వీటితోపాటు పీవీఆర్కే సారథ్యంలో హార్వార్డ్ బిజినెస్ స్కూల్ ద్వారా కార్యక్రమాలు, యూఎన్డీపీ సహాయంతో అభివృద్ధి కార్యక్రమాలు, భారత ప్రభుత్వ డీఓపీటీ సహాయంతో శిక్షణా కార్యక్రమాలు, నిర్వహించడానికి ప్రసాద్ గారు కీలకమైన పాత్ర పోషించారు. 1999 ఎన్నికల అనంతరం అప్పటి క్యాబినెట్ మంత్రులకు, నాటి ముఖ్యమంత్రికి కలిపి మూడు రోజుల శిక్షణ నిర్వహించటం దేశంలోనే మొదటిసారి.

'నాహంకర్తా హరిః కర్తా', 'అసలేం జరిగిందంటే', 'తిరుమల లీలామృతం', 'తిరుమల చరితామృతం' ప్రసాద్ గారు రాసిన పుస్తకాలు.

దేశం ఒక సమర్థ పరిపాలనాదక్షుడిని, సంస్థల వ్యవస్థాపకుడిని–రూపకర్తను, ఆధ్యాత్మికవాదిని, అన్నింటికీ మించి మంచి నిబద్ధత కలిగిన కర్తవ్యపరాయణుడినీ, క్రమశిక్షణా ప్రియుడిని, ఆదర్శనీయుడిని కోల్పోయింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



ట్రిపుల్ తలాక్ మీద సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై హర్షం వ్యక్తంచేస్తూ మంగళవారం ముంబైలో మిఠాయిలు పంచుకుంటున్న ముస్లిం మహిళలు

స్వాతంత్ర్యానంతరం అతిపెద్ద సాంఘిక సంస్కరణ

- ముస్లిం మహిళా సామాజిక కార్యకర్తల హర్షం
- పిటిషనర్లలో తొణికిసలాడిన ఆనందం

న్యూఢిల్లీ, ఆగస్టు 22: ట్రిపుల్ తలాక్ చట్ట విరుద్ధమని సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రక తీర్పుతో పిటిషనర్ల మోములో ఆనందం తొణికిసలాడింది. సుప్రీంకోర్టు తీర్పు దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిపిన 'అత్యుత్తమ సంస్కరణల్లో ఒకటి' అని ముస్లిం సామాజిక కార్యకర్తలు అభివర్ణించారు. తలాక్ పద్ధతి పాటిస్తే శిక్ష తప్పదని చట్టం చేసినప్పుడే నిజమైన విజయం సాధించినట్లని కొందరు పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ తీర్పు ముస్లిం మహిళల హక్కులను పరిరక్షిస్తుందని, సున్నీ ముస్లింలు ఇకనుంచి దీనికి దూరంగా ఉండాలని న్యాయనిపుణుడు సోలి సొరాబ్జీ అన్నారు. అఖిల భారత ముస్లిం మహిళా పర్సనల్ లా బోర్డు (ఏఐఎండబ్ల్యూపీఎల్బీ)తోపాటు పిటిషనర్లు ఫరాహ్ ఫయాజ్, జాకియా సుమన్, నూర్జహాన్ నయాజ్ స్పందిస్తూ 'యుద్ధంలో సగం విజయం మాత్రమే సాధించాం' అని పేర్కొన్నారు. చట్టం రూపొందించే వరకు దీనికి విరుగుడు లేదని రాష్ట్రవాది ముస్లిం మహిళా సంఘ్ అధ్యక్షురాలు ఫరాహ్ ఫయాజ్ అన్నారు. భారతీయ ముస్లిం మహిళా ఆందోళన్ (బీఎంఎంఏ) ప్రతినిధి నయాజ్ స్పందిస్తూ ముస్లిం మహిళలు ఇక ప్రాథమిక హక్కులు పొందగలరని అన్నారు. ఈ తీర్పు సాంఘిక సంస్కరణల్లో నూతన అధ్యాయాన్ని లిఖిస్తుందని భారతీయ ముస్లిం మహిళా ఆందోళన్ సహ వ్యవస్థాపకురాలు, పిటిషనర్లలో ఒకరైన జాకియా సుమన్ ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రముఖ స్కాలర్ జీనత్ షౌకత్ అలీ మాట్లాడుతూ ఇది అద్భుతమైన తీర్పు, హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నానని వ్యాఖ్యానించారు. ఇది 'ముస్లిం మహిళల విజయం. అంతకుమించి ఇస్లాం సాధించిన విజయం' అని అఖిల భారత ముస్లిం మహిళా పర్సనల్ లా బోర్డు అధ్యక్షురాలు షైస్టా అంబర్ అన్నారు. అఖిల భారత షియా పర్సనల్ లాబోర్డు కూడా ఇస్లాం విజయంగా, ముస్లిం మహిళల విజయంగా అభివర్ణించింది. అఖిలభారత ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్బీ) అధికార ప్రతినిధి మౌలానా యాసూబ్ అబ్బాస్ స్పందిస్తూ ఈ తీర్పుతో మహిళలపై వేధింపులకు చరమ గీతం పాడినట్లేనన్నారు. బోర్డు ప్రధాన కార్యదర్శి మౌలానా వలీ రెహ్మానీ వ్యాఖ్యానించడానికి నిరాకరించారు. బాలీవుడ్ కథానాయిక షబానా అజ్మీ.. ఏండ్ల తరబడి పోరాడుతున్న మహిళలు సాధించిన విజయంగా సుప్రీంకోర్టు తీర్పును అభివర్ణించారు.

సుప్రీం తీర్పుపై స్పందనలు

సుప్రీం తీర్పు చరిత్రాత్మకం. మహిళా సాధికారత దిశగా శక్తిమంతమైన చర్య. ముస్లిం మహిళలకు సమానత్వాన్ని అందజేస్తుంది. **- ప్రధాని నరేంద్రమోదీ**

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం. న్యాయం కోసం పోరాడిన మహిళలను అభినందిస్తున్నాం. **- రాహుల్‌గాంధీ, ఏఐసీసీ ఉపాధ్యక్షుడు**

తక్షణ తలాక్‌పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఏకగ్రీవం కాదు. సంస్కరణల అమలు సమాజంలోనే ప్రారంభం కావాల్సిన అవసరం ఉంది. వచ్చేనెల భోపాల్‌లో అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్బీ) సమావేశమై దీనిపై ఒక నిర్ణయం తీసుకుంటుంది. క్షేత్రస్థాయిలో దీని అమలు కఠినమైన ప్రక్రియ. ఆచరణలో సమస్యలు ఎదురవుతాయి. ప్రాథమిక హక్కుల పరిధిలో సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తాం. ఇది బీజేపీ విజయం కాదు. **- అసదుద్దీన్ ఒవైసీ, మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు**

సుప్రీం తీర్పును సవివరంగా అధ్యయనం చేయకుండా స్పందించడం సరికాదు. వచ్చేనెల 10న భోపాల్‌లో జరిగే ఏఐఎంపీఎల్బీ వర్కింగ్ కమిటీ సమావేశంలో తదుపరి కార్యాచరణ రూపొందిస్తాం. ఈ సమావేశంలో బాబ్రీ మసీదు కేసు అంశంపైనా చర్చిస్తాం. **- జాఫర్యాబ్ జిలానీ, ఏఐఎంపీఎల్బీ సభ్యుడు**

ట్రిపుల్ తలాక్ రాజ్యాంగ విరుద్ధం

మూడోపేజీ తరువాయి

మౌలిక సూత్రాలకు విరుద్ధమైన ఏ ఆచారమైనా రాజ్యాంగ విరుద్ధమైనదేనని తమ మెజారిటీ తీర్పులో వారు నొక్కిచెప్పారు. మూడు తలాక్‌ల ఆచారం బాహాటంగానే నిరంకుశమైందని, ఆవిధంగా అది రాజ్యాంగ విరుద్ధమైందని అంటూ ముగ్గురు న్యాయమూర్తులు మూడు తలాక్‌ల ఆచారాన్ని కొట్టివేశారు. మైనారిటీ తీర్పు వెలువరించిన ప్రధాన న్యాయమూర్తి జేఎస్ ఖేహర్, న్యాయమూర్తి ఎస్ అబ్దుల్ మాత్రం ఆరునెలలపాటు ఆచారాన్ని నిలిపివేయాలని, ఆలోగా ప్రభుత్వం చట్టం చేయకపోతే నిషేధం కొసాగించాలని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం ఈ విషయమై ముస్లిం సంస్థల ఆందోళనను, షరియా చట్టాన్ని పరిగణనలోకి తీసుకుంటుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

ధర్మాసనంలో ఐదుమతాల న్యాయమూర్తులు

సిక్కు, క్రైస్తవ, పార్శీ, హిందూ, ముస్లిం న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ముస్లిం మహిళలు తలాక్ ఆచారాన్ని సవాల్‌చేస్తూ దాఖలైన ఏడు పిటిషన్లపై విచారణ జరిపింది. ముస్లిం భర్త ఒకే గుక్కలో మూడుసార్లు తలాక్ చెప్పి భార్యకు విడాకులిచ్చే ఆచారాన్ని ముస్లిం మహిళలు తమ పిటిషన్లలో సవాల్ చేశారు. ఫోన్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా కూడా తలాక్‌లు చెప్పడం పరిపాటి అయ్యిందని వారు తెలిపారు.

ప్రధాన న్యాయమూర్తితో ఏకీభవించలేం

మూడు తలాక్‌ల ఆచారాన్ని ముస్లిం మతనిబంధనల్లో, వైయక్తిక న్యాయంలో భాగంగా చూడాలన్న ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయంతో ఏకీభవించడం అతికష్టంగా ఉన్నదని మెజారిటీ తరపున తీర్పును లిఖించిన న్యాయమూర్తి జోసెఫ్ పేర్కొన్నారు. న్యాయమూర్తులు నారిమన్, లలిత్ ఆయనతో ఏకీభవించారు. ఖురానులోని సూక్తులను జస్టిస్ జోసెఫ్ ఈ



సందర్భంగా ప్రస్తావించారు. 'వివాహానికి దివ్య ఖురాను పవిత్రతతను, శాశ్వతత్వాన్ని ఆపాదించింది. అయితే పూర్తి అనివార్య పరిస్థితుల్లో మాత్రమే తలాక్‌ను అనుమతించవచ్చని చెప్పింది. అయితే ఈలోగా రాజీకోసం ప్రయత్నించాలి. అది కుదిరితే తలాక్ రద్దవుతుంది. తలాక్ నిలబడాలంటే ముందుగా ఇవన్నీ జరుగాలి. కానీ మూడు తలాక్‌ల పద్ధతిలో వీటికి ద్వారం మూసుకు పోతుంది. అందుకే తలాక్ ఆచారం ఖురాను మౌలిక సూత్రాలకు విరుద్ధం. తద్వారా అది షరియాను ఉల్లంఘిస్తుంది' అని న్యాయమూర్తి జోసెఫ్ అన్నారు. ఇస్లామిక్ న్యాయంలోని ఖురాను, హదిత్, ఇజ్మా, ఖియాస్ అనే నాలుగు మూలాలను ఆయన ప్రస్తావించారు. ఖురానులో చెప్పిందానికి మిగతావి అనుబంధమని, ఖురానే సర్వోన్నతమని అన్నారు. ఖురానులో స్పష్టంగా చెప్పిందానికి మిగతా మూడు వ్యతిరేకంగా పోవడానికి వీల్లేదని నొక్కిచెప్పారు. 'ఇస్లాం ఖురానుకు వ్యతిరేకంగా ఉండడానికి వీల్లేదు' అని న్యాయమూర్తి జోసెఫ్ స్పష్టంచేశారు.

క్షణికావేశంలో ఇచ్చే తలాక్ చెల్లదు

'ముస్లిం భర్త క్షణికావేశంలో, ఇష్టారాజ్యంగా తలాక్ చెప్పి భార్యకు విడాకులిచ్చే ఈ ఆచారం... వివాహబంధాన్ని కాపాడేందుకు ప్రయత్నించాలన్న దివ్యఖురాను ఉద్దేశాలకు వ్యతిరేకం' అని న్యాయమూర్తి నారిమన్ విడిగా వెలువరించిన తీర్పులో అభిప్రాయపడ్డారు. 'ఈ తరహా తలాక్ భారత రాజ్యాంగంలోని 14వ అధికరణం కింద సంక్రమించే ప్రాథమిక (సమానత్వ) హక్కును ఉల్లంఘిస్తుంది' అని ఆయన అన్నారు.

తీర్పుపై గందరగోళం

ముందుగా తీర్పులోని కార్యాచరణ భాగాన్ని చదువుతూ ప్రధాన న్యాయమూర్తి జేఎస్ ఖేహర్ 'మేం' అనే మాటను ఉపయోగించడం కొంత గందరగోళానికి దారితీసింది. పలువురు మీడియా సభ్యులు ధర్మాసనం ఏకగ్రీవ తీర్పునిచ్చిందని అనుకుని పొరబడ్డారు. న్యాయమూర్తి జోసెఫ్ తన తీర్పును చదువడం మొదలు పెట్టినప్పుడు మెజారిటీ, మైనారిటీగా ధర్మాసనం విడిపోయిన సంగతి అవగతమైంది. పైగా ప్రధాన న్యాయమూర్తి స్వయంగా మైనారిటీలో ఉన్నారన్న సంగతి తేటతెల్లమైంది.

మిగతా తలాక్‌లు చెల్లుతాయి

మూడు తలాక్‌లు ఒకేసారి చెప్పే 'తలాకే బిద్దత్'ను మాత్రమే సుప్రీంకోర్టు ధర్మాసనం మౌలికంగా చట్టవిరుద్ధమైనదని పక్కన పెట్టింది. ఇదికాకుండా తలాక్ హసన్, తలాక్ అహసాన్ అనే ఇతర ఆచారాలున్నాయి. వీటిపై సుప్రీంకోర్టు స్పందించలేదు. కనుక ఇవి అమలులో ఉంటాయి. 'తలాక్ అహసాన్' ప్రకారం ముస్లిం భర్త నెలకోసారి తలాక్ చెప్పి భార్యకు విడాకులు ఇవ్వవచ్చు. మూడు బహిష్టుల కాలం పూర్తి కావడం అనేది ఇందుకు షరతుగా ఉంటుంది. ఇక తలాక్ హసన్ ఆచారం దీనికి దగ్గరగా ఉంటుంది. అయితే మూడు మాసాల కాలంలో భార్యతో భర్త శారీరక సంబంధం ఏర్పరుచుకోకుండా దూరంగా ఉండాలి.

షమీమ్ ఆరా కేసు తీర్పే ఆధారం

2002లో సుప్రీంకోర్టు షమీమ్ ఆరా కేసులో వెలువరించిన అభిప్రాయం ఆధారంగా న్యాయమూర్తి జోసెఫ్ తన తీర్పును రూపొందించారు. మూడు తలాక్‌ల ఆచారానికి ఎలాంటి న్యాయపరమైన ఆలంబన లేదని ఆ కేసులో సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. వివిధ హైకోర్టులు చెప్పిన తీర్పులను కూడా న్యాయమూర్తి జోసెఫ్ ఉటంకించారు. షమీమ్ ఆరా కేసు ఎలాంటి న్యాయపరమైన పూర్వాచారాన్ని నెలకొల్పలేదన్న ముస్లిం పర్సనల్ లాబోర్డు వాదనను ఆయన తోసిపుచ్చారు. 'తలాక్ అనేది ఒక హేతుబద్ధమైన కారణంతో జరుగాలి. అంతకుముందు భార్యాభర్తల మధ్య రాజీకి ఇద్దరు మధ్యవర్తుల ద్వారా తగిన ప్రయత్నాలు జరుగాలి' అని స్పష్టం చేశారు. 1400 సంవత్సరాలుగా తలాక్ అమల్లో ఉందన్న ముస్లిం పర్సనల్ లాబోర్డు వాదనను ప్రస్తావిస్తూ పాత ఆచారమైనంత మాత్రాన చట్టవిరుద్ధమైనా సమర్థించలేమని తెలిపారు. మూడు తలాక్‌ల ఆచారం ముస్లిం మతంలో భాగమని, దానిని స్తంభింపజేసి.. చట్టాన్ని తెచ్చేందుకు ప్రభుత్వానికి ఆరునెలల సమయం ఇవ్వాలన్న అభిప్రాయంతో తాను ఏకీభవించలేనని ఆయన స్పష్టం చేశారు. దివ్య ఖురాను చెడ్డదని చెప్పిన విషయం షరియాలో మంచిది కావడానికి వీల్లేదని అన్నారు.

రెండేండ్ల న్యాయ పోరాటం

న్యూఢిల్లీ, ఆగస్టు 22: ట్రిపుల్ తలాక్ రాజ్యాంగ విరుద్ధమని, ఆమోదయోగ్యం కాదని సుప్రీంకోర్టు ఐదుగురుసభ్యుల ధర్మాసనం స్పష్టంచేసింది. ట్రిపుల్ తలాక్ 2015 అక్టోబర్‌లో తొలిసారిగా సుప్రీంకోర్టు ముందుకు వచ్చింది. అప్పటినుంచి రెండేండ్లపాటు విస్తృత చర్చకు దారితీసింది.

- **2015 అక్టోబర్ 16 :** 'వివాహ రద్దు విషయంలో ముస్లిం మహిళలు వివక్షను ఎదుర్కొంటున్నారా?' అనే అంశాన్ని పరిశీలించేందుకు రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలని భారత ప్రధాన న్యాయమూర్తిని కోరిన సుప్రీంకోర్టు ధర్మాసనం
- **2016 ఫిబ్రవరి 5 :** ట్రిపుల్ తలాక్, నిఖా హలాలా, బహుభార్యత్వం.. వీటి రాజ్యాంగ బద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణలో సహాయపడాల్సిందిగా అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గీని కోరిన సర్వోన్నత న్యాయస్థానం
- **2016 మార్చి 28 :** కుటుంబ చట్టాల వెలుగులో వివాహం, విడాకులు, కస్టడీ, వారసత్వం వంటి అంశాల అధ్యయనానికి అత్యున్నత కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం. ఆలిండియా ముస్లిం పర్సనల్‌లా బోర్డ్ సహా పలు సంస్థలు కక్షిదారులుగా చేర్పు.
- **2016 జూన్ 29 :** 'రాజ్యాంగమే గీటురాయి'గా ట్రిపుల్ తలాక్ అంశాన్ని పరిశీలిస్తామని ప్రకటించిన న్యాయస్థానం.
- **2016 అక్టోబర్ 7 :** భారత రాజ్యాంగ చరిత్రలో తొలిసారి.. లింగ సమానత్వం, సెక్యులరిజం వంటి కోణాల్లో ట్రిపుల్ తలాక్, నిఖా హలాలా, ఇతర వ్యవహారాలను పునఃసమీక్షించాలని సుప్రీంకోర్టును కోరిన ప్రభుత్వం
- **2017 ఫిబ్రవరి 14-16 :** ట్రిపుల్ తలాక్‌పై వచ్చిన పరస్పర విరుద్ధమైన ఫిర్యాదులనూ ప్రధాన కేసుతోపాటే విచారించాలని సుప్రీంకోర్టు నిర్ణయం. ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన
- **2017 మార్చి 27-30 :** న్యాయవ్యవస్థ పరిధిలో లేని అంశాలపై విచారణ సహేతుకం కాదన్న ముస్లిం పర్సనల్‌లా బోర్డ్. మే11 నుంచి రాజ్యాంగ ధర్మాసనం అన్నికోణాల్లో విచారణ ప్రారంభిస్తుందన్న సుప్రీకోర్టు
- **2017 మే 11-12 :** ముస్లిం మతవిశ్వాసాల్లో ఇవి మౌలికమైన అంశాలా? అనే అంశాలను పరిశీలిస్తామని ధర్మాసనం ప్రకటన. వివాహ రద్దుకు ట్రిపుల్ తలాక్ అనేది ముస్లింలలో కోరుకోదగ్గ విధానం కాదని వ్యాఖ్య.
- **2017 మే 15-16 :** ట్రిపుల్ తలాక్ విధానాన్ని రద్దు చేస్తే, కొత్త చట్టం తీసుకువచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ఏమేరకు ట్రిపుల్ తలాక్‌ను అనుమతిస్తుందో పరిశీలిస్తామని ధర్మాసనం వెల్లడి. ట్రిపుల్ తలాక్ అనేది 1400 ఏండ్లుగా కొనసాగుతూ వస్తున్న నమ్మకమని, దానిని రాజ్యాంగ విశ్వసనీయత కోణంలో పరీక్షించలేమని ముస్లిం పర్సనల్‌లా బోర్డ్ వాదన.
- **2017 మే 17-18 :** ట్రిపుల్ తలాక్‌ను వ్యతిరేకించే అధికారం బాధిత మహిళకు ఇవ్వబడుతుందా? అని ఏఐఎంపీఎల్‌బీని ప్రశ్నించిన ధర్మాసనం. ట్రిపుల్ తలాక్ ఇస్లాంలో అంతర్భాగం కాదని పేర్కొన్న కేంద్రం.
- **2017 మే 18 :** ట్రిపుల్ తలాక్‌పై తీర్పును రిజర్వ్ చేసిన అత్యున్నత న్యాయస్థానం
- **2017 ఆగస్టు 22 :** ట్రిపుల్ తలాక్ అన్యాయమైనదని, రాజ్యాంగ విరుద్ధమని, 3:2 నిష్పత్తిలో సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు. పార్లమెంటు ఆమోదం ద్వారా ఆరునెలల్లో చట్టం తీసుకువచ్చేలా ప్రభుత్వానికి ఆదేశం.



సుప్రీంకోర్టు తీర్పును చరిత్రాత్మకం అని పేర్కొంటూ సైకతశిల్పి సుదర్శన్ పట్నాయక్ ఒడిశాలోని పూరి సముద్రతీరంలో రూపొందించిన కళాఖండం

ముస్లిం దేశాల్లో 'తలాక్' ఎలా?



న్యూఢిల్లీ, ఆగస్టు 22: ముస్లిం దేశాల చట్టాలు తలాక్ గురించి ఏమంటున్నాయి? అక్కడ విడాకులకు అనుసరించే పద్ధతులేంటి? కొన్ని ముస్లిం మెజారిటీ దేశాల్లో అమల్లో ఉన్న చట్టాలు ఇలా చెప్తున్నాయి..

- **ఈజిప్ట్ :** సున్నీలు ఇక్కడ మెజారిటీ వర్గం. బలవంతంగాగానీ, మత్తులో కానీ తలాక్ పలుకడం చెల్లదు. ఏదైనా చర్యను ప్రేరేపించడంకానీ, బలవంతంగా తలాక్ వినేలా చేయడం కానీ ఈజిప్ట్‌లో చట్టపరంగా ఆమోదనీయం కాదు. భర్త మనస్ఫూర్తిగా కాకుండా, కేవలం సూత్రప్రాయంగా చెప్పే తలాక్ అక్కడ చెల్లదు.
- **ఇరాక్ :** ఇస్లాం అధికార మతంగా ఉన్న రాజరిక దేశం. షియా జనాభా ఎక్కువ. బలవంతంగా, ప్రేరేపించేలా, మత్తులో ఉన్నప్పుడు, మానసిక స్థితి సరిగా లేనప్పుడు, మనో దౌర్బల్యంతో, క్షణికావేశంలో, ఆపద సమయాల్లో, వృద్ధాప్యంలో, జబ్బు పడినప్పుడు చెప్పే తలాక్ చట్టపరంగా చెల్లదు.
- **మొరాకో :** రాజరిక దేశం. సున్నీ ముస్లింలు ఎక్కువ. ఇక్కడ విడాకులు పొందాలంటే ముందుగా కోర్టు అనుమతి కోరుతూ పిటిషన్ దాఖలు చేయాలి. న్యాయస్థానం అనుమతిస్తే పెండ్లి అయిన ప్రాంతంలోగాని భార్య నివసించే ప్రదేశంలో కానీ పబ్లిక్ నోటరీ ద్వారా విడాకుల విషయాన్ని ప్రకటించాలి.
- **యుఏఈ :** వివాహాన్ని రద్దు చేసుకుని, భర్త ఏకపక్షంగా విడాకులకు సిద్ధమైనప్పుడు.. ఇద్దత్‌తో పాటు కచ్చితంగా భరణం చెల్లించాల్సి ఉంటుంది. భరణాన్ని ఖాజీ కూడా నిర్ణయించవచ్చు' అని యూఏఈ చట్టాలు స్పష్టంచేస్తున్నాయి.
- **పాకిస్థాన్ /బంగ్లాదేశ్ :** రెండు దేశాల్లోనూ ఇస్లాం అధికారిక మతం. 1961లో పాకిస్థాన్ చేసిన చట్టాన్నే, బంగ్లాదేశ్ కూడా స్వీకరించింది. 'ఏ రూపంలో అయినా తలాక్‌ను చెప్పిన తర్వాత, భర్త తన చర్యను లిఖితపూర్వకంగా 90 రోజుల్లోపు కోర్టు చైర్మన్‌కు తెలియజేయాలి. దాని ప్రతిని భార్యకూ అందజేయాలి. కోర్టు చైర్మన్ మధ్యవర్తిత్వం ఫలించకపోతే, విడాకులను మంజూరు చేస్తారు. ఈ పద్ధతిని ఉల్లంఘిస్తే ఏడాది వరకూ జైలుశిక్ష కానీ, ఐదువేల రూపాయల జరిమానా విధించాలి' అని ఆ చట్టం చెప్తుంది.
- **మలేసియా/ ఇండోనేషియా :** న్యాయస్థానం ద్వారానే విడాకులు మంజూరు చేస్తారు.

ఇక బీజేపీ వైపు ముస్లింల మొగ్గు!

- ట్రిపుల్ తలాక్‌పై సుప్రీంకోర్టు నిషేధం నేపథ్యంలో చర్చ

న్యూఢిల్లీ, ఆగస్టు 22: ట్రిపుల్ తలాక్‌ను నిషేధిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన చరిత్రాత్మక తీర్పు బీజేపీ నెత్తిన పాలు పోయనున్నదా? అంటే అవుననే సమాధానం వస్తున్నది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో 2019 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి బీజేపీకి మంచి ప్రారంభం లభించినట్లయింది. ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయంతో.. బీజేపీని దరిదాపులకు కూడా రానీయని ముస్లిం వర్గాలు ఆ పార్టీ పట్ల కొంతమేరకు మొగ్గు చూపే అవకాశం ఉన్నది. మంగళవారం తీర్పు వెలువడిన కొన్నిగంటల్లోనే స్పందించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా.. సుప్రీంకోర్టు నిర్ణయం ద్వారా ముస్లిం మహిళల సమానత్వం విషయంలో నూతన శకం ప్రారంభమైందని హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం ఇచ్చిన స్ఫూర్తితో బీజేపీ తన పరిధిలో లేని కొన్ని ముస్లిం వర్గాలను రానున్న రోజుల్లో ఆకట్టుకునే ప్రయత్నం చేసే అవకాశం ఉన్నది. ట్రిపుల్ తలాక్‌ను రాజకీయ అంశంగా మార్చేందుకు చాలాకాలం నుంచి ప్రయత్నించి విజయం సాధించిన బీజేపీ, తన ప్రత్యర్థులైన కాంగ్రెస్, లెఫ్ట్‌పార్టీలపై కూడా పైచేయి సాధించిందని విశ్లేషకులు అంటున్నారు.

తలాక్‌పై చట్టం అవసరం లేదా?

- తీర్పు చాలంటున్న కేంద్ర పెద్దలు

న్యూఢిల్లీ , ఆగస్టు 22: సత్వర తలాక్ ఆచారాన్ని నిషేధిస్తూ చట్టం తేవాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్టుగా కనిపిస్తున్నది. సుప్రీంకోర్టు తీర్పే శాసనంగా అమలు చేయాలనేది సర్కారు ఆలోచన అని కేంద్రపెద్దల స్పందన ద్వారా తెలియవస్తున్నది. సర్వోన్నత న్యాయస్థానం తీర్పే శాసనమని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును ఎలా అమలు చేస్తారు? ఆ ఆచారాన్ని నిషేధించేందుకు చట్టం అవసరం లేదా? అని ఓ కేంద్ర ప్రభుత్వ అధికారిని అడిగితే ఎవరైనా మూడు తలాక్‌ల ద్వారా విడాకులిస్తే అది చెల్లదని సమాధానమిచ్చారు. ఆ విధానం ద్వారా విడాకులు పొందిన మహిళ పోలీసులను కూడా ఆశ్రయించవచ్చని ఆయన వివరించారు. అలాంటివారికి రక్షణ కల్పించేందుకు గృహహింస నిరోధక చట్టం వంటివి ఉన్నాయని కూడా అన్నారు.

రాష్ట్రాల అభిప్రాయం కోరిన కేంద్రం

ట్రిపుల్ తలాక్ ఆచారాన్ని సుప్రీంకోర్టు పక్కనపెట్టిన నేపథ్యంలో రాష్ట్రాల అభిప్రాయాన్ని కేంద్ర హోంశాఖ కోరింది. సుప్రీంకోర్టు తీర్పుపై అభిప్రాయం తెలుపాలని కోరినట్లు ఆ శాఖ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు.

పళనిపై దినకరన్ తిరుగుబాటు

- తమిళ రాజకీయాల్లో మరో ట్విస్ట్
- గవర్నర్‌ను కలిసి విశ్వాస పరీక్ష నిర్వహించాలని వినతి
- ప్రతిపక్ష డీఎంకేది కూడా అదే కోరిక
- రిసార్ట్‌కు తిరుగుబాటు ఎమ్మెల్యేల తరలింపు

చెన్నై, ఆగస్టు 22: తమిళనాడులో అధికార అన్నాడీఎంకే పార్టీలో సంక్షోభం సమసిపోయిందనుకునే లోగా మరో మలుపు తిరిగింది. పార్టీలోని రెండు ప్రధాన వర్గాలు విలీనమై 24 గంటలు కూడా గడువకముందే మరో కొత్త ఫ్యాక్షన్ పుట్టుకొచ్చింది. పార్టీ బాధ్యతల నుంచి ఉద్వాసనకు గురైన టీటీవీ దినకరన్‌కు మద్దతుగా నిలిచిన 19 మంది ఎమ్మెల్యేలు మంగళవారం ఉదయం రాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావును కలిసి ముఖ్యమంత్రి పళనిస్వామిపై తమకు విశ్వాసం లేదని ప్రకటించారు. ముఖ్యమంత్రికి తమ మద్దతును ఉపసంహరిస్తున్నట్టు తెలుపుతూ వారు ఒక లేఖను గవర్నర్‌కు అందజేశారు. ఈ విషయంలో గవర్నర్ వెంటనే జోక్యం చేసుకొని రాజ్యాంగ ప్రక్రియను అనుసరించి అసెంబ్లీలో విశ్వాస పరీక్షను కోరాలని విజ్ఞప్తి చేశారు. తాజా పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకొనేందుకు ప్రయత్నిస్తున్న ప్రతిపక్ష డీఎంకే కూడా గవర్నర్‌కు ఒక లేఖ రాసింది. వెంటనే అసెంబ్లీని సమావేశపరిచి సీఎం పళనిస్వామిని మెజారిటీ నిరూపించుకోవలసిందిగా కోరాలని సూచించింది. 234 మంది సభ్యులున్న తమిళనాడు అసెంబ్లీలో అన్నాడీఎంకేకు స్పీకర్ మినహా 134 మంది సభ్యులున్నారు. దివంగత ముఖ్యమంత్రి జయలలిత నియోజకవర్గమైన ఆర్‌కేనగర్ ఇంకా ఖాళీగానే ఉంది. డీఎంకేకు 89 మంది ఎమ్మెల్యేలున్నారు. కాంగ్రెస్‌కు 8, ఐయూఎంఎల్‌కు ఒక సీటు ఉన్నాయి. విశ్వాస పరీక్షలో నెగ్గేందుకు సర్కారుకు 118 మంది సభ్యుల బలం అవసరం. దినకరన్ వర్గానికి చెందిన 19 మంది ఎమ్మెల్యేలను పాండిచ్చేరిలోని ఒక రిసార్ట్‌కు తరలించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.



తమిళ నాడు గవర్నర్ విద్యాసాగర్‌రావును కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న దినకరన్ వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు

కొత్త ముఖ్యమంత్రి కావాలి!

తామందరం కలిసి ఒక కొత్త ముఖ్యమంత్రిని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తామని దినకరన్ మద్దతుదారుడు, అండిపట్టి ఎమ్మెల్యే తంగ తమిళసెల్వన్ చెప్పారు. తమ గ్రూపులో 25 మంది ఎమ్మెల్యేలున్నట్టు దినకరన్ వర్గం సోమవారం ప్రకటించింది. దినకరన్ వర్గం మొదటి నుంచి పన్నీరుసెల్వం, పళనిస్వామి వర్గాల విలీనాన్ని వ్యతిరేకిస్తున్నది. గవర్నర్‌ను కలిసిన అనంతరం తమిళసెల్వన్ మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీలో విశ్వాస పరీక్ష జరుగాలని, అప్పుడే కొత్త ముఖ్యమంత్రి వస్తారని పేర్కొన్నారు. తాము పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయడం లేదని, అలాగే ప్రభుత్వానికి కూడా మద్దతు ఉపసంహరించడం లేదని చెప్పారు. కేవలం తాము ముఖ్యమంత్రి మార్పును మాత్రమే కోరుతున్నామని తెలిపారు. శశికళ కోరికమేరకే 122 మంది ఎమ్మెల్యేలు పళనిస్వామిని ముఖ్యమంత్రిని చేశారని తమిళసెల్వన్ గుర్తుచేశారు. ఫిబ్రవరి18న జరిగిన విశ్వాస పరీక్షలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసిన పన్నీర్‌సెల్వం పళని సర్కార్‌ను పడగొట్టేందుకు కుట్ర చేశాడని ఆరోపించారు. ఇప్పుడు పన్నీర్‌కు ఉపముఖ్యమంత్రి పదవి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. పార్టీ నుంచి శశికళను తొలిగించేందుకు జరుగుతున్న ప్రయత్నాల పట్ల తమిళసెల్వన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, శశికళను అన్నాడీఎంకే నుండి బహిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించిన రాజ్యసభ సభ్యుడు ఆర్ వైతిలింగంను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలిగిస్తున్నట్టు దినకరన్ ప్రకటించారు.

మేము భారత్‌లోకి వస్తే..
అల్లకల్లోలమే!

- భారత్‌కు చైనా బెదిరింపులు

బీజింగ్, ఆగస్టు 22: తాము భారత్‌లోకి ప్రవేశిస్తే.. అల్లకల్లోలం అవుతుందని చైనా మళ్లీ బెదిరించింది. భారత్ తమ సైన్యాన్ని బేషరతుగా ఉపసంహరించుకుంటేనే డోక్లాం సమస్యకు పరిష్కారం లభిస్తుందని చైనా విదేశాంగశాఖ ప్రతినిధి హూ చునియింగ్ మంగళవారం పేర్కొన్నారు. డోక్లాం ప్రతిష్టంభనకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని, చైనా అనుకూల నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోమవారం ఆశాభావం వ్యక్తం చేశారు. తాము ఏ దేశంపైనా దాడులు చేయబోమని, అలాగే ఇతరుల భూభాగాలను ఆక్రమించుకునే ప్రసక్తేలేదని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన హూ భారత దళాలు అక్రమంగా సరిహద్దును దాటి తమ భూభాగంలోకి ప్రవేశించాయని, డొక్లాంలో చైనా నిర్మిస్తున్న రోడ్డు, భవన నిర్మాణాలను అడ్డుకునేందుకు భారత్ చూపిస్తున్న కారణాలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. భారత్ తన బలగాలను, సామగ్రిని బేషరతుగా ఉపసంహరించుకోవడమే సమస్యకు ఏకైక పరిష్కారమని హూ పేర్కొన్నారు. సిలిగురికి సమీపంలో చైనా నిర్మాణాలు చేపట్టడం ఈశాన్యభారత్‌తో ప్రధాన భూభాగానికి సంబంధాలు తెంచడానికే అని భారత్ భావిస్తున్నది. డోక్లాం భూభాగం తమ దేశానికి చెందినదని భూటాన్ చెప్తుండగా.. చైనా తమదేనని వాదిస్తున్నది. ఈ ప్రతిష్టంభనపై చైనా మీడియా ఒక వీడియోను రూపొందించి విడుదల చేసింది. ఇందులో భారతీయ దేశభక్తుల అభిరుచిని చులకన చేస్తూ పలు వ్యాఖ్యలు చేశారు. 'చైనా శాంతిని కోరుకుంటుంది, శాంతియుత వాతావరణంకోసం గట్టిగా కృషి చేస్తున్నది. అదేసమయంలో తమ దేశభూభాగంలోకి చొరబడాలనుకునే వారిని అడ్డుకుంటుంది. దేశ సమగ్రత, సార్వభౌమత్వం కాపాడుకుంటాం' అని హూ పేర్కొన్నారు.



మంగళ వారం ఢిల్లీలో యువ పారిశ్రామికవేత్తల సదస్సులో ప్రసంగిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ

అభివృద్ధికి సేనానులు కావాలి

- యువ పారిశ్రామికవేత్తలకు ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ, ఆగస్టు 22: యువ పారిశ్రామికవేత్తలు అభివృద్ధికి సైనికులు కావాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. తక్కువ నగదు గల ఆర్థిక వ్యవస్థగా దేశాన్ని మార్చడంతోపాటు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు సహాయపడాలని కోరారు. నీతి ఆయోగ్ మంగళవారం 'చాంపియన్స్ ఆఫ్ చేంజ్' పేరిట ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన 200 మందికి పైగా సీఈవోలు, స్టార్టప్‌ల ఆవిష్కర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ ఎగుమతులు పెంచేందుకు, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు కృషి చేయాలని కోరారు. మహాత్మా గాంధీని స్ఫూర్తిగా తీసుకొని దేశాభివృద్ధిని ఒక సామూహిక ఉద్యమంగా చేపట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. యువ పారిశ్రామికవేత్తలు దేశాభివృద్ధిలో సైనికులుగా మారాలని అన్నారు. కలిసి పనిచేయడం ద్వారా దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించవచ్చని ఉద్బోధించారు. తక్కువ నగదు గల ఆర్థిక వ్యవస్థగా దేశం పరివర్తన చెందాల్సిన అవసరం ఉందని ప్రధాని నొక్కి చెప్పారు. నగదు రహిత లావాదేవీల కోసం సీఈవోలు భీమ్ యాప్ వినియోగాన్ని ప్రోత్సహించాలని కోరారు. 2022 నాటికి వారి వద్ద పనిచేస్తున్న ఉద్యోగులందరూ నగదు రహిత లావాదేవీలు జరిపేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఉద్యోగులకు దీపావళి బహుమతులుగా ఖాదీ కూపన్లను పంపిణీ చేయాలని ప్రధాని సీఈవోలకు సూచించారు. పర్యాటక రంగంలో అనేక ఉపాధి అవకాశాలున్నాయని పేర్కొంటూ, 'భారతీయులు తమ సంపన్నమైన వారసత్వ సంపద గురించి పెద్దగా చెప్పుకోరు. మనం వాటి గొప్పతనాన్ని గురించి చెప్పడం ప్రారంభిస్తే ప్రపంచం భారత్‌ను సందర్శించాలని ఉవ్విళ్లూరుతుంది'' అని అన్నారు. నీతి ఆయోగ్‌కు వైస్ చైర్మన్‌గా సేవలందించిన అర్వింద్ పనగారియాపై ప్రధాని ప్రశంసల జల్లు కురిపించారు.

ఉపరాష్ట్రపతికి వీడ్కోలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మంగళవారం ఉదయం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో రాజ్‌భవన్‌లో సోమవారం ఉపరాష్ట్రపతికి ఘనంగా పౌరసన్మానం జరిగిన విషయం తెలిసిందే. సన్మానం తర్వాత ఆయన రాజ్‌భవన్‌లోనే బసచేశారు. మంగళవారం ఉదయం బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లారు. గవర్నర్ నరసింహన్, ఉపముఖ్యమంత్రులు మహమూద్‌అలీ, కడియం శ్రీహరి, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, ఈటల రాజేందర్, డీజీపీ అనురాగ్‌శర్మ తదితరులు ఆయనకు వీడ్కోలు పలికారు.



మంగళవారం బేగంపేట విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడికి వీడ్కోలు పలుకుతున్న గవర్నర్ నరసింహన్

ప్రభావితం చేయడమే నాయకత్వం

వ్యవసాయక్షేత్రంలో సీఎం కేసీఆర్ ఫొటోలను ట్వీట్‌చేసిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావులోని మట్టి మనిషిని ఆయన తనయుడు, రాష్ట్ర మంత్రి కే తారకరామారావు గుర్తు చేసుకున్నారు. సీఎం కేసీఆర్‌కు అత్యంత ఇష్టమైన ఎర్రవెల్లిలోని వ్యవసాయక్షేత్రంలో పనుల్లో నిమ్నగమై ఉన్న కొద్దికాలం కిందటి చిత్రాలను కేటీఆర్ ట్విట్టర్‌లో షేర్‌చేశారు. రైతు పక్షపాతి అయిన కేసీఆర్ గురించి తనదైన శైలిలో వివరించారు. 'నాయకత్వం అంటే పదవులు, బిరుదులు కాదు. ఒకరి జీవితాన్ని మరొకరు ప్రభావితం చేయడం. తనకు ఇష్టమైన వ్యవసాయక్షేత్రంలో సీఎం కేసీఆర్' అని పేర్కొంటూ.. కొన్ని ఫొటోలను జతపరిచారు. మంత్రి కేటీఆర్ చేసిన ట్వీట్‌కు భారీ స్పందన వచ్చింది.



మంత్రి కేటీఆర్ ట్విట్టర్‌లో షేర్‌చేసిన సీఎం కేసీఆర్ ఫొటోలు

మీ ప్రచారంతో పర్యావరణ స్ఫూర్తి

మంత్రి కేటీఆర్‌తో సంతోషం పంచుకున్న ఓ తండ్రి

తన పిల్లలు ఎకో గణేశుడిని తయారుచేశారని ట్వీట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వినాయకచవితి సందర్భంగా మట్టి గణపతులను పూజించి పర్యావరణ పరిరక్షకులుగా మారాలంటూ మంత్రి కే తారకరామారావు చేసిన ప్రచారం సత్ఫలితాలను ఇస్తున్నది. ఇప్పటికే పలువురు మట్టివినాయకులనే పూజిస్తామని తీర్మానించుకోగా, కొందరు చిన్నారులు సైతం మంత్రి స్ఫూర్తితో ముందుకు సాగుతున్నారు. తన కుమారులు ఇసుకతో గణేశుడి విగ్రహాలను తయారుచేశారని హైదరాబాద్‌కు చెందిన సుధీర్‌రెడ్డి పేర్కొంటూ, ఈ చిత్రాలను మంత్రి కేటీఆర్‌కు ట్విట్టర్ ద్వారా పంపించారు. 'మీ స్ఫూర్తితో మా పిల్లలు మట్టి గణేశ్ విగ్రహాలు తయారుచేశారు' అని ట్వీట్‌చేశారు. చిన్నారులను అభినందిస్తూ మంత్రి సంతోషం వ్యక్తంచేశారు.



మంగళవారం హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌లో మార్కెటింగ్‌శాఖ సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

అత్యాధునిక వసతులతో మార్కెట్లు

కోహెడ, పటాన్‌చెరుల్లో నిర్మాణం

మార్కెటింగ్‌శాఖ సమీక్షలో మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అత్యాధునిక సదుపాయాలతో కోహెడ, పటాన్‌చెరుల్లో మార్కెట్లను నిర్మిస్తున్నట్టు మార్కెటింగ్‌శాఖ మంత్రి టీ హరీశ్‌రావు పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌లో మార్కెటింగ్‌శాఖ పనితీరు, ఈ నామ్, కోల్డ్ స్టోరేజీలు, ఖరీఫ్ దిగుబడుల సేకరణ తదితర అంశాలపై మంత్రి హరీశ్‌రావు సమీక్ష నిర్వహించారు. పటాన్‌చెరు, కోహెడ మార్కెట్లకు సంబంధించిన బిల్డర్లతో మాట్లాడి ఆయా వర్గాలకు అవసరమైన వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ మార్కెట్ల నిర్మాణంపై సమగ్ర నివేదికను 15 రోజుల్లో సమర్పించాలని, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నిమ్మ, దొండ, బత్తాయి మార్కెట్ల నిర్మాణాలను 45 రోజుల్లో పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. డెడ్‌లైన్‌లోగా పూర్తిచేయకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో 44 వ్యవసాయ మార్కెట్లలో ఈ నామ్ విజయవంతంగా అమలవుతున్నదని, సాఫ్ట్‌వేర్ సమస్యలు తరచూ తలెత్తుతున్నందున ఆయా సమస్యలను వెంటనే కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని అధికారులను హరీశ్‌రావు ఆదేశించారు. పత్తిసాగు పెరిగిన నేపథ్యంలో ఖరీఫ్ దిగుబడి సేకరణకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు.

దడువాయిల సౌకర్యాలపై అధ్యయనం

మార్కెట్లలో పనిచేస్తున్న దడువాయిల సౌకర్యాలపై ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేయాలని అధికారులను మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. మంగళవారం పౌరసరఫరాల సంస్థ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్కే భవన్‌లో దడువాయిల సంఘం ప్రతినిధులు మంత్రిని కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. దడువాయిల లైసెన్సు బదిలీల నిబంధనల్లో సడలింపులు ఇవ్వాలని, పెండింగులో ఉన్న దరఖాస్తులను 15 రోజుల్లో క్లియర్ చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, జేడీలు లక్ష్మణుడు, పీ రవికుమార్, డిప్యూటీ డైరెక్టర్ మల్లేశం, ఓఎస్డీ జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బలహీనపడ్డ రుతుపవనాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నైరుతి రుతుపవనాల కదలిక బలహీనంగా మారడంతో తెలంగాణ జిల్లాల్లో మంగళవారం వర్షాలు తగ్గుముఖం పట్టాయి. గడిచిన 24 గంటల్లో కొన్నిచోట్ల సాధారణ వర్షపాతం నమోదయినట్టు హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం తెలిపింది. రానున్న ఐదు రోజుల్లో పలుచోట్ల సాధారణ, ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉన్నట్టు వెల్లడించింది. మంగళవారం సిరిసిల్ల, మెదక్‌లో 2 సెంటీమీటర్లు, బిక్కనూర్, చిన్నచింతకుంట, వనపర్తి, కరీంనగర్, రామాయంపేటలో ఒక సెంటీమీటర్ చొప్పున వర్షపాతం నమోదైనట్టు పేర్కొన్నది.

కొత్తగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలు

వచ్చే ఏడాది నుంచే ప్రవేశాలు

పూర్తి సమాచారం ఇస్తేనే అఫిలియేషన్లు

ఆన్‌లైన్ పరిధిలోనే అన్నిరకాల సేవలు

దేశంలో ఉత్తమమైన బోర్డుగా తీర్చిదిద్దుతాం

సర్కార్ కాలేజీల్లో పెరుగుతున్న ప్రవేశాలు

ఇంటర్‌బోర్డు పాలకమండలి సమావేశంలో డిప్యూటీ సీఎం కడియం వెల్లడి



మంగళవారం ఇంటర్‌బోర్డు పాలకమండలి సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కొత్తగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలను ఏర్పాటు చేయడానికి సీఎం కేసీఆర్ అనుమతించారని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి చెప్పారు. ఈ కాలేజీలను వచ్చే విద్యాసంవత్సరం (2018-19) ఏర్పాటు చేయడమేకాకుండా ప్రవేశాలను కూడా కల్పిస్తామని అన్నారు. ఏయే ప్రాంతాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీలను ఏర్పాటు చేయాలన్న వివరాలను సేకరిస్తున్నామని చెప్పారు. దీనిపై ఒక కమిటీ వేసి, తయారుచేసిన నివేదికను ప్రభుత్వానికి మూడునెలల్లో అందజేస్తామని వివరించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలపై ప్రజలకు పెరుగుతున్న నమ్మకం మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నదని పేర్కొన్నారు.మంగళవారం ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇంటర్‌బోర్డు రెండో పాలకమండలి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. దాదాపు 50కి పైగా అంశాలపై చర్చించి, పలు తీర్మానాలను ఆమోదించారు. 2004 నుంచి 2014 వరకు ఏర్పాటు చేసిన 59 ప్రభుత్వ జూనియర్ కాలేజీలను గతపాలకులు పట్టించుకోలేదని కడియం విమర్శించారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత ఆ కాలేజీల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయడంతోపాటు పక్కా భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. ఇంటర్‌బోర్డు పాలకమండలి సభ్యుల విషయంలో కొన్ని మార్పులు చేస్తామని చెప్పారు. వరల్డ్ ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో తెలంగాణ ఇంటర్‌బోర్డుకు బెస్ట్ డిజిటలైజ్డ్ బోర్డుగా అవార్డు రావడం గర్వించాల్సిన విషయమన్నారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ బోర్డులో వృత్తివిద్యా కోర్సులను పటిష్ఠం చేస్తామన్నారు. ఇందుకోసం జేఎన్టీయూ, వైద్యఆరోగ్యశాఖ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ప్రతినిధులతో కమిటీ ఏర్పాటుచేస్తున్నామని చెప్పారు. దానికనుగుణంగా కోర్సులను రూపొందించి, వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి తీసుకొస్తామన్నారు. ఆదరణ కోల్పోయిన వృత్తి విద్యా కోర్సులను తొలిగిస్తామన్నారు.

కాలేజీల ప్రొఫైల్ తయారుచేస్తాం

ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 404 ప్రభుత్వ కాలేజీలకు సంబంధించి ఒక్కొక్క దానికి ఒక్క ప్రొఫైల్ తయారుచేసి, అందరికీ అందుబాటులో ఉండేవిధంగా వెబ్‌సైట్‌లో పెడుతామన్నారు. అలాగే అఫిలియేషన్ పొందిన ప్రైవేటు జూనియర్ కాలేజీలతోపాటు, అఫిలియేషన్ లేని జూనియర్ కాలేజీల వివరాలను కూడా అందరికీ అందుబాటులో ఉంచుతామన్నారు.

పెత్తనం చేసే ప్రైవేటు కాలేజీలకు చెక్

కొన్నేండ్లుగా ఇంటర్ బోర్డుపై పెత్తనం చేస్తూ డ్రామాలాడుతున్న కొన్ని ప్రైవేటు జూనియర్ కాలేజీలకు ఇంటర్‌బోర్డు చెక్ పెడుతున్నదని, పూర్తిగా సమాచారం ఇవ్వని కాలేజీలకు అఫిలియేషన్లు నిలిపివేయడంలో నిక్కచ్చిగా వ్యవహరిస్తుందని చెప్పారు. కాలేజీలను అనుమతులు ఇవ్వడంలో బోర్డు కఠినంగా వ్యవహరిస్తున్నదని పేర్కొన్నారు. పెద్దఎత్తున జరిమానాలు వసూలు చేయడమే బోర్డు నిబద్ధతకు నిదర్శనమన్నారు. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ప్రభుత్వ కాలేజీల్లో అనేక సంస్కరణలు తీసుకువచ్చామని తెలిపారు. ఉచితవిద్యను అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా రూ. 325 కోట్లు వెచ్చించి అన్నిరకాల అభివృద్ధి పనులను చేపడుతున్నామని వివరించారు. ఇంటర్‌బోర్డులో ఉన్న 22 రకాల సేవలను ఆన్‌లైన్ పరిధిలోకి తీసుకొచ్చి దేశంలోనే ఉత్తమమైనదిగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన అనేక సంస్కరణల ఫలితంగా 404 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రవేశాల సంఖ్య 1.81 లక్షలకు చేరుకుందని తెలిపారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందించడంతోపాటు త్వరలోనే మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలియజేశారు. సమావేశంలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ వాణీప్రసాద్, ఇంటర్‌బోర్డు కార్యదర్శి అశోక్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్, పలు యూనివర్సిటీల వైస్‌చాన్స్‌లర్లు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులందరికీ న్యాయం

దోస్త్ అధికారులతో డిప్యూటీ సీఎం కడియం సమీక్ష

నాలుగో విడుత కౌన్సెలింగ్‌పై రేపు తుది నిర్ణయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాల కోసం ఈ నెల మొదటివారంలో నిర్వహించిన దోస్త్ -2017 కౌన్సెలింగ్‌లో సీట్లు పొందని విద్యార్థులకు న్యాయం చేస్తామని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి తెలిపారు. డిగ్రీ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపులో తలెత్తిన గందరగోళంపై విద్యార్థుల నుంచి అనేక ఫిర్యాదు అందిన నేపథ్యంలో డిప్యూటీ సీఎం కడియం మంగళవారం దోస్త్ అధికారులతో సమీక్షించారు. పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇందులో కొన్ని పొరపాట్లు విద్యార్థులు చేయగా.. మరికొన్ని పొరపాట్లు సీజీజీ వల్ల జరిగాయని తేల్చారు. సీట్ల కేటాయింపులో తలెత్తిన గందరగోళ పరిస్థితుల వల్ల విద్యార్థులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అన్నిరకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిగ్రీలో నాలుగు లక్షలకు పైగా సీట్లు ఉన్నాయని, సీటు రాదన్న ఆందోళన విద్యార్థులకు అవసరం లేదని దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ లింబాద్రి తెలిపారు. మూడో విడుత కౌన్సెలింగ్ వరకు 1,78,754 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించగా.. 2,07,423 సీట్లు ఇంకా మిగిలే ఉన్నాయని వెల్లడించారు. కోర్టులో ఉన్న 28 కాలేజీల్లో ఆప్షన్స్ పెట్టుకున్న విద్యార్థులకు కూడా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. నాలుగో విడుత కౌన్సెలింగ్ నిర్వహించే అంశంపై ఈ నెల 24 తుది నిర్ణయం తీసుకోనున్నట్లు వివరించారు.

సెప్టెంబర్ 21 వరకు అఫిలియేషన్ గడువు

రాష్ట్రంలోని ప్రైవేటు జూనియర్ కాలేజీల అఫిలియేషన్ల గడువును సెప్టెంబర్ 21 వరకు పొడిగించామని ఇంటర్ బోర్డు కార్యదర్శి ఏ అశోక్ మంగళవారం తెలిపారు. 329 ప్రైవేటు జూనియర్ కాలేజీల నుంచి ఇంకా పూర్తి సమాచారం అందలేదన్నారు. వారికి అవకాశం ఇవ్వడం కోసం మరో నెలరోజులు గడువు పొడిగించామని తెలిపారు. 2017-18 విద్యాసంవత్సరం కోసం మొత్తం 1,555 కాలేజీలు దరఖాస్తు చేసుకున్నాయని, వాటిలో 1,249 కాలేజీలు అఫిలియేషన్ పొందాయని తెలిపారు. 106 కాలేజీల దరఖాస్తులు వివిధ దశల్లో ఉన్నాయని, వివిధ కారణాల వల్ల 329 కాలేజీల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.

మొండి బకాయిలు చెల్లించకపోతే చర్యలు

ఆస్తులు జప్తుచేసి.. బోనులో నిలబెడుతాం

మిల్లర్లతో భేటీలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ హెచ్చరిక



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'మీరు అమాయకులా? ఎన్నిసార్లు చెప్పాలి? ప్రభుత్వం అంటే లెక్కలేదా? ఇదే చివరి అవకాశం తీరుమార్చుకోకుంటే బోనులో నిలబడాలి. ప్రజాధనంతో ఆటలాడుతున్నారా? రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద చర్యలు తప్పవు. ఆస్తులు స్వాధీనం చేసుకునేందుకు వెనుకాడబోం' అంటూ బకాయిలు చెల్లించని మొండి మిల్లర్లపై పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్ మండిపడ్డారు. బకాయిలు చెల్లించని మిల్లర్లతో పౌరసరఫరాల భవన్‌లో కమిషనర్ సీవీ ఆనంద్ మంగళవారం సమావేశం ఏర్పాటుచేశారు. ఐదారేండ్ల నుంచి రూ.కోట్లు చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్నారని కమిషనర్ ఆగ్రహం వ్యక్తంచేసినట్లు సమాచారం. 2010-11 నుంచి 2014-15 వరకు మిల్లర్లు చెల్లించాల్సిన రూ.120 కోట్ల బకాయిలు అలాగే ఉన్నాయి. రాష్ట్రం ఏర్పాటు తర్వాత మొండి బకాయిలపై ప్రభుత్వం దృష్టిసారించింది. రాష్ట్రవ్యాప్తంగా బకాయిలు చెల్లించని 113 మంది మొండి మిల్లర్లను గుర్తించి, పలుమార్లు హెచ్చరించడంతోపాటు తాయిలాలు ప్రకటించింది. దీంతో 24 మంది మిల్లర్లు ముందుకొచ్చి రూ.24 కోట్లు చెల్లించారు. మిగతా దాదాపు 90 మంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మరోసారి భేటీ కాగా, సమావేశానికి 50 మందే హాజరయ్యారు. సమావేశానికి హాజరైన వారి నుంచి హామీ పత్రాలు తీసుకున్న అధికారులు.. ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించారు.

యాసంగి విత్తన ధరలు ఖరారు

శనగ విత్తనాలకు 33 శాతం

వేరుశనగ విత్తనాలకు 40 శాతం రాయితీ.. వ్యవసాయశాఖ వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: యాసంగి పంటల విత్తన సరఫరా కోసం రాష్ట్ర వ్యవసాయశాఖ ధరలను ఖరారు చేసింది. వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఈ మేరకు ధరలను నిర్ధారించారు. వచ్చే యాసంగి పంటకు 5.82 లక్షల క్వింటాళ్ల విత్తనాలను వ్యవసాయశాఖ ద్వారా సరఫరా చేయాలని నిర్ణయించారు. ఇందులో శనగ (బెంగాల్ గ్రామ్), వేరుశనగ తప్ప మిగతా పంటల విత్తనాల్లో వ్యవసాయశాఖ ఎలాంటి మార్పులు చేయలేదు. వ్యవసాయశాఖ ద్వారా 1.33 లక్షల క్వింటాళ్ల శనగ, 1.64 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను సరఫరా చేయనున్నారు. శనగ విత్తనాల ధర క్వింటాల్‌కు రూ. 8,680గా నిర్ధారించిన వ్యవసాయశాఖ, 33 శాతం రాయితీపై సరఫరా చేయాలని నిర్ణయించింది. అంటే రూ. 2,865 రాయితీ పోగా రూ. 5,815 రైతులు చెల్లించాల్సి ఉంటుంది. వేరుశనగ ధరను క్వింటాల్‌కు రూ.7,600గా నిర్ణయించిన అధికారులు, 40 శాతం సబ్సిడీ (రూ.3,040) పోగా రూ.4,560 ధరకు రైతుకు సరఫరా చేయనున్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్యదర్శి సీ పార్థసారథి, కమిషనర్ జగన్మోహన్‌రెడ్డి, ఉద్యానశాఖ కమిషనర్ వెంకట్రాంరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తాగునీరైనా విడిపించండి

ఢిల్లీకి తెలుగు రాష్ట్రాల తాగునీటి సమస్య

కేంద్రం, బజాజ్ కమిటీకి లేఖ రాయనున్న కృష్ణా బోర్డు

టెలిమెట్రీపై బోర్డు సమావేశంలో సుదీర్ఘ చర్చ..

వచ్చేనెల 18, 19 తేదీల్లో మళ్లీ సమావేశం

జలాల పంపిణీ దామాషా, పట్టిసీమ, వర్కింగ్ మాన్యువల్‌పై కుదరని ఏకాభిప్రాయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వచ్చిన నీటిని కర్ణాటక ఒడిసిపడుతుండటం, దిగువ రాష్ట్రాల్లోని కృష్ణా ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లోలు లేకపోవడంతో తెలుగు రాష్ట్రాల్లో తాగునీటి సమస్యపై ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో కనీసం తెలుగు రాష్ట్రాల తాగునీటి అవసరాలకు కర్ణాటకలోని నారాయణపూర్ నుంచి నీటిని వదిలేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర సర్కారుతోపాటు బజాజ్ కమిటీకి లేఖ రాయాలని కృష్ణా నది యాజమాన్య బోర్డు తీర్మానించింది. విజయవాడలో తొలిసారిగా మంగళవారం జరిగిన బోర్డు సమావేశంలో ఈ మేరకు నిర్ణయించింది. హోటల్ గేట్‌వేలో బోర్డు చైర్మన్ శ్రీవాత్సవ అధ్యక్షతన జరిగిన సమావేశానికి రెండు తెలుగు రాష్ట్రాల అధికారులు హాజరయ్యారు. కృష్ణా బేసిన్‌లో వచ్చిన సుమారు 400 టీఎంసీలను కర్ణాటకనే నిల్వ చేసుకొని వినియోగించుకోవడంతో దిగువన తాగునీటికీ సంక్షోభం నెలకొనే ప్రమాదముందని చర్చించారు. బచావత్ అవార్డు, స్కీం-ఏ వంటి సాంకేతిక అంశాలకు అతీతంగా.. కేంద్రాన్ని సంప్రదించి, సమస్యను పరిష్కరించాలంటూ బాధ్యతను బోర్డు మీద ఉంచగా.. అందుకు చైర్మన్ అంగీకరించి, త్వరలోనే లేఖ రాస్తానన్నారు. పట్టిసీమద్వారా కృష్ణా డెల్టాకు ఏపీ మళ్లిస్తున్న గోదావరి జలాలకు అనుగుణంగా తెలంగాణకు కృష్ణా జలాల్లో వాటా కల్పించాలని రాష్ట్ర అధికారులు కోరారు. ఆ అంశం బజాజ్ కమిటీ పరిశీలనలో ఉందని ఏపీ, బోర్డు అధికారులు సమాధానమిచ్చారు. 2017-18కి ఆంధ్రప్రదేశ్ 512, తెలంగాణ 299 టీఎంసీల దామాషా అనుగుణంగా ఈ ఏడాది కూడా పంపిణీ ఉంటుందని బోర్డు తెలిపింది. కానీ, దీనిపై రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదురలేదు.



మంగళవారం విజయవాడలో కృష్ణానది యాజమాన్య బోర్డు చైర్మన్ శ్రీవాత్సవ అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన తెలంగాణ, ఏపీ రాష్ట్రాల అధికారులు

టెలిమెట్రీపై మరో భేటీ

ఏడు ఎజెండా అంశాలతో మొదలైన ఈ సమావేశంలో కృష్ణా ప్రాజెక్టుల పరిధిలో టెలిమెట్రీ వ్యవస్థ ఏర్పాటుపైనే సుదీర్ఘంగా చర్చ జరిగింది. మొదటిదశలో భాగంగా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన 600 మీటర్లు, 12వ కిలోమీటర్ వద్ద టెలిమెట్రీ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ కూడా అంగీకరించడంతో పెండింగులో ఉన్న 600 మీటర్ల టెలిమెట్రీ పనులను పూర్తిచేస్తామని బోర్డు తెలిపింది. రెండోదశలో భాగంగా రెండు రాష్ట్రాల పరిధిలో 29 చోట్ల టెలిమెట్రీ ఏర్పాటుకు బోర్డు ప్రతిపాదనలు సిద్ధంచేసింది. రెండోదశ ప్రక్రియను వెంటనే అమలుచేయాలని కోరిన ఎస్కే జోషి.. తాము గతంలో ప్రతిపాదించిన 12 పాయింట్లను అందులో పొందుపరుచలేదని తెలిపారు. ప్రాజెక్టు హెడ్‌రెగ్యులేటర్ వద్ద టెలిమెట్రీ పెట్టిన తర్వాత బనకచర్ల దగ్గర నాలుగు పాయింట్లు, సాగర్ నుంచి ప్రకాశం బరాజ్ వరకు పోలవరంకాల్వ, పాలేరు, మున్నేరువంటి ప్రదేశాల్లో అవసరంలేదని ఏపీ అధికారులు అన్నారు. దీనిని తెలంగాణ వ్యతిరేకించగా.. ఏర్పాటుచేసినా ఎలాంటి నష్టంలేదని బోర్డు అభిప్రాయపడినట్టు తెలిసింది. దీంతో టెలిమెట్రీపై వచ్చే నెల 18, 19 తేదీల్లో ప్రత్యేకంగా ఒక సమావేశాన్ని నిర్వహించి, చర్చిద్దామని బోర్డు చైర్మన్ తెలిపారు. ఆలోగా ఏ ప్రాతిపదికన టెలిమెట్రీ పాయింట్ల ఎంపిక జరిగింది? ఎక్కడెక్కడ నీటి వినియోగాన్ని కొలువాల్సిన అవసరముంది? మార్గదర్శకాలేంది? అనే వాటిపై ఒక స్పష్టతను తీసుకురావాలని జోషి బోర్డు చైర్మన్‌ను కోరారు.

శాస్త్రీయంగా లెక్కించండి

రెండు రాష్ట్రాల మధ్య జలాల పంపిణీ దామాషా చర్చకు వచ్చినపుడు.. చిన్న నీటిపారుదల కింద తెలంగాణ వినియోగాన్ని 89.15 టీఎంసీలుగా లెక్కించాలన్న ఏపీ అధికారుల వాదనతో తెలంగాణ అధికారులు విభేదించారు. అలాగని వినియోగాన్ని సున్నాగా కూడా తాము చెప్పడం లేదని, వాస్తవ వినియోగంపై శాస్త్రీయ లెక్కలు ఉండాలని అన్నారు. ఈ అంశంపై గతంలో వేసిన కమిటీ ద్వారా ఒక విధానాన్ని అమలుచేసేందుకు కసరత్తు చేస్తామని బోర్డు అధికారులు తెలిపారు. వీటితోపాటు సిబ్బంది, నిధులు, వ్యయాలపైనా సమావేశంలో చర్చ జరిగింది. సమావేశంలో బోర్డు సభ్య కార్యదర్శి సమీర్ చటర్జీ, తెలంగాణ నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, ఏపీ జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్, రెండురాష్ట్రాల ఈఎన్సీలు మురళీధర్‌రావు, వెంకటేశ్వర్‌రావు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ సునీల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నీటి విడుదలపై ఒక విధానముండాలి: బోర్డు చైర్మన్ శ్రీవాత్సవ

కృష్ణా బేసిన్‌లో ఎగువన వచ్చిన నీటిని కర్ణాటక ఆల్మట్టి, నారాయణపూర్‌లో నిల్వ చేసుకోవడంతో దిగువన రెండు రాష్ట్రాల్లో తాగునీటికి ఇబ్బంది నెలకొంటుందని బోర్డు చైర్మన్ శ్రీవాత్సవ పేర్కొన్నారు. బోర్డు సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ సమస్యను రెండురాష్ట్రాలు తమ దృష్టికి తీసుకొచ్చినందున కేంద్రం, బజాజ్ కమిటీకి లేఖ రాస్తామని చెప్పారు. కొరత సమయంలో దిగువ రాష్ట్రాలకు నీటిని వదులడంపై ఒక విధానం ఉండాల్సిన అవసరముందని ఆయన అభిప్రాయపడ్డారు.

గోదావరి మళ్లింపు వాటాగా ఎస్సెల్బీసీకి నికరజలాలు

ఉమ్మడి రాష్ట్రంలోని జీవోను అమలుచేయండి

ప్రాజెక్టు పూర్తయ్యేలోగా ఏఎమ్మార్పీకి 45 టీఎంసీలు కేటాయించండి

బోర్డు సమావేశంలో కీలక అంశాలతో నివేదిక ఇచ్చిన తెలంగాణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్సెల్బీసీ) పథకానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే 30 టీఎంసీల నికరజలాలు కేటాయించారని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. విజయవాడలో మంగళవారం నిర్వహించిన కృష్ణా నది యాజమాన్య బోర్డు సమావేశంలో తెలంగాణ అధికారులు ఈ అంశాన్ని తమ నివేదికలో ప్రస్తావించారు. పోలవరం ప్రాజెక్టు ద్వారా 80 టీఎంసీల గోదావరిజలాలను కృష్ణా డెల్టాకు మళ్లించనున్న దరిమిలా సాగర్ ఎగువన ఉన్న ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటకకు 80 టీఎంసీల కృష్ణాజలాల వాటా కల్పిస్తూ గోదావరి ట్రిబ్యునల్ అవార్డులో ఉన్న విషయం తెలిసిందే. ఇందులోభాగంగా ఉమ్మడి ఏపీకి 45 టీఎంసీలు వస్తున్నందున.. అందులో 30 టీఎంసీలను శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ ప్రాజెక్టుకు కేటాయించి మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని నిర్ణయించారు. ఈమేరకు 29.7.1982లో జీవో 306 జారీచేశారు. 18.11.1981న అప్పటి సీఎం.. ప్రతిపక్ష పార్టీలతో సమావేశమై తీసుకున్న నిర్ణయం మేరకే జీవోను జారీ చేసినట్టు తెలంగాణ అధికారులు నివేదికలో చెప్పారు. రాష్ట్ర విభజనకు ముందే 23.3.2013న జరిగిన రాష్ట్రస్థాయి సాంకేతిక సలహా మండలి సమావేశంలోనూ జీవో 306 ప్రకారం ఎస్సెల్బీసీకి 30 టీఎంసీల నికరజలాల కేటాయింపు ఉందని తెలిపిన విషయాన్ని అధికారులు గుర్తుచేశారు. గోదావరిజలాల మళ్లింపు మొదలైన వెంటనే ఈ జీవో అమలులోకి రావాల్సి ఉందని.. రెండేండ్లుగా ఏపీ కృష్ణా డెల్టాకు గోదావరిజలాలను మళ్లిస్తుందని వివరించారు. నదీ పరీవాహక విస్తీర్ణం, ఇతరత్రా సాంకేతిక అంశాలను పరిగణనలోకి తీసుకుంటే ఏపీ 80 టీఎంసీల గోదావరిజలాలను కృష్ణా డెల్టాకు మళ్లిస్తున్నందున సాగర్ ఎగువన ఉన్న తెలంగాణకు 45 టీఎంసీల వాటాను కేటాయించాలని కోరారు. ఎస్సెల్బీసీ ప్రాజెక్టు 2019 చివరి నాటికి పూర్తవుతుందని, అప్పటివరకు ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుకు ఈ కేటాయింపును వర్తింపజేయాలని సూచించారు. 2017-18 నీటి సంవత్సరానికి రెండు తెలుగురాష్ట్రాల మధ్య నీటి పంపిణీ విధానంలో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 344 టీఎంసీలు (299+45)గా పరిగణించి.. బ్రిజేష్ ట్రిబ్యునల్ అమలులోకి వచ్చేవరకు ఇదే దామాషాను అమలుచేయాలని కోరారు. రెండురాష్ట్రాల వాటా కంటే ఎక్కువ నీళ్లు బేసిన్‌కు వస్తే ఆ ఎక్కువ నీటిని సగం సగం పంపిణీ చేయాలని విన్నవించారు.

ఆ నీటి ఆవిరిని చూడండి

సాగర్ ఎడమ కాల్వ.. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సుమారు 281 కి.మీ మేర ఉంది. దాదాపు 102 కిలోమీటర్ నుంచి ఏపీ పరిధి మొదలవుతుంది. ఇటీవల టేకులపల్లి ఎస్ఈ నిర్వహించిన ఒక అధ్యయనంలో ఎడమకాల్వ 52.299 కిలోమీటర్ వద్ద 6908 క్యూసెక్కుల నీటిని విడుదలచేస్తే 102 కిలోమీటర్ వద్ద (ఏపీ పరిధి ప్రారంభం) 3,487 క్యూసెక్కులు మాత్రమే వచ్చినట్టు తేలింది. 50 కి.మీ పొడవునే ఇలా నీటి ఆవిరి ఉంటే.. 280 కిలోమీటర్ల పొడవున ఎలా ఉంటుందో గుర్తించాలని సూచించారు. ఏపీ మాత్రం తాము వినియోగించిన నీటినే లెక్కిస్తే ఎలా? అని అధికారులు నివేదికలో అభిప్రాయపడ్డారు.




ఇక్కడి వనిత అక్కడ ఘనత

న్యూజిలాండ్‌లో సాధారణ ఎన్నికలు త్వరలో జరుగనున్నాయి. ప్రచార హోరుతో ఇప్పుడు అక్కడంతా హాట్ హాట్ పాలిటిక్స్ నడుస్తున్నాయి. అయితే మనకేంటి? అంటారా? అక్కడే ఉంది విషయం. ఈ ఎన్నికల్లో మన హైదరాబాద్ వనిత కూడా పోటీ చేస్తున్నది. అదీ ఎంపీ అభ్యర్థిగా. ఇంతకీ ఎవరామె అనుకుంటున్నారా? పేరు.. శ్రీసుత నాంపల్లి. మిగితా వివరాల కోసం 'జిందగీ' ఆమెను ఫోన్‌లో పలుకరించింది. ఆ వివరాలివి..

ప్రయత్నించి ఓడిపో. తప్పులేదు. కానీ ప్రయత్నిం చడంలోనే ఓడిపోతే అది కచ్చితంగా తప్పే. అవును. ఇక్కడ గెలుపోటములు విషయం కాదు. ధైర్యంతో ఒక అడుగు ముందుకేయడం ముఖ్యం. గెలుస్తుందా? లేదా? అనే విషయం పక్కన పెడితే ఒక అడుగు వేయడంలో శ్రీసుత నాంపల్లి మాత్రం విజయం సాధించారు. దేశం కాని దేశం.. న్యూజిలాండ్‌లో జరుగనున్న సాధారణ ఎన్నికల్లో ఆక్లాండ్ నుంచి ఎంపీ అభ్యర్థిగా ధైర్యంగా బరిలో నిలబడ్డారు.

గెలుపోటములు పక్కన పెడితే.. కష్టపడుతున్న, నష్టపోతున్న ప్రజలకు అండగా నిలువాలనుకున్నారు శ్రీసుత నాంపల్లి. ఇప్పుడు ఆ పనిలో భాగంగానే ఎన్నికల బరిలోకి దిగారు. అక్కడి మన తెలుగు ప్రజలకు సేవచేయాలని, మన ప్రజల హక్కుల కోసం పోరాటం చేయాలని ఎంపీ అభ్యర్థిగా పోటీలో నిలబడ్డానని చెప్పారు శ్రీసుత.

అన్నింటా అనుభవం.. అనుకోని అవకాశం

గతంలో భారతసంతతికి చెందిన చాలామంది అమెరికా వంటి దేశాల ఎన్నికల్లో పోటీ చేసినా న్యూజిలాండ్ పార్లమెంట్ చరిత్రలో తెలంగాణ వనిత ఎంపీగా పోటీచేయడం ఇదే మొదటిసారి. 2001లో కోఠిలోని త్యాగరాయ ప్రభుత్వ సంగీత కళాశాల నుంచి కర్ణాటక సంగీతంలో ఆరేళ్ల డిప్లొమా కోర్సు పూర్తి చేశారు శ్రీసుత. తల్లి శాంతాకుమారి, తండ్రి ఎన్వీ రామారావు ఇద్దరూ మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖలో పనిచేశారు. వారికి హైదరాబాద్‌కు బదిలీ అయ్యాక శ్రీసుత ఉన్నత విద్యనంత ఇక్కడే అభ్యసించారు. 2001లో డిగ్రీ పూర్తయిన తర్వాత నన్నెగారి శ్రీధర్‌ను పెళ్లాడారు. 2006లో న్యూజిలాండ్ వెళ్లి స్థిరపడ్డారు ఈ దంపతులు. న్యూజిలాండ్ వెళ్లిన తర్వాత శ్రీసుత కొన్నాళ్లు గృహిణిగానే ఉన్నారు. ఆ తర్వాత కొంతకాలం వివిధ రంగాల్లో ఉద్యోగం చేశారు. అకౌంటింగ్ అసిస్టెంట్‌గా, కీవీ బ్యాంక్‌లో, ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో పనిచేసిన అనుభవం ఉన్నది. ఇటీవల న్యూజిలాండ్ పీపుల్స్ పార్టీలో ఉద్యోగం కోసం దరఖాస్తు పెట్టుకున్నారు. ఉద్యోగం వచ్చింది. గత అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని శ్రీసుతకు పీపుల్స్ పార్టీ ఈ అవకాశం ఇచ్చింది. రాజకీయాల్లో ఎలాంటి అనుభవం లేకున్నా గత పదేళ్లుగా ఆమె చేస్తున్న సేవను పార్టీ గుర్తించింది. న్యూజిలాండ్‌లో స్థిరపడ్డ తెలుగు ప్రజల హక్కుల కోసం, న్యాయపరమైన చర్యల గురించి ఎంతో కాలంగా శ్రమిస్తున్నారు. శ్రీసుతకు న్యూజిలాండ్ ప్రధానమంత్రి బిల్ ఇంగ్లిష్‌తో సత్సంబంధాలున్నాయి. నేరుగా వెళ్లి సమస్యల గురించి చర్చించే సాన్నిహిత్యం ఉన్నది.

పీపుల్స్ పార్టీ.. భారీ మెజారిటీ

శ్రీసుత నాంపల్లి గెలుపు ఖాయమైతే న్యూజిలాండ్ పార్లమెంట్‌లో ఒక తెలుగు గళం వినిపిస్తుంది.



అక్కడ నివసిస్తున్న మన వాళ్ల సాధక బాధకాలకు ఓ పరిష్కారం కూడా దొరుకుతుంది. సెప్టెంబర్ 23న అక్కడ ఎన్నికలు జరుగనున్నాయి. న్యూజిలాండ్ పీపుల్స్ పార్టీ తరపున బరిలో దిగిన శ్రీసుతకు ఇప్పటి వరకు రాజకీయాలతో సంబంధం లేదు. మొదటిసారి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రచారాన్ని కూడా ముమ్మరం చేశారు. ఆక్లాండ్‌లో ఉన్న తెలుగు ప్రజలను ఏకం చేసి గట్టి ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. చిన్నప్పటి నుంచి తనలో లీడర్‌షిప్ క్వాలిటీస్ ఉన్నా రాజకీయాల్లో వస్తానని అనుకోలేదని చెప్పారామె. రాజకీయాల్లోకి రావాలని ఆహ్వానం అందగానే భర్తతో ఈ విషయాన్ని పంచుకుని ఆనందించారట. దీనికి ఆమె భర్త కూడా అంగీకరించి తనవంతుగా ప్రోత్సాహం అందిస్తున్నందుకు మరింత ఆనందంగా ఉందన్నారామె.



న్యూజిలాండ్ 39వ ప్రధాని బిల్ ఇంగ్లిష్‌తో శ్రీసుత

మన ఆట.. మన పాట

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు న్యూజిలాండ్ తెలుగు అసోసియేషన్‌కు ఉపాధ్యక్షురాలిగా ఉండి న్యూజిలాండ్ తెలుగు ప్రజలకు అండగా నిలిచారు శ్రీసుత. ప్రస్తుతం న్యూజిలాండ్ తెలంగాణ అసోసియేషన్‌కు కల్చరర్ సెక్రటరీగా ఉండి మన సంప్రదాయాలను, పండుగ కట్టుబాట్లను మరిచిపోకుండా, భావితరాలకు అందేలా అవగాహన కల్పిస్తున్నారు. కర్ణాటక సంగీతంలో ఉన్న అనుభవంతో న్యూజిలాండ్‌లో ఎక్కడ ఏ సాంస్కృతిక కార్యక్రమం జరిగినా వెళ్లి పాటలు పాడటం పిల్లలకు డాన్సులు నేర్పిస్తున్నారు. పూల పండుగ బతుకమ్మను తన పాటల ద్వారా అక్కడి వారికీ చేరువ చేస్తున్నారు. బతుకమ్మ బాధ్యతలను భుజాల మీద వేసుకుంటున్నందుకు జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కల్వకుంట్ల కవిత ప్రశంసించారు. ఆక్లాండ్‌లోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా బతుకమ్మ పండుగను విస్తరించేలా కృషి చేస్తున్నారు. పీపుల్స్ పార్టీ ప్రధాన ఎజెండా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు సాధ్యమైనంత తొందరగా పరిష్కరించడమేనని చెప్పారు శ్రీసుత.

ఉచిత శిక్షణ.. మనోళ్లకు రక్షణ

ఆక్లాండ్ నివసిస్తున్న తెలుగు చిన్నారులకు సంప్రదాయ నృత్యాలు, కర్ణాటక సంగీతంలో ఆసక్తి ఉన్న పిల్లలకు సంగీతం కూడా నేర్పిస్తున్నారు శ్రీసుత అండ్ టీమ్. న్యూజిలాండ్‌లో కల్చరర్ కార్యక్రమాలు జరిగితే తెలుగుతో పాటు హిందీ, తమిళ పాటలు కూడా పాడుతున్నారు. న్యూజిలాండ్‌లో ఉన్న కమ్యూనిటీ తెలుగు రేడియోలో జాకీగా పనిచేస్తున్నారు. శ్రీసుత అక్కడి భారతీయ మందిర్‌లో వాలంటీర్‌గా ఉన్నారు. 120 సీట్లు ఉండే న్యూజిలాండ్ పార్లమెంట్‌లో 70 సీట్లను ప్రజలు ఓట్ల ద్వారా ఎన్నుకుంటారు. మిగితా 50 మందిని ఆయా పార్టీలు తమ పార్టీ అభ్యర్థులను నామినేట్ చేస్తాయి. అంతేకాదు అక్కడి ప్రజలకు ఒక్కొక్కరి రెండు చొప్పున ఓట్లు ఉంటాయని చెప్పారు శ్రీసుత.

తొలి లోకో పైలెట్



సాధారణంగా రైల్వేస్‌లో పురుషాధిక్యత ఎక్కువ. అలాంటి శాఖలో ఆమెది చెరిగిపోని రికార్డు. ఇంతకీ ఆమె ఎవరు? ఏం చేసింది?

మహారాష్ట్ర సతారా జిల్లాకు చెందిన సుజాత రైతు కుటుంబంలో పుట్టింది. చిన్నప్పట్నుంచే చదువులో, ఆటపాటల్లో ఆల్‌రౌండర్‌గా పేరు తెచ్చుకున్నది. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా పూర్తిచేసిన సుజాత టీచర్ కావాలనుకున్నది. ఎవరూ ఊహించని ఉద్యోగాన్ని ఎంచుకున్నది. అంతవరకూ మహిళలు అడుగుపెట్టని ఇండియన్ రైల్వేస్‌లోకి ప్రవేశించింది. 1987లో జరిగిన రాతపరీక్షలో పాసై.. ధూమశకట సారథిగా కెరీర్ ప్రారంభించింది. ఇండియాలో రైలు నడిపిన తొలి మహిళగా గుర్తింపు పొందింది. ఆమె నెంబర్ ఎల్-50. మొదట రన్నింగ్ కండిషన్‌ను చెక్ చేయడం, సిగ్నల్స్ వంటి విధులు నిర్వర్తించిన ఆమె.. 1998లో పూర్తిస్థాయి లోకో పైలట్‌గా బాధ్యతలు స్వీకరించింది. వాడి బందర్ నుంచి కల్యాణ్‌కు నడిచే లోకల్ గూడ్స్‌ను తొలుత నడిపిందామె. ఇప్పుడామె వయసు 51 ఏళ్లు. అసిస్టెంట్ ట్రైనీ డ్రైవర్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆమె 30 సంవత్సరాలుగా తన విధులను విజయవంతంగా నిర్వరిస్తున్నది. 2000లో ప్రారంభమైన లేడీస్ స్పెషల్ ట్రైన్‌ను నడిపిన తొలి మహిళ కూడా సుజాతే కావడం విశేషం. అనంతరం ఆమె ఎక్స్‌ప్రెస్ మెయిల్ లోకో పైలట్‌గా, కల్యాణ్‌లోని ట్రైనింగ్ సెంటర్‌లో సీనియర్ ఇన్‌స్ట్రక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 1987కు ముందు రైలు నడిపేవాళ్లలో ఒక్క మహిళ కూడా ఉండేది కాదు. కానీ సుజాతను ఆదర్శంగా తీసుకుని ఎంతో మంది ఈ రంగం వైపు ఆసక్తి చూపారు. ప్రస్తుతం దేశంలో రైలు నడిపే మహిళలు యాభై మందికి పైగా ఉన్నారు. ఎంత మంది వచ్చినా రైలు నడిపిన తొలి మహిళగా రైల్వే చరిత్రలో సుజాత పేరు స్థిరపడిపోయింది.

ముడుతలు తొలిగించండిలా..

- గుడ్డులోని తెల్లసొనలో ముడుతలను నివారించే లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. దీనిలో ఉండే విటమిన్ ఇ ముడుతలు, చారలపై అద్భుతంగా పనిచేస్తుంది. మెత్తని దూదిసాయంతో తెల్లసొనను ముఖానికి అప్లై చేసి 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకుంటే మంచి మార్పు కనిపిస్తుంది.
- తెల్లసొనలో అలొవెరా జెల్ కలిపి పేస్టులా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముడుతల చుట్టూ అప్లై చేసి మసాజ్ చేయాలి. అరగంట తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకోవాలి. తరుచూ ఇలా చేస్తే చర్మం మృదువుగా తయారవుతుంది.
- ముడుతలను నివారించడంలో ఆలివ్‌నూనె ప్రభావవంతంగా పనిచేస్తుంది. రాత్రి నిద్రించే ముందు ఆలివ్ నూనెను చర్మానికి రాసుకుని మసాజ్ చేసుకోవాలి. తరుచూ ఇలా చేస్తే చర్మం కాంతివంతంగా మారుతుంది.
- కొబ్బరి నూనెలోనూ ముడుతల్ని తగ్గించే లక్షణాలున్నాయి. రాత్రి సమయంలో ముఖానికి కొబ్బరి నూనెను అప్లై చేయడం వల్ల మంచి మార్పు కనిపిస్తుంది.
- నిమ్మరసం బ్లీచింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. దీనితో ముడుతలపై సున్నితంగా సాజ్ చేయాలి. దీంట్లో ఉండే సిట్రిక్ యాసిడ్ ముడుతలను మాయం చేస్తుంది.




చర్మంపై ఏర్పడే ముడుతలు, చారలు తెగ ఇబ్బంది పెడుతుంటాయి. నలుగురిలో అందవికారంగా కనిపించేలా చేస్తాయి. వీటిని తొలిగించుకునేందుకు సహజసిద్ధమైన పై హోమ్‌రెమెడీస్‌ను ట్రై చేయండి.

బిట్స్ కార్నర్

ఇమ్యూనిటీ పెంచుకోవడం ఎలా?



అడుగండి చెబుతా



డాక్టర్ విజయ్ కుమార్
సీనియర్ జనరల్ ఫిజిషియన్
యశోద హాస్పిటల్
సికింద్రాబాద్

నా వయసు 59 సంవత్సరాలు. పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయురాలిని. కొద్దిరోజులుగా మోకాళ్లలో నొప్పి వస్తున్నది. ఇతర ఎలాంటి అనారోగ్యం లేదు. డాక్టర్‌కు చూపిస్తే ఇమ్యూనిటి పెంచుకొమ్మని సలహా ఇచ్చారు. అధికంగా విటమిన్ మందులు, టానిక్‌లు తీసుకోవడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుందా? ఇమ్యూనిటి పెరగడానికి ఏం చెయ్యాలో వివరించండి?

అమృత, హన్మకొండ

ఇమ్యూనిటి అంటే రోగనిరోధక శక్తి అని అర్థం. ఇది శరీరంలోకి చేరే హానికారక సూక్ష్మ క్రిములతో పోరాడి శరీరాన్ని అనారోగ్యం నుంచి కాపాడుతుంది. దీని గురించి అనేక అపోహలు ప్రచారంలో ఉన్నాయి. విటమిన్లు, మినరల్స్ మందుల రూపంలో ఎక్కువగా తీసుకోవడం వల్ల నిరోధక వ్యవస్థ మెరుగుపడుతుందని పరిశోధనల్లో నిరూపితం కాలేదు. పెద్ద వారిలో నిరోధక వ్యవస్థను మెరుగు పరుచుకునేందుకు కొన్ని జాగ్రత్తలను నిపుణులు సూచిస్తున్నారు.

- పెద్దవారికి ఇచ్చే టీకాలను వేయించుకోవడం వల్ల నిరోధక వ్యవస్థను చురుకుగా ఉంచవచ్చు.
- బీపీ, షుగర్, శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి.
- వారానికి కనీసం 5 రోజుల పాటు రోజుకు అర గంటకు తగ్గకుండా వ్యాయామం చెయాలి.
- పొగతాగే అలవాటు ఉంటే వెంటనే మానెయ్యాలి. మద్యం అలవాటు ఉంటే దాన్ని కూడా అదుపులో ఉంచుకోవాలి.
- తగినంత నిద్ర తప్పనిసరి.
- ఆరోగ్యవంతమైన, సమతుల, పౌష్టికాహారం తీసుకోవాలి.

ఇలాంటి చిన్నచిన్న జాగ్రత్తలతో శరీరంలో ఇమ్యూనిటి పెంపొందించుకోవచ్చు.

మాకు రాయండి

మీకు ఆరోగ్యపరమైన సమస్యలు, సందేహాలున్నాయా? అయితే మాకు రాయండి. నిపుణులతో సలహాలు ఇప్పిస్తాం. మా అడ్రస్ : నమస్తే తెలంగాణ - అడుగండి చెబుతా(హెల్త్‌డెస్క్) #8-2-3\1\7\8\9, క్రిష్ణాపురం, రోడ్ నెం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. health@ntdaily.news

శ్వేత మేకలఫారం!

చేసే పని చిన్నదా? పెద్దదా? అనేది విషయం కాదు. ఎక్కువ జీతం, విలాసవంతమైన జీవితం ఇచ్చే ఉద్యోగం కంటే మనసుకు సంతృప్తినిచ్చే ఉద్యోగమే బెస్ట్ అంటున్నదీ అమ్మాయి.



బెంగళూరులో ఫ్యాషన్ డిజైనర్‌గా నీడ పట్టున ఉంటూ నాలుగు రాళ్లు సంపాదించుకునేది శ్వేత తోమర్. భర్తతో కలిసి ఒకసారి వీకెండ్‌కి దగ్గర్లోని ఫామ్‌హౌజ్‌కి వెళ్లింది. అక్కడ మేకల పెంపకాన్ని చూసి ఆసక్తిగా గమనించింది. ఆ తర్వాత రోజూ ఆ ఫామ్‌హౌజ్‌కి వెళ్లడం, మేకలను ఎలా పెంచుతున్నారు? వాటికి ఎలాంటి తిండి పెడుతున్నారు? నిర్వహణ ఖర్చు ఎంత అవుతున్నది?.. ఇలాంటి వివరాలన్నీ ఆసక్తిగా అడిగి తెలుసుకున్నది. ఇలా ఒక సంవత్సరం పాటు రోజూ వెళ్లింది. తను కూడా సొంతంగా మేకలు పెంచాలనుకుంది. అందుకోసం ఒక ఫామ్ ఏర్పాటు చేయాలనుకుంది. మనసులోని ఆలోచన భర్తతో పంచుకుంది. అతను ఓకే చెప్పి, మేకల పెంపకంలో శిక్షణ కూడా ఇప్పించాడు. బెంగళూరు నిఫ్ట్‌లో చదివి ఫ్యాషన్ డిజైనర్‌గా మంచి పేరు తెచ్చుకుంటున్న క్రమంలోనే ఆమె జీవితం అనుకోని మలుపు తిరిగింది. కొత్త జీవితాన్ని ప్రారంభించాలన్న ఆలోచనతో మేకల పెంపకం మొదలుపెట్టింది. ఇందుకోసం లోన్ తీసుకొని 250 మేకలు కొన్నది. పట్టణంలో కాకుండా గ్రామీణ ప్రాంతంలో అయితే మేకలు సహజంగా పెరుగుతాయని భావించింది. లిస్త్రాపుర అనే గ్రామాన్ని సెలక్ట్ చేసుకుంది. అక్కడి వెళ్లి చూస్తే తొలి అడుగే ముళ్లకంప మీద అన్నట్టుగా ఉంది. కొన్నేళ్లుగా ఆ ప్రాంతంలో ఎవరూ మేకలు పెంచడం లేదు. ఇతర పనులు చేసుకుని బతుకుతున్నారు. దీనికి కారణం ఏనుగుల బెడద, మేకలకు రక్షణ లేకపోవడం. అయినా శ్వేత వెనుకడుగు వేయలేదు. అక్కడే తన కెరీర్ మొదలుపెట్టాలనుకుంది. ఏనుగుల కంటే ఎత్తులో షెడ్డు తయారుచేసింది. మేకల కోసం అన్నీ సౌకర్యాలు ఏర్పాటు చేసింది. మేకల రొచ్చు, మూత్రం ద్వారా వాటికి ఎలాంటి వ్యాధులు రాకుండా ఉండేందుకు మేకల మలమూత్రాలు నేరుగా కిందికి వెళ్లిపోయేలా ప్లాన్ చేసింది. ఓ పదిమందికి ఉపాధి కల్పిస్తూ సంవత్సరానికి నాలుగైదు లక్షల రూపాయలు సంపాదిస్తున్నది. 'గ్రామాల నుంచి ఎంతో మంది ఉపాధి కోసం నగరాలకు తరలిపోతున్నారు. వారిలో కొందరైనా నన్ను చూసి గ్రామంలోనే ఉపాధి వెతుక్కుంటారని చిన్న ప్రయత్నం' అంటున్నది శ్వేత.

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
బుధవారం 23 ఆగస్టు 2017
WWW.NTNEWS.COM

స్టార్ హీరోల ఆలోచన విధానం మారాలి

- దర్శకుడు మురుగదాస్



మురుగదాస్

సినిమాలకు సామాజిక ప్రయోజనం ఉండాలని విశ్వసించే దర్శకుల్లో మురుగదాస్ ఒకరు. హీరోయిజం, వాణిజ్య సూత్రాలకు సందేశాల్ని మేళవించి సినిమాల్ని తెరకెక్కిస్తుంటారాయన. సినిమాల ద్వారా మంచి చెప్పకపోయినా పరవాలేదు కానీ చెడు మాత్రం చూపించనని ..అదే తన సిద్ధాంతమని చెబుతున్నారాయన. తమిళంతో పాటు తెలుగు, హిందీ భాషల్లో వరుస విజయాల్ని అందుకుంటూ ప్రతిభావంతుడైన దర్శకుడిగా నిరూపించుకున్నారు మురుగదాస్. ఆయన దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం ‘స్పైడర్’. మహేష్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో ఠాగూర్ మధు సమర్పణలో రూపొందుతున్న ఈ చిత్రానికి ఎన్వీ ప్రసాద్ నిర్మాత. ‘స్పైడర్’ చిత్ర విశేషాలను మంగళవారం హైదరాబాద్‌లో పాత్రికేయులతో పంచుకున్నారు మురుగదాస్. ఆ సంగతులివి...

‘స్పైడర్’ ప్రయాణం ఎలా ప్రారంభమైంది?

• ‘స్టాలిన్’ తర్వాత తెలుగులో నేను చేస్తున్న చిత్రమిది. ‘పోకిరి’ సమయంలో పరుచూరి వెంకటేశ్వరరావు ద్వారా మహేష్‌బాబుతో పరిచయం ఏర్పడింది. ఆయన నటించిన ‘ఒక్కడు’ సినిమాను చూశాను. రెండు వారాల తర్వాత కూడా థియేటర్లలో పండుగ వాతావరణం కనిపించింది. కృత్రిమత్వం లేకుండా సహజత్వంతో కూడిన ఆయన నటన నన్ను బాగా ఆకట్టుకుంది. దాంతో మహేష్‌బాబును కలిసి మీతో ఓ సినిమా చేయాలనుందని చెప్పాను. ఇద్దరం ఇతర సినిమాలతో బిజీగా ఉండటంతో మా కలయిక కొంత ఆలస్యమైంది. గతంలో నేను చేసిన సినిమాలు ఎక్కువగా తెలుగులో డబ్ అయ్యాయి. అలా కాకుండా ఓ ద్విభాషా చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి ఆయనతో చేయడం ఆనందంగా ఉంది. రెండు భాషలకు సరిపోయే కథ ఇది. హీరోయిజంతో పాటు వాణిజ్య హంగులన్ని ఉంటాయి. తమిళంలో మహేష్‌బాబుకు మంచి శుభారంభంగా నిలుస్తుంది. ఓ పాట మినహా చిత్రీకరణ పూర్తయింది. పదేళ్లు వేచి చూసినందుకు తెలుగులో ‘స్పైడర్’ రూపంలో మంచి సినిమా దొరికింది.

తొలిసారి మహేష్‌బాబుతో కలిసి సినిమా చేయడం ఎలాంటి అనుభూతినిచ్చింది?

• ఇతరులతో పోలిస్తే మహేష్ చాలా ప్రత్యేకమైన నటుడు. ప్రతి దర్శకుడు తన కెరీర్‌లో ఒక్కసారైనా ఆయనతో పనిచేయాలి. ఏడాది పాటు ఈ సినిమా కోసం కలిసి ప్రయాణించాం. దర్శకుల నటుడాయన. ఒకసారి కథను అంగీకరించిన తర్వాత దర్శకుల పనిలో ఎలాంటి జోక్యం చేసుకోరు. సినిమా కోసం ఎనభై రోజుల పాటు రాత్రిళ్లు షూటింగ్ చేశాం. ఈ సినిమా కోసం ఆయన చాలా శ్రమించారు. ‘అలసిపోయాను. షూటింగ్ చేయలేను’ అన్న మాటలు ఎప్పుడూ వినలేదు. ఆయనలా ఏ సూపర్‌స్టార్ కష్టపడటం చూడలేదు. సినిమా బాగా రావడానికి మరికొన్ని రోజులు డేట్స్ కేటాయించడానికి సిద్ధమని చెప్పేవారు. సినిమా కోసం ఆయన పడుతున్న తపన నన్ను ఆకట్టుకుంది. ఆయన లేకపోతే ఈసినిమా లేదు. తప్పకుండా ఆయనతో మరో సినిమా చేస్తాను.

ఈ పదేళ్లలో ఆయనకు ఎప్పుడైనా కథలు వినిపించారా?

• మహేష్‌బాబును ప్రతి ఏడాది కలుస్తుంటాను. ఇద్దరం కలిసి సినిమా చేయాలని చాలా సార్లు అనుకున్నాం. కానీ అనివార్య కారణాల వల్ల కుదరలేదు. ‘శ్రీమంతుడు’ తమిళ ప్రచార కార్యక్రమాల్లో మహేష్‌బాబును కలిసి స్పైడర్ పాయింట్ ఇరవై నిమిషాల పాటు వినిపించాను. ఆయనకు నచ్చింది. తుపాకి, గజిని తరహాలో స్టైలిష్ మాస్ అంశాలతో పాటు రమణ, కత్తి తరహాలో ఎమోషనల్‌గా ఈ సినిమా సాగుతుంది.

జేమ్స్‌బాండ్ తరహాలో సాగే సినిమా అనుకోవచ్చా?

• జేమ్స్‌బాండ్ ట్రెండ్ ఇప్పుడు ఔట్‌డేటెడ్ అయిపోయింది. ఆ సినిమాలన్ని సహజత్వానికి దూరంగా సాంకేతికంగా పది, పదిహేనేళ్ల వెనకే ఉండిపోయాయి. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన తర్వాత ఓ మొబైల్‌తోనే ఎన్నో అద్భుతాల్ని సృష్టిస్తున్నారు. జేమ్స్‌బాండ్ తరహాలోనే టెక్నాలజీ ఆధారంగా సాగే సినిమా కాదిది. మనదేశంలో గూఢచార వ్యవస్థ పనితీరు ఎలా ఉంది? దాని లక్ష్యాలేమిటి? అన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. ప్రత్యక్షంగా, పరోక్షంగా నేను చేసే ప్రతి సినిమాలో ఏదో ఒక సందేశాన్ని ఇచ్చే ప్రయత్నం చేస్తుంటాను. ఈ సినిమాలో కూడా మానవత్వం నశించడం వల్లే ఉగ్రవాదం, అవినీతి వంటివి పెరుగుతున్నాయనే అంశాన్ని అంతర్లీనంగా చూపించబోతున్నాం.

మహేష్‌బాబును గూఢచారి పాత్రలో చూపించాలనే ఆలోచన ఎలా వచ్చింది?

• సినిమాలో హీరో పోలీస్, ఆర్మీ అధికారి అయితే ఆయా గెటప్‌లలో చూపిస్తే సరిపోతుంది. అలా కాకుండా గూఢచారి పాత్ర అంటే అందరిలో ఆసక్తి ఉంటుంది. ఆధునిక పంథాలో స్టైలిష్‌గా సాగే ఈ పాత్ర మహేష్‌బాబు బాడీలాంగ్వేజ్‌కు సరిగ్గా సరిపోతుందని అనిపించింది. ఈ తరహా కథకు వందశాతం ఆయన మాత్రమే న్యాయం చేస్తారని నమ్మాను.

రెండు భాషల్లో, పెద్ద బడ్జెట్‌తో సినిమా చేయడంలో నిర్మాతలు ఎలాంటి సహకారాన్ని అందించారు?

• భారీ బడ్జెట్‌తో సినిమా చేయాలనే ఆలోచనతో కాకుండా ప్రేమతో నిర్మాతలు చేసిన చిత్రమిది. మధుతో ఠాగూర్, గజిని, స్టాలిన్ సినిమాలు చేశాను. తిరుపతి ప్రసాద్‌తో చాలా కాలంగా పరిచయముంది. వారిద్దరు ఈ సినిమాకు నిర్మాతలని మహేష్‌బాబు చెప్పగానే ఆనందమేసింది. సినిమా బాగా రావడానికి వారు నిరంతరం తపించారు. నాణ్యత విషయంలో రాజీపడకుండా రష్యా, లండన్‌లలో హాలీవుడ్ సాంకేతిక నిపుణులతో గ్రాఫిక్స్ పనులు జరిపించారు.

మీ కెరీర్‌లోనే ఎక్కువ సమయం తీసుకొని ఈ సినిమా చేశారు. ఆలస్యానికి కారణమేమిటి?

• తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి చేయడం, అంచనాలు భారీగా ఉండటం, విజువల్ ఎఫెక్ట్స్ ఇలా పలు కారణాల వల్ల సినిమా చిత్రీకరణలో జాప్యం చోటుచేసుకున్నది. రెండు భాషల్లో సినిమా అంటే ఒకే సన్నివేశాన్ని మరోసారి చిత్రీకరించడమనే అభిప్రాయంతో మొదలుపెట్టాం. కానీ ఒకేసారి రెండు సినిమాలు చేసిన కష్టం అందులో ఇమిడి ఉంటుందని తర్వాత అర్థమైంది.

ఒక సారి సిద్ధం చేసుకున్న కథలో మార్పులు చేయడానికి మీరు ఇష్టపడతారా?

• ఇంప్రూవ్‌మెంట్ అనేది నిరంతరం జరిగే ప్రక్రియ. కొన్ని సార్లు చిత్రీకరణ సమయంలో మార్పులు చేస్తుంటాం. అవసరమైతే డబ్బింగ్ చెబుతున్నప్పుడు సవరణలు చేస్తుంటాం. అది ఎప్పుడూ జరుగుతూనే ఉంటుంది.

తొలుత ఈ సినిమాలో పరిణితీ చోప్రాతో పాటు పలువురు బాలీవుడ్ తారలు కథానాయికగా నటించనున్నట్లు వార్తలు వచ్చాయి?

• బాలీవుడ్ హీరోయిన్ అయితే సినిమా పట్ల ఆకర్షణ మరింత పెరుగుతుందని అనుకున్న మాట నిజమే. ఆ ఆలోచనతోనే పరిణితీ చోప్రాను తీసుకోవాలని అనుకున్నాం. కానీ తెలుగు, తమిళ భాషల పట్ల పరిజ్ఞానం లేకపోవడంతో ఆమెతో సినిమా చేయడం కష్టమనిపించింది. దాంతో ఆ ఆలోచనను విరమించుకున్నాం. రకుల్ ప్రీత్‌సింగ్‌కు రెండు భాషలు అర్థమవుతాయి కాబట్టి ఆమెను ఎంపికచేసుకున్నాం.

సినిమాలో ప్రతినాయకుడిగా ఎస్.జె.సూర్యను ఎంపిక చేయడానికి కారణమేమిటి?

• ప్రస్తుతం సినిమాల్లో ప్రతినాయకుడు అంటే ఆరుపలకల దేహంతో బలవంతుడిగా చూపించడం ట్రెండ్‌గా మారిపోయింది. శక్తివంతుడైన గ్యాంగ్‌స్టర్, రాజకీయనాయకుడు అనే మూసధోరణికి భిన్నంగా ప్రతినాయకుడిని తెలివిపరుడిగా ఆవిష్కరిస్తే బాగుంటుందని అనిపించింది. తన బుద్ధిబలాన్ని ఉపయోగిస్తూ హీరోను ఎదుర్కొనే విలన్‌గా ఈ సినిమాలో సూర్య కనిపిస్తారు. ఎస్.జె. సూర్యతో నాకు మంచి సాన్నిహిత్యం ఉంది. ఆయన దర్శకత్వం వహించిన ‘ఖుషీ’ చిత్రానికి నేను కొన్నాళ్ల పాటు పనిచేశాను. ఆయనతో పాటు భరత్ పాత్ర కొత్త అనుభూతిని పంచుతుంది.

మీ ప్రతి సినిమాలో ఏదో ఒక సందేశాన్ని ప్రేక్షకులకు అందిస్తూనే ఉంటారు. ఈ సినిమాలో ఎలాంటి సందేశాన్ని ఇస్తున్నారు?

• ప్రతి రోజు భిన్న మాధ్యమాల ద్వారా ప్రజలు సందేశాల్ని స్వీకరిస్తూనే ఉంటారు. సినిమాల్లో కూడా సందేశం అనగానే భయపడిపోతున్నారు. ఒక రకంగా సందేశాల పట్ల వారిలో విరక్తి ఏర్పడింది. అందుకే నేను రూపొందించే సినిమాల్లో డైరెక్ట్‌గా వారికి సందేశాన్ని అందించే ప్రయత్నం చేయను. ‘తుపాకి’ సినిమాను దేశభక్తి నేపథ్యంలో చేసినా అందులో ఎక్కడ జాతీయ పతాకం, జైహింద్, వందేమాతర గీతం లాంటివి చూపించలేదు. అలాగే ‘స్పైడర్’లో కూడా కమర్షియల్ హంగులతో పాటు అంతర్లీనంగా సందేశాన్ని చెప్పే ప్రయత్నం చేశాను. నా సినిమాల ద్వారా మంచి చెప్పకపోయినా చెడు మాత్రం చూపించను. సిగరెట్, ఆల్కహాల్ వంటి వ్యసనాలకు చోటు కల్పించను. సినిమాలో స్టార్ హీరో పొగ త్రాగుతూ కనిపిస్తే అభిమానులపై ఆ ప్రభావం తప్పకుండా పడుతుందని నమ్ముతాను. అలాంటివి నా సినిమాలో కనబడకుండా జాగ్రత్త పడుతాను. ‘స్పైడర్’లో అలాంటి సన్నివేశాలు ఉండవు.

‘స్పైడర్’ సినిమాను హిందీలో తెరకెక్కించే ఆలోచన ఉందా?

• తెలుగు, తమిళ భాషల్లో నేరుగా ఈ సినిమా చేస్తున్నాం. వీటితో పాటు మలయాళం, అరబిక్ భాషల్లో అనువాద రూపంలో ఒకేసారి విడుదలచేయనున్నాం. రీమేక్‌లకంటే స్ట్రెయిట్ సినిమాలు చేయడమంటేనే నాకు ఇష్టం. హిందీలో ఈ సినిమాను రీమేక్ చేస్తానో లేదో తెలియదు. తుపాకీ, గజిని సినిమాలను ముందస్తు ఒప్పందాల కారణంగా హిందీ భాషలో దర్శకత్వం వహించాను.

స్టార్ హీరోలతో సినిమా అనగానే కలెక్షన్స్, రికార్డుల లెక్కలు ఎక్కువగా ఉంటాయి. అలాంటి వాటి గురించి మీరు ఆలోచిస్తారా?

• కలెక్షన్స్ కంటే నేను చేసిన సినిమా ఎంత మంది ప్రేక్షకులకు చేరువైందనేది మాత్రమే చూసుకుంటాను. హీరోల గత సినిమాలు, ప్రస్తుతం వారి మార్కెట్ ఎంత? ఏ బడ్జెట్‌లో సినిమాలు చేయాలి? పోటీ చిత్రాలేవి? లాంటి అనవసర విషయాల్ని గురించి ఆలోచిస్తే అసూయ పెరగడం తప్ప ఎలాంటి ఉపయోగం ఉండదు. వసూళ్ల భారం మొత్తం నిర్మాతలపైనే ఉంటుంది. ఏ సినిమా చేసినా అంతిమంగా హిట్ అయితే సంతోషపడతాను. రికార్డులు బ్రేక్ చేస్తే బోనస్ అనుకుంటాను.

ప్రేక్షకులపై సినిమాల ప్రభావం ఉంటుందని అనుకుంటున్నారా. ?

• అమెరికా, వియత్నాం మధ్య జరిగిన యుద్ధానికి ఒక ఫొటోతో తెరపడింది. సినిమాలతో పాటు అన్ని రకాల మాధ్యమాల ప్రభావం ప్రజలపై తప్పకుండా ఉంటుంది. దానిని దృష్టిలో పెట్టుకొని ఓ బాధ్యతగా భావిస్తూ తమ సినిమాల్లో మంచిని చూపించేందుకు దర్శకులు ప్రయత్నించాలి. ముఖ్యంగా ఈ విషయంలో స్టార్ హీరోల ఆలోచన విధానం మారాలి. పెద్దలు, మహిళల్ని గౌరవించడం లాంటి అంశాలను తమ సినిమాల్లో చూపిస్తే ప్రేక్షకులు ఆ మంచిని స్వీకరిస్తారు.



- సినిమా డెస్క్



శింబు, నయనతార

సరసుడి ప్రణయగాథ

శింబు, నయనతార, ఆండ్రియా ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ చిత్రం ‘ఇదు నమ్మ ఆళు’ తెలుగులో ‘సరసుడు’ పేరుతో అనువాదమవుతున్నది. పాండిరాజ్ దర్శకుడు. శింబు సినీ ఆర్ట్స్ మరియు జేసన్‌రాజ్ ఫిల్మ్స్ పతాకంపై టి. రాజేందర్ నిర్మించారు. ఈ నెల 8న తెలుగుప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా శింబు చిత్ర విశేషాలు తెలియజేస్తూ ‘విభిన్నమైన ఇతివృత్తంతో రూపొందిన ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. ఈ సినిమాలో నేను సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా కనిపిస్తాను. ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా అలరిస్తుంది. సంగీతానికి కూడా చాలా ప్రాధాన్యత వుంటుంది’ అన్నారు. ‘శింబు, నయనతార మధ్య వచ్చే రొమాంటిక్ సన్నివేశాలు సినిమాలో ప్రత్యేకాకర్షణగా నిలుస్తాయి. తమిళంలో మంచి విజయాన్ని సాధించిన చిత్రమిది. పాటలు, మాటలు నేనే రాశాను. ఈ చిత్రం ద్వారా మా చిన్నబ్బాయి కురళ్‌అరసన్‌ని సంగీత దర్శకుడిగా పరిచయం చేస్తున్నాను. పాటలు మెలోడీ ప్రధానంగా ఆకట్టుకుంటాయి. తెలుగుప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిచ్చే చిత్రమిది’ అన్నారు. ఆసక్తికరమైన మలుపులతో సాగే ముక్కోణపు ప్రేమకథా చిత్రమిదని దర్శకుడు తెలిపారు.

ఐబీఎస్‌కు హోమియో బెస్ట్



మానవ జీర్ణ వ్యవస్థను మ్యాజిక్ బాక్స్ అని అంటారు. కడుపు నొప్పికి కారణాలు అనేకం. ఇది ఎందువల్ల వస్తుందో నిర్ధారించడం కష్టం. దీర్ఘకాలికంగా కడుపునొప్పి, విరేచనాలు వేధిస్తున్నాయంటే పేగుల్లో ఇబ్బందికర మార్పులేవో ఇందుకు కారణం కావచ్చు. ముఖ్యంగా పేగుల్లో పూత, వాపు వల్ల ఇటువంటి లక్షణాలు కనిపించవచ్చు. ఈ సమస్యలను ఇన్‌ఫ్లమేటరీ బవెల్ సిండ్రోమ్ అంటారు.

ఇన్‌ఫ్లమేటరీ బవెల్ సిండ్రోమ్ ఆహార నాళాలకు సంబంధించిన ఒక దీర్ఘకాలిక సమస్య. మన శరీరంలో జీర్ణాశయానికి లోపలి వైపున అనేక మ్యూకోసిల్ పొరలు ఉంటాయి. వీటిలో వాపు, మంట, తాపానికి గురి కావడాన్ని ఇన్‌ఫ్లమేషన్ అని అంటారు. ఈ సమస్య వయసుతో సంబంధం లేకుండా స్త్రీ, పురుషులెవరిలోనైనా సమానంగా కనిపిస్తుంది. సాధారణంగా 30 సంవత్సరాల లోపు వయసు వారిలో ఎక్కువగా కనిపిస్తుంది.

కారణాలు

జన్యుపరమైన సమస్యలు, రోగనిరోధక వ్యవస్థ పొరపాటున జీర్ణవ్యవస్థ పైన దాడి చెయ్యడం, కుటుంబ చరిత్ర, కాలుష్యం, పొగతాగడం వంటివి ప్రధాన కారణాలు. ఇన్‌ఫ్లమేటరీ బవెల్ సిండ్రోమ్ రెండు రకాలుగా ఉంటుంది.

- **అల్సరేటివ్ కోలైటిస్** – చాలావరకు ఈ సమస్య పెద్దపేగుకు మాత్రమే పరిమితం అవుతుంది. పెద్దపేగుకు లోపల వైపుగా ఉండే మ్యూకోసిల్ పొరలు ఎర్రగా మారి, వాపునకి గురి కావడం, పుండ్లు ఏర్పడడం వల్ల విరేచనాలు, కొందరిలో రక్తంతో కూడిన విరేచనాలు మలవిసర్జనలో ఆతురత, కడుపునొప్పి వంటి సమస్యలు వస్తుంటాయి.
- **క్రొన్స్ డిసీజ్**– ఈ సమస్య జీర్ణవ్యవస్థ అనగా నోటి నుంచి మొదలుకొని మలద్వారం వరకు ఎక్కడైనా రావచ్చు. ముఖ్యంగా చిన్న పేగు చివరి భాగంలో వచ్చే అవకాశాలు ఎక్కువ. ఇది కేవలం పైన ఉండే మ్యూకోసిల్ పొరలకు మాత్రమే కాకుండా లోపల ఉండే అన్ని పొరలకు ఇన్‌ఫ్లమేషన్ వ్యాపిస్తుంది. దీని వల్ల దీర్ఘకాలికంగా విరేచనాలు, కడుపులో నొప్పి మెలితిప్పినట్టు ఉండడం, రక్తంతో కూడిన విరేచనాలు ప్రధానంగా ఉంటాయి. నిర్లక్ష్యం చేస్తే చిన్న పేగు మూసుకుపోవడం, పుండ్లు ఏర్పడడం, పేగులో రంధ్రాలు ఏర్పడడం, ఫిస్టులాస్ వంటి తీవ్ర సమస్యలకు దారి తీస్తుంది. ఫలితంగా రక్తహీనత, నీరసం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయి.
- ఐబీఎస్ కేవలం జీర్ణవ్యవస్థకే కాకుండా కీళ్లు, చర్మం, కాలేయం, కళ్లు వంటి అవయవాల పైన కూడా ప్రభావం చూపుతుంది.

పరీక్షలు

రోగి లక్షణాలను బట్టి రక్త పరీక్ష, మల పరీక్ష, కొలనోస్కోపి, సిగ్మాయిడోస్కోపి, ఎక్స్‌రే, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎండోస్కోపీ వంటి పరీక్షల ద్వారా వ్యాధిని నిర్ధారించడమే కాకుండా ఇతర జీర్ణవ్యవస్థకు సంబంధించిన సమస్యలు కూడా నిర్ధారించడం జరుగుతుంది.

హోమియో చికిత్స

జెనెటిక్ కాన్‌స్టిట్యూషనల్ సిమిలియం ద్వారా ఇన్‌ఫ్లమేటరీ బవెల్ సిండ్రోమ్ వల్ల దీర్ఘకాలికంగా వచ్చే కడుపునొప్పి విరేచనాలు ఇతర లక్షణాలను తగ్గించడమే కాకుండా ఐబీఎస్‌కి గల కారణాలను ముఖ్యంగా వికటించిన రోగనిరోధక వ్యవస్థను చికిత్స ద్వారా సరిచేసి ఈ సమస్యను, శాశ్వతంగా దూరం చేయవచ్చు. హోమియోకేర్‌లో వైద్యం ద్వారా ఐబీఎస్ సమస్యతో బాధపడుతున్న వారిలో సుమారు 82 శాతం మందిలో మంచి ఫలితాలు కనిపించాయి.



ఫ్యాటీ లివర్‌తో జర పదిలం



ఫ్యాటీ లివర్ లేదా హెపాటిక్ స్టీనోసిస్ అనే మాటలు లివర్‌లో పేరుకుపోయిన కొవ్వును తెలియజేస్తాయి. నిజానికి లివర్‌లో కొంత మొత్తంలో కొవ్వు ఉండడం సహజమే. కానీ అది పరిమితికి మించి ఉండడం అనేది అనారోగ్యాన్ని సూచిస్తుంది. లివర్ శరీరంలోని రెండో అతి పెద్ద అవయవం. ఇది మనం తీసుకొనే ఆహారంలోని హాని కారకాలను రక్తాన్ని వడగట్టడం ద్వారా తొలిగిస్తుంది. లివర్‌లో కొవ్వు పేరుకుపోతే ఈ ప్రక్రియ సరిగ్గా జరుగదు. లివర్ బరువులో 5–10 శాతం వరకు కొవ్వు పేరుకొని పోయిన స్థితిని ఫ్యాటీ లివర్‌గా చెప్పవచ్చు.

లక్షణాలు ఎలా ఉంటాయి?

సాధారణంగా ఫ్యాటీ లివర్ సమస్యలో లక్షణాలు ఏమీ ఉండవు. కడుపులో అసౌకర్యంగా ఉండడం, కొద్దిగా నీరసంగా ఉండడం వంటి లక్షణాలు మాత్రం ఉండొచ్చు. లివర్ పరిమాణం కొద్దిగా పెరుగవచ్చు. ఇది డాక్టర్ పరీక్షించి చూసినపుడు గుర్తించగలుగుతారు. ఎక్కువ కొవ్వు పేరుకోవడం వల్ల లివర్ కొద్దిగా వాపు వస్తుంది. ఇలా జరిగినపుడు ఆకలి మందగించడం, బరువు తగ్గడం, కడుపునొప్పి, నీరసంగా ఉండడం, కళ్లు తిరుగుతున్నట్టుగా ఉండడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. ఫ్యాటీ లివర్ సమస్య వల్ల సిర్రోసిస్ లేదా లివర్ ఫెయిల్యూర్‌కు దారి తీస్తే అప్పుడు కడుపులో నీరు చేరడం, కామెర్లు, త్వరగా రక్తస్రావం జరుగడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి.

ఫ్యాటీ లివర్ ఎందుకు అవుతుంది?

సాధారణంగా మద్యం అలవాటు ఉన్నవారిలో ఫ్యాటీ లివర్ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. అది కాకుండా ఆరోగ్యవంతమైన జీవనశైలి లేని వారిలో, స్థూలకాయం వంటివి కూడా కారణం అవుతాయి.

హైపర్‌లిపిడిమియా (రక్తంలో కొవ్వు ఎక్కువగా ఉండడం, డయాబెటిస్ సమస్య), వంశపారంపర్యంగా సంక్రమించడం, ఆస్ప్రిన్, స్టెరాయిడ్స్ వంటి మందుల దుష్ప్రభావం వల్ల కూడా ఫ్యాటీ లివర్ సమస్య రావచ్చు.

శరీరంలో ఎక్కువ కొవ్వు ఉత్పత్తి అయ్యి అది నిల్వ ఉండిపోవడం వల్ల ఫ్యాటీ లివర్ అవుతుంది. కొవ్వులు ఎక్కువగా తీసుకోవడం, ఆహారంలో చక్కెర ఎక్కువగా వాడడం అనేది నేరుగా ఫ్యాటీ లివర్ సమస్యకు కారణం కాదు. కానీ ఇది డయాబెటిస్ పెరుగడానికి, బరవు పెరగడానికి కారణం కావడం వల్ల పరోక్షంగా ఫ్యాటీ లివర్ సమస్యకు కారణం అవుతుంది.

ఫ్యాటీ లివర్ సమస్య ఎవరిలో కనిపిస్తుంది?

బరువు ఎక్కువగా ఉన్న వారిలో ఫ్యాటీ లివర్ సమస్య వచ్చేందుకు ఆస్కారాలు ఎక్కువ. టైప్2 డయాబెటిస్ వల్ల కూడా ఫ్యాటీ లివర్ సమస్య రావచ్చు. లివర్‌లో కొవ్వు నిల్వలు పెరిగిపోవడం వల్ల శరీరంలో ఇన్సులిన్ నిరోధకత కూడ పెరిగేందుకు ఆస్కారం ఉంటుంది. వీటితో పాటు ఎక్కువగా ఆల్కహాల్ తీసుకునే వారిలో, ఒక్కోసారి గర్భధారణ, రక్తంలో కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉండడం, ట్రైగ్లిజరాయిడ్లు ఎక్కువగా ఉండడం, పోషకాహార లోపం, మెటబాలిక్ సిండ్రోమ్, డాక్టర్ సలహా లేకుండా మందులు వాడడం వంటి అలవాట్లు ఉన్న వారిలో ఫ్యాటీ లివర్ సమస్య వచ్చేందుకు ఆస్కారాలు ఎక్కువ.

ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

ఫ్యాటీ లివర్ సమస్య తీవ్రం కాకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి.

- ఆల్కహాల్ తీసుకోకపోవడమే మంచిది. ఒకవేళ తీసుకోవాల్సి వస్తే పరిమితంగా తీసుకోవాలి.
- రక్తంలో కొలెస్ట్రాల్, షుగర్ పెరుగకుండా ఉండేందుకు అందుకు అనువైన ఆహారం అంటే చక్కెరలు, కొవ్వులు తక్కువగా ఉండే ఆహార పదార్థాలు మాత్రమే తీసుకోవాలి.
- శరీర బరువు అదుపులో ఉంచుకోవాలి.
- క్రమం తప్పకుండా వ్యాయామం చెయ్యాలి. ఆరోగ్యవంతమైన జీవన శైలిని అలవరుచుకోవాలి. బరువు తగ్గడం వల్ల లివర్ ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.
- ఆహారంలో తాజా కూరగాయలు, పండ్లు, గింజలు ఎక్కువగా తీసుకోవడం, కొవ్వులు తగ్గించడం ద్వారా ఫ్యాటీలివర్ సమస్యను పూర్తిగా నయం చెయ్యవచ్చు.

నివారణ సాధ్యమేనా?

ఎప్పుడైనా నివారణే చికిత్స కంటే మెరుగు. ఆల్కహాల్ కానీ ఇతర పానీయాలేవైనా సరే వీలైనంత తక్కువగా తీసుకోవడం, ప్రతి రోజూ కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చెయ్యడం. శరీర బరువును అదుపులో ఉంచుకోవడం, షుగర్, కొలెస్ట్రాల్ వంటి సమస్యలను అదుపులో ఉంచుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకుంటే ఫ్యాటీ లివర్ సమస్య రాకుండా నివారించవచ్చు.



డాక్టర్ టి. లక్ష్మీకాంత్
సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్
లాపరోస్కోపిక్, బేరియాట్రిక్ అండ్ రోబోటిక్ సర్జన్
కిమ్స్ హాస్పిటల్స్, హైదరాబాద్
040 4488 5000

ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో 139 అప్రెంటిస్‌లు

తమిళ నాడు మహేంద్రగిరిలో ఉన్న ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ట్రేడ్ టెక్నీషియన్/ట్రేడ్ అప్రెంటిస్ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ప్రొపల్షన్ కాంప్లెక్స్ అనేది ఇస్రో పరిధిలో పనిచేస్తున్నది. ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)ను 1969 ఆగస్టు 15న విక్రమ్ సారాభాయ్ స్థాపించారు. ఇది అంతరిక్ష పరిశోధనల కోసం భారత ప్రభుత్వం నెలకొల్పిన సంస్థ.

- పోస్టు పేరు: ట్రేడ్ టెక్నీషియన్/ట్రేడ్ అప్రెంటిస్
- మొత్తం పోస్టుల సంఖ్య: 139
- ట్రేడ్ అప్రెంటిస్ - 80 ఖాళీలు
- విభాగాలవారీగా ఖాళీలు: ఫిట్టర్-15, వెల్డర్-8, మెషినిస్ట్-2, డ్రాఫ్ట్స్‌మెన్ (మెకానిక్)-2, టర్నర్-2, ఎలక్ట్రీషియన్-8, డ్రాఫ్ట్స్‌మెన్ (సివిల్)-7, ఎలక్ట్రానిక్ మెకానిక్/ మెకానిక్ (రేడియో అండ్ టెలివిజన్)-4, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్-2, రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మెకానిక్-1, డీజిల్ మెకానిక్-8, కార్పెంటర్-2, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ (కెమికల్ ప్లాంట్)-1, ప్రోగ్రామింగ్ అండ్ సిస్టమ్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ (పాసా) లేదా కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ (కోపా)-18
- అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఎస్‌ఎస్సీ/ఎస్‌ఎస్‌ఎల్సీలో ఉత్తీర్ణత. ఎన్‌సీవీటీతో గుర్తింపు పొందిన సంస్థ నుంచి సంబంధిత ఐటీఐ ట్రేడ్‌లో ఉత్తీర్ణత. లైబ్రరీ సైన్స్ పోస్టులకు డిగ్రీ (లైబ్రరీ సైన్స్, ఇన్ఫర్మేషన్ సైన్స్)లో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత.
- వేతనం: మొదటి ఏడాదికి రూ. 6,400/-, కొన్ని ట్రేడ్ అప్రెంటిస్‌లకు రూ. 7,200/- స్టయిఫండ్ చెల్లిస్తారు.



- టెక్నీషియన్ అప్రెంటిస్- 59 ఖాళీలు
- విభాగాలవారీగా ఖాళీలు: మెకానికల్-13, ఎలక్ట్రికల్-7, ఎలక్ట్రానిక్స్-12, సివిల్-7, కమర్షియల్ ప్రాక్టీస్-15
- అర్హత: సంబంధిత ఇంజినీరింగ్‌లో ప్రథమశ్రేణిలో డిప్లొమా ఉత్తీర్ణత. కమర్షియల్ ప్రాక్టీస్‌కు డిప్లొమా (మోడ్రన్ ఆఫీస్ ప్రాక్టీస్/కమర్షియల్ ప్రాక్టీస్)లో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత.
- వేతనం: రూ. 3542/- స్టయిఫండ్ చెల్లిస్తారు.
- వయస్సు: 2017 సెప్టెంబర్ 2 నాటికి 35 ఏండ్లకు (కమర్షియల్ ప్రాక్టీస్‌కు 26 ఏండ్లు) మించరాదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్ల పాటు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- ఎంపిక విధానం: అకడమిక్ ప్రతిభను స్క్రీనింగ్ చేస్తారు. ఆ తర్వాత అర్హతగల అభ్యర్థులకు రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ, స్కిల్ టెస్ట్‌లు నిర్వహిస్తారు.
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- చివరి తేదీ: సెప్టెంబర్ 2
- వెబ్‌సైట్: www. iprc.gov.in

సీడాక్‌లో పీజీ డిప్లొమా

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీడాక్) పీజీ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

సీడాక్ కేంద్ర ప్రభుత్వ సంస్థ. దేశవ్యాప్తంగా పలు పట్టణాల్లో సీడాక్ కేంద్రాలు ఉన్నాయి. పరిశోధన, పలు ప్రోగ్రామ్స్‌ను అందించడం దీని ప్రత్యేకత.

- కోర్సు పేరు: ఎలక్ట్రానిక్ ప్రొడక్ట్ డిజైన్‌లో పీజీ డిప్లొమా ఉత్తీర్ణత.
- అర్హతలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఈ/బీటెక్‌లో ఈసీఈ లేదా ఈఈఈ లేదా ఈఐలో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు లేదా ఎమ్మెస్సీ ఎలక్ట్రానిక్స్‌లో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి.
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: సెప్టెంబర్ 7
- వెబ్‌సైట్: www.esdmindia.in

'అగ్రికల్చర్'లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు

- నాలుగేండ్ల డిగ్రీ + పీజీ, ఎమ్మెస్సీ అభ్యర్థులకు అవకాశం
- ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక
- దరఖాస్తులకు చివరితేదీ: సెప్టెంబర్ 20

హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

ఈ యూనివర్సిటీని 2014లో ఏర్పాటైయింది రాష్ట్రంలోని వ్యవసాయ పరిశోధన, అనుబంధ విద్య, విస్తరణను పర్యవేక్షిస్తుంది.

- పోస్టు పేరు: అసిస్టెంట్ ప్రొఫెసర్
- మొత్తం పోస్టుల సంఖ్య: 224 (అగ్రికల్చర్-180, లైబ్రరీ సైన్స్-6, అగ్రికల్చర్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ-22, హోం సైన్స్-16)

విభాగాలవారీగా ఖాళీలు:

- అగ్రికల్చర్ ఇంజినీరింగ్ & టెక్నాలజీ డిపార్ట్‌మెంట్
- అగ్రికల్చర్ ప్రాసెస్ అండ్ ఫుడ్ ఇంజినీరింగ్-2 పోస్టులు.. ఓసీ-1 (మహిళ), ఎస్సీ-1 (మహిళ)
- ఫామ్ మెషినరీ అండ్ పవర్ ఇంజినీరింగ్-7 పోస్టులు.. ఓసీ (జనరల్-3, పీహెచ్-1), బీసీ ఏ-1 (మహిళ), ఎస్సీ-1, ఎస్టీ-1 (మహిళ)
- ఫుడ్ బిజినెస్ మేనేజ్‌మెంట్-1 (బీసీ-బీ మహిళ)
- ఫుడ్ ప్రాసెస్ ఇంజినీరింగ్- 3 పోస్టులు.. ఓసీ (జనరల్-2, మహిళ-1)
- ఫుడ్ ప్రాసెస్ టెక్నాలజీ- 3 పోస్టులు.. ఓసీ-1, బీసీ సీ-1, ఎస్సీ-1 (మహిళ)
- సాయిల్ అండ్ వాటర్ కన్జర్వేషన్ ఇంజినీరింగ్-6 పోస్టులు.. ఓసీ (జనరల్-1, మహిళ-1), బీసీ ఏ-1, బీసీ డీ-1 (మహిళ), బీసీ ఈ-1 (మహిళ), ఎస్సీ-1 (మహిళ)

హోం సైన్స్..

- అప్పెరల్ టెక్స్‌టైల్స్-1 (ఓసీ మహిళ)
- అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్..
- అగ్రికల్చర్ ఎకనామిక్స్-12 పోస్టులు.. ఓసీ (జనరల్-4, మహిళ-2, పీహెచ్-1), బీసీ ఏ-1 (మహిళ), బీసీ బీ-1 (మహిళ), ఎస్సీ (జనరల్-1, మహిళ-1), ఎస్టీ-1 (మహిళ)
- అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్-24 పోస్టులు.. ఓసీ (జనరల్-7, మహిళ-4, పీహెచ్-1), బీసీ ఏ - 2, బీసీ బీ-2, బీసీ సీ-1, బీసీ డీ-1 (మహిళ), బీసీ ఈ-1 (మహిళ), ఎస్సీ (జనరల్-2, మహిళ-1), ఎస్టీ-1
- అగ్రికల్చర్ బయాలజీ-4 పోస్టులు.. ఓసీ (జనరల్-2, మహిళ-1), బీసీ డీ-1
- ఆగ్రానమీ- 35 పోస్టులు.. ఓసీ (జనరల్-10, మహిళ-5, పీహెచ్-1), బీసీ ఏ-1 (మహిళ), బీసీ బీ (జనరల్-2, మహిళ-1), బీసీ డీ (జనరల్-2, మహిళ-1), బీసీ ఈ-2, ఎస్సీ (జనరల్-4, మహిళ-2), ఎస్టీ (జనరల్-1, మహిళ-1)
- క్రాప్ ఫిజియాలజీ-2 పోస్టులు.. ఓసీ-1, ఎస్సీ-1
- ఎంటమాలజీ-22 పోస్టులు.. ఓసీ (జనరల్-6, మహిళ-4), బీసీ ఏ-1, బీసీ బీ (జనరల్-2, మహిళ-2), బీసీ డీ-2, బీసీ ఈ-1, ఎస్సీ (జనరల్-2, మహిళ-1), ఎస్టీ-1
- జెనెటిక్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్-24 పోస్టులు.. ఓసీ (జనరల్-8, మహిళ-4, పీహెచ్-1), బీసీ ఏ (జనరల్-1, మహిళ-1), బీసీ బీ-1 (మహిళ), బీసీ సీ-1, బీసీ డీ-1 (మహిళ), బీసీ ఈ-2 (మహిళ), ఎస్సీ (జనరల్-2, మహిళ-2), ఎస్టీ (మహిళ-1)
- హార్టికల్చర్-17 పోస్టులు.. ఓసీ (జనరల్-5, మహిళ-4, పీహెచ్‌సీ-1), బీసీ ఏ-1, బీసీ బీ-2, బీసీ డీ-1, ఎస్సీ-1, ఎస్టీ-2
- ప్లాంట్ పాథాలజీ-12 పోస్టులు.. ఓసీ (జనరల్-5, మహిళ-1), బీసీ ఏ-1 (మహిళ), బీసీ బీ-1 (మహిళ), బీసీ డీ-1, బీసీ ఈ-1, ఎస్సీ (జనరల్-2, మహిళ-1)
- ప్లాంట్ మాలిక్యులార్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ- 1 (బీసీ-ఏ మహిళ)
- సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ-1 (ఓసీ మహిళ)
- సాయిల్ సైన్స్ & అగ్రికల్చర్ కెమిస్ట్రీ-18 పోస్టులు.. ఓసీ (జనరల్-5, మహిళ-3, పీహెచ్-1), బీసీ ఏ-1, బీసీ బీ-1, బీసీ డీ (జనరల్-1, మహిళ-1), బీసీ ఈ-1, ఎస్సీ (జనరల్-2, మహిళ-1), ఎస్టీ-1 (మహిళ)
- స్టాటిస్టిక్స్ అండ్ మ్యాథమెటిక్స్-7 పోస్టులు.. ఓసీ (జనరల్-2, మహిళ-1), బీసీ ఏ-1, బీసీ బీ-1, ఎస్సీ-1, ఎస్టీ-1
- లైబ్రరీ సైన్స్- 5 పోస్టులు.. ఓసీ (జనరల్-2, మహిళ-1), బీసీ ఏ-1 (మహిళ), ఎస్సీ-1 (మహిళ)
- ఫుడ్ అండ్ న్యూట్రిషన్-9 పోస్టులు.. ఓసీ (జనరల్-3, పీహెచ్-1), బీసీ ఏ-1 (మహిళ), బీసీ బీ-1 (మహిళ), ఎస్సీ (జనరల్-1, మహిళ-1), ఎస్టీ-1 (మహిళ)
- హ్యూమన్ డెవలప్‌మెంట్ అండ్ ఫ్యామిలీ స్టడీస్-3 పోస్టులు.. ఓసీ (జనరల్-2, మహిళ-1)
- హోం సైన్స్ ఎక్స్‌టెన్షన్ అండ్ కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్-1 (బీసీ-సీ)
- రిసోర్స్ మేనేజ్‌మెంట్ అండ్ కన్జ్యూమర్ సైన్స్-2 పోస్టులు.. ఓసీ-1, ఎస్సీ-1
- అర్హతలు: గుర్తింపు పొందిన అగ్రిలకల్చర్ యూనివర్సిటీ నుంచి నాలుగేండ్ల బ్యాచిలర్ డిగ్రీ (అగ్రికల్చర్, హార్టికల్చర్, సీఏబీఎం)తోపాటు మాస్టర్ డిగ్రీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. పీహెచ్‌డీ లేదా సంబంధిత సబ్జెక్ట్‌లో యూజీసీ నెట్ అర్హత సాధించాలి. ప్రాంతీయ/తెలుగు భాషలో పరిజ్ఞానం ఉండాలి.
- లైబ్రరీ సైన్స్: లైబ్రరీ సైన్స్/ఇన్ఫర్మేషన్ సైన్స్, డాక్యుమెంటేషన్ సైన్స్‌లో మాస్టర్ డిగ్రీ 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత. పీహెచ్‌డీ లేదా సంబంధిత సబ్జెక్ట్‌లో యూజీసీ నెట్ అర్హత సాధించాలి. ప్రాంతీయ/తెలుగు భాషలో పరిజ్ఞానం ఉండాలి.
- ఫ్యాకల్టీ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ & టెక్నాలజీ
- అర్హతలు: నాలుగేండ్ల బ్యాచిలర్ డిగ్రీ (ఫుడ్ సైన్స్, ఫుడ్ టెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, అగ్రికల్చర్ ఇంజినీరింగ్‌లో ఉత్తీర్ణత. సంబంధిత మాస్టర్ డిగ్రీ, ఎంఏబీఎం/ఎంబీఏ (ఏబీఎం)లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత. పీహెచ్‌డీ లేదా సంబంధిత సబ్జెక్ట్‌లో యూజీసీ నెట్‌లో అర్హత సాధించాలి. తెలుగు భాషలో పరిజ్ఞానం ఉండాలి.

గమనిక: 2009 జూలై 11 నాటికి పీహెచ్‌డీలో రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థులకు యూజీసీ నెట్ క్వాలిఫికేషన్‌లో మినయింపు ఉంటుంది.

- పే స్కేల్: రూ. 15,600-39,100 + అకడమిక్ గ్రేడ్ పే రూ. 6,000/-
- అప్లికేషన్ ఫీజు: రూ. 1500/-, ఎస్సీ, ఎస్టీలకు రూ. 750/-
- ఎంపిక: పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా. ఆన్‌లైన్‌లో పంపిన దరఖాస్తులను ప్రింట్‌తీసి, సంబంధిత పర్సనల్ అధికారికి పంపాలి.

చిరునామా : Registrar,
Professor Jayashankar Telangana State Agricultural University.,
Rajendranagar,
Hyderabad - 500 030

- చివరితేదీ: సెప్టెంబర్ 20
- ఆన్‌లైన్ హార్డ్‌కాపీలకు చివరితేదీ: సెప్టెంబర్ 29
- వెబ్‌సైట్: www.pjtsau.ac.in

ఎన్ఐఏబీలో సైంటిస్టులు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ (ఎన్ఐఏబీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న సైంటిస్టు పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

ఎన్ఐఏబీ అనేది స్వతంత్ర సంస్థ. ఇది కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేస్తున్నది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 11
- సైంటిస్ట్- 6 పోస్టులు
- అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ ఉండాలి. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- టెక్నికల్ ఆఫీసర్- 4 పోస్టులు
- అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఎస్సీ, బీవీఎస్సీ, బీఫార్మసీ, బీఈలో ఉత్తీర్ణత. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- సీనియర్ మేనేజర్ (అడ్మిన్ అండ్ ఫైనాన్స్)- 1
- అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మాస్టర్ డిగ్రీ, ఎంబీఏలో ఉత్తీర్ణత.
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా. ఆన్‌లైన్‌లో పంపిన దరఖాస్తులను ప్రింట్ తీసి, సంబంధిత పర్సనల్ అధికారికి పంపించాలి.
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేదీ: సెప్టెంబర్ 18
- ఆన్‌లైన్ హార్డ్‌కాపీకి చివరితేదీ: సెప్టెంబర్ 23
- వెబ్‌సైట్: www.niab.org.in

నేషనల్ ఫెర్టిలైజర్స్‌లో ట్రయినీలు

నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఎన్ఎఫ్ఎల్) ఖాళీగా ఉన్న మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.


వివరాలు:

నేషనల్ ఫెర్టిలైజర్ లిమిటెడ్ అనేది కేటగిరీ-1 హోదా కలిగిన ప్రభుత్వరంగ మినీరత్న కంపెనీ. ఇది రసాయనిక ఎరువులు, సేంద్రీయ ఎరువులు, పారిశ్రామిక రసాయనాలను ఉత్పత్తి చేసే ప్రధాన భారతీయ కంపెనీ. దీన్ని 1974 ఆగస్టు 23న ఏర్పాటుచేశారు..

- పోస్టు పేరు: మేనేజ్‌మెంట్ ట్రెయినీ
- మొత్తం పోస్టుల సంఖ్య: 36
- విభాగాలవారీగా ఖాళీలు: హెచ్‌ఆర్- 12, మార్కెటింగ్- 24
- అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎంబీఏ/పీజీ డిగ్రీ, పీజీ డిప్లొమా/బీఏస్సీతోపాటు ఎమ్మెస్సీ, బీఎస్సీ+ పీజీడీబీఎంలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. సంబంధిత రంగంలో ఏడాది అనుభవం ఉండాలి.
- వయస్సు: 2017 ఆగస్టు 31 నాటికి 29 ఏండ్లకు మించరాదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీ అభ్యర్థులు పదేండ్లవరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- పే స్కేల్: రూ. 16,400-40,500/-
- దరఖాస్తు ఫీజు: రూ. 735/-, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, ఎక్స్‌సర్వీస్‌మెన్, డిపార్ట్‌మెంటల్ అభ్యర్థులకు ఎలాంటి ఫీజు లేదు.
- ఎంపిక: ఆన్‌లైన్ రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తులకు చివరితేదీ: సెప్టెంబర్ 6
- వెబ్‌సైట్: www.nationalfertilizers.com

గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు

తమిళ నాడులోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

ప్రొపల్షన్ కాంప్లెక్స్ అనేది ఇస్రో పరిధిలో పనిచేస్తున్నది. ఈ సంస్థలో ఇస్రోకు సంబంధించిన ప్రొఫెషనల్ సిస్టమ్ సెంటర్లలో టెస్టింగ్, చోధక వ్యవస్థలను సమగ్రపరచడం, అసెంబ్లింగ్ చేయడం, ప్రొపల్లెంట్ స్టోరేజ్ చేస్తారు.

- పోస్టు పేరు: గ్రాడ్యుయేట్ అప్రెంటిస్
- మొత్తం పోస్టుల సంఖ్య: 41
- విభాగాలవారీగా ఖాళీలు: మెకానికల్-10, ఎలక్ట్రికల్- 5, ఎలక్ట్రానిక్స్- 10, ఇన్‌స్ట్రుమెంటేషన్- 2, కెమికల్- 2, కంప్యూటర్‌సైన్స్- 5, సివిల్- 4, లైబ్రరీ సైన్స్- 3
- అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్‌లో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత. లైబ్రరీ సైన్స్ పోస్టులకు డిగ్రీ (లైబ్రరీ సైన్స్, ఇన్ఫర్మేషన్ సైన్స్)లో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత.
- ఎంపిక విధానం: అకడమిక్ ప్రతిభ, బయోడేటా ఆధారంగా స్క్రీనింగ్ చేస్తారు. ఆ తర్వాత అర్హతగల అభ్యర్థులకు రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ, స్కిల్‌టెస్ట్‌లు నిర్వహిస్తారు.
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- చివరి తేదీ: ఆగస్టు 31
- వెబ్‌సైట్: www. iprc.gov.in

డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్‌లో 39 ఖాళీలు

ఏపీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్ ఖాళీగా ఉన్న మల్టీ టాస్కింగ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఇండియా పోస్టును 1854 ఏప్రిల్ 1 ఏర్పాటు చేశారు.

- పోస్టు పేరు: మల్టీ టాస్కింగ్ స్టాఫ్
- మొత్తం పోస్టుల సంఖ్య- 39 (జనరల్- 21, ఓబీసీ- 10, ఎస్సీ- 6, ఎస్టీ- 2)
- అర్హతలు: గుర్తింపు పొందిన బోర్డ్/సంస్థ నుంచి మెట్రిక్యులేషన్/ఐటీఐలో ఉత్తీర్ణత.
- వయస్సు: 2017 సెప్టెంబర్ 18 నాటికి 21 నుంచి 25 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేండ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేండ్లు, పీహెచ్‌సీ అభ్యర్థులకు పదేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- పే స్కేల్: రూ. 5,200-20,200+ గ్రేడ్ పే రూ.1800/-
- ఎంపిక: రాతపరీక్ష ద్వారా
- పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది.
- ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం 100 ప్రశ్నలకు 100 మార్కులు.
- నెగెటివ్ మార్కింగ్ లేదు.
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తులకు చివరితేదీ: సెప్టెంబర్ 18
- వెబ్‌సైట్: www.appost.in

గెయిల్‌లో 151 పోస్టులు

- మహారత్న కంపెనీలో కొలువులు
- పీజీ, డిగ్రీ, డిప్లొమా అభ్యర్థులకు అవకాశం
- రాతపరీక్ష/స్కిల్‌టెస్ట్ ద్వారా ఎంపిక



భారత ప్రభుత్వ రంగ సంస్థ గెయిల్ (ఇండియా) లిమిటెడ్ పలు విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

వివరాలు:

గెయిల్ ఒక మహారత్న పీఎస్‌యూ. సహజవాయువు ఉత్పత్తి, ప్రాసెసింగ్, సరఫరా, మార్కెటింగ్ తదితర సర్వీసులను అందిస్తున్నది.

- ఫోర్‌మ్యాన్-ఎలక్ట్రికల్ (ఎస్-5 గ్రేడ్)
- ఖాళీల సంఖ్య- 40 (జనరల్- 18, ఎస్సీ- 6, ఎస్టీ- 9, ఓబీసీ- 7)
- అర్హతలు: కనీసం 60 శాతం మార్కులతో ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో ఇంజినీరింగ్ డిప్లొమాతోపాటు రెండేండ్ల అనుభవం ఉండాలి.
- వయస్సు: 30 ఏండ్లు మించరాదు.
- పేస్కేల్: రూ. 14,500 - 36,000/-
- ఫోర్‌మ్యాన్-ఇన్‌స్ట్రుమెంటేషన్ (ఎస్-5 గ్రేడ్)
- ఖాళీల సంఖ్య - 35 (జనరల్- 19, ఎస్సీ- 5, ఎస్టీ- 10, ఓబీసీ- 1)
- అర్హతలు: కనీసం 60 శాతం మార్కులతో ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఐసీ లేదా ఎలక్ట్రానిక్స్ లేదా ఈఈఈలో ఇంజినీరింగ్ డిప్లొమా తోపాటు కనీసం రెండేండ్ల అనుభవం ఉండాలి.
- జూనియర్ కెమిస్ట్ (ఎస్-5 గ్రేడ్)
- ఖాళీల సంఖ్య - 12. (జనరల్ - 5, ఎస్సీ - 4, ఓబీసీ - 3 ఖాళీలు ఉన్నాయి.
- అర్హతలు: కనీసం 55 శాతం మార్కులతో కెమిస్ట్రీలో ఫుల్‌టైం పీజీ ఉత్తీర్ణులు. కనీసం రెండేండ్ల అనుభవం ఉండాలి.
- జూనియర్ సూపరింటెండెంట్- అఫీషియల్ లాంగ్వేజ్ (ఎస్-5 గ్రేడ్)
- ఖాళీల సంఖ్య-5 (జనరల్-2, ఎస్సీ-2, ఎస్టీ-1)
- అర్హతలు: కనీసం 55 శాతం మార్కులతో ఫుల్‌టైం డిగ్రీ ఉండాలి. డిగ్రీలో హిందీ లిటరేచర్ ప్రధాన సబ్జెక్టుగా కలిగి ఉండాలి. హిందీ నుంచి ఇంగ్లిష్, ఇంగ్లిష్ నుంచి హిందీలోకి అనువాదం చేయగల సామర్థ్యం ఉండాలి. కనీసం మూడేండ్ల అనుభవం అవసరం.
- వయస్సు: 30 ఏండ్లు మించరాదు.
- పేస్కేల్: రూ. 14,500 - 36,000/-
- అసిస్టెంట్-స్టోర్స్ అండ్ పర్చేస్ (ఎస్-3 గ్రేడ్)
- ఖాళీల సంఖ్య-15 (జనరల్-10, ఎస్టీ-2, ఓబీసీ-3)
- అర్హతలు: కనీసం 55 శాతం మార్కులతో ఫుల్‌టైం డిగ్రీ ఉత్తీర్ణత. కనీసం ఏడాది అనుభవం ఉండాలి.
- అకౌంట్స్ అసిస్టెంట్స్ (ఎస్-3 గ్రేడ్)
- ఖాళీల సంఖ్య- 24 (జనరల్-15, ఎస్సీ-2, ఎస్టీ-2, ఓబీసీ-5)
- అర్హతలు: కనీసం 55 శాతం మార్కులతో బీకాం ఉత్తీర్ణత. కంప్యూటర్ అప్లికేషన్స్‌లో బేసిక్ నాలెడ్జ్ ఉండాలి. దీంతోపాటు కనీసం ఏడాది అనుభవం తప్పనిసరి.
- మార్కెటింగ్ అసిస్టెంట్ (ఎస్-3 గ్రేడ్)
- ఖాళీల సంఖ్య-20 (జనరల్-14, ఎస్సీ-2, ఎస్టీ-1, ఓబీసీ-3)
- అర్హతలు: కనీసం 55 శాతం మార్కులతో బీబీఏ/బీబీఎస్ లేదా బీబీఎం లేదా బీఎంఎస్ డిగ్రీ ఉత్తీర్ణత. కనీసం ఏడాది అనుభవం తప్పనిసరి. దీంతోపాటు కంప్యూటర్ నాలెడ్జ్ ఉండాలి.
- వయస్సు: 28 ఏండ్లు మించరాదు.
- పేస్కేల్: రూ. 12,500- 33,000/-

నోట్: ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీ అభ్యర్థులకు పదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఇస్తారు.

- ఎంపిక విధానం: ఫోర్‌మ్యాన్, జూనియర్ కెమిస్ట్ పోస్టులకు రాతపరీక్ష / ట్రేడ్ టెస్ట్ సంబంధిత విభాగంలో ఉంటుంది. మిగిలిన పోస్టులకు రాత పరీక్ష/ స్కిల్ టెస్ట్ (కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్) నిర్వహిస్తారు.
- అప్లికేషన్ ఫీజు: రూ. 50/-
- ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీలకు ఎలాంటి ఫీజు లేదు.
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: సెప్టెంబర్ 15
- వెబ్‌సైట్: http://www.gailonline.com

ఇర్కాన్‌లో మేనేజర్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లో మేనేజర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.



వివరాలు:

ఇర్కాన్ భారత ప్రభుత్వరంగ సంస్థ. ఇది రైల్వే మంత్రిత్వశాఖ పరిధిలో పనిచేస్తుంది.

- మొత్తం ఖాళీల సంఖ్య- 4
- డిప్యూటీ జనరల్ మేనేజర్ (లీగల్)- 1
- అర్హతలు: కనీసం 55 శాతం మార్కులతో ఫుల్‌టైం ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణత. కనీసం ఏడాది అనుభవం ఉండాలి. లేదా 55 శాతం మార్కులతో ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణత. అనుభవం తప్పనిసరి.
- పేస్కేల్: రూ. 32,900 - 58,000/-
- డిప్యూటీ మేనేజర్ (లీగల్)- 3
- పేస్కేల్: రూ. 24,900 - 50,500/-
- అర్హతలు: కనీసం 55 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ, అనుభవం ఉండాలి.
- దరఖాస్తు: వెబ్‌సైట్‌లో
- చివరితేదీ: ఆగస్టు 28
- వెబ్‌సైట్: www.ircon.org


'హలో' చిత్రంలో అఖిల్

'హలో' అంటున్న అఖిల్

అఖిల్ కథానాయకుడిగా విక్రమ్.కె. కుమార్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతున్నది. అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నాగార్జున నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'హలో' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. కొన్ని రోజులుగా ఈ టైటిల్ పట్ల చిత్ర వర్గాలతో పాటు అక్కినేని అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. గిటీవల తాను నటించిన 'నిర్ణయం' సినిమాలోని 'హలో గురూ ప్రేమకోసమేరోయ్ జీవితం' అనే గీతాన్ని ట్విట్టర్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు నాగార్జున. ఆ పాట పల్లవిలోనే సినిమా టైటిల్ దాగి ఉందని చెప్పారు. దీనిపై మరిన్ని వివరాల్ని నాగచైతన్య, సమంత వెల్లడిస్తారంటూ ప్రకటించారు. ఆ తర్వాత రోజు 'ఏ మాయ చేసావే'లోని 'హోసన్నా' అనే పాటను ట్విట్టర్ ద్వారా షేర్ చేసిన నాగచైతన్య కూడా ఈ పాటలోనే టైటిల్ ఉందని, చాలా బాగుందని వెల్లడించారు. దాంతో రెండు పాటల్లో 'హలో' అనే పదం కామన్‌గా ఉండటంతో అదే ఈసినిమా టైటిల్ అంటూ ప్రచారం జరిగింది. ఆ అంచనాలకు అనుగుణంగానే 'హలో' అనే పదాన్నే టైటిల్‌గా నిర్ణయించారు నిర్మాత నాగార్జున. టైటిల్‌తో పాటు ఫస్ట్‌లుక్‌ను సోమవారం ట్విట్టర్ ద్వారా ఆయన విడుదల చేశారు. ఎన్టీఆర్, ప్రభాస్, రానా, రాజమౌళితో పాటు పలువురు సినీ ప్రముఖులు చిత్రబృందానికి శుభాకాంక్షలు అందజేసిన వీడియోను పంచుకున్నారు. ఇందులో 'అర్ యూ రెడీ నాన్న మీరే చెప్పండి' అనే మాటను నాగార్జున చెప్పగానే దివంగత నటుడు నాగేశ్వరరావు హలో హలో అంటూ వీడియోలో కనిపించి చెప్పిన మాటలు అభిమానుల్ని అలరిస్తున్నాయి. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 22న ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అనూప్ రూబెన్స్ స్వరాలను సమకూర్చిన ఈ చిత్రంలో అఖిల్ ఓ గీతాన్ని ఆలపించారు.

ప్రపంచానికి మీ సత్తా చాటండి!



శర్వానంద్, ప్రణయ్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, విజయ్‌దేవరకొండ, షాలిని

'ప్రతి నటుడికి తాను నటిస్తున్న సినిమా విజయం మీద నమ్మకం వుండాలి. మన సినిమా మీద మనకు విశ్వాసం లేకపోవడం సిగ్గుపడాల్సిన విషయం' అన్నారు విజయ్‌దేవరకొండ. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'అర్జున్ రెడ్డి'. షాలిని కథానాయిక. సందీప్‌రెడ్డి వంగా దర్శకుడు. ప్రణయ్‌రెడ్డి వంగా నిర్మాత. ఈ నెల 25న ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. విజయ్‌దేవరకొండ మాట్లాడుతూ 'ఈ సినిమా విజయం గురించి గతంలో నేను వెలిబుచ్చిన అభిప్రాయాల్ని కొందరు అతివిశ్వాసం అంటూ విమర్శిస్తున్నారు. ఈ సమాజంలో యువత తలెత్తుకొని తిరగాలని నేను కోరుకుంటాను. మీ నైపుణ్యాలేమిటో ప్రపంచానికి గర్వంగా తెలియజెప్పండి. మీరేమి చేయగలరో ప్రపంచానికి చాటిచెప్పండి. ఈ చిత్రంలోని సందేశమదే' అన్నారు. ప్రేక్షకుల మనసుల్ని వెంటాడే చిత్రమిదని, అందరికి గుర్తుండిపోతుందని దర్శకుడు చెప్పారు. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ 'ఈ రోజు పరిశ్రమకు సంబంధించిన కొన్ని విషయాల్ని మాట్లాడుదామనుకుంటున్నాను. ప్రస్తుతం థియేటర్లు కొంతమంది కబ్జాలో వున్నాయి. అలా ఎందుకు వున్నాయో ఎవరికి తెలియదు. జీఎస్టీ వచ్చాక సినిమాలపై అదనపు భారం పడుతున్నది. ఒక్క టిక్కెట్టుపై నిర్మాతకు 4రూపాయలే మిగులుతున్నాయి. ఇలాంటి విషయాల్ని అందరూ చర్చించాలి. ఈ మధ్యన సోషల్‌మీడియాలో నెటిజన్లు, కొందరు రాజకీయ నాయకులు సినిమా వాళ్లని పిచ్చోళ్లుగా చూస్తున్నారు. ప్రతి ఒక్కరూ రాళ్లు విసురుతున్నారు. సినిమాలు ఇష్టం లేకపోతే చూడటం మానేయాలి. అనవసర విమర్శలు చేయొద్దు. పరిశ్రమ సమస్యల్ని పరిష్కరించుకోవడానికి అందరూ ఏకం కావాలి' అన్నారు. ఈ కార్యక్రమంలో తరుణ్‌భాస్కర్, నందినిరెడ్డి, క్రాంతిమాధవ్, స్వప్నదత్ తదితరులు పాల్గొన్నారు.

నరసింహారెడ్డి పాత్ర నాకు దక్కిన గొప్ప అవకాశం!

- 'సైరా నరసింహారెడ్డి' మోషన్ పోస్టర్ విడుదల
- కీలక అతిథి పాత్రలో అమితాబ్ బచ్చన్

బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి. ఆయన జీవిత కథ ఆధారంగా సీనియర్ కథానాయకుడు చిరంజీవి హీరోగా రూపొందనున్న చిత్రానికి 'సైరా నరసింహారెడ్డి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. బాలీవుడ్ దిగ్గజ నటుడు అమితాబ్‌బచ్చన్ కీలక అతిథి పాత్రలో నటించనున్న ఈ చిత్రానికి సురేందర్‌రెడ్డి దర్శకుడు. నయనతార కథానాయక. ఈ చిత్రాన్ని కొణిదెల ప్రొడక్షన్స్ పతాకంపై చిరంజీవి తనయుడు రామ్‌చరణ్ నిర్మిస్తున్నారు. మంగళవారం చిరంజీవి పుట్టినరోజును పురస్కరించుకుని హైదరాబాద్‌లో ఈ చిత్రానికి సంబంధించిన మోషన్ పోస్టర్‌ను దర్శకుడు రాజమౌళి విడుదల చేశారు. చిత్ర టైటిల్ లోగోను నిర్మాత అల్లు అరవింద్ విడుదల చేయగా, ∟టీ∟టులు, సాంకేతిక నిపుణులకు సంబంధించిన ఏవీని పరుచూరి బ్రదర్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ 'మోషన్ పోస్టర్‌లో చిరంజీవి గెటప్ అద్భుతంగా వుంది. 'బాహుబలి' సక్సెస్ కావడానికి ప్రధాన కారణం సాంకేతిక నిపుణులే. మళ్లీ ఆ స్థాయి టెక్నీషియన్స్ ఈ సినిమాకు కుదిరారు. ఏ.ఆర్.రెహమాన్, రాజీవన్, రవివర్మన్, పరుచూరి బ్రదర్స్ వంటి హేమాహేమీలు 'సైరా నరసింహారెడ్డి' చిత్రానికి వెన్నుదన్నుగా వున్నారు. పరుచూరి బ్రదర్స్ కలం బలం ఈ చిత్రానికి వుంది. టెక్నీషియన్స్ మీద మంచి పట్టున్న దర్శకుడు సురేందర్‌రెడ్డి. ∟టీ∟టవర్గాన్ని చూస్తే ఓ రేంజ్‌లో కనిపిస్తున్నది. ఇది చిరంజీవిగారి 151వ సినిమా కాదు. 150 సినిమాలు ప్రయాణాన్ని పూర్తిచేసి ఈ చిత్రాన్ని తొలి సినిమాగా మొదలుపెడుతున్నారు. మోషన్ పోస్టర్ నా చేతులమీదుగా రిలీజ్ చేయడం గర్వంగా వుంది' అన్నారు. వీడియో సందేశం ద్వారా చిరంజీవి మాట్లాడుతూ 'స్వాతంత్ర్య సమరయోధుడిగా నటించాలని చాలా కాలంగా ఎదురు చూస్తున్నాను. అందులో భగత్‌సింగ్ పాత్రలో నటించాలని చాలా సార్లు అనుకున్నాను. ఎందుకో కుదరలేదు. ఇన్నాళ్లకు ఉయ్యాలవాడ... రూపంలో నా ఆశకు, అభిమానుల ఆకాంక్షలకు తగ్గ సినిమా కుదిరింది. స్వాతంత్ర్య సమరయోధులకు ఆరాధ్యులైన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పాత్ర దొరకడం నాకు దక్కిన గొప్ప అవకాశంగా భావిస్తున్నాను. అదే సమయంలో ఈ పాత్ర నాకు పెద్ద ఛాలెంజ్‌గా కూడా భావిస్తున్నాను. అత్యుత్తమ సాంకేతిక విలువలతో సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో రూపుదిద్దుకోనున్నది. ప్రపంచ వ్యాప్తంగా తెలుగువాడు గర్వించేలా ఓ చరిత్ర సృష్టించిన దర్శకుడి ఆశీస్సులు అందుకోవడం నిర్మాతగా రామ్‌చరణ్‌కు, ఈ చిత్రానికి మంచి శుభసూచకం' అని తెలిపారు. దర్శకుడు సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ 'నరసింహారెడ్డి పేరు వింటేనే నాకు వణుకు పుడుతున్నది. నామీద చాలా పెద్ద బాధ్యతను పెట్టారు. నా ఫోకస్ అంతా 'సైరా నరసింహారెడ్డి' సినిమా రిలీజ్, అది బ్లాక్ బస్టర్ కావాలి అనేదే నాకు కనిపిస్తున్నది' అన్నారు. రామ్‌చరణ్ మాట్లాడుతూ చాలా ఆలోచించి ఈ చిత్రాన్ని నిర్మించాలనే నిర్ణయానికి రావడం జరిగింది. చాలా ఒత్తిడిగా వుంది. ఈ చిత్రాన్ని ఎలా తీయాలి? ఏవిధంగా తెరమీదకు తీసుకురావాలి? ఇవన్నీ ఆలోచిస్తున్నప్పుడు 'బాహుబలి' చిత్రాన్ని రాజమౌళి భారతీయ సినిమాల్లో బిగ్గెస్ట్ హిట్‌గా ఎలా మలిచాడా? అనిపించింది. ఆయన పడిన శ్రమ నాకు, దర్శకుడు సురేందర్‌రెడ్డికి ఇప్పుడిప్పుడే అర్థమవుతున్నది. చాలా కష్టతరమైన సినిమా ఇది. అయితే అందరూ చెప్పినట్టు ఆ ఆంజనేయ స్వామి ఆశీస్సులు వున్నాయి కాబట్టే మేము ప్రయత్నించకుండానే అన్నీ సమకూరుతున్నాయి' అన్నారు. జగపతిబాబు, సుదీప్, విజయ్‌సేతుపతి, నాజర్, రవికిషన్, ముఖేష్‌రుషి, రఘుబాబు, పరుచూరి వెంకటేశ్వరరావు, సుబ్బరాజు, జయప్రకాష్, రఘు తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఏ.ఆర్.రెహమాన్, ఛాయాగ్రహణం: రవివర్మన్, ప్రొడక్షన్ డిజైనర్: రాజీవన్, కథ: పరుచూరి బ్రదర్స్, మాటలు: సాయిమాధవ్ బుర్రా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: వాకాడ అప్పారావు, వి.వై.ప్రవీణ్‌కుమార్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: సురేందర్‌రెడ్డి.


సాయిధరమ్ తేజ్, అల్లు అరవింద్, సురేందర్‌రెడ్డి, రాజమౌళి, రామ్‌చరణ్

మేడమీద అబ్బాయి వినోదం!


నిఖిల విమల్, అల్లరి నరేష్

వెండితెరపై దర్శకుడిగా తన పేరును చూసుకోవాలని... రామ్ చరణ్, ప్రభాస్‌లను తన కథలతో ఒప్పించి మెగాఫోన్ పట్టాలని.. తద్వారా జీవితంలో స్థిరపడాలనేది ఆ యువకుడి కల. అయితే తన లక్ష్యం చేరుకోవడానికి అతను ఏం చేశాడు? అనేది ఆసక్తికరంగా వుంటుంది' అన్నారు దర్శకుడు ప్రజీత్. ఆయన దర్శకత్వంలో అల్లరి నరేష్ నటిస్తున్న తాజా చిత్రం 'మేడమీద అబ్బాయి'. జాహ్నవి ఫిల్మ్స్ పతాకంపై శ్రీమతి నీలిమ సమర్పణలో బొప్పన చంద్రశేఖర్ నిర్మిస్తున్నారు. నిఖిల విమల్ కథానాయిక. సెన్సార్ కార్యక్రమాల్ని పూర్తిచేసుకున్న ఈ చిత్రం సెప్టెంబరు 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'కొత్తదనంతో కూడిన కథతో చేస్తున్న విభిన్న చిత్రమిది. 'గమ్యం' 'శంభో శివ శంభో' తర్వాత ఆ తరహా సున్నితమైన కథతో నరేష్ చేస్తున్న చిత్రమిది. సహజమైన అంశాలతో థ్రిల్లింగ్ వుంటూనే నరేష్ శైలి వినోదం వుంటుంది. తప్పకుండా చిత్రం అన్ని వర్గాల ఆదరణ పొందుతుందనే నమ్మకం వుంది' అని తెలిపారు. అవసరాల శ్రీనివాస్, జయప్రకాష్, తులసి, సుధ, సత్యం రాజేష్, మధునందన్, జబర్దస్త్ ఆది, పద్మ జయంతి, రవిప్రకాష్, వెన్నెల రామారావు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఉన్ని ఎస్ కుమార్, సంగీతం: షాన్ రెహమాన్, ఆర్ట్: రాజీవ్ నాయర్, ఎడిటర్: నందమూరి హరి, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: ఎం.ఎస్.కుమార్, సమర్పణ: శ్రీమతి నీలిమ, నిర్మాత: బొప్పన చంద్రశేఖర్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: జి.ప్రజీత్.

ప్రేమ ఎంత మధురం...


చంద్రకాంత్

చంద్రకాంత్, రాధికా మెహరోత్రా జంటగా నటిస్తున్న చిత్రం 'ప్రేమ ఎంత మధురం ప్రియురాలు అంత కఠినం'. గోవర్ధన్.జి దర్శకుడు. రఘురాం రొయ్యూరు, గోవర్ధన్.జి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్వరలో ప్రేక్షకులు ముందుకు రానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో హీరో చంద్రకాంత్ మాట్లాడుతూ 'నాది హైదరాబాద్. ఇక్కడే పుట్టాను. ఇక్కడే పెరిగాను. ఇంజినీరింగ్ పూర్తిచేసిన తరువాత సినిమాలపై వున్న మక్కువతో అమెరికాలో నటనకు సంబంధించి ప్రత్యేక శిక్షణ తీసుకున్నాను. ఓ వినూత్నమైన కథతో రొమాంటిక్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమా ద్వారా కథానాయకుడిగా పరిచయం అవుతున్నందుకు ఆనందంగా వుంది. అత్యధిక భాగం అమెరికా నేపథ్యంలో చిత్రీకరించాం. దర్శకుడు గోవర్ధన్ ప్రాణం పెట్టి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. గిటీవల విడుదల చేసిన మోషన్ పోస్టర్‌కు మంచి స్పందన లభిస్తున్నది. నటుడిగా నాకు గుర్తింపును తెచ్చిపెడుతుందనే నమ్మకముంది' అన్నారు. తనికెళ్ల భరణి, తులసి, జెమిని సురేష్, పల్లవి దొర తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి పాటలు: కిట్టు విస్సాప్రగడ, ఎడిటింగ్: శ్రీనివాస్ తోట, నేపథ్య సంగీతం: సిద్ధార్థ్ సదాశివుని, సంగీతం: జతిన్ రోషన్, ఛాయాగ్రహణం: మనోజ్‌రెడ్డి, రచన, దర్శకత్వం: గోవర్ధన్.జి.

అప్పట్నుంచే ఫ్లాపులొస్తున్నాయి


రామ్‌గోపాల్ వర్మ

ఏ విషయాన్నైనా కుండబద్దలు కొట్టినట్లు నిర్మొహమాటంగా చెప్పడం రామ్‌గోపాల్‌వర్మ నైజం. సంచలన వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో ఎప్పుడు యాక్టివ్‌గా ఉంటారాయన. తాజాగా దర్శకుడిగా గత కొన్నేళ్లుగా తనకు పరాజయాలు ఎదురవ్వడానికి గల కారణాన్ని తనదైన శైలిలోనే ట్విట్టర్ ద్వారా వెల్లడించారు రామ్‌గోపాల్‌వర్మ. బౌండ్ స్క్రిప్ట్‌లతో సినిమాలు చేయడం మొదలు పెట్టినప్పట్నుంచే తనకు ఫ్లాపులొస్తున్నాయని ప్రకటించారు. వివరాల్లోకి వెళితే.. ప్రముఖ నిర్మాత విధూ వినోద్ చోప్రా భార్య అనుపమా చోప్రా తాను నిర్వహిస్తున్న ఓ వెబ్‌సైట్ కోసం రామ్‌గోపాల్‌వర్మ తెరకెక్కించిన సత్య, కంపెనీ సినిమాల స్క్రిప్టులు కావాలని అడిగింది. ఔత్సాహిక దర్శకులకు అవి ఉపయోగకరంగా ఉంటాయనే ఉద్దేశంతో అనుపమ ....వర్మ సహాయాన్ని కోరింది. ఆ అభ్యర్థనకు వర్మ స్పందించిన తీరు చూసి ఆశ్చర్యపోవడం అనుపమ వంతైంది 'అమ్మమీదా, నాకు నచ్చిన దర్శకుడు స్టివెన్ స్పిల్‌బర్గ్ మీద ప్రమాణం చేసి చెబుతున్నాను. బౌండ్ స్క్రిప్టలతో సినిమాల చేయడం మొదలుపెట్టిన తర్వాత నాకు పరాజయాలు వస్తున్నాయి' అని తెలిపారు. స్క్రిప్టులు రాయకుండానే సత్య, కంపెనీ సినిమాలు చేశానని ఆమెకు సమాధానమిచ్చారు.





జీహెచ్ఎంసీలోని అర్బన్ బయోడైవర్సిటీ విభాగం ఆధునికత దిశగా అడుగులు వేస్తున్నది. నగరంలో చెట్ల కొమ్మలను నరికే పనుల్లో ఆధునిక యంత్రాలను రంగంలోకి దింపుతున్నారు. సెంట్రల్ జోన్ పరిధిలో దాదాపు రూ. 18 లక్షలతో ఏర్పాటు చేసిన ప్రూనింగ్(నరకడం), ష్రెడ్డింగ్ (చిన్నచిన్న ముక్కలుగా చేయడం) మెషీన్లను మంగళవారం ఇందిరాపార్క్‌లో మేయర్ బొంతు రామ్మోహన్ ప్రారంభించారు. మేయర్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కే లక్ష్మణ్ స్వయంగా యంత్రాలను నడిపి పని తీరును పరిశీలించారు. ఈ ప్రూనింగ్ యంత్రంతో ఒకే వ్యక్తి మెషీన్‌ను నడుపుకుంటూ కొమ్మలను నరికే అవకాశం ఉంటుంది. కొమ్మలను చిన్న చిన్న ముక్కలుగా మార్చిన తర్వాత సేంద్రియ ఎరువుగా తయారు చేయవచ్చు.

– హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ

జైళ్లలో కలబంద సాగు!

నేడు చంచల్‌గూడలో ఖైదీలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జైళ్లలో ఖైదీలకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చిన అధికారులు, బుధవారం కలబంద సాగుపై శిక్షణ ఇప్పించనున్నారు. నగరంలోని చంచల్‌గూడ జైలులో ఖైదీలకు హిమాలయ డ్రగ్స్ కంపెనీకి చెందిన నిపుణులు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తారని జైలు అధికారులు తెలిపారు. ఆయుర్వేద మందుల తయారీలో కలబందను ప్రత్యేకంగా వినియోగిస్తుంటారు. కలబందతో తయారుచేసిన ఉత్పత్తులకు మంచి గిరాకీ ఉన్నది. దీంతో జైళ్లశాఖ స్థలాల్లో ఈ పంటను సాగుచేస్తూ.. ఖైదీలకు ఉపాధి కల్పించడంతోపాటు ఆదాయం వచ్చే అవకాశం ఉన్నదని అధికారులు చెప్తున్నారు. అన్ని జిల్లాల్లోని జైళ్లలో ఉన్న ఖాళీ స్థలంలో కలబంద సాగు చేయనున్నట్టు సీనియర్ అధికారులు తెలిపారు. దీంతో ఖైదీలు విడుదలైన తర్వాత కలబందను సాగుచేసుకొని ఉపాధి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

నేటి నుంచి జానపద జాతర

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నుంచి జానపద జాతరను నిర్వహించేందుకు రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ కార్యాచరణ రూపొందించింది. బుధవారం ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా జానపద జాతర–2017 కార్యక్రమాన్ని బుధవారం నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నారు. బుధవారం నిర్మల్, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో, 24న జనగామ, కరీంనగర్, మహబూబాబాద్, 25న జగిత్యాల, వరంగల్‌అర్బన్, మెదక్, యాదాద్రి భువనగిరి, 26న ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల, 27న సూర్యాపేట, వనపర్తి, పెద్దపల్లి, 28న మహబూబ్‌నగర్, కామారెడ్డి, సంగారెడ్డి, 29న సిద్దిపేట, కుమ్రంభీం ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో జానపద జాతరలను నిర్వహించనున్నారు. 31న హైదరాబాద్ రవీంద్రభారతిలో ముగింపు ఉత్సవాలు నిర్వహిస్తారు.

3 ఫోన్లు.. 3 లక్షలు..

3 కి.మీ. చేజింగ్

- స్మార్ట్‌ఫోన్ పేరుతో వైద్యుడిని బురిడీ కొట్టించిన నైజీరియన్
- ఢిల్లీ గల్లీల్లో వెంబడించి పట్టుకున్న సైబరాబాద్ పోలీసులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హై ఎండ్ ఫీచర్స్ ఉన్న స్మార్ట్‌ఫోన్లను అతి తక్కువ ధరకే ఇస్తామని ఓ ఈ–కామర్స్ వెబ్ సైట్‌లో పెట్టిన పోస్ట్‌ను నమ్మి ఓ డాక్టర్ బోల్తా పడ్డాడు. మూడు ఫోన్లకు ఆర్డర్ ఇచ్చి రూ.3లక్షలు పోగొట్టుకున్నాడు. ఢిల్లీలో దాక్కున్న ఈ 'స్మార్ట్' చీటర్లను సైబరాబాద్ పోలీసులు చేజ్ చేసి పట్టుకున్నారు. మాదాపూర్‌లో నివాసం ఉంటున్న ఓ వైద్యుడు ఇటీవల ఓ ఈ–కామర్స్ వెబ్‌సైట్‌ను పరిశీలించగా హైఎండ్ ఫీచర్స్ ఉన్న స్మార్ట్ ఫోన్లు కనిపించాయి. తక్కువ ధర ఉండడంతో మూడు ఫోన్లకు ఆర్డర్ బుక్ చేశారు. ఇవి విదేశాల నుంచి వస్తాయని, రిజిస్ట్రేషన్ ఫీ జులతో పాటు కొన్ని క్లియరెన్స్ సర్టిఫికెట్ల కోసం నగదు చెల్లించాలని వెబ్‌సైట్ నిర్వాహకులు కోరారు. దీంతో ఆ డాక్టర్ వారికి రూ.3 లక్షలు చెల్లించారు. ఎంతకీ ఫోన్లు డెలివరీ కాకపోవడంతో తాను మోసపోయానని గుర్తించి సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదుపై పోలీసులు స్పందించి దర్యాప్తు చేపట్టారు. ఫోన్ నంబర్లు, బ్యాంక్ ఖాతాల వివరాలు, ఐపీ అడ్రస్‌లను పరిశీలించి ఢిల్లీ నుంచి మోసం జరిగిందని గుర్తించారు. ఓ ప్రత్యేక బృందం ఢిల్లీకి వెళ్లి ఓ నైజీరియన్‌ను, అతడికి సహకరించిన మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

ఢిల్లీలో మూడు కిలోమీటర్ల చేజ్..

డాక్టర్‌ను బురిడీ కొట్టించిన మోసగాళ్లను పట్టుకునేందుకు సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు వారం రోజుల కిందట ఢిల్లీకి వెళ్లారు. బ్యాంక్ ఖాతాల ఆధారంగా ప్రధాన నిందితుడికి సహకరిస్తున్న అనుచరుడిని గుర్తించి.. అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడు ఇచ్చిన సమాచారం ఆధారంగా ప్రధాన సూత్రధారి ఓ నైజీరియన్‌గా గుర్తించారు. అతడిని పట్టుకునేందుకు ఢిల్లీలోని ఓ గల్లీలో మాటు వేశారు. అక్కడికి వచ్చిన ఆ నైజీరియన్ పోలీసులను గుర్తించి వారిని తోసేసి పరిగెత్తాడు. ఓ ఆటో ఎక్కి పారిపోయేందుకు ప్రయత్నించాడు. వెంటనే తేరుకున్న పోలీసులు రెండు బృందాలుగా విడిపోయి ఢిల్లీ రోడ్ల మీద దాదాపు 3 కిలోమీటర్లు చేజ్ చేశారు. ఒక బృందం ఆటోలో నైజీరియన్‌ను వెంబడించగా, మరో బృందం స్థానిక పోలీసుల సహకారంతో మరో మార్గంలో వెళ్లారు. దాదాపు అర గంట చేజింగ్ చేసి నైజీరియన్ మోసగాడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులోనే కాదు.. నైజీరియన్ మోసగాళ్ల కేసుల్లో దాదాపు అన్ని సందర్భాల్లోనూ తాము ఇలాంటి కష్టాలనే ఎదుర్కొంటున్నామని పోలీసులు తెలిపారు. నైజీరియన్ల హంగామా, ప్రతి దాడులను ఎదుర్కొంటూ వారిని అరెస్ట్ చేస్తున్నామని పోలీసులు చెప్తున్నారు.

'డబుల్' ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్

- దేశంలోనే మొదటిసారిగా నిరుపేదల కోసం ఉచిత టౌన్‌షిప్
- కొల్లూరులో నిర్మించేందుకు జీహెచ్ఎంసీ సన్నాహాలు
- స్కూల్ నుంచి శ్మశానం వరకు అన్ని సౌకర్యాలు
- ప్రభుత్వం ఆమోదిస్తే త్వరలో టెండర్ల ప్రక్రియ



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్.. అంటే ఒక ఊరినే కొత్తగా నిర్మించడం. ఇండ్లు, స్కూళ్లు, కాలేజీ, దవాఖాన, వాటర్ ట్యాంకులు, రోడ్లు, శ్మశానవాటిక ఇలా ఒక గ్రామంలో ఉండే అన్ని సౌకర్యాలు ఇక్కడే ఉంటాయి. మొత్తం అపార్ట్‌మెంట్లతో నగర వాతావరణం కనిపిస్తుంటుంది. నగర శివార్లలో, ఔటర్ చుట్టూ ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌లను అభివృద్ధిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన సంగతి తెలిసిందే. ఇలాంటి ఓ టౌన్‌షిప్‌ను నిరుపేదల కోసం నిర్మించాలని నిర్ణయించింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకంలో భాగంగా పూర్తిస్థాయి సౌకర్యాలతో ఉచితంగా ఓ ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించింది. సంపన్నులకే పరిమితమైన ఇలాంటి టౌన్‌షిప్‌ను నిరుపేదల కోసం ఉచితంగా నిర్మించి ఇవ్వడం బహుశా దేశంలోనే మొట్టమొదటిసారి అని అధికారులు చెప్తున్నారు. ఇంతవరకు ఏ రాష్ట్రంలోనూ ఇలా ఉచితంగా టౌన్‌షిప్ నిర్మించిన దాఖలాలు లేవంటున్నారు.

కొల్లూరులో 95 ఎకరాల్లో..

నగరంలోని పేదలకోసం లక్ష 'డబుల్' ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పటికే 20వేల ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభం కాగా, 60వేలకు పైగా ఇండ్లకు టెండర్లు ఖరారయ్యాయి. ఈ నెలాఖరుకు మిగిలిన ఇండ్ల టెండర్లు ఖరారు చేసి వచ్చే ఏడాది ఆగస్టు చివరికల్లా నిర్మాణాలు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కొన్నిచోట్ల ప్రస్తుతమున్న బస్తీల స్థానంలో డబుల్ ఇండ్లు నిర్మిస్తుండగా, మరికొన్నిచోట్ల ఖాళీ స్థలాల్లో కాలనీలు నిర్మిస్తున్నారు. ఇప్పుడు ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌పై దృష్టి సారించారు. రామచంద్రాపురం మండలం కొల్లూరు గ్రామ పరిధిలో 95 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి కేటాయించారు. నగర శివారులో ఒకేచోట ఇంత స్థలం లభించంతో ఇది ఓ మోడల్‌గా నిలిచేలా ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌గా అభివృద్ధి చేయాలని పురపాలక, ఐటీశాఖల మంత్రి కే తారకరామారావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు వారు నమూనాలను సిద్ధం చేశారు. ఈ టౌన్‌షిప్ నమూనాకు మంత్రి ఆమోదం లభిస్తే టెండర్లు పిలిచి ఇండ్ల నిర్మాణం చేపట్టాలని, ఇతర సౌకర్యాలను కల్పించాలని నిర్ణయించారు.

ప్రతిపాదిత సౌకర్యాలు ఇవే..


ఈ టౌన్‌షిప్‌లో 15 వేల ఇండ్లు నిర్మించనున్నారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కాలేజీ, దవాఖాన, మార్కెట్, పిల్లలకోసం ఆట మైదానం, ఇండోర్ స్టేడియం, పార్క్, షాపింగ్ మాల్ తదితర సౌకర్యాలతోపాటు శ్మశానాన్ని కూడా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇక్కడి నుంచి వెలువడే వ్యర్థాలను తడి, పొడి చెత్తగా విడదీసి శాస్త్రీయ పద్ధతుల్లో నిర్మూలించేందుకు కూడా తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. 15 వేల ఇండ్లలో 60 నుంచి 70 వేల జనాభా నివసించే అవకాశం ఉండడంతో ఇది మున్సిపాలిటీతో సమానంగా ఉంటుందని అధికారులు చెప్తున్నారు. అందుకే కాలనీలోనే అన్ని రకాల సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారని, దీనికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించామని పేర్కొన్నారు. ఇండ్లను ప్రభుత్వం ఉచితంగా నిర్మించి ఇస్తుండగా, ఇతర సౌకర్యాలను బీవోటీ పద్ధతిలో ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించనున్నారు.



హైదరాబాద్ నారాయణగూడ వైఎంసీఏలోని రాజ బహద్దూర్ వేంకటరామారెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న సొసైటీ సభ్యులు

రాజ బహద్దూర్ నేటితరానికి ఆదర్శం

హిమాయత్‌నగర్: దివంగత రాజ బహద్దూర్ వేంకటరామారెడ్డి సమాజానికి అందించిన సేవలు నేటి తరానికి ఆదర్శమని రాజ బహద్దూర్ వేంకటరామారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఏ రఘుపతిరెడ్డి, కార్యదర్శి కే వెంకట్‌రెడ్డి కొనియాడారు. రాజ బహద్దూర్ 149వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం హైదరాబాద్ నారాయణగూడ వైఎంసీఏలోని ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రఘుపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో విద్యావకాశాలు లేని సమయంలో రాజ బహద్దూర్ విద్యాసంస్థలు, వసతి గృహాలను స్థాపించి ఎంతో మందికి విద్యనందించారని గుర్తుచేశారు. నగర కొత్వాల్‌గా 14 ఏండ్లు సుదీర్ఘంగా పనిచేసి, నిజాం ప్రభుత్వం, ప్రజల మన్ననలు పొందిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఇంద్రాసేనారెడ్డి, సొసైటీ ప్రతినిధులు జనార్దన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఖరగ్‌పూర్ ఐఐటీలో అవార్డు అందుకుంటున్న ఐఐసీటీ సైంటిస్ట్ శ్రీధర్

హైదరాబాద్ ఐఐసీటీ సైంటిస్ట్ శ్రీధర్‌కు

నైనా సక్సేనా ఎక్స్‌లెన్స్ అవార్డు

అవార్డు అందచేసిన ఐఐటీ ఖరగ్‌పూర్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: సీఎస్ఐఆర్–ఐఐసీటీ హైదరాబాద్ ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ శ్రీధర్ ప్రతిష్ఠాత్మక నైనా సక్సేనా ఎక్స్‌లెన్స్ అవార్డును ఈటీవల అందుకున్నారు. 'టెక్నాలజీస్ ఫర్ ప్రమోటింగ్ ఇండస్ట్రియల్ ప్రోగ్రెస్ అండ్ సొసైటికల్ వెల్ఫేర్' అంశంపై శ్రీధర్ బృందం చేసిన కృషికి 2017 సంవత్సరానికి గాను అవార్డుకు ఎంపిక చేశారు. ఖరగ్‌పూర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఈ అవార్డును అందజేసింది. శ్రీధర్‌తోపాటు ఆయన బృంద సభ్యులైన శాస్త్రవేత్తలు పావని, సిద్ధార్థ మౌలిక్, డాక్టర్ వైవీఎస్ రవికుమార్, బీ గోవర్ధన్, ఎస్ఎస్ చంద్రశేఖర్ కలిసి అవార్డు అందుకున్నారు. వీరందరూకలిసి ఎలక్ట్రోడయాలసిస్, నానోఫిల్టరేషన్ అండ్ గ్యాస్‌ప్రీమియేషన్ చేసి కలుషిత నీటిని శుద్ధిచేసే ప్రక్రియపై పనిచేసినందుకు ఈ గుర్తింపు లభించింది. వీరు గంటకు 600 నుంచి 4 వేల లీటర్ల నీటిని డీఫ్లోరిడేషన్ చేసేలా 14 ఆర్వో మోడల్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. పరిశ్రమల్లోని వర్థ నీటిని ప్రయోజనకరంగా మార్చడం, ఫ్లోరోసిస్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల ప్రజలకు శుద్ధజలాలను అందించడం వంటి కార్యక్రమాలను తెలంగాణలోని అనేక గ్రామాలు, పట్టణాలతోపాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ప్రజలు ఫ్లోరోసిస్, గ్యాస్ట్రో, కామెర్లు, టైఫాయిడ్ వంటి వ్యాధుల బారిన పడకుండా చేస్తున్న కృషికి గుర్తింపుగా అవార్డు వరించినట్టు సీఎస్ఐఆర్–ఐఐసీటీ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది.

సమన్వయం తారక మంత్రం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

- ప్రభుత్వం అనుమతించినా సమగ్ర వివరాలివ్వని శాఖలు
- శాఖల అధికారులతో భేటీకి టీఎస్‌పీఎస్సీ షెడ్యూల్
- 27 నుంచి వచ్చేనెల 2 వరకు శాఖల అధికారులతో భేటీ
- ఆ తర్వాతే వరుసగా ఉద్యోగ నియామక నోటిఫికేషన్లు

ఉద్యోగ నియామకాలకు ప్రభుత్వం పరిపాలనా అనుమతి ఇచ్చినా తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)కి ఆయా శాఖల నుంచి స్పష్టమైన వివరాలు రాకపోవడంతో వాటి భర్తీకి ప్రకటనలు వెలువడలేదు. ఈ నేపథ్యంలో సదరు కొలువుల భర్తీ కోసం మున్సిపల్, వైద్యశాఖలతోపాటు ఇతర శాఖల్లో ఖాళీ పోస్టులపై సమగ్ర వివరాల కోసం ఈ నెల 27 నుంచి వచ్చేనెల రెండో తేదీ వరకు ఆయా శాఖల అధికారులతో టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశాలు జరిపేందుకు షెడ్యూల్ ఖరారుచేసింది. ఆయా శాఖలతో సమన్వయం కోసం టీఎస్‌పీఎస్సీ రెండు చేజింగ్ సెల్స్ ఏర్పాటు చేసింది. ఇవి ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ.. నోటిఫికేషన్ల జారీలో న్యాయపరమైన చిక్కుల తొలిగింపు, పరీక్ష తేదీలను ఖరారుచేస్తాయని తెలిసింది. ఉద్యోగ నియామకాల కోసం ప్రభుత్వం అనుమతులు ఇచ్చినా కొన్ని శాఖలు టీఎస్‌పీఎస్సీకి అసమగ్ర సమాచారం అందజేశాయి. సర్వీస్ రూల్స్ లేమి, విద్యార్హతలు, జోన్లు, జిల్లాల వారీగా విభజన తదితర అంశాలపై సమగ్ర వివరాలు అందించకపోవడంతో టీఎస్‌పీఎస్సీ ఆయా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీచేయలేదు. ఆయా శాఖలకు టీఎస్‌పీఎస్సీ పలుసార్లు లేఖలు రాసినా స్పందన లేదు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఉద్యోగ నియామకంపై టీఎస్‌పీఎస్సీ, ప్రభుత్వశాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని ఆదేశించింది. దీంతో ఆయా శాఖల అధికారులతో జరిగే సమావేశాల్లో నోటిఫికేషన్లు జారీ చేయడానికి అడ్డంకిగా ఉన్న చిక్కులను అధిగమించాల్సిన అంశాలపై టీఎస్‌పీఎస్సీ చర్చించనున్నదని తెలుస్తున్నది. ఒక నెలలో ఈ కసరత్తు పూర్తిచేసి సుమారు 4000 నుంచి 5000 కొలువుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసేందుకు సిద్ధమైనట్టు సమాచారం.

డీఎస్సీతోపాటు గ్రూప్ 3, 4, మున్సిపల్ శాఖ పోస్టులపై ప్రత్యేక దృష్టి

భారీగా ఉద్యోగ ఖాళీలు ఉన్న డీఎస్సీ, గ్రూప్ 3, గ్రూప్ 4, మున్సిపల్ శాఖల్లో ఉద్యోగ నియామకాలపై టీఎస్‌పీఎస్సీ ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలిసింది. డీఎస్సీ నోటిఫికేషన్ల కోసం ప్రభుత్వం నుంచి రెండు జీవోలు రావాల్సి ఉన్నదని తెలుస్తున్నది. ఒకటి, రెండు రోజుల్లో ఆ జీవోలు తెప్పించుకుని ఖాళీల వివరాలు రాగానే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు సమాచారం. ఇక మున్సిపల్ శాఖలోనూ పెద్ద సంఖ్యలో ఖాళీలు ఉన్నా సర్వీస్ రూల్స్ విషయమై స్పష్టత రాలేదు. దీనిపై పూర్తి వివరాలు తెప్పించుకున్న తర్వాత నోటిఫికేషన్ జారీ చేస్తారని తెలిసింది. మరోవైపు గ్రూప్ 3, 4 లలో టైపిస్టులు, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. కొత్త జిల్లాల ఆధారంగా ఏర్పడే ఖాళీలతో కలిపి వాటిని భర్తీ చేయడానికి సిద్ధమవుతున్నట్టు సమాచారం. డిసెంబర్ నాటికి పెండింగ్ ఖాళీ పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్లు విడుదల చేయనున్నదని తెలిసింది.


ఆన్‌లైన్‌లో పట్టణాల ఆస్తుల వివరాలు

- 72 పట్టణాల్లో సమగ్ర భూవివరాల పట్టిక సిద్ధం
- 12.5 లక్షల ఇండ్ల సమాచారం నమోదు
- ఇంటిపై న్యాయవివాదం ఉన్నా తెలుస్తుంది
- మీడియాకు వెల్లడించిన సీడీఎంఏ శ్రీదేవి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని 72 పట్టణాల సమగ్ర భూవివరాల పట్టిక (కాంప్రిహెన్సివ్ ల్యాండ్ రిజిస్ట్రీ)ను సిద్ధం చేశామని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ శ్రీదేవి తెలిపారు. వ్యాపారులు, ప్రజలు రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల్లో స్థలాలు కొనుక్కోవడానికి మార్గం సుగమం చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 72 పట్టణ, స్థానికసంస్థల్లోని సుమారు 12.5 లక్షల ఆస్తుల వివరాలను ఇందులో నమోదు చేశామని వివరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) కార్యాలయంలో ఆమె మీడియాకు వివరాలు వెల్లడించారు. ఎవరైనా ఇల్లు కొనుగోలు చేయాలంటే సీడీఎంఏ వెబ్‌సైట్‌లో 'నో ప్రాపర్టీ డిటెయిల్స్'పై క్లిక్ చేసి కార్పొరేషన్ లేదా మున్సిపాలిటీలో ఇంటి నంబర్ లేదా ఆస్తిపన్ను మదింపు క్రమసంఖ్య వివరాలు నమోదు చేస్తే ఆ ఇంటికి సంబంధించిన సమగ్ర వివరాలు తెలుస్తాయన్నారు. ఇంటి యజమాని ఎవరు? ఆస్తి పన్ను చెల్లించారా? ఆ ఇంటిపై కోర్టు కేసులు పెండింగులో ఉన్నాయా? ఇతరత్రా న్యాయ వివాదాలున్నాయా? వంటివి తెలుస్తాయని ఆమె తెలిపారు. ఆ ఇంటికి సంబంధించిన ఈసీ వివరాలు కూడా తెలుసుకోవచ్చని చెప్పారు.

గూగుల్ మ్యాపుల సాయంతో..: రాష్ట్రంలోని 72 పట్టణాల్లో 11 లక్షల ఇండ్లను జియో ట్యాగింగ్ చేశామని సీడీఎంఏ శ్రీదేవి తెలిపారు. ఈ ప్రక్రియ 91 శాతం పూర్తయిందని, మిగితా లక్షన్నర ఇండ్లను దీని పరిధిలోకి తీసుకొస్తామన్నారు. సులభతర వాణిజ్య విధానంలో అతివేగంగా అడుగులు ముందుకేస్తున్నామని, ఇకనుంచి పట్టణ స్థానిక సంస్థల్లో కొత్త వ్యాపారులు సులువుగా అనుమతులు తీసుకోవచ్చని చెప్పారు. గతంలో ఉన్న 14 పత్రాలస్థానంలో రెండు పత్రాలకు పరిమితం చేశామని వెల్లడించారు. ఓటరు గుర్తింపు కార్డు లేదా పాన్‌కార్డు, లీజు అగ్రిమెంట్ వంటివి పొందుపరిస్తే రెండువారాల్లో అనుమతి ఇస్తామన్నారు.

సిటిజన్స్ బడ్డీ యాప్



పట్టణ ప్రజలకు మరింత చేరువ కావాలన్న ఉద్దేశంతో ప్రత్యేకంగా 'సిటిజన్ బడ్డీ' మొబైల్ యాప్‌ను సీడీఎంఏ అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా పట్టణ ప్రజలు అన్నిరకాల సేవలను పట్టణ స్థానిక సంస్థల నుంచి అందుకోవచ్చు. ఏదైనా సమస్య వస్తే ఫిర్యాదు చేయవచ్చు. ఆస్తిపన్ను సులువుగా కట్టుకోవచ్చు. ఇందుకోసం ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ వంటి పలు ప్రైవేట్ బ్యాంక్‌లతో సీడీఎంఏ అవగాహన కుదుర్చుకున్నది. ఇందుకోసం గూగుల్ ఆండ్రాయిడ్ ఫోన్లలో 'సిటిజన్ బడ్డీ' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే సరిపోతుంది. దీనివల్ల అనేక ప్రయోజనాలున్నాయి. కాలనీలో పారిశుద్ధ్య కార్మికులు డ్రైనేజీ శుభ్రం చేయకపోతే.. ఫొటో తీసి ఈ యాప్ ద్వారా పంపిస్తే చాలు.. వెంటనే సంబంధిత కమిషనర్‌కు సమాచారం చేరుతుంది. ఫలితంగా, ఆ సమస్య సులువుగా పరిష్కారమవుతుంది.



రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌కు సహజ రంగులతో తయారైన గణేశ్ విగ్రహాన్ని అందజేస్తున్న వ్యవసాయ వర్సిటీ వీసీ డాక్టర్ ప్రవీణ్‌రావు

గవర్నర్‌కు మట్టిగణేశ్ విగ్రహం అందజేత

వ్యవసాయ వర్సిటీ చేపట్టిన కార్యక్రమాన్ని అభినందించిన నరసింహన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సహజసిద్ధ రంగులతో గణపతి విగ్రహాల తయారీని ప్రోత్సహిస్తున్నాయి. వ్యవసాయ వర్సిటీలో సహజ రంగులతో తయారైన గణేశ్ విగ్రహాన్ని మంగళవారం గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌కు రాజ్‌భవన్‌లో వీసీ డాక్టర్ వీ ప్రవీణ్‌రావు అందజేశారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని గవర్నర్ అభినందించారు.

15 ముఠాలపై అనుమానం

- 'సిగరెట్' దొంగల కోసం కొనసాగుతున్న వేట
- 500 సీసీ కెమెరాల ఫుటేజీల విశ్లేషణ
- ఇన్నోవా కారులో వెంబడించినట్టు గుర్తించిన పోలీసులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: మూడు రోజుల కిందట నగర శివారులోని పెద్ద అంబర్‌పేట వద్ద సిగరెట్ లోడ్‌తో వెళ్తున్న కంటెయినర్‌ను దోచుకున్న ముఠా కోసం పోలీసుల వేట కొనసాగుతున్నది. ముషీరాబాద్ నుంచి పెద్ద అంబర్‌పేట వరకు దాదాపు 27 కిలోమీటర్ల మేర ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు సేకరించారు. 500 కెమెరాల ఫుటేజీలను విశ్లేషించగా దుండగులు ముషీరాబాద్ నుంచే ఇన్నోవా కారులో దాదాపు గంటా 11 నిమిషాల పాటు ఫాలో అయ్యారని తేలింది. పెద్ద అంబర్‌పేటలో కంటెయినర్‌ను అడ్డుకొని రూ.4 కోట్లు విలువైన సిగరెట్‌లను దోచుకొని పారిపోయారు. ఈ నేపథ్యంలో దోపిడీ జరిగిన రోజుతోపాటు, అంతకు రెండు రోజుల ముందు ఈ రూట్‌లో నమోదైన వేలాది కాల్‌డేటాను పరిశీలిస్తున్నారు. మరోవైపు దేశవ్యాప్తంగా 15 ముఠాలకు సిగరెట్ దోపిడీల నేపథ్యం ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ గ్యాంగ్‌లు మన రాష్ట్రంతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బీహార్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో సిగరెట్ డంప్‌లను దోపిడీ చేస్తూ హల్‌చల్ చేస్తున్నాయని రికార్డుల ద్వారా తెలిసింది. దీంతో ఇప్పుడు ఆయా ముఠాల వివరాలను సేకరిస్తున్నారు. ఎంత మంది జైళ్లలో ఉన్నారు? బయట ఎవరు ఉన్నారు? వారి వ్యవహారాలు, కదలికలపై ఆరా తీస్తున్నారు. ముఖ్యంగా కర్ణాటకకు చెందిన అవాస్ గ్యాంగ్, మధ్యప్రదేశ్‌కు చెందిన కంజర్ గ్యాంగ్, హైదరాబాద్‌కు చెందిన నాంపల్లి గ్యాంగ్‌పై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్యాంగ్‌లు హైదరాబాద్‌తోపాటు శివారులోని జిన్నారం, తూప్రాన్‌లో 2007 నుంచి 2012 వరకు సిగరెట్ డంప్‌ల దోపిడీకి పాల్పడి రూ.లక్షలు కొల్లగొట్టారని పోలీస్ రికార్డులు చెప్తున్నాయి. సంఘటనా స్థలంలో దొరికిన వేలిముద్రల ఆధారంగా కేసు దర్యాప్తును వేగవంతం చేశారు. దోచుకెళ్లిన సిగరెట్‌ల ను 50 శాతం అగ్గువకు బ్లాక్ మార్కెట్‌లో వ్యాపారులు కొంటుంటారని పోలీసులు గుర్తించారు. సిగరెట్ ప్యాకెట్లపై ఉండే బ్యాచ్ నంబర్, బార్ కోడ్ వివరాలు మార్కెట్‌లో గుర్తిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.



సూర్యగ్రహణంతో సంగీతం

వాషింగ్టన్, ఆగస్టు 22: అమెరికాలో సోమవారం కనిపించిన సంపూర్ణ సూర్యగ్రహణాన్ని ఉపయోగించుకొని శాస్త్రవేత్తలు ఓ మ్యూజిక్ ఆల్బమ్‌ను తయారు చేశారు. జార్జియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరిశోధకుల బృందం మొట్టమొదటిసారిగా ఇలాంటి ప్రయత్నం చేసింది. ఈ ప్రయోగంలో భారత సంతతి శాస్త్రవేత్త అవ్రోష్ కుమార్ పాలు పంచుకోవడం విశేషం. సంగీతం గురించి తెలిసిన ఇద్దరు అంధులను కూడా ఈ ప్రయోగంలో భాగస్వాములను చేశారు. వారిలో ఒకరు సూర్యగ్రహణ సమయంలో పరిసరాల్లో ఎలాంటి కొత్త శబ్దాలు ఉత్పత్తి అవుతున్నాయో, ఎలాంటి మార్పులు వస్తున్నాయో వివరించగా, మరొకరు ఆ శబ్దాల స్థాయికి అనుగుణంగా వాయిద్యాలతో సంగీతాన్ని సృష్టించారు. సూర్యగ్రహణాన్ని శాస్త్రవేత్తలు మూడు భాగాలుగా విభజించారు. ప్రారంభం అయ్యే సమయం నుంచి చంద్రుడు సూర్యుడిని పూర్తిగా కప్పేసే వరకు మొదటి దశగా, సూర్యుడు పూర్తిగా కనిపించక చీకటి కమ్మిన కాలాన్ని రెండో దశగా, గ్రహణం విడిపోతున్న సమయాన్ని మూడో దశగా విభజించారు. ఒక్కో దశలో సంగీతం స్థాయి మారుతూ వచ్చింది. సూర్యగ్రహణం ప్రారంభ, చివరి దశల్లో మంద్రస్థాయి సంగీతం వినిపించగా, పూర్తిగా చీకటి కమ్మిన సమయానికి ఉచ్ఛస్థాయికి చేరింది. అదేసమయంలో ఆకాశంలో ఏయే మార్పులు జరుగుతున్నాయో రికార్డ్ చేశారు. ఈ రెండు ఆడియోలను జతచేసి మ్యూజిక్ ఆల్బమ్ రూపొందించారు.

పాలు+చక్కెర= మిల్క్ క్యూబ్స్



బెర్లిన్, ఆగస్టు 22: కాఫీ తయారు చేసేటప్పుడు పాలు వేడిచేసి, కాఫీపొడి, చక్కెర కలుపుతాం కదా. సమీప భవిష్యత్తులో మాత్రం వేడివేడి నీళ్లల్లో కాఫీ పొడి, మిల్క్ క్యూబ్స్ వేసుకుంటే చాలు కాఫీ రెడీ అయిపోతుంది. అవును.. జర్మనీకి చెందిన మార్టిన్ లూథర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల బృందం పాలను, చక్కెరను కలిపి గడ్డకట్టించి షుగర్ క్యూబ్స్ మాదిరిగా ఉండే 'మిల్క్ క్యూబ్స్'ను రూపొందించారు. ముందుగా పాలకు తగిన పాళ్లలో చక్కెరను కలిపి మిశ్రమంగా తయారు చేశారు. తర్వాత వాటిని గడ్డ కట్టించారు. ఈ 'మిల్క్ క్యూబ్స్'ను గది ఉష్ణోగ్రతలో మూడు వారాల పాటు నిల్వ చేయవచ్చు. ప్రస్తుతం హై స్వీట్, లైట్ స్వీట్ మిల్క్ క్యూబ్‌లు రూపొందించారు. షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉపయోగపడేలా స్వీట్ లెస్ మిల్క్ క్యూబ్స్ తయారు చేయడంపై దృష్టి సారించారు.

మళ్లీ సైన్యంలోకి వెళ్తా!

- మాలేగావ్ పేలుళ్ల నిందితుడు పురోహిత్



ముంబై, ఆగస్టు 22: వీలైనంత త్వరలో తిరిగి సైన్యంలో చేరాలని ఉన్నట్టు మాలేగావ్ పేలుళ్ల కేసులో బెయిలు పొందిన సైన్యాధికారి లెఫ్టినెంట్ కర్నల్ శ్రీకాంత్‌ప్రసాద్ పురోహిత్ అన్నారు. మంగళవారం ముంబైలోని సెషన్స్ కోర్టువద్ద మీడియాతో మాట్లాడుతూ, సైనిక యూనిఫాం తన శరీరానికి చర్మం వంటిదని అన్నారు. తనకు భార్యాపిల్లలు ఒక కుటుంబమైతే సైన్యం మరో కుటుంబమని చెప్పారు. సైన్యం నుంచి వెలుపలకు వచ్చినట్టుగా తాను ఎప్పుడూ భావించ లేదని ఆయన అన్నారు.

జాబిల్లిపై నీటిజాడ ఎండమావేనా?

- చంద్రుడి అంతర్భాగం పొడిగా ఉందని తేల్చిన శాస్త్రవేత్తలు



లాస్ ఏంజెల్స్, ఆగస్టు 22: చంద్రుడిపై నీరు ఉన్నదని ఇప్పటివరకూ అంతా భావిస్తూ వచ్చారు. జాబిల్లిపై మానవ ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటే ఈ నీరు ఉపయోగపడుతుందని అంచనా వేశారు. అయితే అమెరికా శాస్త్రవేత్తలు తాజాగా జరిపిన పరిశోధనలు ఈ అంచనాలను తిరగరాశాయి. చంద్రుడిపై నీరు లేదని, పూర్తిగా పొడిగా ఉన్నదని వారు తేల్చి చెప్తున్నారు. 1972లో చంద్రుడిపైకి పంపిన అపోలో-16 నౌక తిరిగి వచ్చే సమయంలో తీసుకొచ్చిన మట్టి, శిలల నమూనాలను పరిశీలించగా తర్వాత ఈ నిర్ధారణకు వచ్చామన్నారు. శాండియాగో యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తల బృందం 'రస్టీ రాక్' అని పిలిచే మట్టి నమూనాలపై పరిశోధనలు జరిపింది. ఈ నమూనాల్లో తడి అసలేలేదని తేల్చింది. సాధారణంగా జింక్ మూలకాలు నీటి అణువులతో సులభంగా చర్యలో పాల్గొని 'హెవీ ఐసోటోప్స్'గా మారుతాయి. హెవీ ఐసోటోప్స్ ఉన్నచోట నీటిజాడ ఉన్నట్టు శాస్త్రవేత్తలు నిర్ధారిస్తారు. చంద్రుడి ఉపరితల నమూనాల్లో జింక్ మూలకాలు 'లైట్ ఐసోటోప్స్' రూపంలో ఉన్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. దీనిని బట్టి చంద్రుడిపై నీటి జాడ లేదని నిర్ధారించారు.

నీట్ నుంచి తమిళనాడుకు మినహాయింపు లేదు

న్యూఢిల్లీ: వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి తమిళనాడు రాష్ట్రానికి జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) నుంచి ఎటువంటి మినహాయింపు లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి నీట్ మార్కులను ప్రామాణికంగా తీసుకోవడంతోపాటు రాష్ట్ర బోర్డు పరీక్షలో అర్హత సాధించిన వారికి అన్యాయం జరుగకుండా చూడాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందుకోసం తుదిగడువును సెప్టెంబర్ 4 వరకు కోర్టు పొడిగించింది. మెడికల్ కౌన్సెలింగ్‌కు సంబంధించి కేవలం నీట్ మార్కులను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని ఆరుగురు విద్యార్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించగా, కోర్టు తమిళనాడులో మెడికల్ కౌన్సెలింగ్ ప్రవేశాలపై స్టే విధించింది. రాష్ట్రస్థాయి పరీక్షలో అర్హత సాధించినవారికి, నీట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు అందరికీ ఆమోదయోగ్య పరిష్కారం కనుగొనాలని భారత వైద్య మండలిని, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది.

హంద్వారాలో ఎన్‌కౌంటర్.. ఉగ్రవాది హతం

శ్రీనగర్, ఆగస్టు 22: ఉత్తరకశ్మీర్‌లోని కుప్వారా జిల్లా హంద్వారా ప్రాంతంలో మంగళవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ ఉగ్రవాది హతమయ్యాడు. ఇంకా కాల్పులు కొనసాగుతున్నాయని ఆర్మీ అధికారులు తెలిపారు. హంద్వారాలోని హప్రూడ అటవీప్రాంతంలో భద్రతాబలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఉగ్రవాదులు కాల్పులు ప్రారంభించగా భద్రతా దళాలు జరిపిన ఎదురుకాల్పుల్లో ఒక ఉగ్రవాది చనిపోయాడని అధికారులు తెలిపారు.

జీఎన్‌ఎల్‌ఎఫ్‌ను చర్చలకు ఆహ్వానించిన బెంగాల్

కోల్‌కతా, ఆగస్టు 22: డార్జిలింగ్ సమస్యపై బెంగాల్ ప్రభుత్వం గూర్ఖా నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ (జీఎన్‌ఎల్‌ఎఫ్)ను చర్చలకు ఆహ్వానించింది. అయితే ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమాన్ని నిర్వహిస్తున్న గూర్ఖా జనమోర్చా (జీజేఎం)ను మాత్రం పిలువలేదు. ఈనెల 29న సచివాలయంలో చర్చలు జరుగుతాయి. బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ మంగళవారం ఈ సంగతి వెల్లడించారు.

మణిపూర్ మాజీ సీఎం కైషింగ్ కన్నుమూత

ఇంఫాల్, ఆగస్టు 22: మణిపూర్ మాజీ ముఖ్యమంత్రి, మాజీ ఎంపీ రిషంగ్ కైషింగ్ (96) స్వల్ప అస్వస్థత అనంతరం మంగళవారం కన్నుమూశారు. కాంగ్రెస్ నాయకుడైన కైషింగ్ 1980 నుంచి 1988 వరకు, తిరిగి 1994 నుంచి 1997 వరకు మణిపూర్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. 1952లో జరిగిన మొదటి పార్లమెంటు ఎన్నికల్లో మణిపూర్ నుంచి ఎన్నికయ్యారు. రాజ్యసభ సభ్యునిగా కూడా కైషింగ్ పనిచేశారు. హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సహాయమంత్రి కిరెన్ రిజిజు కైషింగ్ మృతి పట్ల సంతాపం వ్యక్తంచేశారు.

జూనియర్ సివిల్ జడ్జిల
నియామకాలపై మార్గదర్శకాలు

- సుప్రీంకోర్టుకు సమర్పించిన కేంద్ర ప్రభుత్వం
- రెండు అంశాలపై తెలంగాణ జడ్జిల అసంతృప్తి
- తదుపరి విచారణ సెప్టెంబర్ 5కు వాయిదా

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: జూనియర్ సివిల్ జడ్జిల నియామకాలపై సుప్రీంకోర్టు ఆదేశం మేరకు కేంద్ర ప్రభుత్వం ముసాయిదా మార్గదర్శకాలను రూపొందించింది. జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ అబ్దుల్ నజీర్‌లతోకూడిన ధర్మాసనానికి అఫిడవిట్ రూపంలో కేంద్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ మణీందర్‌సింగ్ మంగళవారం సమర్పించారు. పది మార్గదర్శకాలను కేంద్రం రూపొందించింది. ఉమ్మడి రాష్ట్రంలో మొత్తం జూనియర్ సివిల్ జడ్జిల సంఖ్య, అందులో ఉన్న ఖాళీలకు సంబంధించిన వివరాలను హైకోర్టు తరపున హాజరైన న్యాయవాది రమణీరావు సమర్పించకపోవడంతో ఈనెల 30లోగా సమర్పించాలని, వివరాలను జడ్జిల సంఘంతోపాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు అధ్యయనం చేయాలని స్పష్టంచేసిన ధర్మాసనం తదుపరి విచారణను సెప్టెంబరు 5కు వాయిదా వేసింది. రెండు మార్గదర్శకాలపై తెలంగాణ జడ్జిల సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. మంగళవారం కేసు విచారణకు రాగా అదనపు సొలిసిటర్ జనరల్ మణీందర్‌సింగ్ ముసాయిదా మార్గదర్శకాలను వివరించారు. తెలంగాణ ఏర్పడడానికి ముందు జూనియర్ సివిల్ జడ్జిలకు ఉన్న సీనియారిటీ ప్రకారం పోస్టుల భర్తీ జరుగాలని, వారు ఏ రాష్ట్రానికి వెళ్ళాలని కోరుకుంటున్నారో 'ఆప్షన్' ఇవ్వాలని, ఆ అధికారులు సర్వీసులో చేరినప్పుడు వారి స్థానికత (లేదా ఆప్షన్) ఆధారంగా ఇప్పుడు కేటాయింపు జరుగాలని, ఒకవేళ మార్గదర్శకాల ప్రకారం నియామకాలు జరిగినప్పటికీ కొన్ని పోస్టులు ఖాళీగా ఉంటే వాటిని సీనియారిటీకి 'రివర్స్' క్రమంలో జరుపాలని.. ఇలా మొత్తం పది మార్గదర్శకాలను రూపొందించారు.



సందేహాలు లేవనెత్తిన జస్టిస్ చలమేశ్వర్

సీనియారిటీ, ఆప్షన్‌ల మార్గదర్శకాలపై జస్టిస్ చలమేశ్వర్ కొన్ని సందేహాలను లేవనెత్తారు. సీనియారిటీ, అప్షన్ అనే రెండు అంశాలలో దేనికి తొలి ప్రాధాన్యం ఉంటుంది? ఏ ఆప్షన్‌నూ ఇవ్వనివారికి నియామకాలు ఏ విధంగా ఉంటాయి? ఎంత మంది ఆప్షన్లు ఇచ్చారు? ఇవ్వనివారి కేటాయింపులకు ప్రాతిపదిక ఏమిటి? అని ప్రశ్నించారు. ఉమ్మడి హైకోర్టు తరపున హాజరైన సీనియర్ న్యాయవాది రమణీరావు జోక్యంచేసుకుని గతంలో మార్గదర్శకాలను రూపొందించిన తర్వాత రెండు రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నామని, దానిపై అభ్యంతరాలు వచ్చిన తర్వాత కేంద్రం వాటిని చేర్చి, మళ్ళీ మార్గదర్శకాలను రూపొందించిందని వివరించారు. జస్టిస్ చలమేశ్వర్ జోక్యం చేసుకుని ఉమ్మడి హైకోర్టు పరిధిలో ఉన్న జూనియర్ సివిల్ జడ్జి పోస్టులు (అధికారికంగా మంజూరైనవి) ఎన్ని? అందులో ఖాళీలెన్ని? వాటి భర్తీకి అనుసరించాల్సిన ప్రాధాన్య క్రమం ఏమిటి? మార్గదర్శకాలను రూపొందించడానికి ఏయే అంశాలను ప్రామాణికంగా తీసుకున్నారు? తదితర వివరాలను కోరారు. ప్రస్తుతానికి తన దగ్గర గణాంకాలులేవని వారంలో సమర్పిస్తానని రమణీరావు తెలిపారు. తెలంగాణ జడ్జిల తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ జోక్యంచేసుకుని మార్గదర్శకాల్లో సీనియారిటీని ప్రామాణికంగా తీసుకోవడం తమకు సమ్మతి కాదని, ఇది ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం స్ఫూర్తికి విరుద్ధమైనదన్నారు. సీనియారిటీ ఉండి ఆప్షన్‌ను ఎంచుకున్నవారికి ప్రాధాన్యం ఇచ్చే తీరులో ఈ మార్గదర్శకం ఉండడం తెలంగాణ స్థానికత కలిగిన న్యాయమూర్తులకు అన్యాయం చేస్తుందన్నారు. సీనియారిటీకి ప్రాధాన్యం ఇవ్వడానికి బదులుగా నిర్దిష్టంగా ఒక రాష్ట్రంలోని జూనియర్ సివిల్ జడ్జిల పోస్టుల్ని భర్తీచేయడానికి ఆ రాష్ట్రానికి చెందిన వారిని ఎంపిక చేయడం సమంజసంగా ఉంటుందన్నారు. మార్గదర్శకాలకు అనుగుణంగా నియామకాలు చేసిన తర్వాత ఖాళీలు వాటిని భర్తీ చేయడానికి సీనియారిటీలో 'రివర్స్' క్రమాన్ని అవలంబించడంపైనా అభ్యంతరం ఉందన్నారు. డిప్యూటేషన్ ప్రాతిపదికన అభ్యంతరంలేదని, శాశ్వత ప్రాతిపదికన నియామకం సమ్మతం కాదన్నారు.



హైదరాబాద్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్

శరవేగంగా అంకుర సంస్థల వృద్ధి

- స్టార్టప్‌లకు ప్రోత్సాహంతో సర్కారుపై టై, ఐఎస్‌బీ సంస్థల ప్రశంసలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంకుర సంస్థలను ప్రోత్సహించడంలో తెలంగాణ ప్రభుత్వం ముందంజలో ఉన్నదని ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ప్రోత్సాహక వేదిక అయిన ది ఇండస్ ఎంటర్ ప్రైజెస్ (టీఐఈ) ప్రశంసించింది. రాష్ట్ర ప్రభుత్వమే టీహబ్ పేరుతో ఇంక్యుబేటర్ల కేంద్రం ఏర్పాటుచేసి, టీ ఫండ్ పేరుతో ప్రోత్సాహక నిధిని కేటాయించడమే ఇందుకు నిదర్శనమని కొనియాడింది. అంతర్జాతీయంగా పేరెన్నికగన్న ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో కలిసి నిర్వహించనున్న టై-ఐఎస్‌బీ కనెక్ట్ 8వ ఎడిషన్ కార్యక్రమంపై టై హైదరాబాద్ అధ్యక్షుడు ప్రదీప్ మిట్టల్, టై ఐఎస్‌బీ కనెక్ట్ చైర్మన్ శ్రీని చందుపట్ల, ఐఎస్‌బీ ప్రతినిధి అరుణారెడ్డి హైదరాబాద్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ సర్కారు పనితీరును ప్రశంసించారు. హైదరాబాద్‌లో శరవేగంగా స్టార్టప్‌లు పెరుగుతున్నాయని, రెండేండ్లలో 100 నుంచి 2,500 స్టార్టప్‌లకు పెరిగాయని ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ చెప్పారు. టై-ఐఎస్‌బీ కనెక్ట్ వంటి కార్యక్రమాలతో ఈ గుర్తింపు మరింత ఇనుమడిస్తుందన్నారు. హైదరాబాద్‌లోనే సెప్టెంబర్ 7, 8 తేదీల్లో తమ ఎనిమిదో ఎడిషన్‌ను నిర్వహించుకోవడం సంతోషంగా ఉన్నదని టై, ఐఎస్‌బీ ప్రతినిధులు తెలిపారు. గతంలో పెట్టుబడిదారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అనుసంధానకర్తగా ఉన్న తాము, మరో ముందడుగు వేసి.. ఎలాంటి సంస్థల్లో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామో ఇన్వెస్టర్ల నుంచి వివరింపజేస్తామని పేర్కొన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పెట్టుబడులు దక్కే మార్గం తెలిసిపోతుందని వివరించారు. కేంద్ర మంత్రులు, పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికులతోపాటు 'బాహుబలి' చిత్రబృందాన్ని ఆహ్వానించి వారి అభిప్రాయాలు పంచుకునే అవకాశం ఇస్తామన్నారు.

బోధనావిధానాల్లో మార్పురావాలి

- టీఎస్‌డబ్ల్యుఆర్‌ఈఐఎస్ కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉపాధ్యాయుల బోధనావిధానాల్లో మార్పు రావాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ వసతిగృహ సంస్థల సొసైటీ కార్యదర్శి (టీఎస్‌డబ్ల్యుఆర్‌ఈఐఎస్) ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మానసిక నిపుణుడు సీ వీరేందర్ రచించిన 'టీచింగ్ సైకాలజీ' పుస్తకాన్ని మంగళవారం ఎస్సీ, ఎస్టీ గురుకుల విద్యాలయాల సొసైటీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. విద్యార్థులకు విషయ పరిజ్ఞానాన్ని అభివృద్ధిపరిచే, శాస్త్రీయంగా ఆలోచించే విధానాలను పుస్తకంలో వీరేందర్ వివరించారని ప్రవీణ్‌కుమార్ చెప్పారు.ఈ పుస్తకాన్ని ఎస్సీ, ఎస్టీ గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మానసిక నిపుణుడు సీ వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి నిధుల ఖర్చుపై ఆడిట్ చేస్తున్నాం

- హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేటాయించే నియోజకవర్గ అభివృద్ధి నిధులు (సీడీపీ), ప్రత్యేక అభివృద్ధి నిధుల (ఎస్‌డీఎఫ్) ఖర్చుపై ఎప్పటికప్పుడు ఆడిట్ నిర్వహిస్తున్నట్టు హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం నివేదించింది. స్టేట్ ఆడిట్ విభాగం, అకౌంటెంట్ జనరల్ ఆధ్వర్యంలో ఆడిట్ చేస్తున్నట్టు తెలిపింది. నియోజకవర్గ అభివృద్ధి నిధుల పేరిట ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రులకు ప్రతిఏడాది కేటాయిస్తున్న రూ.700 కోట్ల ఖర్చుపై మూడేండ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఆడిట్ నిర్వహించడం లేదంటూ దాఖలైన వ్యాజ్యంపై ప్రభుత్వం వివరణ సమర్పించింది. జిల్లాలవారీగా కేటాయించిన నిధుల ఖర్చుపై చేపట్టిన ఆడిట్ వివరాలను ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి, సాధారణ పరిపాలనశాఖ ప్రభుత్వ న్యాయవాది నజీబ్‌ఖాన్ మంగళవారం హైకోర్టుకు సమర్పించారు.

ఏపీపీల నియామకంపై కౌంటర్ దాఖలు చేయండి

- హోంశాఖ ముఖ్యకార్యదర్శికి ఉమ్మడి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రంగారెడ్డి జిల్లాలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (ఏపీపీ) నియామకంపై వివరణ ఇవ్వడంలో హోంశాఖ ముఖ్యకార్యదర్శి జాప్యంచేయడంపై మంగళవారం ఉమ్మడి హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. నియామక వ్యవహారాలపై ప్రమాణపత్రం దాఖలు చేయాలని ఆదేశించినప్పటికీ, బేఖాతరు చేయడమేమిటని ప్రశ్నించింది. తదుపరి విచారణ తేదీనాటికి కౌంటర్ దాఖలు చేయకపోతే వ్యక్తిగతంగా ఆయన హాజరుకావాల్సి ఉంటుందని హెచ్చరించింది. మరింత సమయం కావాలని ఏజీపీ మల్లారెడ్డి అభ్యర్థించడంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తంచేసింది.

'అమెరికన్ అంకాలజీ'లో పుర్రె కణితులకు చికిత్స

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పుర్రె కింద కణితులు ఏర్పడితే వాటిని తొలగించేందుకు అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్ ప్రత్యేక చికిత్సా కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని ఆ సంస్థ వైద్యులు ఎం బాబయ్య, శశికాంత్, అజయ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుత జీవన శైలిలో మార్పుల కారణంగా స్కల్ (పుర్రె) ఆధారంగా కణితులు ఏర్పడే రోగుల సంఖ్య పెరుగుతున్నదన్నారు. క్యాన్సర్ రహిత స్కల్ (పుర్రె) ఆధారిత కణితుల చికిత్సకోసం నల్లగండ్లలోని అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్‌లో ప్రస్తుతం రేడియేషన్ ఆంకాలజీ, మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, మస్క్యులోస్కెలెటల్ అంకాలజీ, బ్లడ్ బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంట్, సేవలను అందిస్తున్నట్లు చెప్పారు.

మార్క్‌ఫెడ్‌కు నాఫెడ్ పూర్తిగా సహకరించాలి

- మార్క్‌ఫెడ్ వాటా షేర్లను బదలాయించండి
- నాఫెడ్ ఎండీకి మార్క్‌ఫెడ్ చైర్మన్ బాపురెడ్డి వినతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైతుల వ్యవసాయ ఉత్పత్తులు నేరుగా కొనుగోలు చేస్తూ వారికి మద్దతు ధర కల్పిస్తున్న మార్క్‌ఫెడ్‌కు నాఫెడ్ ద్వారా పూర్తిసహకారం అందించాలని మార్క్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ లోక బాపురెడ్డి కోరారు. సంస్థ జనరల్ మేనేజర్ రాములుతో కలిసి బాపురెడ్డి మంగళవారం ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. పర్యటనలో భాగంగా నాఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్‌కుమార్ చద్దాతో వారు సమావేశమయ్యారు. 2016-17లో రాష్ట్రంలో పండిన కందులను పెద్దఎత్తున కొనుగోలుచేసి తెలంగాణ రైతాంగాన్ని ఆదుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. మార్క్‌ఫెడ్ విజ్ఞప్తులను వినతిపత్రం రూపంలో అందజేశారు. విభజన చట్టం ప్రకారం తమ కార్పొరేషన్‌కు రావాల్సిన వాటా షేర్లను తక్షణమే కేటాయించాలని కోరారు. నాఫెడ్‌లో తెలంగాణ మార్క్‌ఫెడ్‌కు సభ్యత్వం ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది పత్తిపంటను అధికంగా సాగుచేసిన నేపథ్యంలో సీసీఐతోపాటు నాఫెడ్‌పత్తి కొనుగోలు చేయాలని వారు చద్దాను కోరారు.

త్వరలో కేంద్ర మంత్రివర్గంలో మార్పులు?

- అన్నాడీఎంకే, జేడీయూకు పదవులు
- దక్షిణాదికి ప్రాధాన్యం.. ఈ వారంలోనే మార్పులు!

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: ఈ వారంలో కేంద్ర మంత్రివర్గంలో మార్పులు జరిగే అవకాశాలున్నాయి. అన్నాడీఎంకేకు ఒక క్యాబినెట్ మంత్రి పదవితో పాటు రెండు సహాయ మంత్రి పదవులు, నితీశ్‌కుమార్‌కు చెందిన జేడీయూకు ఒక క్యాబినెట్, ఒక సహాయ మంత్రి పదవులు ఇచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. ప్రస్తుతం కేంద్ర మంత్రులుగా ఉన్న కొద్దిమందిని తొలిగించి దక్షిణాదికి చెందినవారికి అవకాశం ఇవ్వడంపై బీజేపీలో చర్చలు జరుగుతున్నాయి. కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆ రాష్ట్రానికి చెందిన కనీసం ఇద్దరికి చోటు లభించే అవకాశం ఉంది. ప్రస్తుతం కేంద్ర మంత్రులుగా ఉన్న కనీసం ఐదుగురికి ఉద్వాసన పలుకవచ్చని బీజేపీ వర్గాల సమాచారం. నిర్మలా సీతారామన్‌ను మంత్రివర్గం నుంచి తప్పించి పార్టీ వ్యవహారాలకు వినియోగించుకోవచ్చునని తెలిసింది. మరో మంత్రి కల్‌రాజ్‌మిశ్రాకు 75 ఏండ్లు నిండినందున ఆయనను మంత్రివర్గం నుంచి తప్పించి గవర్నర్‌గా పంపవచ్చని సమాచారం. ప్రస్తుతం సహాయ మంత్రులుగా ఉన్న ధర్మేంద్రప్రధాన్, పీయూష్‌గోయల్, బండారుదత్తాత్రేయలకు క్యాబినెట్ హోదాలు లభించనున్నట్లు తెలిసింది. దత్తాత్రేయ ప్రస్తుతం కార్మిక శాఖకు స్వతంత్ర హోదాలో సహాయ మంత్రిగా ఉన్నందున అదే మంత్రిత్వశాఖలో కొనసాగిస్తూ క్యాబినెట్ హోదా కల్పించాలని ఆర్‌ఎస్‌ఎస్‌కు అనుబంధంగా ఉన్న భారతీయ మజ్దూర్ సంఘ్ ప్రధానికి సూచించినట్లు సమాచారం.

ప్రస్తుతం రక్షణ, పట్టణాభివృద్ధి, సమాచార ప్రసారాలు, పర్యావరణ మంత్రిత్వశాఖలు ఖాళీగా ఉన్నందువల్ల వీటికి పూర్తిస్థాయిలో మంత్రుల్ని కేటాయించాల్సి ఉంది. అయితే కీలకమైన మంత్రిత్వశాఖలను బీజేపీ ఎంపీలకే కేటాయించాలని పార్టీ స్పష్టమైన నిర్ణయం తీసుకుంది. కర్ణాటకలో వచ్చే ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కనీసం రెండు మంత్రి పదవులను ఆ రాష్ట్రానికి ఇవ్వాలని పార్టీ భావిస్తున్నది. మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప వర్గానికి చెందిన శోభా కరంద్లాజేకు, లింగాయత్ ఓటు బ్యాంకును దృష్టిలో పెట్టుకుని సురేశ్ అంగాడీకి మంత్రివర్గంలో చోటు కల్పించే అవకాశం ఉంది. ఇక జేడీయూ తరపున నితీష్‌కుమార్‌కు సన్నిహితంగా ఉన్న రామచంద్ర సింగ్, రామ్‌నాథ్ ఠాకూర్‌లకు మంత్రివర్గంలో చోటు లభించవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి కంభంపాటి హరిబాబుకు అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం సైన్స్-టెక్నాలజీ మంత్రిగా ఉన్న సుజనాచౌదరి శాఖ మారే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. ఇక అన్నాడీఎంకే నుంచి లోక్‌సభ డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న తంబిదురైకి క్యాబినెట్ పదవి ఇవ్వనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇక సహాయ మంత్రులుగా పళనిస్వామి, పన్నీర్‌సెల్వం గ్రూపులకు చెందిన చెరొకరికి ఇవ్వడంపై అన్నాడీఎంకేలో చర్చలు మొదలయ్యాయి. అన్నాడీఎంకేకు లోక్‌సభ, రాజ్యసభల్లో దాదాపు 50 మంది ఎంపీలు ఉన్నందువల్ల భవిష్యత్తులో వారి మద్దతు బీజేపీకి చాలా అవసరం కాబట్టి తగిన ప్రాధాన్యాన్ని ఇచ్చే అవకాశమే ఉంది.

నెలాఖరులోగా గవర్నర్ల నియామకం

మంత్రివర్గ విస్తరణకు తోడు ఆరు రాష్ట్రాలకు గవర్నర్ల నియామకంపై కూడా కేంద్రం దృష్టి పెట్టింది. ఆనందీబెన్ పటేల్, కల్‌రాజ్‌మిశ్రా, కర్ణాటకలోని ఎమ్మెల్సీ శంకరమూర్తిల పేర్లు దాదాపు ఖరారైన నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గం నుంచి బీహార్‌కు చెందిన సీనియర్ మంత్రికి ఉద్వాసన పలికినట్లయితే ఆ వ్యక్తికి కూడా గవర్నర్ పదవిని కట్టబెట్టే విధంగా పార్టీ ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఈ నెలాఖరుకల్లా మంత్రివర్గ మార్పులు, గవర్నర్ల నియామకాల ప్రక్రియ పూర్తికావచ్చని సమాచారం.

27.71 లక్షల మందికి మీజిల్స్ రూబెల్లా వ్యాక్సిన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో తట్టు వ్యాధి నివారణే లక్ష్యంగా వైద్యారోగ్యశాఖ చేపట్టిన మీజిల్స్ రూబెల్లా వ్యాక్సినేషన్ కొనసాగుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా 90 లక్షల మంది చిన్నారులకు వ్యాక్సినేషన్ వేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, కేవలం నాలుగు రోజుల్లోనే 27.71 లక్షల మంది చిన్నారులకు వ్యాక్సినేషన్ చేశారు. 9 నెలల నుంచి 15 ఏండ్లలోపు ఉన్న వారికి అన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ, ప్రభుత్వ దవాఖానాల్లో ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 25 వరకు ఉచితంగా వ్యాక్సిన్ వేస్తున్నారు.

సింగరేణిలో స్వచ్ఛ పఖ్‌వాడా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సింగరేణిలోని పన్నెండు ఏరియాల్లో స్వచ్ఛ్ పఖ్‌వాడా కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తున్నామని సంస్థ సీఎండీ ఎన్ శ్రీధర్ తెలిపారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ కార్యదర్శి సుశీల్‌కుమార్ మంగళవారం దేశవ్యాప్తంగా బొగ్గు సంస్థలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సింగరేణిలోని అన్ని కాలనీలు, దవాఖానలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, కాలనీ మురికికాల్వలు, పాఠశాలలను శుభ్రం చేశామని శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు సింగరేణి వాసులను ఆయన అభినందించారు. ఈ సమీక్షలో జీఎం బీ కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రుల ప్రగతికి కృషి

- ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులాలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ అన్నారు. గంగపుత్రుల కోసం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చెరువుల్లో చేపపిల్లలను వేయించారని మంగళవారం ఎంబీసీ కార్పొరేషన్ కార్యాలయంలో గంగపుత్ర సంఘం ప్రతినిధులతో ఆయన చెప్పారు. గంగపుత్ర సంఘం అధ్యక్షుడు ఆర్కే ప్రసాద్, యువజన విభాగం అధ్యక్షుడు గడ్డం సాయికిరణ్, ప్రచార కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్, కార్యదర్శి మెట్టు ధన్‌రాజ్, రవి పాల్గొన్నారు.

'సగరులను ఎంబీసీలుగా గుర్తించండి'

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సామాజికంగా వెనుకబడిన సగర (ఉప్పర) కులస్తులను ఎంబీసీ జాబితాలో చేర్చాలని సంఘం ప్రతినిధులు బీసీ కమిషన్‌ను కోరారు. మంగళవారం కమిషన్ కార్యాలయంలో చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఆంజనేయగౌడ్‌తో సంఘం ప్రతినిధులు సమావేశమయ్యారు. వారికి వినతిపత్రం ఇచ్చారు. సగర సంఘం అధ్యక్షుడు బీ నర్సింహ, ప్రధాన కార్యదర్శి శేఖర్, కుసుమ, ఎం సువర్ణ, లక్ష్మి, ఉపాధ్యక్షుడు హనుమంత్, రామచంద్రయ్య, జిల్లాల అధ్యక్షులు ప్రేమ్, సత్యనారాయణ, రవి, తిరుపతయ్య, ఆంజనేయులు, భిక్షపతి, కుమారస్వామి, సమ్మయ్య, నర్సయ్య, కృష్ణ, ప్రసాద్ ఉన్నారు.

పద్ధతి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు

- ఉగ్రవాదులకు ఆశ్రయమివ్వడంపై పాకిస్థాన్‌కు ట్రంప్ వార్నింగ్
- ఆఫ్ఘన్‌లో శాంతి స్థాపనకు భారత్ పాత్ర పెరుగాలని ఆకాంక్ష



వాషింగ్టన్, ఆగస్టు 22: ఉగ్రవాదులకు పాకిస్థాన్ స్వర్గధామంగా మారిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మండిపడ్డారు. పాక్ తన పద్ధతిని మార్చుకోవాలని లేదంటే పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆఫ్ఘనిస్థాన్ నుంచి తొందరపాటుగా తమ దళాలను ఉపసంహరించబోమని, ఆ దేశంలో శాంతి స్థాపనకు భారత్ పాత్ర మరింత పెరుగాలని సూచించారు. 'ఆఫ్ఘన్ - పాక్' విధానం ప్రకటనలో ఓ అమెరికా అధ్యక్షుడు భారత్ పేరును ప్రస్తావించడం ఇదే తొలిసారి. మంగళవారం ఆయన టీవీ ద్వారా దేశప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ తమ దేశ దక్షిణాసియా విధానాన్ని వెల్లడించారు. భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవడం ఈ విధానంలో కీలకమైనదని పేర్కొన్నారు. దీర్ఘకాలంగా మిత్రదేశంగా ఉన్న పాకిస్థాన్ పట్ల అమెరికా వైఖరిని మార్చుకోవడం ఈ విధానంలో మరో మార్పు అని తెలిపారు. 'ఉగ్రవాదం, హింస, అల్లర్లకు ఏజెంట్లుగా ఉన్న వారికి పాకిస్థాన్ ఆశ్రయం కల్పిస్తున్నది. పలుమార్లు హెచ్చరించినా ఉగ్రవాద గ్రూపులకు పాక్ మద్దతును కొనసాగిస్తున్నది. ఇక సహించేది లేదు పాక్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది' అని ట్రంప్ మండిపడ్డారు. తాలిబాన్ వంటి ఉగ్రవాద సంస్థలకు, ఇతర గ్రూపులకు పాకిస్థాన్ స్వర్గధామంగా కొనసాగితే తాము మౌనంగా ఉండబోమని హెచ్చరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశమైన భారత్ తమకు కీలకమైన భద్రత, ఆర్థిక భాగస్వామి అని పేర్కొన్నారు. అమెరికన్లంతా ఐక్యంగా ఉండాలని, ఇక్కడ అసూయ, ద్వేషాలకు తావు లేదని అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. 'అమెరికా పట్ల ఉన్న ప్రేమ ఇక్కడి ప్రజలందరి పట్ల ఉండాలి. ఇక్కడ అసూయకు, ద్వేషానికి చోటు లేదు. విద్వేషాన్ని సహించబోము' అని ట్రంప్ పేర్కొన్నారు.

నంద్యాలలో ఓటుకు 10వేలు!

- రూ.కోటికిపైగా నగదు, బంగారు ముక్కుపుడకలు స్వాధీనం
- నేడు ఉదయం 7 గంటల నుంచి పోలింగ్, 28న ఫలితాలు

జోగులాంబ గద్వాల, నమస్తే తెలంగాణ ప్రతినిధి: కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నిక ఆఖరి ఘట్టానికి చేరుకున్నది. 2019 ఎన్నికలకు ముందు జరుగుతున్న ఈ ఉప పోరును కీలకంగా భావిస్తున్న అధికార, ప్రతిపక్షాల అభ్యర్థులు పోటాపోటీగా డబ్బులు పంచుతున్నారు. యాబలూరు, దీపగుంట్లలో ఒక్కో ఓటుకు రూ.10 వేల చొప్పున వెచ్చించారు. ఇప్పటివరకు ఓటర్లకు పంచుతూ పట్టుబడిన సొమ్ము కోటి రూపాయలు దాటింది. మరోవైపు సోమవారం ప్రచారం ముగియడంతో నేతలు నంద్యాలను ఖాళీచేసి పక్క గ్రామాల్లో ఉండి డబ్బు పంపిణీపై దృష్టి పెట్టారు. కొన్ని ప్రాంతాల్లో గంపగుత్తగా ఓట్లను కొనుగోలు చేశారు. ఒకే వర్గంలో 80 నుంచి 100 ఓట్లు ఉంటే అక్షరాలా రూ.5 లక్షలు ముట్టజెప్పినట్లు ప్రచారం సాగుతున్నది. కొన్ని ప్రాంతాల్లో ఓటర్లు తమకు డబ్బులు తక్కువగా పంపిణీ చేశారని నేతల ఇండ్ల ముందు ఆందోళనకు దిగారు. నంద్యాల పట్టణంలోని 15వ వార్డులో ఓ స్థానిక నేత ఇంటి ముందు మహిళలు ఆందోళనకు దిగారు. పట్టణంలోని 22వ వార్డులో తమకు కుట్టుమిషన్లు ఇస్తామని చెప్పి ఇవ్వలేదంటూ పలువురు మహిళలు నేతల ఇండ్లవద్దకు వెళ్లి నిలదీశారు. ఇదేతరహా ఆందోళన నంద్యాల ఒకటో వార్డులోనూ జరిగింది. చాపిరల, అయ్యలూరు, చాబోలు, పెద్ద కొట్టాలలో ఒక్కో ఓటుకు రూ.5 వేలు, మహిళలకు చీరలు, ముక్కు పుడకలు పంపిణీ చేసినట్టు తెలుస్తున్నది. ప్రతిపార్టీ అభ్యర్థి దాదాపు రూ.200 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రచారం జరుగుతున్నది. ఉపఎన్నికల పోలింగ్ బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 వరకు జరుగనున్నది. ఈ ఉపపోరులో 15 మంది బరిలో ఉన్నప్పటికీ, టీడీపీ, వైసీపీ అభ్యర్థుల మధ్యే ప్రధానంగా పోటీ ఉన్నది.

భారీగా నగదు, బంగారం స్వాధీనం

ఉపఎన్నిక సందర్భంగా ఇప్పటివరకు రూ.1.16 కోట్లతోపాటు 1405 గ్రాముల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో ఎక్కువగా ముక్కు పుడకలు ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 107 మందిని బైండోవర్ చేయగా.. 320 మంది నేతలపై కేసులు నమోదు చేశారు. 2288 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. రెండు పార్టీలు పంపకాలపై పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నాయి. నిబంధనల ఉల్లంఘనపై ఈసీకి మొత్తం 157 ఫిర్యాదులు వెళ్లాయి.

వెర్నాలో సరికొత్త వెర్షన్



న్యూఢిల్లీ, ఆగస్టు 22: మధ్యస్థాయి సెడాన్ విభాగానికి చెందిన వెర్నాలో సరికొత్త వెర్షన్ దేశీయ మార్కెట్లోకి విడుదల చేసినట్లు దేశంలో రెండో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ హ్యుందాయ్ మోటార్ ప్రకటించింది. ఢిల్లీ షోరూంలో ఈ కారు ప్రారంభ ధరను రూ.7.99 లక్షలుగా నిర్ణయించింది. విడుదల చేసిన వాటిలో పెట్రోల్ రకం కారు రూ.7.99 లక్షల నుంచి రూ.12.23 లక్షల మధ్యలో ధరను నిర్ణయించగా, డీజిల్ రకం రూ.9.19 లక్షల నుంచి రూ.12.61 లక్షల లోపు ఢిల్లీ షోరూంలో లభించనున్నది. తొలి 20 వేల యూనిట్లను కొనుగోలు చేసిన వారికే మాత్రమే ఈ ధరలు వర్తించనున్నట్లు, ఆ తర్వాత ధరలను సమీక్షించనున్నట్లు కంపెనీ డైరెక్టర్ సేల్స్, మార్కెటింగ్ రాకేశ్ శ్రీవాత్సవ తెలిపారు. 1.6 లీటర్ల పెట్రోల్, డీజిల్ ఇంజిన్‌తో రూపొందించిన ఈ కారు మ్యాన్యువల్, ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌లోనూ సైతం లభించనున్నాయి. ఇటీవల సంస్థ అభివృద్ధి చేసిన కె2 ఇంజిన్ ప్లాట్‌ఫామ్ కింద ఐదో జనరేషన్ వెర్నాను తయారు చేయడానికి సంస్థ రూ.1,040 కోట్ల మేర పెట్టుబడి పెట్టింది. సన్‌రూఫ్, భద్రతా ప్రమాణాలను మెరుగు పరుచడానికి 6 ఎయిర్‌బ్యాగులు, ఎకో కోటింగ్ ఏసీ వెంట్స్, రియర్ పార్కింగ్ సెన్సార్ వంటి ఫీచర్స్ ఉన్నాయి.

సెన్సెక్స్ 31,292 ↑ 33

నిఫ్టీ 9,766 ↑ 11

బంగారం ధరలు

ముంబై

24 క్యారెట్లు	29,080
22 క్యారెట్లు	28,930
వెండి (కిలో)	38,870

ముడి చమురు (బ్రెంట్) 51.81

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	58.29	67.59
ఆస్ట్రేలియా డాలర్	46.27	53.54
బహ్రెయిన్ దినార్	157.94	180.90
యూరో	68.81	79.80
జపాన్ యెన్/100	53.35	61.87
కువైట్ దినార్	175.45	218.48
ఒమన్ రియాల్	154.55	176.86
సౌదీ రియాల్	15.50	18.37
సింగపూర్ డాలర్	42.70	50.68
స్టెర్లింగ్ పౌండ్	75.09	87.11
యూఏఈ దిర్హామ్	15.861	8.54

కోడిగుడ్ల ధరలు

	నెక్	హెచ్‌ఎల్‌ఎఫ్‌ఏ
హైదరాబాద్	355-00	335-00
రంగారెడ్డి	355-00	335-00
మెదక్	355-00	335-00
కరీంనగర్	357-00	---
వరంగల్	357-00	---
రిటైల్ ప్రైస్	4-15	4-15

చికెన్ ధరలు

ఫారంధర	86.00
రిటైల్ లైవ్	101.00
డ్రెస్డ్	141.00
స్కిన్‌లెస్	167.00

ఇన్ఫోసిస్ షేర్లపై సెబీ కన్ను

న్యూఢిల్లీ, ఆగస్టు 22:

స్టాక్ మార్కెట్లో ఇన్ఫోసిస్ షేర్ల కదలికలను నిశితంగా గమనిస్తున్నట్లు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి 'సెబీ' చైర్మన్ అజయ్ త్యాగీ తెలిపారు. విశాల్ సిక్కా రాజీనామా కారణంగా గత రెండు సెషన్లలో ఇన్ఫీ షేర్లు భారీ కుదుపునకు లోనయ్యాయి. గత శుక్రవారం నాడు సంస్థ స్టాకులు దాదాపు 10 శాతం మేర పతనం కాగా.. ఈవారం తొలిరోజు (సోమవారం) ట్రేడింగ్‌లో మరో 5 శాతానికిపైగా క్షీణించాయి. గత రెండు సెషన్లలో సంస్థ రూ.33,911.93 కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌ను కోల్పోయింది. 'ఈ కేసులో సెబీ చొరవగా విచారిస్తున్నది. సాధారణంగా ఏదేని సంస్థ షేర్లు తీవ్ర ఊగిసలాటలకు లోనైనప్పుడు సెబీ వాటిపై కన్నేసి ఉంచుతుంది. ఇప్పటివరకైతే ఇది సాధారణ విచారణే. యూఎస్‌లో ఇన్ఫోసిస్ షేర్లకు సంబంధించిన పరిణామాలను ఎప్పటికప్పుడు గమనిస్తాం. సంస్థ విషయంలో అవసరాన్ని బట్టి ముందడుగు వేస్తాం' అని సెబీ వర్గాలు తెలిపాయి.

స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల నుంచి సమాచారం కోరిన నియంత్రణ మండలి

ఇన్ఫోసిస్‌లో కార్పొరేట్ గవర్నెన్స్, సమాచార బహిర్గత నిబంధనల ఉల్లంఘన జరిగిందా అన్న కోణంలోనూ సెబీ పరిశీలిస్తున్నది. సంస్థ బోర్డుపై నారాయణమూర్తి చేసిన ఆరోపణలకు సంబంధించి కొంతమంది షేర్‌హోల్డర్లు నియంత్రణ మండలిని సంప్రదించినట్లు తెలుస్తున్నది. దాంతో సెబీ, ఈ విషయంపై కంపెనీ నుంచి వివరణ కోరాలని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లను ఆదేశించినట్లుగా సమాచారం.

సంస్థ బైబ్యాక్ ప్రణాళికపైనా ప్రభావం?

ఇన్ఫోసిస్‌లో తాజా పరిణామాలు బైబ్యాక్ ప్రణాళికపైనా ప్రభావం చూపవచ్చు. ఇప్పటికే సంస్థపై కన్నేసి ఉంచిన సెబీ.. ఇన్వెస్టర్ల ఫిర్యాదులకు సంబంధించిన దర్యాప్తు ముగిశాకే షేర్ల తిరిగి కొనుగోలు ప్రక్రియకు ఆమోదం తెలిపే అవకాశం ఉంది.



నేడు ఇన్వెస్టర్లతో మూర్తి సమావేశం

ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు నారాయణమూర్తి ఇన్వెస్టర్లతో సంభాషించనున్నారు. బుధవారం నాడు ఇన్వెస్టెక్ ఇండియా ఆధ్వర్యంలో జరుగనున్న సమావేశంలో ఆయన ఇన్వెస్టర్ల ప్రశ్నలకు సమాధానాలివ్వడంతోపాటు ప్రస్తుత వివాదంపై వారిలో నెలకొన్న ఆందోళనలను తగ్గించే ప్రయత్నం చేసే అవకాశం ఉంది. విశాల్ సిక్కా పనితీరును ప్రశ్నించకపోయినప్పటికీ ఇన్ఫోసిస్ బోర్డు వ్యవహార తీరును మూర్తి తప్పుబడుతూ వస్తున్నారు. సంస్థలో కార్పొరేట్ గవర్నెన్స్ ప్రమాణాలు పతనం అవుతున్నాయన్నది ఆయన ప్రధాన ఆందోళన. ఏడాది కాలంగా బోర్డుకు, మూర్తికి మధ్య పోరు కొనసాగుతున్న నేపథ్యంలో సంస్థ సారథ్యం తప్పుకోవాలని సిక్కా అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ఈ పరిణామం ఇన్ఫోసిస్‌కు భారీ కుదుపే. సిక్కా రాజీనామాకు మూర్తి తీరే కారణమంటూ ఇన్ఫోసిస్ బోర్డు ఆరు పేజీల లేఖను విడుదల చేసింది. బోర్డు వ్యాఖ్యలతో కలత చెందానన్న మూర్తి.. తనపై చేసిన ఆరోపణలపై తగిన సమయంలో, సరైన వేదికపై, సముచిత సమయంలో సమాధానమిస్తానని అన్నారు. అయితే, ఇన్వెస్టర్లతో జరుగబోయే సమావేశంలో బోర్డు ఆరోపణలపై మూర్తి స్పందిస్తారా అనే విషయంలో మాత్రం స్పష్టత లేదు.

మూర్తి తీరును తప్పుబట్టిన గోస్వామి

సంస్థ బోర్డులో పదిహేనేండ్లపాటు (2000–2015) సభ్యుడిగా పనిచేసిన ఓంకార్ గోస్వామి.. ఈ వివాదం విషయంలో నారాయణమూర్తి తీరును తీవ్రంగా దుయ్యబట్టారు. సిక్కా రాజీనామాకు దారితీసిన పరిస్థితులను వివరిస్తూ ఆయన బహిరంగ లేఖను విడుదల చేశారు. 'విశాల్ సిక్కాకు పగ్గాలు అప్పగించిన సందర్భంలో హామీ ఇచ్చిన విధంగా సంస్థ వ్యవహారాల్లో కలుగజేసుకోకుండా ఉండటం అలవర్చుకోండి' అని మూర్తిని ఉద్దేశించి లేఖలో పేర్కొన్నారు. 'మీరు వ్యవహరిస్తున్న తీరు సంస్థలో సంక్షోభాన్ని సృష్టించింది. సీఈవో వైదొలుగడానికి కారణమైంది. ఫలితంగా సంస్థ షేర్లు ఒక్కరోజులో 9.6 శాతం క్షీణించాయి. కంపెనీ ఇన్వెస్టర్ల సంపద రూ.22,600 కోట్ల మేర తరిగిపోయింది. అంతేకాదు, అమెరికాలో సంస్థపై నష్టపరిహార దావాలు దాఖలయ్యే పరిస్థితులకు దారితీసింది. బోర్డు అంతర్గత వ్యవహారాలను బోర్డు వరకే పరిమితం చేయడం సంస్థ సంప్రదాయంగా వస్తున్నది. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను లేఖ ద్వారా అందరికీ తెలియజేయాలని నిర్ణయించుకున్నా' అని గోస్వామి మూర్తిని బహిరంగంగా విమర్శించారు. మూర్తితోపాటు సంస్థ మాజీలైన వీ బాలకృష్ణన్, మోహన్‌దాస్ బహిరంగ వ్యాఖ్యల దాడిపై బోర్డులోని ప్రతి స్వతంత్ర డైరెక్టర్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారని గోస్వామి లేఖలో పేర్కొన్నారు.

జైట్లీతో ఇన్ఫీ సహ చైర్మన్ భేటీ

దేశంలో రెండో అతిపెద్ద ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ సహ చైర్మన్ రవి వెంకటేశన్ మంగళవారం కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీతో సమావేశమయ్యారు. విశాల్ సిక్కా రాజీనామాతో సంస్థ భవిష్యత్‌పై అనిశ్చితి మబ్బులు కమ్ముకున్న నేపథ్యంలో ఆర్థిక మంత్రితో వెంకటేశన్ భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. సంస్థలో తాజా పరిణామాలను, షేర్‌హోల్డర్ల ఆందోళనలు తగ్గించేందుకు ఇప్పటివరకు చేపట్టిన చర్యల గురించి మంత్రికి వివరించినట్లు తెలుస్తున్నది. ఇన్ఫోసిస్ సీఈవో, ఎండీ పదవికి సిక్కా గత శుక్రవారం రాజీనామా చేశారు. గతకొద్దికాలంగా తనపై జరుగుతున్న దుష్ప్రచారం వల్ల సక్రమంగా బాధ్యతలు నిర్వహించలేకపోతున్నానని, అందుకే పదవికి రాజీనామా చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇన్ఫోసిస్ బోర్డు మాత్రం సంస్థ మాజీ చైర్మన్, ప్రమోటర్ ఎన్‌ఆర్ నారాయణ మూర్తి ఇందుకు కారణమని ఆరోపించింది. సిక్కా స్థానంలో సీవోవో యూబీ ప్రవీణ్ రావుకు తాత్కాలిక సారథ్య బాధ్యతలు అప్పగించారు. వచ్చే మార్చిలోగా కొత్త సీఈవోను వెతుకనున్నట్లు బోర్డు తెలిపింది.

మ్యాక్స్‌క్యూర్‌లో మెడికోవర్‌కు వాటా

22%వాటా కొనుగోలుకు రూ.100 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, ఆగస్టు 22: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఆరోగ్య సేవల సంస్థ మ్యాక్స్‌క్యూర్‌లో నాస్‌డాక్‌లో లిస్టైన యూరప్‌కు చెందిన హెల్త్‌కేర్ సంస్థ మెడికోవర్ అత్యధిక వాటాను కొనుగోలు చేయడానికి ముందుకొచ్చింది. ప్రస్తుతం 22 శాతం వాటాను కొనుగోలు చేయడానికి రూ.100 కోట్ల మేర పెట్టుబడి పెట్టిన సంస్థ వచ్చే రెండేండ్లకాలంలో ఈ వాటాను 51 శాతానికి పెంచుకోవడానికి రూ.220 కోట్ల నిధులను వెచ్చించనున్నట్లు మ్యాక్స్‌క్యూర్ (గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్) ఎండీ అనిల్ కృష్ణ తెలిపారు. వ్యాపారాన్ని దేశవ్యాప్తంగా విస్తరించే ప్రణాళికలో భాగంగా వాటాను విక్రయించినట్లు అనిల్ తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో ఐదు, ఆంధ్రప్రదేశ్‌లో ఒక ఆసుపత్రిని నిర్వహిస్తున్నది. వీటిలో 1,600 పడకలు ఉన్నాయి. వచ్చే రెండేండ్లకాలంలో పడకల సంఖ్యను 3 వేలకు పెంచుకోవడంలో భాగంగా వరంగల్‌తోపాటు బెంగళూరు, పుణె, చెన్నైలలో నూతన ఆసుపత్రులను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు మ్యాక్స్‌క్యూర్ సీఈవో హరి కృష్ణ చెప్పారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.350 కోట్లుగా నమోదైన టర్నోవర్ ఈ ఏడాది రూ.500 కోట్లు దాటనున్నదని ఆయన అంచనావేస్తున్నారు. భారత్‌లో అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్న హెల్త్‌కేర్ రంగంలో గడిచిన ఏడేండ్లలో 100 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టినట్లు మెడికోవర్ చైర్మన్ ఫ్రెడ్రిక్ స్టెన్మో తెలిపారు. ఇరు సంస్థల మధ్య కుదిరిన వాటా ఒప్పందంతో మ్యాక్స్‌క్యూర్ బోర్డులో ఇద్దరు మెడికోవర్ నామినెట్ చేయనున్నది.

ఢిల్లీ ఎయిర్‌పోర్టులో నాలుగో రన్‌వే

2021కల్లా నిర్మించనున్న డీఐఏఎల్ .. టీ1, టీ3 టర్మినళ్ల సామర్థ్యం పెంపు

న్యూఢిల్లీ: ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో నాలుగో రన్‌వేను ఏర్పాటు చేయబోతున్నారు. 2021కల్లా కొత్త రన్‌వేను నిర్మించనున్నట్లు ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (డీఐఏఎల్) సీఈవో ఐ ప్రభాకర్ రావు తెలిపారు. అంతేకాదు, ప్రస్తుతం కార్యకలాపాలు నిర్వహిస్తున్న రెండు టర్మినళ్లలో (టీ1, టీ3) ప్రయాణికుల సేవల సామర్థ్యాన్ని పెంచనున్నట్లు తెలిపారు. అంతేకాదు, రెండో టర్మినల్ (టీ2) కార్యకలాపాలు పునః ప్రారంభించనున్నట్లు ప్రభాకర్ రావు వెల్లడించారు. టీ1 నుంచి ఆపరేట్ చేస్తున్న ఎయిర్‌లైన్లు అక్టోబర్ నుంచి తమ కార్యకలాపాలను పాక్షికంగా టీ2కు బదిలీ చేయాలని కోరామన్నారు. టీ1 ప్రయాణికుల సామర్థ్యాన్ని 2 కోట్ల నుంచి 4 కోట్లకు, టీ3 కెపాసిటీని 3.4 కోట్ల నుంచి 4.5 కోట్లకు పెంచాలని మాస్టర్ ప్లాన్ ఏర్పాటు చేసుకుంది.

ఎన్‌పీఏల పరిష్కారంపై దృష్టి: ఖారత్

హైదరాబాద్: ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ ఇండియన్ బ్యాంక్..నిరర్థక ఆస్తులను తగ్గించుకోవడానికి ప్రత్యేక దృష్టి సారించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిరర్థక ఆస్తులను 5 శాతానికి కట్టడి చేయాలనుకుంటున్నట్లు బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో కిశోర్ ఖారత్ తెలిపారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఇది 7.21 శాతంగా నమోదైంది. బ్యాంక్ 111వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌తోపాటు కరీంనగర్ జోన్‌లలో జరిగిన ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

మట్టి గణపతులను పూజిద్దాం

ప్రజలను ఆలోచింపజేసిన ముస్లిం దంపతులు



మట్టివినాయకులతో సహజత్వాన్ని ప్రతిబింబించే ప్రతిమలనే పూజించాలని కోరుతూ 'నేనుసైతం' స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహ్మద్ సుభాని, సలీమా దంపతులు మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో వినూత్న ప్రచారం నిర్వహించారు. మట్టి వినాయకుడి వేషధారణలో సుభాని 'మట్టి విగ్రహాలనే పూజించండి... పర్యావరణాన్ని రక్షించండి' అనే ప్లకార్డును చేతపట్టుకుని తోపుడు బండిపై కూర్చున్నాడు. దానిని తోడుకుంటూ పట్టణ పురవీధుల్లో తిరుగుతూ సలీమా వినూత్నంగా ప్రచారం చేయడం అందరినీ ఆలోచింపజేసింది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలతో పర్యావరణపరంగా ఎన్నో అనర్థాలు ఏర్పడుతాయన్నారు.

-నెప్తూ సెంటర్ (మహబూబాబాద్)

హరితహారంపై అలసత్వం తగదు

అటవీ, పర్యావరణశాఖ ముఖ్యకార్యదర్శి రజత్‌కుమార్



మూడోవిడుత హరితహారంపై సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, అటవీశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న అటవీ, పర్యావరణశాఖ ముఖ్యకార్యదర్శి రజత్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హరితహారాన్ని మామూలు కార్యక్రమంగా కాకుండా భవిష్యత్తు తరాలకు వెలుగునిచ్చే బృహత్తర పథకంగా భావించాలని అటవీ, పర్యావరణశాఖ ముఖ్యకార్యదర్శి రజత్‌కుమార్ అన్నారు. హరితహారంలో పనితీరు ఆధారంగా ఉద్యోగులకు ర్యాంకులు ఉంటాయని చెప్పారు. మంగళవారం సచివాలయంలో హరితహారం అమలుతీరుపై అటవీశాఖ అధికారులు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి గ్రామానికి 40వేల మొక్కలు నాటాలని, పట్టణ ప్రాంతాల్లో అర్బన్ పార్కులను అభివృద్ధి చేయాలని రజత్‌కుమార్ సూచించారు. గ్రీన్‌బెల్ట్‌లను ఏర్పాటు చేయాలని, నాటిన ప్రతి మొక్కను జియో ట్యాగింగ్‌ద్వారా అనుసంధానం చేయాలని తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలను ఈ కార్యక్రమంలో ఉపయోగించుకోవాలని సూచించారు. కేంద్రం నుంచి నిధులు విడుదలయ్యాయని.. కూలీ వేతనాలకు కొరత లేదన్నారు. కొన్ని శాఖలు హరితహారంపై అంతగా శ్రద్ధ తీసుకోవడంలేదని, దీనిపై త్వరలో చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో కార్యక్రమం మందగమనంలో కొనసాగుతున్నదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమం అమలులో ముందంజలో ఉన్న జగిత్యాల కలెక్టర్ శరత్, వరంగల్ కలెక్టర్ అర్బన్ ఆమ్రపాలిని రజత్‌కుమార్ అభినందించారు.

130 పత్తి కొనుగోలు కేంద్రాలు!

- వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల కసరత్తు
- దళారీవ్యవస్థ నిర్మూలనకు రైతులకు 'బార్ కోడెడ్ ఐడీ' కార్డులు
- ఆగస్టు చివరినాటికి రైతుల వివరాల సేకరణ
- జిల్లా అధికారులకు వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి ఆదేశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:



మంగళ వారం సచివాలయంలో జిల్లా వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ కార్యదర్శి సీ పార్థసారథి

రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లకు 150 సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, దాదాపు 130 కేంద్రాలు వచ్చే అవకాశాలున్నాయని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల కార్యదర్శి సీ పార్థసారథి తెలిపారు. పండించిన పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కమిషనర్ డాక్టర్ ఎం జగన్‌మోహన్‌తో కలిసి మంగళవారం సచివాలయం నుంచి జిల్లా అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాలతో వానాకాలం పంటలు పుంజుకున్నాయని, పత్తి రికార్డుస్థాయిలో సాగవుతున్నదని పార్థసారథి పేర్కొన్నారు. రాష్ట్రంలో 10 జిల్లాల్లో తప్ప మిగతా చోట్ల సాధారణ వర్షపాతం నమోదైందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారులు, మార్కెటింగ్ అధికారులతో సమన్వయం చేసుకుని పనిచేయాలని ఆదేశించారు. పంటల విస్తీర్ణం, ఉత్పత్తి, ఉత్పాదకతలు పెరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో సమన్వయం, తగిన ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను అడిగి తగిన సూచనలు చేశారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం, మార్కెటింగ్‌శాఖ సంయుక్తంగా పత్తి కనీస మద్దతు ధర స్థిరీకరణకు నిర్వహిస్తున్న ప్రాజెక్టు అంచనాలను, సూచనలను సెప్టెంబర్ నెలాఖరుకల్లా వచ్చే అవకాశం ఉన్నదని తెలిపారు. పత్తి రైతులకు బార్ కోడెడ్ ఐడీ కార్డులు అందజేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. 2016లో 25 లక్షల కార్డులు అందజేసినట్టు గుర్తుచేశారు. అలాగే 2017 వానాకాలం నాటికి పెరిగిన పత్తి రైతుల వివరాలు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. దీనివల్ల దళారుల ప్రమేయాన్ని నిలువరించవచ్చని చెప్పారు. గులాబీ రంగు పురుగు స్థితిగతులు, యాజమాన్యంపై అధికారులతో చర్చించారు. జిల్లా వ్యవసాయ అధికారులు పత్తి రైతు వివరాలను ఇవ్వాలని మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి కోరారు. దీనిద్వారా పత్తి కనీస మద్దతు ధర సీసీఐ అంచనాకు, ఈ-నామ్ అమలుకు వీలవుతుందని చెప్పారు. జిల్లాల్లో ఉన్న జిన్నింగ్ మిల్లులు, వాటి లైసెన్స్ వివరాలను కూడా ఇవ్వాలని కోరారు. రైతు సమగ్రసర్వే డాటా కంప్యూటరీకరణ ఈ నెల 31 వరకు పూర్తిచేయాలని వ్యవసాయశాఖ కమిషనర్ డాక్టర్ ఎం జగన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. సాంకేతిక ఇబ్బందులు తలెత్తిన 5 జిల్లాలకు సెప్టెంబర్ 5 వరకు గడువు ఇచ్చినట్లు చెప్పారు.



మంగళ వారం టీఆర్‌ఎస్‌ఎల్పీలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరరెడ్డి

సంస్కార హీనులతో చర్చించం

ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డిపై టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కసిరెడ్డి, ఎమ్మెల్యే ఆల ఆగ్రహం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నిజాలను కప్పిపుచ్చుతూ పచ్చి అబద్ధాలను మూటగట్టి అసభ్యపదజాలంతో దూషిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి వంటి సంస్కారహీనులతో ప్రాజెక్టులపై చర్చించడానికి తాము సిద్ధంగాలేమని టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి స్పష్టంచేశారు. వచ్చేనెలలో జరుగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఏ ప్రాజెక్ట్‌పై ఏమి అడుగుతారో అడుగాలని, సంబంధిత మంత్రి హరీశ్‌రావు అందరి సందేహాలను నివృత్తి చేస్తారని అన్నారు. టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కల్వకుర్తికి సాగునీళ్లు వస్తుంటే ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి కండ్లలో నీళ్లు వస్తున్నాయన్నారు. అబద్ధాలనే పదేపదే చెప్తూ అదేపనిగా బహిరంగ చర్చకు రావాలంటూ సవాళ్లు విసురుతున్న వంశీచంద్‌రెడ్డి మాట్లాడే భాష మార్చుకోవాలన్నారు. ఐదుసార్లు గెలిచి మంత్రిగా ఉన్న జూపల్లి కృష్ణారావుపై నోరుపారేసుకోవడం వంశీ చిల్లర రాజకీయాలకు నిదర్శనమన్నారు. వంశీ చేసిన ఆరోపణలపై స్పందించిన ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, చిట్టెం రామ్మోహన్‌రెడ్డితోపాటు తనను దుర్భాషలాడటం దుర్మార్గమన్నారు. భాష మార్చుకోకపోతే కల్వకుర్తి నడిరోడ్డులో వంశీని ప్రజలే నిలదీస్తారని హెచ్చరించారు. కల్వకుర్తి, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌లపై వంశీ చేసిన ఆరోపణలన్నీ అబద్ధాలేనని స్పష్టంచేసిన నారాయణరెడ్డి, అందుకు సంబంధించిన జీవో ప్రతులను విలేకరులకు చూపించారు. మంత్రి జూపల్లిని విమర్శించే స్థాయి కానీ, అర్హత కానీ వంశీచంద్‌రెడ్డికి లేదన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న వంశీచంద్‌రెడ్డి అనంతపురం వెళ్లి రాష్ట్రం సమైక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని, కేంద్రం విభజన నిర్ణయాన్ని వెనుకకు తీసుకోవాలని చెప్పిన విషయాన్ని పత్రికా క్లిప్పింగ్‌లు చూపించారు. దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పెద్దవారిని దూషిస్తే తాను పెద్దవాడినవుతాననే ఆరాటం వంశీకి ఉందన్నారు. పాలమూరు జిల్లాలో పుట్టినోళ్లు ప్రాజెక్ట్‌లకు వ్యతిరేకంగా కోర్టుల్లో కేసులు వేస్తారా? అని మండిపడ్డారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రాజెక్టులు పూర్తిచేసి మహబూబ్‌నగర్ జిల్లాలోని 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని స్పష్టంచేశారు.

అంతరాష్ట్ర బదిలీల ప్రక్రియ వేగవంతం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంతరాష్ట్ర బదిలీల ప్రక్రియ వేగం పుంజుకున్నది. ఏపీ నుంచి స్వరాష్ట్రానికి రావడానికి అక్కడ పనిచేస్తున్న దాదాపు వెయ్యి మంది తెలంగాణ ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం. ప్రతీ దరఖాస్తును ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు నిశితంగా పరిశీలిస్తున్నాయి. బదిలీ కోరుకుంటున్న ఉద్యోగి తన వివరాలన్నింటినీ నమూనా దరఖాస్తు ద్వారా సంబంధిత శాఖాధిపతికి అందజేయాల్సి ఉంటుంది. వాటిలో ప్రధానంగా సంబంధిత ఉద్యోగి స్థానికతను ఉన్నతాధికారులు పరిశీలిస్తారు. స్థానికతను కలిగి ఉంటేనే బదిలీ చేస్తారు. దంపతుల్లో ఒకరు రాష్ట్రానికి చెందినవారై, బదిలీ కొరుకున్న సందర్భంలోనూ వారికి అవకాశం కల్పిస్తారు. చివరగా రెండు రాష్ట్రాల చీఫ్ సెక్రటరీల సమావేశం నిర్వహించి జీవోలు విడుదల చేయనున్నారు. నిబంధనలను ఆసరాగా చేసుకొని ఏపీ ఉద్యోగులు తెలంగాణకు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఉద్యోగ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే సందర్భంలో ఏపీలో ఇబ్బందులు పడుతున్న 800 మంది నాలుగోతరగతి ఉద్యోగులను సొంత రాష్ట్రానికి తీసుకురావడానికి ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి.

వాణిజ్యపన్నుల శాఖలో జీఎస్టీ హోదా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వాణిజ్యపన్నులశాఖ అధికారుల హోదాలు మార్చారు. ఈ మేరకు రెవెన్యూ (ఆబ్కారీ, వాణిజ్యపన్నుల) శాఖ ముఖ్యకార్యదర్శి సోమేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. విలువ ఆధారిత పన్ను (వ్యాట్) అమలులో ఉన్నప్పుడు ఉన్న హోదాలను జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత మార్చినట్లు వెల్లడించారు. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత హోదాను పెంచినందుకు వాణిజ్యపన్నుల శాఖ టీజీవో అధ్యక్షుడు టీ వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల ఉద్యోగులకు పదోన్నతులను కల్పించిన ప్రభుత్వం.. జీఎస్టీ అమల్లోకి వచ్చిన నెల రోజుల్లో హోదాలను మార్చడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, ముఖ్యకార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు, వాణిజ్యపన్నుల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాట్ అమల్లో ఉన్న సమయంలో హోదా	జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత హోదా
అడిషనల్ కమిషనర్ (ఐఏఎస్/ఐఆర్ఎస్ క్యాడర్)	స్పెషల్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్
అడిషనల్ కమిషనర్ (నాన్ ఐఏఎస్/ఐఆర్ఎస్ క్యాడర్)	అడిషనల్ కమిషనర్(గ్రేడ్-1)
జాయింట్ కమిషనర్	అడిషనల్ కమిషనర్ స్టేట్ ట్యాక్స్
డిప్యూటీ కమిషనర్	జాయింట్ కమిషనర్ స్టేట్ ట్యాక్స్
అసిస్టెంట్ కమిషనర్	డిప్యూటీ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్
కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్	అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్
డిప్యూటీ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్	స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్
అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్	డిప్యూటీ స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్

కొత్త ఆబ్కారీ విధానంపై కసరత్తు

- లైసెన్స్ ఫీజు తగ్గింపు?
- ఆన్‌లైన్‌లో టెండర్ దరఖాస్తులు
- సెప్టెంబర్ తొలివారంలో తుదిరూపు
- ఆబ్కారీ అధికారులతో ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి సోమేశ్‌కుమార్ సమీక్ష

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కొత్త ఆబ్కారీ విధానాన్ని ఎలా సరళీకృతం చేయాలనే అంశంపై ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. అక్టోబర్ ఒకటి నుంచి అమలులోకి రానున్న కొత్త ఎక్సైజ్ పాలసీలో ఏయే మార్పులు చేయాలనే విషయంపై ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి సోమేశ్‌కుమార్ మంగళవారం ఆబ్కారీ అధికారులతో సచివాలయంలో సమీక్షించారు. ఈ నెలాఖరులోపు కొత్త విధానంపై కసరత్తు పూర్తిచేసి, వచ్చేనెల తొలివారంలో నివేదిక సమర్పించాలని సూచించారు. జాతీయ రహదారులపై మద్యంషాపులను అనుమతించవద్దనే సుప్రీంకోర్టు ఉత్తర్వులను కచ్చితంగా అమలుచేయాలని సమావేశంలో నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారుల వెంట 500 మీటర్లలోపు ఉన్న దాదాపు వందకుపైగా షాపులను తొలిగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. కొత్తమద్యం విధానం చాలా సరళీకృతంగా ఉండాలని సోమేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. స్లాబ్‌రేట్లు, లైసెన్స్‌ఫీజు భారంగా ఉండకుండా కొంతవరకు తగ్గించాలని యోచిస్తున్నట్టు అధికారుల ద్వారా తెలిసింది. జనాభా ప్రాతిపదికలో కూడా మార్పులు చేసే అవకాశాలున్నాయి. మద్యం దుకాణాల టెండర్ దరఖాస్తులను ఈసారి ఆన్‌లైన్‌లో తీసుకోనున్నారు. ఆబ్కారీ కార్యాలయాలకు వచ్చే అవసరం లేకుండా ఆన్‌లైన్‌లోనే దరఖాసులను అప్‌లోడ్ చేయవచ్చు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 2,144 వైన్‌షాపులు ఉన్నాయి. వీటిగడువు అక్టోబర్‌తో ముగియనున్నది.

స్తంభించిన ప్రభుత్వ బ్యాంకింగ్

- నగదు, చెక్కు క్లియరెన్స్ సేవలకు తీవ్ర విఘాతం
- ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగుల సమ్మె విజయవంతం



సమ్మె కారణంగా బోసిపోయిన హైదరాబాద్ బ్యాంక్‌స్ట్రీట్‌లోని ఎస్‌బీఐ శాఖ

న్యూఢిల్లీ, ఆగస్టు 22: ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులు మంగళవారం నాడు చేపట్టిన దేశవ్యాప్త సమ్మె కారణంగా బ్యాంకింగ్ సేవలకు తీవ్ర విఘాతం కలిగింది. బ్యాంకుల్లో నగదు డిపాజిట్, ఉపసంహరణ, నగదు బదిలీ, రెమిటెన్స్ సేవలతోపాటు చెక్కుల క్లియరెన్సులు నిలిచిపోయాయి. కొన్ని చోట్ల, ముఖ్యంగా చిన్న పట్టణాల్లోని ఏటీఎంలలో నగదు లేక కస్టమర్లు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో విలీనాలను వ్యతిరేకించడంతోపాటు పలు డిమాండ్ల సాధనకై యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ఆధ్వర్యంలో పనిచేస్తున్న 9 ట్రేడ్ యూనియన్లకు చెందిన 10 లక్షల పైగా ఆఫీసర్లు, సాధారణ సిబ్బంది ఈ సమ్మెలో పాల్గొన్నారు. హైదరాబాద్‌తోపాటు దేశంలోని వ్యాపార కేంద్రాలైన ముంబై, కోల్‌కతా, పాట్నా, చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్, పుణె, జైపూర్ నగరాలపై సమ్మె ప్రభావం అధికంగా కన్పించింది. ఉద్యోగుల సమ్మెపై ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) కస్టమర్లకు ముందుగానే సమాచారం అందించింది. అంతేకాదు, సమ్మె ప్రభావాన్ని తగ్గించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని బ్యాంకులను సైతం ఆదేశించింది. ప్రైవేట్ బ్యాంకింగ్ రంగానికి చెందిన ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్, కొటక్ మహీంద్రా, యెస్ బ్యాంకులకు చెందిన శాఖల్లో మాత్రం కార్యకలాపాలు యథావిధిగా కొనసాగాయి.

దేశంలో మరింత విస్తృతంగా బ్యాంకింగ్ సేవలు అవసరమైన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల విలీనం, ఏకీకరణ గురించి మాట్లాడుతున్నదని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) జనరల్ సెక్రటరీ సీహెచ్ వెంకటాచలం అన్నారు. బ్యాంకుల విలీనంతో కొన్ని శాఖలు మూతపడుతాయన్నారు. అనుబంధ బ్యాంకులను విలీనం చేసుకున్న ఎస్‌బీఐలో ఇప్పుడదే జరుగుతున్నదన్నారు. విలీనాల ద్వారా దిగ్గజ బ్యాంకులను ఏర్పాటు చేయడం ద్వారా వాటికి రిస్క్ పెరుగుతున్నదన్నారు. బ్యాంక్ ఉద్యోగులకు గ్రాట్యుటీ పరిమితిని రూ.20 లక్షలకు పెంచాలని ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ (ఏఐబీవోసీ) జనరల్ సెక్రటరీ డీటీ ఫ్రాంకో డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలకు ఇచ్చిన రుణాలను రద్దు చేయవద్దని, ఉద్దేశపూర్వక రుణ ఎగవేతలను నేరపూరిత చర్యలుగా పరిగణించాలని, మొండిబకాయిల రికవరీకి సంబంధించి పార్లమెంటరీ కమిటీ ప్రతిపాదనలను అమలు చేయాలని కూడా బ్యాంకింగ్ ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అంతేకాదు, పెద్ద నోట్ల రద్దు సమయంలో అదనపు సమయం పనిచేసిన ఉద్యోగులకు అదనంగా చెల్లించాలని కూడా డిమాండ్ చేశాయి. దేశంలో 21 ప్రభుత్వ రంగ బ్యాంకులున్నాయి. దేశీయ బ్యాంకింగ్ రంగంలో వీటిదే 75 శాతం వాటా.

తెలంగాణలోనూ సేవలకు తీవ్ర విఘాతం

సమ్మె కారణంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో బ్యాంకింగ్ సేవలకు తీవ్ర విఘాతం కలిగింది. రెండు రాష్ట్రాల్లోని ప్రభుత్వ రంగ బ్యాంకులకు చెందిన 11 వేలకు పైగా శాఖల్లో కార్యకలాపాలు స్తంభించిపోయాయి. తెలంగాణలో 5 వేలు, ఏపీలో 6 వేల బ్రాంచీలున్నాయి. వీటిల్లో పనిచేసే దాదాపు లక్ష మంది అధికారులు, సిబ్బంది సమ్మెలో పాల్గొన్నారు.

ప్రధానిని కలువనున్న బ్యాంక్ యూనియన్లు

డిమాండ్ల సాధనకై బ్యాంక్ ఉద్యోగ సంఘాలు వచ్చేనెల 15న ర్యాలీ నిర్వహించాలని ఆలోచిస్తున్నాయి. ఆ తర్వాత ప్రధాని నరేంద్ర మోదీని కూడా కలుసుకొని బ్యాంకింగ్ రంగంలో విలీనాలు, ఏకీకరణపై ఆందోళన వ్యక్తం చేయాలని అనుకుంటున్నాయి.

రాష్ట్ర అర్థగణాంకశాఖలో 462 ఖాళీలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పదోన్నతులు, కొత్త జిల్లాలు, మండలాలు, డివిజన్ల ఏర్పాటు నేపథ్యంలో రాష్ట్ర అర్థగణాంకశాఖలో 462 ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రతీ మండల కేంద్రంలో ప్లానింగ్ అండ్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఎంపీఎస్‌వో) ఉండాలనే నిబంధనల మేరకు ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం 130 మండల కేంద్రాలలో ప్లానింగ్ అండ్ స్టాటిస్టికల్ అధికారులు ఉన్నారు. వీరే తమ సమీప జిల్లా, మండలాల్లో పనిచేస్తున్నారు. రాష్ట్రం ఏర్పడిన అనంతరం 150 మంది ఎంపీఎస్‌వోలకు పదోన్నతులు లభించాయి. వ్యవసాయం, మత్స్యపరిశ్రమ, రవాణా, సేవల రంగాల ద్వారా లభించే ఆదాయం, ఇతర గణాంకాలను ఈ అధికారులు సేకరిస్తున్నారు. నిత్యావసరాల ధరలు, చెరువులు, కుంటలలో నీటిసామర్థ్యం, సాగు వివరాలు, తదితర వివరాలను కూడా వీరు సేకరిస్తున్నారు. 2014 ఆగస్టులో చేపట్టిన సమగ్ర సర్వేలో, ఈ శాఖ సేకరించిన వివరాల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను రూపొందించింది. ప్రతీ మండల కేంద్రంలో ప్లానింగ్ అండ్ స్టాటిస్టికల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలనే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నదని టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సేవ చేసేందుకు బ్యూరో ఆఫ్ ఎకనామిక్స్ శాఖలోని ఉద్యోగులందరూ సిద్ధంగా ఉన్నారని, ఆ శాఖ సబార్డినేట్ అసోసియేషన్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శి అంజయ్య పేర్కొన్నారు.

క్యాట్ సభ్యుడిగా జస్టిస్ కాంతారావు నియామకం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్) హైదరాబాద్ బెంచ్ జ్యుడీషియల్ సభ్యుడిగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రెడ్డి కాంతారావు నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెండేండ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. కేంద్రప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు నిబంధనలు, ఇతర విషయాలపై ట్రిబ్యునల్ విచారిస్తుంది.

ఎన్‌ఎంసీఎంఈ సభ్యుడిగా రాంనేని శ్రీకాంత్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జయశంకర్-భూపాలపల్లి జిల్లా రుద్రారం గ్రామానికి చెందిన రాంనేని శ్రీకాంత్‌ను జాతీయ అల్పసంఖ్యాక వర్గాల విద్యా పర్యవేక్షక కమిటీ (నేషనల్ మానిటరింగ్ కమిటీ ఫర్ మైనారిటీస్ ఎడ్యుకేషన్ - ఎన్‌ఎంసీఎంఈ) సభ్యులుగా నియమించారు. ఈ మేరకు కేంద్ర మానవవనరుల శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది.

ఏడో వేతన స్కేల్ అమలుపై దేశవ్యాప్త ఆందోళన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఏడో వేతన స్కేల్‌ను కేంద్రం అమలు చేసిందని, కానీ యూజీసీ స్కేల్ పొందుతున్న డిగ్రీ, వర్సిటీ, రిటైర్డ్ ప్రొఫెసర్లకు అమలుచేయడం లేదని అధ్యాపకులు అన్నారు. మంగళవారం ఏఐఎఫ్‌యూసీటీవో ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పలు ప్రభుత్వ డిగ్రీ, వర్సిటీలకు చెందిన అధ్యాపకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

ఉద్యాన పథకాలు, రాయితీలపై ఫోన్‌ఇన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'రైతునేస్తం' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఉద్యానశాఖ అమలు చేస్తున్న పథకాలు, ఇస్తున్న రాయితీలపై బుధవారం దూరదర్శన్ యాదగిరి చానెల్‌లో ఫోన్‌ఇన్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం 5.30 నుంచి 6:30 వరకు ప్రసారమయ్యే ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఉద్యానశాఖ ఉపసంచాకుడు బీ బాబు సమాధానాలు ఇస్తారు. ఆసక్తిగల రైతులు 040-27031431, 0450-27031432, 040-27031433 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని అధికారులు పేర్కొన్నారు.

ఎస్సారెస్పీలోకి భారీగా ఇన్‌ఫ్లో


- 25.017 టీఎంసీలకు చేరిన నీటి మట్టం
- కొనసాగుతున్న 40 వేల 87 క్యూసెక్కుల వరద


జలకళను సంతరించుకున్న ఎస్సారెస్పీ

మెండోరా : ఎస్సారెస్పీ నీటి మట్టం క్రమంగా పెరుగుతున్నది. మంగళవారం ఎగువన మహారాష్ట్ర నుంచి వచ్చి చేరుతున్న, స్థానికంగా కురిసిన వర్షాలతో వచ్చి చేరుతున్న 40 వేల 87 క్యూసెక్కుల వరదతో ప్రాజెక్టు నీటి మట్టం పెరుగుతున్నది. సోమవారం రాత్రి 1065 అడుగుల నీటి మట్టంతో 20.180 టీఎంసీలుగా ఉన్న నీటి నిల్వ మంగళవారం రాత్రి వరకు 1067.60 అడుగుల నీటి మట్టంతో 25.017 టీఎంసీలకు చేరింది. మహారాష్ట్రలోని విష్ణుపురి ప్రాజెక్టు నుంచి సోమవారం సాయంత్రం వదిలిన 26 వేల క్యూసెక్కుల వరదకు తోడు, మహారాష్ట్రలో, జిల్లాలో గోదావరి పరీవాహక ప్రాంతంలో వర్షాలతో 42 వేల 768 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ప్రాజెక్టులోకి చేరుతున్నదని అధికారులు తెలిపారు. మంగళవారమే ప్రాజెక్టులోకి 4.837 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1091 అడుగులు, 90 టీఎంసీలు కాగా మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్టులో 1067.60 అడుగుల నీటి మట్టం, 25.017 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈఈ మహేందర్ తెలిపారు.

కడెం, గడ్డెన్నవాగుల్లో పెరిగిన నీటిమట్టాలు

నిర్మల్, నమస్తే తెలంగాణ: నిర్మల్ జిల్లాలోని ప్రధాన రిజర్వాయర్లు అయిన కడెం, గడ్డెన్నవాగు, స్వర్ణ ప్రాజెక్టు నీటి మట్టాలు పెరుగుతున్నాయి. కడెం ప్రాజెక్టు నీటిమట్టం 700 అడుగులు కాగా ప్రస్తుతం 698 అడుగుల నీటి మట్టానికి చేరుకున్నది. ప్రాజెక్టులోకి 1100 క్యూసెక్కుల వరద కొనసాగుతున్నది. గడ్డెన్నవాగు ప్రాజెక్టు నీటిమట్టం 358.5 అడుగులు కాగా ప్రస్తుతం 356 అడుగుల వద్ద ఉన్నది. సారంగాపూర్ మండలంలోని స్వర్ణ ప్రాజెక్టు నీటిమట్టం 1179 అడుగుల వద్ద ఉంది.


ఎల్లంపల్లి ప్రాజెక్టు

ఎల్లంపల్లికి వరద నీరు

అంతర్గాం : నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో రోజు రోజుకు నీటి నిల్వ పెరుగుతున్నది. ప్రాజెక్టు సామర్థ్యం 20 టీఎంసీలు కాగా, మంగళవారం నాటికి 11.680 టీఎంసీల నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి గోదావరిలోకి 2930 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉందన్నారు.

నిజాంసాగర్‌లోకి 1049 క్యూసెక్కులు



కామారెడ్డి / నమస్తే తెలంగాణ : కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు వరప్రదాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 1049 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. 17.802 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి గాను... 1383.50 అడుగులతో 2.056 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కల్యాణి ప్రాజెక్టు 409.50 మీటర్ల లెవల్‌కు గాను 408.80 మీటర్ల లెవల్ వరకు నీటి మట్టం చేరింది. ఎగువ ప్రాంతం నుంచి 179 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. ఈ నీటిని నిజాంసాగర్ మెయిన్ కెనాల్‌లోకి మళ్లిస్తున్నారు.

సమ్మయ్యకు కన్నీటి వీడ్కోలు


బొచ్చు సమ్మయ్య అంత్యక్రియల్లో భాగంగా పోలీసుల గౌరవ వందనం


బొచ్చు సమ్మయ్య పార్థివదేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న దృశ్యం

పరకాల, నమస్తే తెలంగాణ: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి బొచ్చు సమ్మయ్యకు అభిమానులు మంగళవారం వరంగల్ రూరల్ జిల్లా పరకాలలో కన్నీటి వీడ్కోలు పలికారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సమ్మయ్య అంత్యక్రియలను అధికారికంగా నిర్వహించారు. ఉదయం దళితవాడలోని ఆయన ఇంటివద్ద ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులతోపాటు కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, సీపీ సుధీర్‌బాబు, రెవెన్యూ, పోలీసు అధికారులు సమ్మయ్య పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఇంటి నుంచి దమ్మన్నపేట రహదారిలోని వ్యవసాయక్షేత్రం వరకు దాదాపు మూడు గంటలపాటు అంతిమయాత్ర సాగింది. సాయుధ పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపి సమ్మయ్యకు అధికారిక వందనాన్ని సమర్పించారు. అనంతరం ఆయన కుమారుడు జస్టిస్ సుజయ్‌కుమార్ తండ్రికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఎమ్మెల్యేలు రాజయ్య, చల్లా ధర్మారెడ్డి, దొంతి మాధవరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొచ్చు వినయ్, మాజీ మంత్రులు పొన్నాల లక్ష్మయ్య, జగన్‌నాయక్, ఆరోగ్యం, విజయరామారావు, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, పోడెం వీరయ్య, కొండేటి శ్రీధర్, కాంగ్రెస్ నాయకులు రాజనాల శ్రీహరి, జంగా రాఘవరెడ్డి, కట్ల శ్రీనివాస్, విజయ్, శ్రీనివాస్, ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, కత్తి వెంకటస్వామి, బీజేపీ నాయకుడు పెసరు విజయచందర్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు మంద కుమార్, సారంగపాణి, కృష్ణ, విజయ్‌తోపాటు టీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో అంత్యక్రియలకు హాజరయ్యారు.


కరీంనగర్ జిల్లా రేకుర్తిలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో చేతులు పైకెత్తి తమ సమ్మతిని తెలుపుతున్న రైతులు, ప్రజాప్రతినిధులు

'కాళేశ్వరం' కట్టాల్సిందే

- ఆ ప్రాజెక్టుతోనే మా భవిష్యత్తు
- తెలంగాణకు అదే జీవనాధారం
- ప్రజాభిప్రాయ సేకరణలో 4జిల్లాల రైతుల మనోగతం

కాళేశ్వరం ప్రాజెక్టు కట్టితీరాల్సిందేనని పలు జిల్లాలకు చెందిన రైతులు, ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు గొంతెత్తి చాటారు. ఇన్నాళ్లు నీళ్లు లేక అవస్థలు పడ్డాం.. బోర్ల కోసం అప్పుల పాలయ్యాం.. పొలాలూ అమ్ముకున్నాం. ప్రస్తుతం తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు సీఎం కేసీఆర్ రూపకల్పన చేసిన కాళేశ్వరం ప్రాజెక్టును కట్టి తీరాలని,దీనిపైనే తమ భవిష్యత్తు ఆధారపడి ఉందని కరీంనగర్, నిజామాబాద్, మేడ్చల్, యాదాద్రి జిల్లాల రైతులు అభిప్రాయపడ్డారు.

కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: తెలంగాణ రైతు బతుకులు మారాలంటే కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నిర్మించి తీరాలని కరీంనగర్ జిల్లా రైతులు, ప్రజాప్రతినిధులు ముక్త కంఠంతో నినదించారు. ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులపై మంగళవారం కాలుష్య నియంత్రణ మండలి, నీటి పారుదల శాఖల ఆధ్వర్యంలో కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ జిల్లాలోని రేకుర్తిలో ప్రజాభిప్రాయ సేకరణ జరిపారు. పాల్గొన్న వారిలో ఏ ఒక్కరు కూడా ప్రాజెక్టును వ్యతిరేకించ లేదు. తెలంగాణలోని కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, యాదాద్రి, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, నిర్మల్, మేడ్చల్, నల్గొండ, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలకు 180 టీఎంసీల నీటిని మళ్లించేలా ముఖ్యమంత్రి కేసీఆర్ రీడిజైన్ చేశారని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రజాసంఘాల నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, ఎమ్మెల్యే లు గంగుల కమలాకర్, రసమయి బాలకిషన్, బొడిగ శోభ, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై సీఎం కేసీఆర్ సంకల్పానికి రైతులు, ప్రజలు, ప్రజాప్రతినిధుల మద్దతు ఉన్నదన్నారు. ఈ ప్రాజెక్టుతో బీడు భూములు సస్యశ్యామలం అవుతాయని పేర్కొన్నారు.

రివర్స్ పంపింగ్ అత్యద్భుతం..



జల దేవుడు కేసీఆర్ రూపకల్పన చేసిన ప్రాజెక్టుల రీ డిజైనింగ్‌ను రైతులు హర్షిస్తున్నారు. ఏ సీఎం కూడా ఇప్పటివరకు కేసీఆర్‌లా ఆలోచన చేయలేదు. ఎండిపోతున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు జీవం పోసేందుకు రూపకల్పన చేసిన రివర్స్ పంపింగ్ పథకం ఎంతో అద్భుతంగా ఉంది.

- దాడి సుధాకర్, రైతు సంఘం అధ్యక్షుడు, బొమ్మకల్, కరీంనగర్ జిల్లా

మేడ్చల్ జిల్లాలో సంపూర్ణ మద్దతు

శామీర్‌పేట/మేడ్చల్ రూరల్: కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి గోదావరి నీటిని సాగు కోసం మేడ్చల్ జిల్లాకు తరలించేందుకు ప్రజామోదం లభించింది. పర్యావరణ అనుమతుల నిమిత్తం శామీర్‌పేట మండలం తుర్కపల్లిలో ప్రజాభిప్రాయ సేకరణ జరిపారు. కలెక్టర్ ఎంవీ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో పాటు 45 మంది వేదికపైకి వచ్చి అభిప్రాయాలు తెలిపారు. కాల్వల ద్వారా నీటిని తరలించడం తమకు సమ్మతమేనని పార్టీలకతీతంగా ఏకగ్రీవంగా తెలిపారు. కాంగ్రెస్‌కు చెందిన శామీర్‌పేట జెడ్పీటీసీ బాలేశ్ మాట్లాడుతూ.. గోదావరి నీటితో శామీర్‌పేట పెద్ద చెరువుతోపాటు మిగితా చెరువులను నింపడాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

కాళేశ్వరంపైనే భవిష్యత్తు

నిజామాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి పర్యావరణ అనుమతులు ఇవ్వాలని నిజామాబాద్ జిల్లా రైతులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు కోరారు. ఎస్సారెస్పీ రివర్స్ పంపింగ్ సిస్టమ్‌తో నిజామాబాద్ జిల్లాలో 20, 21వ ప్యాకేజీల కింద చేపట్టే పనుల ద్వారా కలిగే ప్రయోజనాలు, సమస్యను తెలుసుకునేందుకు ఇన్‌చార్జి కలెక్టర్ రవీందర్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 15 మండలాల్లోని 145 గ్రామాల్లో లక్షా 80వేల ఎకరాలు సాగులోకి వస్తుందన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మాట్లాడుతూ తమ భూములు సస్యశ్యామలం కావాలని జిల్లా రైతులు కోరుకుంటున్నారన్నారు.

స్వాగతిస్తున్నాం..



గ్రామంలో ఉన్న కొద్దిపాటి భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ అటవీ ఉత్పత్తులను సేకరిస్తూ పశుపోషణ చేస్తూ జీవిస్తున్నాం. ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణం చేపడ్తామంటే స్వాగతిస్తాం.

- రతన్‌సింగ్, అమ్రాబాద్, నిజామాబాద్

జనామోదం

యాదాద్రి భువనగిరి ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కాళేశ్వరం ప్రాజెక్టుకు జనామోదం లభించింది. దశాబ్దాలుగా దగాపడిన ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే తప్పక సాగునీరు రావాల్సిందేనని యాదాద్రి భువనగిరి జిల్లా రైతాంగం తేల్చి చెప్పింది. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో కలెక్టర్ అనితారామచంద్రన్ అధ్యక్షతన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ప్రజలు, మేధావులు, ప్రజాసంఘాల వారు తరలివచ్చి అభిప్రాయాలు వెల్లడించారు. భువనగిరి ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, ఎలిమినేటి కృష్ణారెడ్డిలు మాట్లాడుతూ.. ప్రాజెక్టుల వల్ల సర్వం కోల్పోయే గ్రామాల ప్రజలకు పరిహారంపై భయం అవసరం లేదని భరోసానిచ్చారు. ఈ ప్రాజెక్టులతో ఎవరికీ ఇబ్బందులు కలిగే పరిస్థితి ఉండదన్నారు.

అడ్డుకోవద్దు..



ప్రాజెక్టు కట్టి తీరాల్సిందే. నీళ్లు లేక నాకున్న 30 ఎకరాల్లో 16 ఎకరాలు బోర్ల కోసం అమ్ముకున్నా. ఆలేరు ప్రాంతం ఎడారిగా మారింది. సీఎం కేసీఆర్ పెద్దన్నలా అభివృద్ధి చేస్తుంటే అడ్డుకోవడం తగదు.

- గుత్తా శమంతారెడ్డి, మహిళా రైతు, ఆలేరు


కోదాడలో రేడియో గురు 90.4 ఎఫ్‌ఎం కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు

అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయం


కోదాడ, నమస్తే తెలంగాణ : వ్యవసాయ రంగంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో చితికిపోయిన కుల వృత్తులకు జీవం పోసి, వారి ఆర్థిక పరిపుష్ఠికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని విద్యుత్ శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కోదాడలో రూ.65 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన వ్యవసాయ సహకార సంఘ భవనాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ నాటి ఉద్యమ సారథి, నేటి సీఎం కేసీఆర్ 2002లో ఇదే కోదాడ నుంచి పెదవూరకు జరిపిన పాదయాత్రలో ఇక్కడి రైతుల పరిస్థితులను అధ్యయనం చేశారన్నారు. నాగార్జునసాగర్ డెడ్‌స్టోరేజీ నుంచి కూడా నీరు వదిలి ఎడమ కాల్వ చివరి భూముల రైతాంగాన్ని ఆదుకున్న సందర్భం చరిత్రాత్మకమన్నారు. శ్రీరాంసాగర్ రెండో దశ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, అవి పూర్తయితే కోదాడ నియోజకవర్గంలో భూములు సస్యశ్యామలమవుతాయని తెలిపారు. ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రా పాలనలో రిజర్వాయర్లు లేకపోవడం వల్లే ఇక్కడి భూములు నీళ్లకు నోచుకోలేదని, అందుకే సీఎం కేసీఆర్ రిజర్వాయర్లను నిర్మిస్తున్నారన్నారు. అనంతరం సూర్యాపేట జిల్లాలో ప్రప్రథమంగా కోదాడలో నెలకొల్పిన 90.4 ఎఫ్‌ఎం రేడియో కేంద్రాన్ని మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి, బీసీ కమిషన్ సభ్యుడు జూలూరి గౌరీశంకర్, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, శశిధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత పాల్గొన్నారు.


కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గిరిజన వసతిగృహంలో మొక్క నాటుతున్న మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి. చిత్రంలో కలెక్టర్ సత్యనారాయణ తదితరులు

న్యూట్రిషన్ గార్డెన్లతో పౌష్ఠికాహారం

కామారెడ్డి, నమస్తే తెలంగాణ/భిక్కనూరు : విద్యార్థులకు పౌష్ఠికాహారం అందించడంలో న్యూట్రిషన్ గార్డెన్‌లు ఎంతో కీలకమని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గిరిజన వసతిగృహం, భిక్కనూరు మండలం జంగంపల్లి కేజీబీవీలో కిచెన్ గార్డెన్లను పరిశీలించారు. బొప్పాయి, జామ, నిమ్మ, మామిడి, దానిమ్మ మొక్కలను మంత్రి నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే తొలిసారిగా జిల్లాలో న్యూట్రిషన్ గార్డెన్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థికి 300 గ్రాముల పౌష్ఠికాహారాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో విప్ గంప గోవర్ధన్, కలెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రాజెక్టుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, నీటి నిల్వ వివరాలు


(జూన్1 నుంచి ఇప్పటివరకు 446.218 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిశాయి)

కృష్ణా బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
ఆల్మట్టి	0	7291	1705	1703.48	128.72	121.40
నారాయణపూర్	5817	230	1615	1612.50	37.646	34.21
జూరాల	2577	2230	1045	1038.91	9.66	6.19
తుంగభద్ర	4327	1050	1633	1618.31	100.86	53.78
శ్రీశైలం	1898	46	885	781.90	215.807	21.10
నాగార్జునసాగర్	509	509	590	500.20	312.045	115.626
పులిచింతల	0	0	175	119.69	45.77	3.71
ప్రకాశం బ్యారేజీ	14818	14818	54.95	56.85	3.070	3.03

గోదావరి బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
జైక్వాడ్	31599	118	1522	1513.81	102.732	72.00
కడెం	2423	861	700	697.98	7.6	7.082
ఎస్సారెస్పీ	40087	797	1091	1067.60	90.313	25.017
సింగూరు	5858	395	1717.93	1709.15	29.91	18.04
నిజాంసాగర్	1049	65	1405	1383.50	17.803	2.056
ఎల్లంపల్లి	2930	660	485	474.11	20.175	11.68
లోయర్‌మానేరు	0	129	920	893.50	24.07	7.333
ధవళేశ్వరం	260369	261295	45	45	2.93	2.93

రక్తసిక్తమైన రహదారి

- ఆసిఫాబాద్ జిల్లాలో లారీ, ఆటో ఢీకొని ఆరుగురు దుర్మరణం
- మరో ఐదుగురికి తీవ్ర గాయాలు
- మంచిర్యాల దవాఖానకు తరలింపు
- భవాని జాతరకు వెళ్లివస్తుండగా ఘటన


కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బెండారా సమీపంలో జరిగిన ప్రమాద స్థలంలో చెల్లాచెదురుగా పడిన మృతదేహాలు

వాంకిడి/ఆసిఫాబాద్ రూరల్ /కెరమెరి : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం బెండార గ్రామ సమీపంలోని అంతర్రాష్ట్ర రహదారిపై మలుపు వద్ద మంగళవారం మధ్యాహ్నం లారీ, ఆటో ఢీకొనడంతో నలుగురు యువకులు, ఇద్దరు బాలురు దుర్మరణం చెందారు. కెరమెరి మండలం ఝరి, నీమ్‌గూడ, అగర్‌వాడకు చెందిన 11 మంది పొలాల అమావాస్య పండుగను పురస్కరించుకుని వాంకిడి మండలం సరండి గ్రామ సమీపంలోని గుట్టపై జరిగే భవాని జాతరకు మంగళవారం ఉదయం ఆటోలో వెళ్లారు. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో తిరిగి ఆటోలో స్వగ్రామాలకు బయలు దేరారు. బెండార గ్రామ సమీపంలోని మూల మలుపు వద్దకు ఆటో రాగానే గుర్తుతెలియని లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నీమ్‌గూడ వాసులు వేడుమ అంబారావు (20), తిరుపతి (22) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడ్డ అగర్‌వాడకు చెందిన మొహర్లే సంతోష్(18) ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతూ చనిపోయాడు. ఝరి గ్రామానికి చెందిన లేండ్గురే రమేశ్ (14)ను మంచిర్యాలకు తరలిస్తుండగా రెబ్బెన సమీపంలో ప్రాణాలు వదిలాడు. ఝరి గ్రామానికి చెందిన మొహర్లే జ్ఞానేశ్వర్(21), నీమ్‌గూడకు చెందిన ఇగురపు నవీన్ (15) మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందారు. నీమ్‌గూడ చెందిన కే రవీందర్, మొహర్లే తిరుపతి, మొహర్లే రాందాస్, వాడై గణేశ్, సాంగ్వికి చెందిన రాంచందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరంతా చికిత్సపొందుతున్నారు. డీఎస్పీ హబీబ్‌ఖాన్, వాంకిడి సీఐ శ్రీనివాస్, కాగజ్‌నగర్ సీఐ ప్రసాద్‌రావు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆసిఫాబాద్, మంచిర్యాల ప్రభుత్వ దవాఖానల్లో మృతుల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అశ్వాపురం రూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో మంగళవారం బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతిచెందాడు. భూపాలపల్లి జిల్లా మంగపేటకు చెందిన లోతు నాగరాజు(30) మిషన్ భగీరథలో పనిచేస్తున్నాడు. నాగరాజు అశ్వాపురం వైపు వెళ్తున్న క్రమంలో గొల్లగూడెం వద్ద బైక్ అదుపుతప్పి కింద పడగా అక్కడికక్కడే మృతి చెందాడు.

ఇద్దరు సోదరుల దారుణహత్య


ఆంజనేయులు, అన్నమయ్య (ఫైల్)

కనగల్: భూతగాదాల నేపథ్యంలో ఇద్దరు సోదరులను ప్రత్యర్థులు కొడవళ్లు, గొడ్డలితో దాడిచేసి దారుణంగా హత మార్చారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా కనగల్ మండలం కురంపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై నర్సింహులు, గ్రామస్తులు, మృతుల బంధువులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దాసరి యాదగిరి అతని కుమారులైన దాసరి ఆంజనేయులు(22), దాసరి అన్నమయ్య(20)లను ప్రత్యర్థులు పొలం వద్ద మాటు వేసి తల, మెడపై దాడిచేసి అత్యంత కిరాతకంగా హతమార్చారు. ఇదే గ్రామానికి చెందిన దోటి వెంకటేశం, దోటి పాండరయ్యలతో దాసరి యాదగిరికి గత మూడేండ్లుగా భూ తగాదాలు ఉన్నాయి. ఇటీవల కూడా ఇరువర్గాల మధ్య ఘర్షణ జరుగడంతో పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. పాండరయ్య కుమారుడు అక్కలయ్య మిర్యాలగూడ గ్రామానికి చెందిన ఓ మహిళను కులాంతరం వివాహం చేసుకున్నాడు. సదరు మహిళ కురంపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద రెండెకరాల భూమిని కొనుగోలు చేసి తన పేరిట రిజిస్ట్రేషన్ చేసుకుంది. అక్కలయ్యకు ఆమెకు నడుమ తగాదాలు జరుగుతుండటంతో విడాకులు కావాలని పదేండ్ల క్రితం ఆమె కోర్టులో కేసువేసింది. ఈ క్రమంలో సదరు మహిళ తన పేరిట ఉన్న భూమిని దాసరి యాదగిరికి విక్రయించింది. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న దోటి వెంకటేశం, దోటి పాండరయ్యతోపాటు అతని కుమారులు భరత్, సైదులు, కిరణ్, అక్కలయ్య, మల్లేశ్ పథకం ప్రకారం పొలం వద్దకు వెళ్లారు. అక్కడే ఉన్న యాదగిరి ఇద్దరు కుమారులపై దాడిచేసి హత్య చేశారు. సంఘటనా స్థలాన్ని నల్లగొండ డీఎస్పీ సుధాకర్ పరిశీలించారు. హత్యకు దారితీసిన కారణాలను స్థానికుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. నిందితులను త్వరలో పట్టుకుంటామన్నారు. గ్రామంలో జంట హత్యలు జరిగిన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

కుమారుడికి రోడ్డు ప్రమాదం.. గుండెపోటుతో తండ్రి మృతి

చిన్నకోడూరు : రోడ్డు ప్రమాదంలో కొడుకు గాయపడి దవాఖానలో చేరడాన్ని తట్టుకోలేక తండ్రి గుండెపోటుతో మృతి చెందిన విషాదకర సంఘటన సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మాచాపూర్‌లో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. చిన్నకోడూరు మండలం మాచాపూర్ నుంచి ఇబ్రహీంనగర్ ఆదర్శ పాఠశాలకు వెళుతున్న విద్యార్థుల ఆటో ఇటీవల ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా మరో ఆరుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. మాచాపూర్ గ్రామానికి చెందిన జెరిపోతుల ప్రకాశం-బాబాయిల కుమారుడైన అజయ్‌కు కాలు, ఊపిరితిత్తులకు బలమైన గాయాలయ్యాయి. అతడు సికింద్రాబాద్‌లోని గాంధీ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. కుమారుడు అజయ్ పరిస్థితిని చూసి తట్టుకోలేక ప్రకాశానికి గుండెపోటు వచ్చింది. అదే దవాఖానలో చికిత్స అందించినా నయం కాకపోవడంతో వెంటనే నిమ్స్‌కి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. కొడుకు దవాఖానలో చికిత్స పొందుతుండగా, తండ్రి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రకాశం కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.5 వేలు పంపించారు.

తలపై మోది.. మెదడును చీల్చి..

కొవ్వూరు : ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు మండలం పంగిడిలో దారుణం చోటుచేసుకున్నది. ఓ మతి స్థిమితం లేని వ్యక్తి చెరువు కాపలాదారుడిని అత్యంత దారుణంగా హతమార్చాడు. గ్రామానికి చెందిన చిన నాగేశ్వరావు చెరువు కాపలాదారుడిగా ఉన్నాడు. ఓ మతిస్థిమితం లేని వ్యక్తి అక్కడకు వచ్చి అతడి తలపై బాది హత్య చేశాడు. తలను చీల్చి మెదడును తింటుండడాన్ని గమనించిన స్థానికులు అతడిని పట్టుకొని పంచాయతీ కార్యాలయం వద్ద స్తంభానికి కట్టేసి పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.

మెరిసిన క్రీడారత్నాలు


జ్యోతి సురేఖ

దేవేంద్ర, సర్దార్‌కు ఖేల్ రత్న .. తెలుగు క్రీడాకారులు సాకేత్, సురేఖకు అర్జున

హైదరాబాద్ సాకర్ స్టార్ సయ్యద్ హకీమ్‌కు ధ్యాన్‌చంద్ అవార్డు

ఈ ఏడాదికి క్రీడా పురస్కారాలు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

క్రీడారత్నాలు జిగేల్‌మన్నాయి. అంతర్జాతీయ వేదికలపై ప్రతిభాపాటవాలు చాటి దేశ ఖ్యాతిని దశదిశలా ఇనుమడింపచేసిన ఆటగాళ్లను అవార్డులు వరించాయి. ఈ ఏడాదికిగాను ప్రతిష్ఠాత్మక క్రీడాపురస్కారం ఖేల్‌రత్నతో పాటు అర్జున, ద్రోణాచార్య, ధ్యాన్‌చంద్ పురస్కారాలు అందుకోబోతున్న వారి వివరాలను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. వీరిలో హైదరాబాద్‌కు చెందిన పుట్‌బాల్ దిగ్గజం సయ్యద్ షాహిద్ హకీమ్ ధ్యాన్‌చంద్ జీవితకాల సాఫల్య పురస్కారానికి.. తెలుగు క్రీడాకారులు సాకేత్ మైనేని, జ్యోతి సురేఖలు అర్జునకు ఎంపికవడం విశేషం.

న్యూఢిల్లీ: ప్రతిభకు తగిన గుర్తింపు ఉంటేనే సార్థకత. అది ఆటగానికైనా..అతన్ని ఆరాధించే అభిమానులకైనా. ప్రదర్శనను మరింత మెరుగుపర్చుకునే క్రమంలో ఏ ఆటగానికైనా అవార్డులు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయనడంలో సందేహం లేదు. ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా ఆయా క్రీడా విభాగాల్లో సత్తాచాటిన క్రీడాకారులకు అవార్డులను కేంద్ర క్రీడాశాఖ మంగళవారం అధికారికంగా ప్రకటించింది. జస్టిస్ సీకే థక్కర్ నేతృత్వంలోని అవార్డుల సెలెక్షన్ కమిటీ తుది జాబితాను వెలువరించింది. వివిధ క్రీడా సంఘాల నుంచి వచ్చిన సిఫారసులను పరిగణనలోకి తీసుకుని కేంద్ర క్రీడాశాఖ ఆమోదంతో విజేతల వివరాలను ప్రకటించారు. ఇద్దరికి రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న, 17మందికి అర్జున, ఏడుగురికి ద్రోణాచార్య, ముగ్గురికి ధ్యాన్‌చంద్ జీవితకాల సాఫల్యం పురస్కారాలను ప్రకటించారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవమైన ఈనెల 29న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు. ఖేల్‌రత్న అవార్డు కింద రూ.7.5 లక్షల నగదు, అర్జున, ద్రోణాచార్య, ధ్యాన్‌చంద్ అవార్డులకు రూ.5 లక్షల నజరానాతో పాటు ప్రశంస పత్రం, జ్ఞాపికను విజేతలు అందుకోనున్నారు.


హర్మన్‌ప్రీత్ కౌర్


పుజారా

17 మంది 'అర్జునులు':

ఈ యేడాది మొత్తం 17 మంది ఆటగాళ్లకు అర్జున అవార్డు దక్కింది. ఇందులో క్రికెటర్ చతేశ్వర్ పుజారా, ఇటీవల మహిళల క్రికెట్ ప్రపంచకప్‌లో ఫైనల్ చేరిన భారత జట్టులోని సభ్యురాలైన హర్మన్‌ప్రీత్‌కౌర్, రియో పారాలింపిక్స్‌లో పతకాలు సాధించిన అథ్లెట్లు మరియప్పన్ తంగవేలు, వరుణ్ భాటియా ఉన్నారు. వీరితో పాటు ఇద్దరు తెలుగు తేజాలకు అర్జున గౌరవం దక్కింది. అంతర్జాతీయ స్థాయి ఆర్చరైన జ్యోతి సురేఖ, ప్రముఖ టెన్నిస్ క్రీడాకారుడు సాకేత్ మైనేని అర్జున పురస్కారాన్ని అందుకోబోతున్నారు.

సేవలకు గుర్తింపు:

క్రీడా అభివృద్ధికి అందించిన అనితర సేవలకు గుర్తింపుగా ముగ్గురికి ధ్యాన్‌చంద్ జీవితకాల సాఫల్య (లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్) పురస్కారం లభించింది. ఇందులో హైదరాబాదీ సాకర్ మాంత్రికుడు సయ్యద్ షాహిద్ హకీమ్‌తో పాటు భూపేందర్‌సింగ్(అథ్లెటిక్స్), సుమరయి(హాకీ) ఉన్నారు. 76ఏండ్ల సయ్యద్ షాహిద్ హకీమ్ 1960 రోమ్ ఒలింపిక్స్‌లో పోటీపడ్డ భారత జట్టులో సభ్యునిగా ఉన్నారు.

ఏడుగురు ద్రోణుల్లో తెలుగువాడు:

ఆటగాళ్లను మెరికల్లా తీర్చిదిద్దిన గురువులకు ద్రోణాచార్య అవార్డుతో తగిన గుర్తింపు లభించింది. ప్రస్తుత జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ పుల్లెల గోపీచంద్‌తో పాటు ఎంతో మంది క్రీడాకారులను సానబట్టిన ఏపీలోని ఏలూరుకు చెందిన సీనియర్ బ్యాడ్మింటన్ కోచ్ జీఎస్ఎస్‌వీ ప్రసాద్‌కు ద్రోణాచార్య అవార్డు దక్కింది. ప్రసాద్‌తో పాటు భూషణ్ మహంతీ, రాఫెల్, సంజయ్ చక్రవర్తి, రోషన్‌లాల్ ద్రోణాచార్యకు ఎంపికయ్యారు.


సర్దార్ సింగ్
దేవేంద్ర జజారియా

ఖేల్ రత్నాలు

దేశంలోనే ప్రతిష్ఠాత్మక క్రీడా అవార్డుగా భావించే రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న అవార్డు పారా అథ్లెట్ దేవేంద్ర జాజారియా, భారత హాకీ మాజీ కెప్టెన్ సర్దార్‌సింగ్‌ను వరించింది. రియో(2016) పారాలింపిక్స్‌తో పాటు 2004(ఏథెన్స్) పారాలింపిక్స్‌లో స్వర్ణాలు నెగ్గిన జావెలియన్ త్రోయర్ దేవేంద్ర, ఖేల్‌రత్న గెలిచిన మొదటి పారా అథ్లెట్‌గా రికార్డుల్లోకెక్కాడు. లియాన్ (2013) ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం, దోహా (2015) ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజతంతో ఆకట్టుకున్న దేవేంద్రను ఖేల్‌రత్న అవార్డుకు తొలి చాయిస్‌గా సెలెక్షన్ కమిటీ ఎంపిక చేసింది. గత దశాబ్ద కాలంగా భారత హాకీకి విశేష సేవలందించిన స్టార్ మిడ్‌ఫీల్డర్ సర్దార్‌సింగ్‌ను కమిటీ పరిగణనలోకి తీసుకుంది. ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్‌కు పతకాలు అందించడంలో కీలకంగా వ్యవహరించిన సర్దార్‌సింగ్..అంతర్జాతీయ హాకీ సమాఖ్య(ఎఫ్ఐహెచ్) ప్రకటించిన 2010, 2011 'ఆల్‌స్టార్' జట్టులో చోటు దక్కించుకున్నాడు. 31ఏండ్ల సర్దార్ ఇప్పటికే దేశ నాలుగో అత్యున్నత పురస్కారం పద్మశ్రీ (2015)ని కూడా అందుకున్నాడు. ఇలా ప్రదర్శనను ఆధారంగా చేసుకున్న సెలెక్షన్ కమిటీ ఇద్దరికీ ఖేల్‌రత్న అవార్డును ఇవ్వాలని నిర్ణయించింది.

ఈ ఏడాది క్రీడా పురస్కార గ్రహీతలు వీళ్లే

రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న

దేవేంద్ర జాజారియా (పారా అథ్లెట్), సర్దార్‌సింగ్ (హాకీ)

ద్రోణాచార్య

గాంధీ (అథ్లెటిక్స్), హీరానంద్ కటారియా (కబడ్డీ), జీఎస్ఎస్‌వీ ప్రసాద్ (బ్యాడ్మింటన్),బ్రిజ్ భూషణ్ మహంతీ (బాక్సింగ్), పీఏ రాఫెల్ (హాకీ), సంజయ్ చక్రవర్తి (షూటింగ్),రోషన్ లాల్ (రెజ్లింగ్)

అర్జున

వీజే సురేఖ (ఆర్చరీ),ఖుష్బీర్‌కౌర్ (అథ్లెటిక్స్), రాజీవ్ ఆరోకియా (అథ్లెటిక్స్), ప్రశాంతిసింగ్ (బాస్కెట్‌బాల్), దేవేంద్రోసింగ్ (బాక్సింగ్), పుజార (క్రికెట్),హర్మన్‌ప్రీత్‌కౌర్ (క్రికెట్),బొంబేమ్ దేవి (పుట్‌బాల్),చౌరాసియా (పుట్‌బాల్),ఎస్‌వీ సునీల్ (హాకీ),జస్వీర్‌సింగ్ (కబడ్డీ), పీఎన్ ప్రకాశ్ (షూటింగ్), అమల్‌రాజ్ (టీటీ), సాకేత్ మైనేని (టెన్నిస్), సత్యవర్థ్ కైదాన్ (రెజ్లింగ్), మరియప్పన్ (పారా అథ్లెట్), వరుణ్‌సింగ్ భాటీ (పారా అథ్లెట్),

ధ్యాన్‌చంద్ అవార్డు

భూపిందర్‌సింగ్ (అథ్లెటిక్స్), సయ్యద్ షాహిద్ హకీమ్ (పుట్‌బాల్),సుమరయి (హాకీ).

తెలుగు వెలుగులు

క్రీడా అవార్డుల్లో తెలుగు వెలుగులు విరజిమ్మాయి. అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటిన యువ ఆర్చర్ వన్నెం జ్యోతి సురేఖ, టెన్నిస్ స్టార్ సాకేత్ మైనేని ఈ యేటి అర్జున అవార్డుకు ఎంపికై ఆకట్టుకున్నారు. వేదికలు ఏవైనా..దేశానికి ప్రాతినిధ్యం వహించడమే లక్ష్యంగా వీరిద్దరి ప్రదర్శన కొనసాగింది. పసి ప్రాయంలోనే కృష్ణా నదిలో 5కి.మీల దూరాన్ని మూడు గంటల్లో ఈది లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న విజయవాడ వాసి జ్యోతి సురేఖ..ఆర్చరీలో అంచనాలకు మించి రాణించింది. ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్ 2011(టెహ్రాన్)లో కాంస్యం, బ్యాంకాక్(2015)లో స్వర్ణంతో మెరిసింది. ప్రపంచ యూత్ ఆర్చరీ చాంపియన్‌షిప్ 2013, 15లో కాంస్య పతకాలతో సత్తాచాటింది. మరోవైపు 11 ఏండ్లకే టెన్నిస్ రాకెట్ పట్టుకున్న సాకేత్ మైనేని అనతికాలంలోనే అద్భుత ప్రతిభ గల ఆటగానిగా గుర్తింపు పొందాడు. ఇంచియాన్(2014) ఆసియా క్రీడల్లో సానియా మీర్జాతో కలిసి పసిడి పతకం గెలిచిన సాకేత్..డబుల్స్‌లో సనమ్‌సింగ్ జతగా రజత పతకాన్ని దక్కించుకున్నాడు. ఇలా మెగా టోర్నీలకే పరిమితం గాకుండా ఐటీఎఫ్, ఏటీపీ టోర్నీల్లోనూ సత్తాచాటిన ఈ 29 ఏండ్ల కుర్రాడు డేవిస్‌కప్‌లో కీలక ఆటగానిగా మారాడు.


సాకేత్



ఆలస్యమైనా గుర్తించారు

మన సాకర్ మాంత్రికునికి గౌరవం

(నమస్తే తెలంగాణ క్రీడా ప్రతినిధి)

హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్‌కు భారతరత్న ప్రకటించకపోవడం.. హైదరాబాదీ సాకర్ మాంత్రికుడు సయ్యద్ షాహిద్ హకీంకు ధ్యాన్‌చంద్ పురస్కారం అందించకపోవడం రెండూ ఒకటే అని ఇన్నాళ్లూ తెలుగు క్రీడాభిమానులకున్న ఆవేదన ఇది! కానీ, ఆలస్యంగానైనా హకీం ప్రతిభను గుర్తిస్తూ అతనికి ప్రతిష్ఠాత్మక ధ్యాన్‌చంద్ జీవితసాఫల్య పురస్కారాన్ని ప్రకటించి అభిమానుల వేదనను తీర్చడం సంతోషకరం. హైదరాబాద్‌కు చెందిన హకీం కుటుంబం రెండు తరాలుగా భారత సాకర్ ఎదుగుదలకు ఎంతో కృషి చేసింది. హకీం తండ్రి దివంగత సయ్యద్ అబ్దుల్ రహీం జాతీయ సాకర్ జట్టు కోచ్‌గా భారత్‌కు రెండుసార్లు ఆసియాకప్ స్వర్ణాలు అందించడంతోపాటు, 1956 మెల్‌బోర్న్ ఒలింపిక్స్‌లో జట్టును సెమీఫైనల్స్ చేర్చిన ఘనత అందుకున్నారు. తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న హకీం 1960 రోమ్ ఒలింపిక్స్‌లో ఆరోస్థానంలో నిలిచిన భారత జట్టులో సభ్యునిగా ఉన్నారు. తన 25 ఏండ్ల సాకర్ కెరీర్‌లో 33 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన హకీం.. ఖతార్ వేదికగా1988లో జరిగిన ఆసియా కప్‌లో రాణించిన భారత జాతీయ జట్టులో సభ్యునిగా ఉన్నాడు. అవార్డులు, రివార్డులు లేకున్నా ఏనాడూ నిరాశకులోనవని హకీం.. అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు ప్రకటించినా సాకర్‌పై మమకారాన్ని మాత్రం వదులుకోలేదు. తండ్రి బాటలో నడుస్తూ 1989 నుంచి భారత జట్టుకు కోచ్‌గా సేవలందించాడు. ఎందరో ఆటగాళ్లను తీర్చిదిద్దాడు. సాకర్‌కే జీవితాన్ని అంకితం చేస్తూ ఎన్నో బాధ్యతల్లో మెరిశాడు. ఫిఫా ఇంటర్నేషనల్ రిఫరీగా, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ డీన్‌గా, సాయ్ ప్రాంతీయ క్రీడా డైరెక్టర్‌గా వివిధ హోదాల్లో హకీం పని చేశారు. గతంలో భారత వైమానిక దళ స్క్వాడ్రన్ లీడర్‌గా ఉద్యోగ బాధ్యతలూ నిర్వర్తించారు. ప్రస్తుతం 78ఏండ్ల వయసులోనూ అలుపెరగన్నదే లేకుండా హకీం అండర్-17 సాకర్ ప్రపంచకప్ కోసం సాయ్ చీఫ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గానూ సేవలందిస్తున్నారు. ఇప్పుడు ధ్యాన్‌చంద్ పురస్కారాన్ని ప్రకటించి ముదిమి వయసులోనైనా తన ప్రతిభను గుర్తించినందుకు హకీం ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. తన చివరి శ్వాస విడిచే లోగా మళ్లీ సాకర్‌లో భారత జట్టు అలనాటి వైభవం చవిచూడాలని తపిస్తున్నట్లు హకీం తెలిపాడు.

> 'గతంలో సాకర్ ప్రపంచంలో భారత జట్టంటే హైదరాబాదీలదే ఆధిపత్యం.1950 ప్రాంతంలో భారత జాతీయ జట్టులో 9 మంది హైదరాబాదీల ఉన్నారంటేనే మన నగరంలో పుట్‌బాల్‌కున్న ఆదరణ ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. 1948 నుంచి 1982 ఏండ్ల మధ్య భారత పుట్‌బాల్ జట్టు సాధించిన విజయాల్లో మన హైదరాబాదీలదే కీలక పాత్ర. కానీ వీరికి ఎవరికీ గుర్తింపు లభించలేదు. ఇన్నాళ్లకు నాకు గుర్తింపు లభించడం ఆనందంగా ఉంది. ఇప్పటికైనా మన రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే హైదరాబాద్‌లో పుట్‌బాల్‌కు పునరుజ్జీవం తెచ్చేందుకు నాతో సహ మాజీ ఆటగాళ్లంతా సిద్ధంగా ఉన్నారు'
>
> - 'నమస్తే తెలంగాణ'తో సయ్యద్ షాహిద్ హకీం

స్టార్టప్ ఫెస్ట్, స్పోర్ట్స్ కార్నివాల్ 26 నుంచి


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జ్వాల, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్

హైదరాబాద్ సిటీ బ్యూరో, నమస్తే తెలంగాణ: ఆసియాలోనే అతిపెద్ద స్టార్టప్ ఫెస్టివల్ ఈనెల 26న హైదరాబాలో మొదలవనుంది. వరుసగా రెండురోజుల పాటు జరిగే ఈ ఆగస్టు ఫెస్ట్, స్పోర్ట్స్ కార్నివాల్ బ్రోచర్‌ను బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ గుత్తా జ్వాల మంగళవారం ఆవిష్కరించింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్‌తో కలిసి జ్వాల ఈ ఫెస్ట్ వివరాలను వెల్లడించింది. క్రీడలను ప్రోత్సహిస్తే, దేశంలో క్రైమ్‌రేట్ తగ్గేందుకు ఆస్కారం ఉంటుందని ఈ సందర్భంగా జ్వాల పేర్కొంది. ఈ కార్యక్రమంలో ఆగస్టు ఫెస్ట్ కో ఫౌండర్ ఆది, స్పోర్ట్స్ కార్నివాల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

'అర్జున' విలువను కాపాడండి

న్యూఢిల్లీ: ప్రతి ఏడాదీ అర్జున అవార్డులు ప్రకటించడమంటే, ఆ పురస్కారానికున్న విలువను తగ్గించడమేనని హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ తనయుడు, హాకీ జట్టు మాజీ కెప్టెన్ అశోక్ కుమార్ వాలీబాల్ మాజీ కెప్టెన్ సురేశ్ మిశ్రా విమర్శించారు. 'ప్రతి ఏడాది అర్జున అవార్డును ఎందుకు ఇస్తున్నారో అర్థం కావడం లేదు. ఇదంత అవసరమా? మనం ఈ అవార్డుల విలువను తగ్గిస్తున్నట్లుగా నేను భావిస్తున్నాను. దయచేసి ఈ అవార్డుల గౌరవాన్ని పెంచేలా చర్యలు చేపట్టండి' అని గతంలో అర్జున అవార్డు అందుకున్న అశోక్ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఒలింపిక్స్ పతకం సాధించిన వారికి మాత్రమే అర్జున అవార్డు ఇచ్చేలా నిబంధనలు మార్చాలని సూచించారు.

యూఎస్ ఓపెన్ నుంచి అజరెంకా ఔట్



న్యూయార్క్: ఈ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ యూఎస్ ఓపెన్‌లో తాను ఆడడం లేదని బెలారస్ టెన్నిస్ స్టార్, మాజీ ప్రపంచ నంబర్‌వన్ విక్టోరియా అజరెంకా తెలిపింది. గత డిసెంబర్‌లోనే బాబుకు జన్మనిచ్చిన అజరెంకా ఈ ఏడాది జూన్‌లో జరిగిన వింబుల్డన్‌లో పాల్గొని నాలుగో రౌండ్‌లో హాలెప్ చేతిలో ఓడింది. తాజాగా కుటుంబ కారణాలతో యూఎస్ ఓపెన్ నుంచి తప్పుకున్నట్లు రెండుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత అజరెంకా ప్రకటించింది.



ప్రీక్వార్టర్స్‌లో సింధు

సాయి ప్రణీత్, జయరామ్, సిక్కి ముందంజ

ప్రపంచ చాంపియన్‌షిప్


సిక్కిరెడ్డి

గ్లాస్గో: ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత హాట్ ఫేవరెట్ పీవీ సింధు శుభారంభం చేసింది. మహిళల సింగిల్స్ తొలిరౌండ్లో బై అందుకున్న ఈ తెలుగమ్మాయి రెండోరౌండ్‌ను అలవోకగా అధిగమించింది. మంగళవారం జరిగిన రెండోరౌండ్ పోరులో నాలుగోసీడ్ సింధు 21-16, 21-14తో కొరియాకు చెందిన కిమ్ హో మిన్‌పై విజయం సాధించి ప్రీక్వార్టర్‌ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. గతంలో రెండుసార్లు ప్రపంచ కాంస్య పతక విజేతైన సింధు మ్యాచ్ ఆద్యంతం ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశమివ్వకుండా చెలరేగింది. కేవలం 49 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించిన సింధు ఈ విజయంతో కిమ్‌పై గెలుపోటముల రికార్డును 4-1కు పెంచుకుంది. 22ఏండ్ల సింధు క్వార్టర్స్ బెర్త్ కోసం ఎవ్‌గెనియా (రష్యా), చువాంగ్ గాన్ (హాంకాంగ్) మధ్య జరిగే మ్యాచ్ విజేతతో తలపడనుంది. భారత్‌కు చెందిన మరో స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్‌కు తొలిరౌండ్లో బై లభించిన సంగతి తెలిసిందే. రెండోరౌండ్ పోరును సైనా బుధవారం ఆడనుంది. రెండోరోజు ఆటలో పురుషుల సింగిల్స్ బరిలోకి దిగిన ఇద్దరు భారత షట్లర్లు విజయాలు నమోదుచేశారు. సింగపూర్ ఓపెన్ చాంపియన్ సాయి ప్రణీత్ 21-18, 21-17తో హాంకాంగ్ షట్లర్ వీ నాన్‌ను వరుసగేముల్లో ఓడించి రెండోరౌండ్ చేరాడు. మరో తొలిరౌండ్ పోరులో 13వ సీడ్ అజయ్ జయరామ్ 21-14, 21-12తో ఆస్ట్రియా ఆటగాడు లుకా రాబర్‌పై గెలిచాడు. ప్రీక్వార్టర్స్‌లో చోటుకోసం ఆంథోనీ సినిసుకా గింటింగ్ (ఇండోనేసియా)తో సాయి ప్రణీత్, మార్క్ కాల్‌జో (నెదర్లాండ్స్)తో జయరామ్ అమీతుమీ తేల్చుకోనున్నారు. పురుషుల సింగిల్స్‌లో ఇప్పటికే శ్రీకాంత్, సమీర్ వర్మ రెండోరౌండ్ చేరిన సంగతి తెలిసిందే. ఇక హైదరాబాద్ అమ్మాయి సిక్కిరెడ్డి మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రీక్వార్టర్స్ చేరింది. తొలిరౌండ్లో బై అందుకున్న సిక్కిరెడ్డి-ప్రణవ్ చోప్రా జోడీ రెండోరౌండ్లో 21-12, 21-19తో భారత్‌కే చెందిన ప్రజక్తా సావంత్-యోగేంద్రన్ (మలేసియా) జంటపై నెగ్గింది. మిక్స్‌డ్‌లో మిగతా భారత జోడీలు అశ్వినీ పొన్నప్ప-సుమిత్ రెడ్డి, సాత్విక్‌రాజ్-మనీషాలకు రెండోరౌండ్లో నిరాశ ఎదురైంది. చైనా జోడీ చేతిలో సుమిత్ జంట, డెన్మార్క్ ద్వయం చేతిలో సాత్విక్ జోడీ ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించారు.

ధోనీ, భజ్జీ మమ్మల్ని మోసగించారు!

న్యూఢిల్లీ: తమ వ్యాపారాన్ని మరింత లాభాల బాట పట్టించుకునేందుకు చాలా కంపెనీలు క్రికెటర్లను ప్రచారకర్తలుగా నియమించుకుంటాయి. దీంతో తమ అభిమాన ఆటగాళ్లు ఉన్నారన్న ఉద్దేశంతో ఎక్కువ మంది ఆసక్తి కనబరుస్తారు. ఇదే కోవలో ఓ రియల్ ఎస్టేట్ కంపెనీ ధోనీ, హర్భజన్‌సింగ్‌లను తమ ప్రచారకర్తలుగా పెట్టుకోవడంతో చాలా మంది ఆ కంపెనీలో పెట్టుడులు పెట్టారు. తీరా ఆ కంపెనీ మోసగించడంతో ఇప్పుడు ధోనీ, భజ్జీవల్లే మేమంతా మోసపోయామంటూ ట్విట్టర్‌లో విరుచుకుపడ్డారు. 'మీకు విల్లాలు దక్కాయి, మేమైతే ఘోరంగా నష్టపోయాం' అని ఒకరు పోస్ట్ చేయగా.. 'ఆ కంపెనీ అధ్యక్షుడు ధోనీకి మంచి దోస్తు, భజ్జీ నువ్వు అబద్ధం ఆడవద్దు' అని మరొకరు ట్వీట్ చేశారు.


రాష్ట్రస్థాయి అంతర్ జిల్లా ఖోఖో టోర్నీలో రంగారెడ్డి బాలుర జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్లో వరంగల్‌పై రంగారెడ్డి విజయం సాధించింది. రంగారెడ్డి బాలికల జట్టుకు మూడోస్థానం దక్కింది.

ఎదురులేని గుజరాత్

లక్నో: ప్రొ కబడ్డీలో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ వరుస విజయాలతో దూసుకుపోతున్నది. ఆల్‌రౌండ్ గేమ్‌తో ఈ జట్టు టోర్నీలో ఆడిన 10 మ్యాచ్‌లలో 7 విజయాలు, 2 డ్రాలు, ఒక పరాజయంతో 41 పాయింట్లు సాధించి ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచింది. మంగళవారం పుణెరి పల్టాన్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 35- 21 పాయింట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఉత్కంఠగా సాగిన మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ జట్టు 32-31 స్కోరుతో యూపీ యోధాస్ జట్టును ఓడించింది.